సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 151

సోమవారం 21-8-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'



## భారత్ బంగారు గురి

ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత జట్లకు రెండు స్వర్ణాలు -12లో



## విదేశీ విద్యానిధికి 'డాలర్' రూట్!

డాలర్ మారకంలో పెట్టుబడులు. కరెన్సీ విలువ క్షీణతకు హెడ్జింగ్ -13లో



## గూగుల్ అకౌంట్.. ఇక డిలీటే!

గూగుల్ అకౌంట్‌ను రెండేళ్లపాటు లాగిన్ చేయకపోతే శాశ్వతంగా డిలీట్ చేసేలా గూగుల్ కొత్త పాలసీని ప్రకటించింది.

- వివరాలు 6లో



## మాలిలో దుండగుల కాల్పులు

పశ్చిమ ఆఫ్రికా దేశమైన మాలిలోని మోప్టీ ప్రాంతంలో గుర్తుతెలియని దుండగుల కాల్పుల్లో 21 మంది ప్రాణాలు కోల్పోయారు.


- వివరాలు 6లో



## పాక్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో ఓ బస్సు ఇంధన ట్యాంక్ ఉన్న ఓ వ్యాన్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో 18 మంది మరణించారు.

- వివరాలు 6లో



## ఆక్రమించలేదనడం అబద్ధం

లద్దాఖ్‌లోని అంగుళం భూమిని కూడా చైనా ఆర్మీ ఆక్రమించుకోలేదంటూ ప్రధాని మోదీ చేసిన ప్రకటన అబద్ధమని రాహుల్ అన్నారు.

- వివరాలు 6లో

ఆదివారం సూర్యాపేటలో నిర్వహించిన ప్రగతి నివేదన సభకు హాజరైన జన సందోహం. (కింద) ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్



# పింఛన్ పెంచుకుందాం



## ఎంత అన్నది త్వరలోనే ప్రకటిస్తాం.. సూర్యాపేట సభలో సీఎం కేసీఆర్

- రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్‌కే అధికారం
- గతంలో కంటే ఐదారు సీట్లు ఎక్కువగానే గెలుస్తాం
- ధరణితోనే రైతుబంధు, బీమా వంటివి పక్కాగా అమలు
- అది లేకుంటే మళ్లీ దళారులు, పైరవీల దందానే.. మాయమాటలు చెప్పేవారిని చూసి ఆగం కావొద్దు
- 3 గంటల కరెంటు కావాలా.. 24 గంటలు కావాలా?
- బీసీలందరికీ ఆర్థిక సాయం అందుతుందని వెల్లడి

**వాళ్లు అరచేతిలో వైకుంఠం చూపుతారు**

కాంగ్రెస్ ఒక్క అవకాశం ఇవ్వాలని ఇప్పుడు అడుగుతోంది. మొన్నటిదాకా 50ఏళ్ల అధికారం ఇస్తే ఏం చేసింది? నాడు రైతులు చనిపోతున్నా పట్టించుకోలేదు. ఆపద్బంధు కింద రూ.50 వేలు ఇస్తామనీ సరిగా ఇవ్వలేదు. రూ.500 పెన్షన్ ఇవ్వలేదు. అలాంటి కాంగ్రెస్ వాళ్లు ఇప్పుడు పింఛన్లను రూ.4 వేలకు పెంచుతామని అంటున్నారు. వారు అధికారంలో ఉన్న కర్ణాటకలో పెంచకుండా ఇక్కడ పెంచుతామని మాయ మాటలు చెప్తున్నారు. కాంగ్రెస్ వాళ్లు ఆపద మొక్కులు మొక్కుతారు. అరచేతిలో వైకుంఠం చూపుతారు. వారి మాటలు నమ్మి మోసపోవద్దు. మనం పెన్షన్ మొత్తాన్ని పెంచుకుందాం. ఎంతనేది త్వరలోనే ప్రకటిస్తా. - సీఎం కేసీఆర్

సాక్షి ప్రతినిధి నల్లగొండ/ సూర్యాపేట: రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే ఏర్పాటవుతుందని.. ఎవరు ఎన్ని జిమ్మిక్కులు చేసినా గతంలో కంటే ఐదారు సీట్లు ఎక్కువే గెలుస్తామని బీఆర్ఎస్ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. ఎన్నికలు వస్తున్నాయంటే ఎవరెవరో వస్తారని.. వారి మాయ మాటలు నమ్మి ఓట్లు వేస్తే ఆగమవుతామని ప్రజలు మిగతా 2వ పేజీలో ▶

# 'ఘోస్ట్' చందా.. మార్గదర్శి దందా!

## మరో అక్రమం బట్టబయలు

- కొత్త వ్యక్తుల పేరుతో వారికి తెలియకుండానే చిట్టీ గ్రూపులు.. ఆధార్ నంబర్లు తెలుసుకుని సభ్యత్వం
- చందాలు చెల్లించకుండానే బుక్ అడ్జస్ట్‌మెంట్ ద్వారా కనికట్టు
- చిట్టీ పాట కొల్లగొడుతున్న మార్గదర్శి యాజమాన్యం
- సూళ్లూరుపేట వ్యక్తి పేరిట చీరాలలో చిట్టీ
- చందాదారులను అప్పుల ఊబిలోకి నెడుతూ మరో దందా
- ఫిర్యాదులతో మార్గదర్శిపై మూడు కేసుల నమోదు
- మేనేజర్లను అదుపులోకి తీసుకున్న సీఐడీ
- వివరాలు వెల్లడించిన సీఐడీ అదనపు డీజీ సంజయ్, స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రామకృష్ణ



మీడియాతో మాట్లాడుతున్న సీఐడీ అదనపు డీజీ సంజయ్. చిత్రంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రామకృష్ణ, సీఐడీ ఎస్పీ అమిత్



సుబ్రహ్మణ్యం

సాక్షి, అమరావతి: ఈయన పేరు సుబ్రహ్మణ్యం. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండలం కోటపోలూరు గ్రామస్తుడు. బాపట్ల జిల్లా చీరాలలోని మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి కార్యాలయంలో ఓ చిట్టీ గ్రూపులో చందాదారుగా నమోదయ్యారు. ఈయన ఏనాడూ చీరాల మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయానికి వెళ్లలేదు. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో చందాదారుగా చేరనే లేదు. కానీ చీరాల మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయంలో మాత్రం ఆయన్ను చందాదారుగా నమోదు చేయడం గమనార్హం. విడ్డూరంగా ఉన్నప్పటికీ ఇది నిఖార్సైన నిజం. దేశంలో ఇంత వరకు మిగతా 10వ పేజీలో ▶

## న్యూస్‌రీల్

### రష్యా 'లూనా-25' ప్రయోగం విఫలం



చందమామపై పరిశోధనల కోసం రష్యా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన లూనా-25 ప్రయోగం విఫలమైంది. చంద్రుడిపై అడుగుపెట్టకముందే ల్యాండర్ కుప్ప కూలింది. అనియంత్రిత కక్ష్యలోకి ప్రవేశించి చంద్రుడి ఉపరితలాన్ని ఢీకొట్టి పేలిపోయింది. ఈ విషయాన్ని రష్యా అంతరిక్ష సంస్థ రోస్‌కాస్మోస్ ఆదివారం అధికారికంగా వెల్లడించింది. శనివారం లూనా-25తో కమ్యూనికేషన్ తెగిపోయినట్లు పేర్కొంది.

- వివరాలు 6లో



# వారికి ఇవ్వొద్దు... మా నేతలకివ్వండి



భూపాలపల్లిలో టవర్ఎక్కిన మధుసూదనాచారి మద్దతుదారులు

**బీఆర్ఎస్‌లో ముదురుతున్న టికెట్ల లొల్లి**

- సిట్టింగ్ ఎమ్మెల్యేకు మళ్లీ టికెట్ ఇవ్వవద్దంటూ కొందరు..
- ఈసారి తమవారికే ఇవ్వాలంటూ ఇంకొందరు ఆందోళనలు
- నియోజకవర్గాల్లో అనుచరుల ర్యాలీలు, నిరసనలు

భూపాలపల్లి రూరల్/ మెదక్/ తరిగొప్పుల/ స్టేషన్‌ఘన్‌పూర్: బీఆర్ఎస్‌లో ఎమ్మెల్యే టికెట్లకు అభ్యర్థుల ఎంపిక పూర్తయిందంటూ జరుగుతున్న ప్రచారంతో రగడ మొదలైంది. అసమ్మతి లొల్లి మరింతగా ముదురుతోంది. తమ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యేకు మళ్లీ టికెట్ ఇవ్వొద్దంటూ పలుచోట్ల.. ఇతర నేతలకు ఇవ్వాలంటూ మరికొన్నిచోట్ల ఆందోళనలు మొదలయ్యాయి. నియోజకవర్గాల్లో ఆయా నేతల అనుచరులు, కార్యకర్తలు నిరసన ర్యాలీలు, ధర్నాలు చేపడుతున్నారు.

**మధుసూదనాచారికే టికెట్ ఇవ్వాలంటూ..**

భూపాలపల్లి నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి టికెట్ కేటాయిస్తున్నట్టు ప్రచారం జరగడంతో.. ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి వర్గం ఆదివారం ఆందోళనకు దిగింది. మధుసూదనాచారికే ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలంటూ బీఆర్ఎస్ కార్యకర్తలు మెరుగు శ్రీకాంత్, పూర్ణయాదవ్, పృథ్వీ తదితరులు సెల్‌ఫోన్ టవర్ ఎక్కారు. మరికొందరు కార్యకర్తలు ఇక్కడి అంబేడ్కర్ సెంటర్‌లో ధర్నా చేపట్టారు. తెలంగాణ మిగతా 2వ పేజీలో ▶

# ఆచితూచి.. అత్యున్నత హోదా



- ఎన్నికల వేళ సీడబ్ల్యూసీలో ఇద్దరు తెలంగాణ నేతలకు చోటు
- దామోదరకు శాశ్వత ఆహ్వానితుడిగా స్థానం వెనుక దళిత వర్గాలను ఆకట్టుకునే వ్యూహం
- ఢిల్లీ కేంద్రంగా ఏఐసీసీ వ్యవహారాలు చూస్తున్న వంశీకి తగిన గుర్తింపు.. తెలంగాణ నేతలను ఆహ్వానితులుగా మాత్రమే పరిమితం చేయడంపై పార్టీలో చర్చ
- ఆశావహుల్లో అసంతృప్తి!

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలో అత్యున్నత విధాన నిర్ణాయక కమిటీ అయిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ)లో తెలంగాణ నేతలకు చోటు కల్పించే విషయంలో అధిష్టానం ఆచితూచి వ్యవహరించిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మాజీ ఉప ముఖ్యమంత్రి, మాదిగ సామాజిక వర్గానికి చెందిన దామోదర రాజనర్సింహను సీడబ్ల్యూసీ శాశ్వత ఆహ్వానితుడిగా నియమించడం వెనుక పార్టీ హైకమాండ్‌కు భారీ వ్యూహమే ఉందనే చర్చ జరుగుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్రంలోని పార్టీ పరిస్థితులు, సామాజిక సమతుల్యతలను దృష్టిలో ఉంచుకునే, ఎవరూ ఊహించని విధంగా దామోదరకు స్థానం కల్పించారని, దళిత వర్గాలను ఆకట్టుకోవాలనే ఆలోచనతోనే ఆయనకు అత్యున్నత హోదాను కట్టబెట్టారని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. మరో నాయకుడు, విద్యార్థి సంఘం నుంచి పార్టీలో పనిచేస్తున్న మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డికి కూడా పార్టీ మిగతా 5వ పేజీలో ▶

**సీడబ్ల్యూసీలోకి దామోదర** — మొత్తం 84 మందితో సీడబ్ల్యూసీని ఏర్పాటు చేసిన ఖర్గే 5లో

# కేసీఆర్ సర్కార్‌ది రియల్ ఎస్టేట్ కంపెనీ

## రాష్ట్రంలో భూములకు రక్షణ లేదు: కిషన్‌రెడ్డి

- ప్రభుత్వ భూములను వ్యాపారస్తులకు కట్టబెడుతోంది
- ధరణి పేరుతో గ్రామాల్లో ప్రజల భూములు లాక్కుంటున్నారు
- నిర్మల్‌లో రైతులకు నష్టం జరగకుండా అడ్డుకున్నందుకు బీజేపీ కార్యకర్తలపై పోలీసుల దౌర్జన్యమని మండిపాటు
- తెలంగాణను పోలీసు రాజ్యంగా మార్చారు: ఈటల రాజేందర్



ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వ అధీనంలోని భూములతోపాటు రైతుల భూములకూ ఎలాంటి రక్షణ లేకుండా పోయిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పరిపాలనను పక్కనబెట్టిన కేసీఆర్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ కంపెనీగా మారిందని మండిపడ్డారు. గ్రామాల్లో ధరణి పేరుతో రైతుల భూములను లాక్కుంటున్నారని, ఇవ్వకుంటే కేసులు పెట్టి బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఎన్నికల ముందు ప్రభుత్వ భూములను అమ్ముతోందని. ఇదేమిటని ప్రశ్నించేవారిని అణచివేస్తోందని మండిపడ్డారు. 111 జీవో ఎత్తేసి, హైదరాబాద్ సమీపంలోని విలువైన భూములను కావాల్సిన వ్యాపారులకు మిగతా 2వ పేజీలో ▶

**నిర్మల్‌లో 'మాస్టర్' ఫైట్** — ఐదో రోజుకు చేరిన ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆమరణ దీక్ష

**23 నుంచి ఆందోళనలు** — ఎన్నికలు సమీపిస్తుండటంతో కార్యాచరణ వేగవంతం చేసిన బీజేపీ 2లో

## ఇంటింటా...




# డుమ్మా టీచర్లపై నజర్!

**సెలవుల్లో ఉన్నదెవరు? సెలవు పెట్టకుండా రానివారెవరు?**

- సుదీర్ఘకాలం బడి ఎగ్గొడుతున్న ఉపాధ్యాయులపై సర్కారు ఆరా
- తక్షణమే వివరాలు ఇవ్వాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు
- హాజరు, సెలవుల వివరాలన్నీ ఆన్‌లైన్.. ఇందుకోసం ప్రత్యేకంగా వెబ్‌సైట్
- ఐదు వేల మందికిపైగా టీచర్లు విధులకు రావడం లేదని అంచనా



సాక్షి, హైదరాబాద్: ఫలానా పాఠశాలలో.. ఫలానా టీచర్.. రికార్డుల్లో వివరాలు ఉంటాయి. బడిలో చూస్తే ఆ టీచర్ ఉండరు. నెలలకు నెలలుగా బడి మొహమే చూడరు. ఏమయ్యారంటే.. ప్రధానోపాధ్యాయుడికీ తెలియదు, మండల విద్యాధికారికీ తెలియదు.. ఆపై అధికారులకు అసలు సమాచారమే ఉండదు. ఇలా ఒకరిద్దరు కాదు.. ఐదు వేల మందికిపైనే ప్రభుత్వ టీచర్లు సుదీర్ఘకాలం నుంచి పాఠశాలలకు రావడం లేదని అంచనా. లెక్కల్లో మాత్రం ఆయా స్కూళ్లలో సదరు టీచర్లు పనిచేస్తున్నట్టు ఉంటుంది. విద్యార్థులకు మాత్రం చదువు అందదు. ఇలాంటి టీచర్లు రాజీనామా చేస్తేనో, ప్రభుత్వమే తొలగిస్తేనో, మరోచోటికి బదిలీ చేస్తేనో తప్ప.. ఆ స్కూల్‌కు మరో టీచర్‌ను నియమించలేని పరిస్థితి. ఈ క్రమంలోనే ప్రభుత్వ పాఠశాలల్లో దీర్ఘకాలం నుంచి విధులకు రాని ఉపాధ్యాయులపై విద్యాశాఖ దృష్టిపెట్టింది. 'డుమ్మా'టీచర్ల వివరాలు ఇవ్వాలని తాజాగా ప్రధానోపాధ్యాయులను ఆదేశించింది.

**ప్రత్యేక వెబ్‌సైట్లో వివరాలు..**


రాష్ట్రవ్యాప్తంగా 26 వేల వరకు ప్రభుత్వ స్కూళ్లుండగా.. వాటిలో ప్రస్తుతం 1.05 లక్షల మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఇందులో ఐదు వేల మందికిపైగా విధులకు రావడం లేదని పాఠశాల విద్య డైరెక్టరేట్ అధికారులు చెప్తున్నారు. వీరిలో చాలా మంది తొలుత సెలవు పెట్టి, ఆ గడువు ముగిసినా హాజరవడం లేదు. ఇంకొందరైతే సెలవులు కూడా పెట్టకుండానే గైర్హాజరు అవుతున్నారని అంటున్నారు. అలాంటివారి వివరాలన్నీ తక్షణమే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ప్రధానోపాధ్యాయులను డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ తాజాగా ఆదేశించింది. దీని కోసం ప్రత్యేక వెబ్‌సైట్‌ను కూడా రూపొందించింది. టీచర్లకు సంబంధించిన ఏడాది డేటాను ఈ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని సూచించింది.

**ఏదో ఓ కారణం చెప్పి..**

కొందరు టీచర్లు విదేశాల పర్యటనలకు వెళ్తున్నారు. కొందరు మహిళా టీచర్లు.. వారి భర్త, పిల్లలు ఇతర దేశాల్లో ఉద్యోగాలు చేస్తుంటే వారి దగ్గరికి వెళ్లాలంటూ సెలవులు పెడుతున్నారు. కానీ ముందుగా తీసుకునే సెలవు నెలా రెండు నెలలు మాత్రమే అయితే.. గడువు తీరినా అక్కడే ఉండటమో, తిరిగి వచ్చినా.. బడులకు మిగతా 3వ పేజీలో ▶

# పల్మనరీ మెడిసిన్ ఔట్

- మెడికల్ కాలేజీకి అవసరమైన విభాగాల నుంచి తొలగింపు
- జాతీయ మెడికల్ కమిషన్ తాజా మార్గదర్శకాలు
- ఎమర్జెన్సీ మెడిసిన్, ఫిజికల్ మెడిసిన్ అండ్ రిహాబిలిటేషన్, రేడియేషన్ అంకాలజీలు కూడా ఔట్
- కొత్తగా సమీకృత వైద్య పరిశోధన విభాగం తప్పనిసరి
- ప్రత్యేకంగా యోగా విభాగం కూడా..



సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్ సీట్లతో మెడికల్ కాలేజీ పెట్టడానికి సంబంధించిన తాజా మార్గదర్శకాలను జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) విడుదల చేసింది. మూడేళ్ల తర్వాత ప్రస్తుత పరిస్థితులను ఆధారం చేసుకొని గత మార్గదర్శకాల్లో పలు మార్పులు చేర్పులు చేసింది. గతంలో మెడికల్ కాలేజీకి అనుమతి రావాలంటే 24 డిపార్ట్‌మెంట్లు తప్పనిసరిగా ఉండాలి. ప్రస్తుతం వాటిల్లో నాలుగింటిని తొలగించి, ఒక దాన్ని చేర్చారు. అంటే 21 విభాగాలు ఉంటే సరిపోతుంది. అయితే ఎంబీబీఎస్ విద్యార్థులకు కీలకమైన పల్మనరీ మెడిసిన్ విభాగం తొలగించడంపై విమర్శలు వస్తున్నాయి. దీనితో పాటు ప్రాధాన్యత కలిగిన ఎమర్జెన్సీ మెడిసిన్, ఫిజికల్ మెడిసిన్ అండ్ రిహాబిలిటేషన్, రేడియేషన్ అంకాలజీ మిగతా 5వ పేజీలో ▶



సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ సముదాయాన్ని ప్రారంభిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, చీఫ్ సెక్రెటరీ శాంతికుమారి, సూర్యాపేట జిల్లా కలెక్టర్ వెంకట్రావ్, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు



సూర్యాపేటలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కేసీఆర్, చిత్రంలో మంత్రి జగదీశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, తుంగతుర్తి ఎమ్మెల్యే గ్యాదరి కిషోర్



సూర్యాపేట జిల్లా కేంద్రంలో సమీకృత వెజ్ మార్కెట్‌ను ప్రారంభించి కూరగాయలను పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్



సూర్యాపేట పట్టణంలో మెడికల్ కళాశాల భవనాన్ని ప్రారంభించిన సందర్భంగా మెడికోలకు విజయ సంకేతం చూపుతున్న సీఎం కేసీఆర్

## క్లుప్తంగా...

### ఉదయ్‌పూర్‌కు శాసనమండలి చైర్మన్ గుత్తా



సాక్షి, హైదరాబాద్: కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ సమావేశాలలో పాల్గొనేందుకు తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆదివారం రాజస్తాన్ రాష్ట్రంలోని ఉదయ్‌పూర్‌కు బయల్దేరి వెళ్లారు. ఉదయ్‌పూర్‌లో ఈ నెల 21 నుండి 23 తేదీ వరకు జరగనున్న సమావేశాల్లో రాష్ట్ర లెజిస్లేచర్ తరఫున ప్రసంగించనున్నారు. తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ, శాసనమండలి సమావేశాలు జరుగుతున్న తీరు, రాష్ట్రంలో అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ పథకాలు, చట్టసభల్లో అనుసరించాల్సిన పద్ధతులు తదితర అంశాలపై ఆయన ప్రసంగించనున్నారు. చైర్మన్ వెంట మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, తెలంగాణ లెజిస్లేచర్ సెక్రెటరీ నరసింహాచార్యులు కూడా ఉన్నారు.

### సోషల్ మీడియాలో మాజీ ఎమ్మెల్యే ఫొటోలు వైరల్

**డీజీపీకి ఫిర్యాదు చేస్తానన్న మదన్‌లాల్**

వైరా: ఖమ్మం జిల్లా వైరా మాజీ ఎమ్మెల్యే బాణోత్ మదన్‌లాల్ ఫొటోలు రెండు రోజులుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఓ మహిళతో ఆయన సన్నిహితంగా ఉన్న ఫొటోలు సోషల్ మీడియాలో రావడం కలకలం రేపింది. వైరా ఎమ్మెల్యే సీటును బీఆర్‌ఎస్ అధిష్టానం మదన్‌లాల్‌కే ఇస్తుందంటూ పత్రికల్లో కథనాలు వచ్చిన రోజే ఈ ఫొటోలు బయటకు రావడంతో నియోజకవర్గంలో పెద్ద దుమారం రేగింది. ఈ విషయమై మదన్‌లాల్‌ను వివరణ కోరగా.. తనపై కొందరు సోషల్ మీడియాలో మార్ఫింగ్ చేసిన ఫొటోలు పెట్టి దుష్ప్రచారం చేస్తున్నారని, ఇలా చేసిన వారిపై డీజీపీకి ఫిర్యాదు చేస్తానని చెప్పారు.

### ఎమ్మెల్యే ముత్తిరెడ్డికి కూతురే శత్రువు

**కాంగ్రెస్ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి**



జనగామ: జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి ఆయన కూతురు తుల్జాభవానీ రెడ్డే శత్రువు.. ఆమె తండ్రిపై బహిరంగంగా ఆరోపణలు చేస్తుంటే.. తమను నిందించడం ఏమిటని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. చేర్యాల పట్టణంలోని చెరువు స్థలాన్ని కూతురు పేరిట ముత్తిరెడ్డి రిజిస్ట్రేషన్ చేయగా, తండ్రి తప్పుచేశారని పేర్కొంటూ ఆమె తిరిగి మున్సిపాలిటీకి రాసిచ్చేశారనీ.. కూతురు నిజాయితీని స్వాగతించిన ఎమ్మెల్యే ఆమెపై కేసు ఎందుకు పెట్టారో ప్రజలకు చెప్పాలని అన్నారు. తన పేరిట ఉన్న ఆస్తులను సైతం దొంగ స్టాంపు పేపర్లతో పేరు మార్పిడి చేసినట్లు స్వయంగా ఆయన కూతురే ఆరోపించడాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. నర్మెట మండలం హనుమంతపూర్‌లోని ఎమ్మెల్యే ఫాంహౌస్‌లో 70 శాతం అసైన్డ్ భూములు ఉన్నాయని కొమ్మూరి ఆరోపించారు.

## నేటి భవితలో..

- బ్యాంక్ జాబ్స్: సర్కారీ బ్యాంకులో.. స్పెషలిస్ట్ ఆఫీసర్: ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, లా తదితర ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసుకున్న అభ్యర్థులకు చక్కటి అవకాశం.. ఐబీపీఎస్ స్పెషలిస్ట్ ఆఫీసర్(ఎస్‌వో) నోటిఫికేషన్. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మొత్తం 1402 ఎస్‌వో పోస్టుల భర్తీకి ప్రకటన వెలువడింది. మూడంచెల్లో ఎంపిక ప్రక్రియ జరగనుంది. ఇందులో ఎంపికైతే బ్యాంకింగ్ రంగంలో ఉజ్వల కెరీర్ ఖాయం. ఈ నేపథ్యంలో.. ఐబీపీఎస్ ఎస్‌వో పోస్టుల వివరాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం తదితర వివరాలు..
- గ్రూప్స్ ప్రత్యేకం-కరెంట్ అఫైర్స్: సివిల్స్, గ్రూప్స్, బ్యాంక్స్ వంటి పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉపయోగపడేలా.. అంతర్జాతీయం, జాతీయం, రాష్ట్రీయం, వార్తల్లో వ్యక్తులు, అవార్డులు, క్రీడలు తదితర తాజా పరిణామాలతో వీక్లీ కరెంట్ అఫైర్స్ రౌండప్..
- విద్య, ఉద్యోగ సమాచారం

నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

# పింఛన్ పెంచుకుందాం

▶ మొదటి పేజీ తరువాయి

జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. త్వరలోనే ఆసరా పింఛన్లు పెంచుకుందామని చెప్పారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ భవనం, మెడికల్ కాలేజీ, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, జిల్లా పోలీస్ కార్యాలయంతోపాటు బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించారు. అనంతరం మంత్రి జగదీశ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సూర్యాపేట అసెంబ్లీ నియోజకవర్గ ప్రగతి నివేదన సభలో మాట్లాడారు. సభలో కేసీఆర్ ప్రసంగం ఆయన మాటల్లోనే..

''కాళేశ్వరం నీళ్లు తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడలోని మోతె మండలం వరకు ఎలా వచ్చాయో మీకు తెలుసు. ఒకప్పుడు కరెంటు రాకపోతే, మోటార్లు కాలిపోతే రైతులు ఇబ్బందులు పడేవారు. వాటిని చూసి ఉద్యమ సమయంలో నేను కంటతడి పెట్టాను. ఇప్పుడు కాళేశ్వరం జలాలు వస్తున్నాయి. అలాంటిది ఇప్పుడు ఒకడు మోటార్లకు మీటర్లు పెట్టాలంటడు, మరొకడు 3 గంటలు కరెంటు చాలంటడు. కాంగ్రెస్ వాళ్లు కర్ణాటకలో కరెంటు సరిగా ఇవ్వక జనాలు ఇబ్బందులు పడుతున్నారు. మనం మళ్లీ అలా గోసపడదామా? లేదంటే 24 గంటల కరెంటు కావాలా? ఆలోచించాలి.

**ధరణి వద్దంటే దళారుల దందానే..**

కాంగ్రెస్ వస్తే మళ్లీ పైరవీకారుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. ధరణితోనే ఇప్పుడు రైతుబంధు నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతోంది. ధాన్యం అమ్ముకున్నా ఖాతాలోనే సొమ్ము పడుతోంది. కాంగ్రెస్ వస్తే రైతు బంధు, రైతుబీమా ఉండవు. గతంలో పాస్‌బుక్‌ల విషయంలో ఎమ్మార్వో, ఆర్డీఓ, జేసీ, కలెక్టర్, మంత్రి ఇలా ఎవరు పడితే వారు పెత్తనం చేసేవారు. వీఆర్వోలు ఇష్టానుసారం పేర్లు మార్చారు. అందుకే ఆ వ్యవస్థను రద్దుచేశాం. ధరణిని తీసుకువచ్చాం. అధికారులకు ఉన్న పవర్‌ను ధరణితో రైతుల బొటనవేలికే ఇచ్చాం. రికార్డులను ఎవరూ మార్చలేరు. కాంగ్రెస్ ధరణిని తీసేస్తామంటోంది. మళ్లీ దళారుల దందా రావాలా?

**వాళ్లు నల్లగొండను పట్టించుకోలేదు**

కాంగ్రెస్ పాలనలో నల్లగొండ జిల్లాను పట్టించుకోలేదు. సూర్యాపేట ప్రజలకు మురుగునీటినే తాగించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాకే మిషన్ భగీరథ ద్వారా రక్షిత తాగునీటిని అందిస్తున్నాం. నల్లగొండ జిల్లా అభివృద్ధికి కావాల్సినన్ని నిధులు ఇచ్చాం. మంత్రి జగదీశ్‌రెడ్డి కొట్లాడి మరీ నల్లగొండ జిల్లాకు విద్యుత్ ప్లాంట్ సాధించారు. రూ.30 వేల కోట్లతో నిర్మిస్తున్న దానిని త్వరలో ప్రారంభించుకుంటాం. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 అసెంబ్లీ స్థానాల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి.

**బీసీలందరికీ ఆర్థిక సాయం**

బీసీలందరికి ఆర్థిక సాయం అందుతుంది. అందులో ఎలాంటి సందేహం లేదు. ఎవరూ అనుమానం పెట్టుకోవద్దు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో చెట్టుకొకరు పుట్టకొకరు ఉన్న వారంతా ఇప్పుడు గ్రామాలకు వచ్చి, పనులు చేసుకుంటున్నారు. అన్ని వర్గాలను కడుపులో పెట్టుకొని చూసుకుంటున్నాం. ఈ అభివృద్ధి ఇంకా కొనసాగాలి.

**సూర్యాపేటకు సీఎం వరాలు**

సూర్యాపేట జిల్లాలోని ప్రతి గ్రామపంచాయతీకి రూ.10 లక్షల చొప్పున.. సూర్యాపేట మున్సిపాలిటీకి రూ.50 కోట్లు, మిగతా నాలుగు మున్సిపాలిటీలకు రూ.25 కోట్ల చొప్పున మంజూరు చేస్తున్నాం. కళాభారతి నిర్మాణానికి రూ.25 కోట్లు ఇస్తాం. స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు జీవో జారీ చేస్తాం'' అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.

**దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిచాం**

తెలంగాణ ఏర్పాటయ్యాక అద్భుత పనితీరుతో మానవాభివృద్ధి, తలసరి ఆదాయంలో దేశంలోనే టాప్‌లో నిలిచిందని సీఎం కేసీఆర్ అన్నారు. సూర్యాపేట కొత్త కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సమీకృత కలెక్టరేట్లను ప్రారంభించుకుంటున్నామని.. కొన్ని రాష్ట్రాలలో అసెంబ్లీ, సెక్రటేరియేట్లు కూడా ఈ స్థాయిలో లేవని కేసీఆర్ చెప్పారు. సూర్యాపేటలో సీఎం కార్యక్రమాల్లో మంత్రులు జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గ్యాదరి కిశోర్, సైదిరెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### రూ.37 వేల కోట్లు రుణమాఫీ చేశాం

కరోనాతో రుణమాఫీ విషయంలో కొంత ఆలస్యమైంది. ఇప్పుడు రూ.37 వేల కోట్ల రుణ మాఫీ చేశాం. దేశంలో ఇంత పెద్ద కార్యక్రమం చేపట్టినది తెలంగాణ ప్రభుత్వం మాత్రమే. ఇప్పుడిప్పుడే రైతులు ఒకరి వద్ద చేయి చాచకుండా బతుకున్నారు. దేశానికి అన్నం పెట్టే స్థాయికి ఎదిగాం. రాష్ట్రంలో 3 కోట్ల టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. ఖమ్మంలో సీతారామ వంటి ప్రాజెక్టులతో దిగుబడి 4 కోట్ల టన్నులకు పెరుగుతుంది.

### సర్కారును నడపటమంటే.. సంసారం నడిపించినట్టే..

సూర్యాపేట సభలో సీఎం కేసీఆర్ ప్రసంగం ఆద్యంతం ఛలోక్తులతో సాగింది. ప్రభుత్వం చేపట్టిన పనులను ప్రస్తావిస్తూ.. ''సర్కారు నడిపించాలంటే.. సంసారం నడిపించినట్టే..'' అని కేసీఆర్ పేర్కొనడంతో సభలో నవ్వులు విరిశాయి. తర్వాత ''60 ఏళ్ల నుంచి రూ.200 పింఛన్ ఇవ్వలేని కాంగ్రెస్ వాళ్లు ఇవాళ రూ.4వేలు ఇస్తరట.. అంటే నేను రూ.5వేలు ఇవ్వాలా? ఇదేమన్నా వేలం పాటనా?'' అని కేసీఆర్ వ్యాఖ్యానించారు. ఇక మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రసంగంలో సూర్యాపేటలో పలు అభివృద్ధి పను లు చేపట్టాలని సీఎంను కోరారు. తర్వాత కేసీఆర్ మాట్లాడుతూ.. ''జగదీశ్‌రెడ్డి ఇంత హుషారని అనుకోలేదు. మనకు అన్ని ఇచ్చారు, సూర్యాపేట జిల్లా కూడా ఇచ్చారు. అన్నీ అయిపోయాయి. సభకు వచ్చిపోతే చాలు. ఏమీ అడగనని అక్కడ చెప్పిండు. ఇప్పుడు అవీ ఇవీ కావాలి అని అందరి ముందూ అడుగుతున్నారు..'' అని పేర్కొన్నారు.

# నేడే మద్యం లాటరీలు

- జిల్లా కేంద్రాల్లో కలెక్టర్ల పర్యవేక్షణలో 'డ్రా'కు ఏర్పాట్లు
- పకడ్బందీగా నిర్వహించాలి: శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్/జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రానున్న రెండేళ్ల కాలానికిగాను లైసెన్సుల మంజూరు కోసం నేడు(సోమవారం) రాష్ట్రవ్యాప్తంగా 2,620 వైన్‌షాపులకు లాటరీలు నిర్వహించనున్నారు. ఈ నెల 4న ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ 18వ తేదీన ముగిసిన నేపథ్యంలో సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 'డ్రా'తీయనున్నారు. జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో వీడియో చిత్రీకరణ ద్వారా ఈ లాటరీల కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. కాగా, ఈ ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని, లాటరీలో విజేతలకు వెంటనే షాపుల కేటాయింపు ఉత్తర్వులు అందజేయాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. ఎంట్రీ పాసులు ఉన్నవారిని మాత్రమే డ్రా తీసే ప్రదేశంలోకి అనుమతించాలని, లాటరీ ప్రక్రియ విషయంలో చిన్న పొరపాటు జరిగినా సంబంధిత అధికారులపై కఠినచర్యలు తీసుకుంటామని శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు. కాగా, మంత్రి ఆదివారం మహబూబ్‌నగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో కూడా ఎక్సైజ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. లాటరీ ప్రక్రియకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు.

### సెప్టెంబర్ మొదటి వారంలో ఎస్సై శిక్షణ ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: ఎస్సైల శిక్షణ అతి త్వరలోనే ప్రారంభం కానుంది. నియామక ప్రక్రియ తుది దశకు చేరుకోవడంతో శిక్షణ ప్రారంభంపై పోలీస్ ఉన్నతాధికారులు దృష్టి పెట్టారు. ఆగస్టు చివరి వారంలో లేదంటే సెప్టెంబర్ మొదటి వారం నుంచి తెలంగాణ పోలీస్ అకాడమీలో నూతన ఎస్సైల శిక్షణ ప్రారంభం కానున్నట్లు సమాచారం. ఈ ఏడాది బ్యాచ్‌లో సివిల్ ఎస్సైల సంఖ్య తక్కువగా ఉండటంతో వసతుల ఏర్పాట్లకు పెద్దగా సమయం పట్టదని అధికారులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 17 నుంచి వైద్య పరీక్షలు ప్రారంభమయ్యా యి. మరోవైపు ఎస్బీ ఎంక్వైరీ జరుగుతోంది. ఈ మొత్తం ప్రక్రియ తర్వాత పోలీస్ రిక్రూట్‌మెంట్‌కు నివేదికలను ఆయా జిల్లాల, కమిషనరేట్ల యూనిట్ అధికారులు పంపుతారు. తర్వాత వారి నుంచి అభ్యర్థులకు శిక్షణకు ఎప్పుడు రావాలన్న వివరాలతో నియామక పత్రాలు అందుతాయి. ఈ మొత్తం ప్రక్రియ మరో వారంలో పూర్తి కానున్నట్లు తెలిసింది. ఈసారి బ్యాచ్‌లో 587 మంది ఎస్సైలకు శిక్షణ ఇవ్వనున్నారు.

### కేటీఆర్‌కు టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: బ్రస్సెల్స్‌లోని టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ అక్టోబర్ 24న నిర్వహించే 'టెక్ యాక్సిలేటర్-2023 సదస్సు'కు రావాల్సిందిగా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావును ఆహ్వానించింది. యూకే మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ వ్యవస్థాపక చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఈ ఇన్‌స్టిట్యూట్ సాంకేతికత, డేటా ఆధారంగా మెరుగైన ప్రజాసేవలు అందించే లక్ష్యంతో పనిచేస్తోంది. కృత్రిమ మేధస్సుకు ప్రాధాన్యం పెరుగుతున్న ప్రస్తుత సందర్భంలో ప్రపంచ వ్యాప్తంగా విధానాలు, రాజకీయాల్లో పేరొందిన కొందరు నేతలను కీలకోపన్యాసం చేసేందుకు ఆహ్వానిస్తోంది. ఏఐ, ఐటీ, పరిశ్రమలు, ఆవిష్కరణల రంగంలో తెలంగాణ చేస్తున్న కృషికి దక్కిన గుర్తింపుగా ఈ ఆహ్వానాన్ని భావిస్తున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు.

### 69 మంది ఫైర్‌మన్‌లకు పదోన్నతి

సాక్షి, హైదరాబాద్: అగ్నిమాపకశాఖలో 69 మంది ఫైర్‌మన్‌లకు లీడింగ్ ఫైర్‌మన్‌లుగా పదోన్నతి కల్పిస్తూ ఆ శాఖ డైరెక్టర్ జనరల్ వై.నాగిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన వారిలో అత్యధికంగా చార్మినార్ జోన్ నుంచి 40 మంది ఉండగా, బాసర జోన్ నుంచి ఆరుగురు, రాజన్న జోన్ నుంచి ఐదుగురు, భద్రాద్రి జోన్ నుంచి ఆరుగురు, యాదాద్రి జోన్ నుంచి ఆరుగురు, జోగులాంబ జోన్ నుంచి ఆరుగురు ఉన్నారు.

# 23 నుంచి బీజేపీ ఆందోళనలు

- ఎన్నికలు సమీపిస్తుండటంతో కార్యాచరణ వేగవంతం
- ఆదివారం ఉదయం నుంచి రాత్రి దాకా వరుసగా పార్టీ సమావేశాలు
- పార్టీ ఉప కమిటీల భేటీలు కూడా.. నిరసనల ప్రణాళికలపై చర్చలు



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో బీజేపీ తమ కార్యాచరణను వేగవంతం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 23 నుంచి ఆందోళనలను చేపట్టేందుకు ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి సునీల్ బన్సల్, పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్‌ల నేతృత్వంలో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు పలు పార్టీ సమావేశాలను నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా నిరసనలు, ఆందోళనలకు యాక్షన్ ప్లాన్ రూపొందించారు.

**23 నుంచి ప్రజా ఆందోళనలు:** కె.లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన ఉద్యమ కమిటీ సమావేశంలో.. ఈనెల 23 నుంచి నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో ఆందోళన కార్యక్రమాల ప్రణాళికను ఖరారు చేశారు. 23న అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల ఇళ్ల ముందు ధర్నాలు, నిరసనలు చేపట్టి.. ఆయా ఎమ్మెల్యేలు గత ఐదేళ్ల చేసిన అవినీతి, అక్రమాలు, హామీల ఉల్లంఘనపై చార్జిషీటును విడుదల చేస్తారు. 24న మంత్రుల ఇళ్ల ముట్టడి, ధర్నాలు చేపట్టి.. మంత్రుల అవినీతిపై చార్జిషీటును విడుదల చేస్తారు. 25న జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహించి.. కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేస్తారు.

**అమిత్‌షా పర్యటన, బస్సు యాత్రలపై..:** 27న ఖమ్మంలో నిర్వహించే అమిత్‌షా సభకు ఏర్పాట్లపైనా రాష్ట్ర బీజేపీ నేతలు మరో సమావేశంలో చర్చించారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా చేపట్టాలని నిర్ణయించిన బస్సు యాత్రలపై స్పష్టమైన నిర్ణయం తీసుకున్నారు. భద్రాచలం సీతారామ దేవాలయం, బాసర సరస్వతి దేవాలయం, అలంపూర్ జోగులాంబ దేవాలయాల నుంచి బీజేపీ బస్సుయాత్రలను ప్రారంభించనున్నారు.

**అధికార పార్టీ ఉల్లంఘనలపై ఫోకస్**

మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన బీజేపీ ఎలక్షన్ కమిషన్ ఎఫైర్స్ కమిటీ సమావేశంలో.. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా అధికార పార్టీ చేపట్టే కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు స్పందించేలా చేపట్టాల్సిన చర్యలపై చర్చించినట్టు తెలిసింది. ఇక ఈటల రాజేందర్ అధ్యక్షతన జరిగిన ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశంలో.. నియోజకవర్గాల వారీగా పార్టీ అభ్యర్థుల విజయానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. కాగా సోమవారం పార్టీ అనుబంధ సంఘాలైన ఏడు మోర్చాల సమావేశాలను పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించనున్నారు.

# వారికి ఇవ్వొద్దు... మా నేతలకివ్వండి

▶ మొదటి పేజీ తరువాయి



మెదక్‌లో ఆందోళన చేస్తున్న రోహిత్ వర్గీయులు

ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మధుసూదనాచారికి అన్యాయం చేయవద్దని కోరారు. గండ్ర వెంకటరమణారెడ్డికి టికెట్ ఇస్తే.. సుమారు 200 మంది ఉద్యమకారులం నామినేషన్లు వేసి బరిలో దిగుతామని, గండ్రను ఓడిస్తామని హెచ్చరించారు. పోలీసులు, నేతలు అక్కడికి చేరుకుని టవర్ ఎక్కిన వారితో మాట్లాడి కిందికి దింపారు.

**పద్మా దేవేందర్‌రెడ్డికి ఇవ్వొద్దంటూ..**

మెదక్ బీఆర్‌ఎస్ టికెట్‌ను సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డికి ఇవ్వొద్దంటూ మైనంపల్లి రోహిత్ వర్గీయులు ఆదివారం పట్టణంలో ధర్నాకు దిగారు. అధిష్టానం ఆదేశాల మేరకే యువ నాయకుడు రోహిత్ 'సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ (ఎంఎస్‌ఎస్)' ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నారని, టికెట్ ఆయనకే కేటాయించాలని డిమాండ్ చేశారు. పద్మా దేవేందర్‌రెడ్డికి టికెట్ ఇస్తే.. యువత ఎట్టి పరిస్థితుల్లో మద్దతు ఇవ్వదన్నారు. కార్యక్రమంలో చిన్నశంకరంపేట మాజీ ఎంపీపీ అరుణ, సర్పంచ్ రాజిరెడ్డి, ఎంఎస్‌ఎస్‌ఓ ఆర్గనైజింగ్ సభ్యులు బొజ్జ పవన్, బోసు, మేడి గణేశ్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

**ముత్తిరెడ్డి, జెడ్పీ చైర్మన్ వర్గాల మధ్య ఘర్షణ**

జనగామ బీఆర్‌ఎస్ టికెట్ విషయంలో.. సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి వర్గాల మధ్య ఇప్పటికే ఘర్షణ కొనసాగుతుండగా ఆదివారం అది మరింత పెరిగింది. నియోజకవర్గంలోని తరిగొప్పుల మండలం మరియపురంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బీరెడ్డి జార్జిరెడ్డి నివాసంలో మండల ప్రజా ప్రతినిధులతో జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి అనుచరులు బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పింగిళి జగన్మోహన్‌రెడ్డి, కో-ఆర్డినేటర్ జొన్నగోని కిష్టయ్య, గ్రామ అధ్యక్షుడు అంకం రాజారాం, యూత్ అధ్యక్షుడు మల్యాల సుధీర్ తదితరులు అక్కడికి చేరుకుని ఆందోళనకు దిగారు. ప్రజాప్రతినిధులను ప్రలోభాలకు గురిచేస్తున్నారంటూ మండిపడ్డారు. దీంతో ఇరువర్గాల మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది.

**టి.రాజయ్యకే టికెట్ ఇవ్వాలంటూ..**

బీఆర్‌ఎస్ స్టేషన్ ఘన్‌పూర్ అసెంబ్లీ టికెట్‌ను ఈసారి కడియం శ్రీహరికి ఇచ్చే అవకాశం ఉందన్న ప్రచారంతో సిట్టింగ్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య వర్గం ఆందోళనకు దిగింది. 'స్థానికుడైన రాజయ్యకే మళ్లీ టికెట్ ఇవ్వాలి. వలసవాద రాజకీయాలు వద్దు. కడియం గోబ్యాక్'అంటూ రాజయ్య అనుచరులు ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సమీపంలో ధర్నా చేశారు.

# నిర్మల్‌లో 'మాస్టర్' ఫైట్

- ఐదో రోజుకు చేరిన ఏలేటి దీక్ష
- మంత్రి ఇంద్రకరణ్ ఇంటి ముట్టడికి బీజేపీ యత్నం
- పోలీసుల లాఠీచార్జి.. మహిళలు, కార్యకర్తలకు గాయాలు
- నేడు ఏలేటి ఇంటి ముట్టడి: బీఆర్‌ఎస్



ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు

నిర్మల్/బాల్కొండ/ఇందల్వాయి/సాక్షి, హైదరాబాద్: మాస్టర్‌ప్లాన్ వ్యవహారంతో నిర్మల్ ఉద్రిక్తంగా మారింది. మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చేపట్టిన ఆమరణ నిరాహారదీక్ష ఆదివారం ఐదో రోజుకు చేరింది. ఆయన ఆరోగ్యం మరింత క్షీణిస్తుండటంతో బీజేపీ ఆదివారం రెండోరోజూ ఆందోళనకు దిగింది. నిర్మల్ బైల్‌బజార్ చౌరస్తా వద్ద పెద్దసంఖ్యలో మహిళలు, పార్టీ నేతలు, కార్యకర్తలు బైఠాయించారు. మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేయాలని నినదించారు. అనంతరం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఇంటి ముట్టడికి బయలుదేరారు. మంత్రి ఇంటి సమీపంలోకి రాగానే పోలీసులు వారిని అడ్డుకుని, లాఠీచార్జి చేశారు. దీనితో మహిళలు, కార్యకర్తలకు గాయాలయ్యాయి. మరోవైపు ఏలేటి దీక్షకు సంఘీభావం ప్రకటించేందుకు వెళ్తున్న బీజేపీ నేతలు డీకే అరుణ, ధర్మపురి అర్వింద్‌లను పోలీసులు అడ్డుకున్నారు. కాగా, మంత్రి ఇంటి ముట్టడికి ప్రతిగా తాము సోమవారం బీజేపీ నేత ఏలేటి ఇంటిని ముట్టడిస్తామని బీఆర్‌ఎస్ ప్రకటించింది. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో జిల్లా కేంద్రంలో భారీగా బలగాలను మోహరించారు.

**ఆమరణ దీక్షలోనే ఏలేటి..**

నిర్మల్ మున్సిపాలిటీ మాస్టర్‌ప్లాన్ పూర్తిగా రద్దయ్యే వరకూ పోరాటం చేస్తానంటూ మహేశ్వర్‌రెడ్డి ఆమరణ నిరాహారదీక్ష కొనసాగిస్తున్నారు. ఆదివారం ప్రభుత్వ వైద్యులు ఆరోగ్యం పరీక్షించేందుకు వచ్చినా నిరాకరించారు. దీక్షకు సంఘీభావంగా వచ్చిన బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను నిజామాబాద్-నిర్మల్ జిల్లాల సరిహద్దు వద్దే పోలీసులు నిలిపివేశారు. నిర్మల్ జిల్లా సోన్ వద్ద నిజామాబాద్ జిల్లా మెండోరా, నిర్మల్ పోలీసులు సంయుక్తంగా అరుణను అరెస్టు చేసి హైదరాబాద్‌కు పంపించారు. అరుణ సోన్‌లో, అనంతరం హైదరాబాద్‌లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ ఏలేటిని పరామర్శించడానికి వెళ్తున్న తనను ప్రభుత్వం అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు.

**అమిత్‌షా, కిషన్‌రెడ్డి ఆరా..**

మహేశ్వర్‌రెడ్డికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఫోన్‌చేసి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆమరణ దీక్ష, పోలీసులు లాఠీచార్జి చేయడంపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఫోన్‌లో ఆరా తీశారని తెలిపారు. కాగా సోమవారం కిషన్‌రెడ్డితో పాటు రాష్ట్ర ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్ తదితరులు నిర్మల్ రానున్నట్లు పార్టీ నాయకులు వెల్లడించారు. మరోపక్క మాస్టర్‌ప్లాన్ రద్దు చేసే దాకా రిలే నిరాహార దీక్షలను ఆపేది లేదంటూ బాధిత రైతులు భీష్మించుకుని కూర్చున్నారు. ఆర్డీవో కార్యాలయం ఎదుట దీక్షలో ఉన్నవారిని ఆదివారం పలువురు నేతలు పరామర్శించారు.

# కేసీఆర్ సర్కార్‌ది రియల్ ఎస్టేట్ కంపెనీ

▶ మొదటి పేజీ తరువాయి

కట్టబెడుతున్నారని ఆరోపించారు.

**నిర్మల్‌లో నిలదీస్తే దాడులా?**

నిర్మల్ పట్టణంలో మాస్టర్ ప్లాన్ పేరిట భూమాయ జరుగుతోందని.. అధికార పార్టీ నేతలకు అనుకూలంగా, రైతుల భూములను అన్యాక్రాంతం చేసేందుకు కుట్ర జరుగుతోందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. నిర్మల్‌లో సోఫీనగర్ ఇండస్ట్రియల్ జోన్‌ను రెసిడెన్షియల్‌గా మార్చేందుకు జీవో తెచ్చి రైతులకు నష్టం కలిగిస్తున్నారని.. దీనికి వ్యతిరేకంగా రైతులు, ప్రజలు ఆందోళన చేస్తుంటే పోలీసులతో లాఠీచార్జి చేయిస్తున్నారని విమర్శించారు. పోలీసుల దాడిలో దాదాపు 30 మంది యువకులు తీవ్రంగా గాయపడ్డారని, పలువురి తల పగిలి గాయాలయ్యాయని చెప్పారు. నిర్మల్‌లో మహేశ్వర్‌రెడ్డి చేపట్టిన దీక్షకు మద్దతు తెలిపేందుకు వెళుతున్న మాజీ మంత్రి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణను పోలీసులు అడ్డుకున్నారని, మహిళా నాయకురాలనే గౌరవం లేకుండా బలవంతంగా ఈడ్చుకెళ్లి అరెస్ట్ చేశారని మండిపడ్డారు. పోలీసులు బీఆర్‌ఎస్ పార్టీ నాయకుల్లా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

**ప్రశ్నిస్తే అణచివేస్తారా?**

ఆదిలాబాద్‌లో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బీజేపీ కార్యకర్తలు, జిల్లా అధ్యక్షుడిపైనా పోలీసులు లాఠీచార్జి చేయడం దారుణమని కిషన్‌రెడ్డి చెప్పారు. సీఎం సూర్యాపేటకు వెళితే అక్కడి బీజేపీ నేతలను అరెస్టు చేశారన్నారు. సీఎం, ఆయన కుమారుడు ఎక్కడికి వెళ్లినా ప్రతిపక్షాల నేతలు, కార్యకర్తలను ముందస్తు అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. కల్వకుంట్ల కుటుంబంలో అభద్రతాభావం ఏర్పడిందని.. వారి అవినీతికి వ్యతిరేకంగా ఎవరైనా ప్రశ్నిస్తే అణచివేసే ధోరణి నడుస్తోందని విమర్శించారు. కల్వకుంట్ల కుటుంబం అధికారంలో ఉండేది 4 నెలలేనని, తర్వాత బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని పేర్కొన్నారు. పోలీసులు చట్టబద్ధంగా వ్యవహరించాలని, పక్షపాతం మంచిది కాదని హితవు పలికారు.

### పోలీసులు మహిళలనూ కొట్టారు: ఈటల

తెలంగాణలో పోలీసులు చట్టానికి లోబడి కాకుండా కేసీఆర్ చెప్పినట్టుగా పనిచేస్తున్నారని బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆరోపించారు. నిర్మల్‌లో వందలమంది మహిళలను మగ పోలీసులు విపరీతంగా కొట్టారని ఆరోపించారు. లంబాడీ మహిళల పట్ల కేసీఆర్ నీచంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కాళోజీ టీవీ దాసరి శ్రీనివాస్, బీజేపీ ఐటీ సెల్‌లో పని చేసే బొమ్మ శరత్‌లను మఫ్టీలో ఉన్న పోలీసులు పట్టుకుపోయి బయటి ప్రాంతాల్లో తిప్పుతూ విపరీతంగా కొట్టారని.. హుజూరాబాద్‌లో చెల్పూరు సర్పంచ్ మహేందర్‌ను అలాగే కొట్టి హింసించి, పైశాచికానందనం పొందారని ఆరోపించారు. గిరిజన, దళిత మహిళలకు కేసీఆర్ ప్రభుత్వంలో రక్షణ లేదన్నారు.

# తల్లీబిడ్డల సంరక్షణలో రోల్‌మోడల్‌గా తెలంగాణ

- ప్రజారోగ్యంపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి
- మంత్రి హరీశ్‌రావు వెల్లడి
- గాంధీలో ఎంసీహెచ్ కేర్ సెంటర్, డైట్ క్యాంటీన్, నియోనెటల్ అంబులెన్స్ సర్వీసులు ప్రారంభం


జెండా ఊపి నియోనెటాల్ అంబులెన్స్ సర్వీసులు ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్. చిత్రంలో తలసాని

గాంధీ ఆస్పత్రి (హైదరాబాద్): తల్లీబిడ్డల సంరక్షణలో తెలంగాణ దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచిందని, మాతాశిశు మరణాలు తక్కువగా ఉన్న మూడో రాష్ట్రంగా నమోదు కావడం గర్వంగా ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. మాతాశిశు మరణాలను గణనీయంగా తగ్గించిన ఘనత ముఖ్యమంత్రి, ప్రభుత్వ వైద్యులు, సిబ్బందికే దక్కుతుందని పేర్కొన్నారు. తల్లి మరణాలు గతంలో ప్రతి లక్షకు 92 ఉంటే.. అవిప్పుడు 43కు తగ్గాయని, బిడ్డ మరణాలు 39 నుంచి 21కి తగ్గాయని తెలిపారు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో రూ.52 కోట్లతో నిర్మించిన మదర్ చైల్డ్ హెల్త్ (ఎంసీహెచ్) కేర్ సెంటర్‌ను, రూ.2.70 కోట్లతో ఏర్పాటు చేసిన డైట్ క్యాంటీన్ భవనాలను, జిల్లాకు ఒకటి చొప్పున 33 నియోనెటల్ అంబులెన్స్ సర్వీసులను ఆదివారం మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్‌తో కలిసి హరీశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూలై నెలలో 72.8 శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే జరిగాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 350 ప్రసూతి కేంద్రాల ఆధునికీకరణ చేపట్టామని తెలిపారు. హైదరాబాద్‌లోని గాంధీ, పేట్లబురుజు ఆస్పత్రుల్లో సంతాన సాఫల్య కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

**గాంధీలో సూపర్ స్పెషాలిటీ ఎంసీహెచ్ కేర్ సెంటర్**

మాతాశిశు మరణాలను తగ్గించేందుకు 600 పడకలతో గాంధీ, నిమ్స్, టిమ్స్ (ఆల్వాల్)ల్లో మూడు ఎంసీహెచ్ కేర్ సెంటర్లకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా, ఆదివారం నుంచి గాంధీలో సూపర్ స్పెషాలిటీ ఎంసీహెచ్ కేర్ సెంటర్ అందుబాటులోకి వచ్చిందని హరీశ్‌రావు వెల్లడించారు. ప్రస్తుతం గాంధీ ఆస్పత్రిలో మాతాశిశు సంరక్షణకు 500 పడకలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. సీఎం కేసీఆర్ ప్రారంభించిన 300 అమ్మఒడి వాహనాలు రోజూ 4 వేల మంది గర్భిణులకు సేవలు అందిస్తున్నాయని వివరించారు.

**ఆధునిక సౌకర్యాలతో నియోనెటల్ అంబులెన్స్‌లు**

పుట్టిన ప్రతి శిశువును ప్రాణాలతో కాపాడుకునేందుకు జిల్లాకు ఒకటి చొప్పున 33 నియోనెటల్ అంబులెన్స్ సర్వీసులను అందుబాటులోకి తెచ్చామని హరీశ్‌రావు చెప్పారు. ఆధునిక సౌకర్యాలతో కూడిన ఈ అంబులెన్సులు అత్యవసర సమయాల్లో నవజాత శిశువులను ఆస్పత్రులకు తరలించేందుకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఎమ్మెల్సీలు వాణీదేవి, మీర్జా రహమత్ ఆలీబేగ్, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ, జిల్లా కలెక్టర్ అనుదీప్, పలువురు ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

**గాంధీ ఆస్పత్రికి ఐఎస్‌ఓ సర్టిఫికెట్**

గాంధీ ఆస్పత్రి (హైదరాబాద్): తెలంగాణ వైద్య ప్రదాయినీ సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి రెండు విభాగాల్లో ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ (ఐఎస్‌ఓ) సర్టిఫికెట్లు సాధించింది. టెరిటరీ లెవెల్ పబ్లిక్ హెల్త్ కేర్ సర్వీసెస్ విభాగంలో క్వాలిటీ మేనేజ్‌మెంట్ సిస్టం (ఐఎస్‌ఓ 9001: 2015), ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సిస్టం (ఐఎస్‌ఓ 45001: 2018)లకు క్వాలిటీ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (క్యూఆర్‌ఓ) సంస్థ ఐఎస్‌ఓ సర్టిఫికెట్లను ప్రదానం చేసింది. ఈ సర్టిఫికెట్ల కాలపరిమితి 2026 వరకు ఉంటుందని, ప్రభుత్వ ఆస్పత్రుల సెక్టార్‌లో ఐఎస్‌ఓ సర్టిఫికెట్ పొందిన మొట్టమొదటి ఆస్పత్రి సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి అని సూపరింటెండెంట్ రాజారావు తెలిపారు. గాంధీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మంత్రి హరీశ్‌రావు గాంధీ వైద్యులు, సిబ్బంది, పాలనా యంత్రాంగ పనితీరును ప్రశంసించారు. సూపరింటెండెంట్ రాజారావు, గైనకాలజీ హెచ్‌ఓడీ సంగీత షాలకు ఐఎస్‌ఓ సర్టిఫికెట్లను అందించి అభినందించారు.

# వసతులు మెరుగుపడ్డాయా?

**సంక్షేమ వసతి గృహాల తనిఖీకి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం**

సాక్షి, హైదరాబాద్: గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో పరిస్థితుల పరిశీలనకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. సంక్షేమ విద్యార్థులకు మరింత నాణ్యమైన భోజనం అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మెస్ చార్జీలను సైతం దాదాపు 30 శాతం పెంచింది. ఈ క్రమంలో అక్కడ మారిన పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్లకు తనిఖీ బాధ్యతలు అప్పగించింది. ప్రతి వారం కనీసం ఒక సంక్షేమ వసతిగృహం, గురుకుల పాఠశాలను తనిఖీ చేయాలని ఆదేశించింది. ఇటీవల వైద్యారోగ్య శాఖ మంత్రి టి.హరీశ్ ఈ మేరకు కలెక్టర్లను ఆదేశించారు.

**పరిశీలన... భోజనం..:** సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల తనిఖీ బాధ్యతలు రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకు అప్పగించినప్పటికీ సంబంధిత సంక్షేమ శాఖ అధికారులు విధిగా ఈ పరిశీలనలను క్రమం తప్పకుండా చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. వచ్చే నెల మొదటి వారం నుంచి ఈ తనిఖీలు ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించాలని సంక్షేమ శాఖలు భావిస్తున్నాయి. అదేవిధంగా తనిఖీకి సంబంధించిన ప్రొఫార్మాను సైతం ప్రత్యేకంగా రూపొందించేందుకు సిద్ధమవుతున్నాయి. తనిఖీ అనంతరం అక్కడే భోజనం చేసేలా ప్రభుత్వం నిబంధన విధించింది. జిల్లా కలెక్టర్ కనీసం వారంలో ఒక గురుకుల పాఠశాల, ఒక వసతిగృహాన్ని విజిట్ చేయాల్సి ఉంటుంది. సంక్షేమ శాఖ అధికారులు మాత్రం వారంలో రెండు లేదా మూడు హాస్టళ్లు, స్కూళ్లు విజిట్ చేయాలి. ఈ మేరకు పూర్తిస్థాయి మార్గదర్శకాలను జారీ చేయనుంది. రాష్ట్రంలో వెయ్యికిపైగా గురుకుల పాఠశాలలు, కళాశాలలున్నాయి. వీటితో పాటు 1,450 సంక్షేమ వసతి గృహాలున్నాయి. వీటి పరిధిలో దాదాపు 9 లక్షల మంది విద్యార్థులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.



▶ మొదటి పేజీ తరువాయి

# డుమ్మా టీచర్లపై నజర్!

గైర్హాజరు కావడమో చేస్తున్నారు. ఇలాంటి వారు తొలుత పాఠశాల విద్య డైరెక్టరేట్ నుంచి అనుమతి తీసుకుంటున్నారని.. కానీ తర్వాత సెలవులు పొడిగించాలంటూ తమకు మెసేజీలు, మెయిల్స్ పెడుతున్నారని ప్రధానోపాధ్యాయులు చెప్తున్నారు. కానీ నిబంధనల మేరకు వాటిని తాము అనుమతించలేక పోతున్నామని అంటున్నారు. అలాంటి టీచర్లంతా అనధికారికంగా గైర్హాజరైనట్టు రికార్డుల్లో నమోదవుతోంది. ఈ సమాచారం డైరెక్టరేట్, డీఈవో పరిధిలో ఉండటం లేదు. మరికొందరు టీచర్లు ప్రైవేటు కాలేజీల్లో లెక్చరర్లుగా పనిచేస్తున్నట్టు విద్యాశాఖ దృష్టికొచ్చింది. అలాంటి వారు అనారోగ్య కారణాలతో సెలవులు పెడుతున్నారని.. ఆ తర్వాత అయినా సరైన పత్రాలతో సెలవుల పొడిగింపునకు ప్రయత్నించడం లేదని అధికారులు చెప్తున్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో పలువురు టీచర్లు.. వారికి బదులు ఎవరికో కొంత డబ్బులిచ్చి బోధించేలా చేస్తున్నారనే ఫిర్యాదులు కూడా ఉన్నాయి.

**'డుమ్మా'మాస్టార్ల లెక్క ఎందుకు లేదు?**

రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లపై చాలా ఏళ్లుగా సరైన పర్యవేక్షణ లేదని.. డీఈవోలు, ఎంఈవోల కొరత దీనికి కారణమన్న విమర్శలు ఉన్నాయి. సీనియర్ హెచ్ఎంలకు ఏడెనిమిది మండలాలను అప్పగించి.. ఇన్‌చార్జి ఎంఈవో బాధ్యతలు నిర్వర్తింపజేస్తున్న పరిస్థితి ఉంది. దీనికితోడు ఇప్పటివరకు ఆన్‌లైన్ హాజరు విధానం లేకపోవడంతో ఉపాధ్యాయుల అటెండెన్స్ రాష్ట్ర కార్యాలయం పరిధిలోకి రావడం లేదు. ఈ క్రమంలోనే తాజాగా ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందిస్తున్నారు. టీచర్ల సెలవులు, ఎన్ని రోజులకు అనుమతి తీసుకున్నారు? ఎన్ని రోజుల నుంచి గైర్హాజరు అవుతున్నారు? అనే వివరాలను అందులో అప్‌లోడ్ చేయనున్నారు. ఈ డేటా ఆధారంగా బడి ఎగ్గొట్టే టీచర్లపై కఠిన చర్యలు తీసుకుంటారు.

**సెలవుల అనుమతి ఎలా..?**

- సాధారణంగా ఉపాధ్యాయులు వివిధ రకాలుగా సెలవులు పెట్టే వీలుంది. క్యాజువల్ లీవ్ పెట్టేందుకు గరిష్టంగా 10 రోజులకు అనుమతి ఉంటుంది. అనారోగ్య సమస్యలతో మెడికల్ లీవ్ పెట్టడానికి ఎలాంటి కాలపరిమితి ఉండదు. తగిన ధ్రువపత్రాలు, వైద్యుల సిఫార్సులను చూపించాల్సి ఉంటుంది.
- ఇవి కాకుండా 180 వరకు ఈఎల్స్ (ఎర్న్‌డ్ లీవ్స్) ఉంటాయి. వీటిని పైఅధికారి అనుమతితో వాడుకోవచ్చు.
- సెలవుల మంజూరుకు సంబంధించి 2009లో తెచ్చిన జీవో 70యే ప్రస్తుతం అమల్లో ఉంది. దాని ప్రకారం టీచర్లకు నాలుగు నెలల వరకు సెలవు ఇచ్చేందుకు సంబంధిత స్కూల్ ప్రధానోపాధ్యాయుడికి అధికారం ఉంటుంది. 4–12 నెలల వరకూ డీఈవో అనుమతి తీసుకోవాలి. ఏడాది నుంచి 4 ఏళ్ల వరకూ లీవ్ తీసుకోవాలంటే పాఠశాల విద్య డైరెక్టర్ అనుమతి తీసుకోవాలి. అంతకు మించి సెలవు పెట్టాలంటే రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి.

**డుమ్మాలపై చర్యలు ఎలా?**

- ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా అనుమతి లేకుండా సెలవును పొడిగిస్తే దాన్ని గైర్హాజరుగానే పరిగణించి సదరు ఉద్యోగిపై తగిన చర్యలు తీసుకోవచ్చు.
- ఉద్యోగి గైర్హాజరైన కాలాన్ని సర్వీస్ నుంచి తొలగించాలి. సస్పెండ్ చేయవచ్చు. అనధికార గైర్హాజరు ఎక్కువగా ఏళ్లకేళ్లు ఉంటే నోటీసు ఇచ్చి సర్వీసు నుంచి తొలగించే అధికారం ప్రభుత్వానికి ఉంది.
- ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా ఐదేళ్లు దాటి గైర్హాజరైతే ఆ ఉద్యోగి రాజీనామా చేసినట్టుగానే భావించి చర్యలు తీసుకోవచ్చు.
- అనుమతి లేకుండా సెలవులను పొడిగించినా, గైర్హాజరైనా ఆ కాలానికి ఎలాంటి వేతనం ఇవ్వరు. పూర్తిగా లాస్ ఆఫ్ పే గానే పరిగణిస్తారు. సస్పెండ్ చేస్తే మాత్రం సగం వేతనం ఇవ్వాల్సి ఉంటుంది.

**ఏళ్లకేళ్లు రాకున్నా మళ్లీ విధుల్లోకి..**

అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా నిబంధనలు సరిగా అమలుకాని పరిస్థితి కనిపిస్తోంది. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఏళ్లకేళ్లు విధులకు హాజరుకాని ఉద్యోగులను తిరిగి విధుల్లో చేర్చుకుంటున్న ఘటనలు కోకొల్లలు.

- జగిత్యాల జిల్లాలో ఒక ఉపాధ్యాయుడు ఏకంగా 12 ఏళ్లపాటు విధులకు రాకున్నా.. తిరిగి జాయిన్ చేసుకున్నారు.
- మరో జిల్లాలో మూడేళ్ల పాటు డుమ్మా కొట్టిన టీచర్‌ను విధుల్లోకి తీసుకున్నారు. అంతకాలం గైర్హాజరైనవారిని తిరిగి జాయిన్ చేసుకునే అధికారం డీఈవోకు లేకున్నా తీసుకోవడం విశేషం.

**పర్యవేక్షణ లోపమే అసలు కారణం**

డుమ్మా కొట్టే టీచర్ల వివరాలు ఇప్పటికీ డైరెక్టరేట్ కార్యాలయంలో అందుబాటులో లేవంటే పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎంఈవోలు 16 మంది మాత్రమే. డిప్యూటీ డీఈవోల ఖాళీలు భారీగా ఉన్నాయి. డీఈవోలు 16 మంది మాత్రమే ఉన్నారు. ఖాళీ పోస్టులన్నింటినీ డైట్ కాలేజీల లెక్చరర్లు, ఇతర అధికారులను ఇన్‌చార్జులుగా పెట్టి నడిపిస్తున్నారు. దీంతో బడులపై పర్యవేక్షణ లోపించింది. టీచర్లు ఇష్టానుసారం అనుమతి లేకుండా డుమ్మా కొట్టడం సహించరాని నేరమే. దీనివల్ల విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుంది. అలాంటి వారిని ఉపేక్షించాల్సిన అవసరం లేదు. – చావా రవి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి





## విద్యార్థినులకు కవిత కుమారుల చేయూత

**10 మందికి స్కాలర్‌షిప్‌ల అందజేత**


విద్యార్థినులకు స్కాలర్ షిప్‌లను అందజేసిన ఎమ్మెల్సీ కవిత కుమారులు ఆదిత్య, ఆర్య

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కుమారులు తమ ఉదారతను చాటుకున్నారు. ఆర్థికంగా వెనుకబడిన మహిళా విద్యార్థినులకు చేయూత అందించారు. ఆమె కుమారులు ఆదిత్య, ఆర్య ప్రారంభించిన సినర్జీ ఆఫ్ మైండ్స్ (ఎస్‌ఓఎం) ఫౌండేషన్ ద్వారా హైదరాబాద్‌లోని సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కాలేజీలో అడ్మిషన్ లభించిన ఆర్థికంగా వెనుకబడిన 10 మంది మహిళా విద్యార్థులకు ఫౌండేషన్ నుంచి స్కాలర్‌షిప్‌లను అందజేశారు. 10 మంది విద్యార్థినుల్లో ఆరుగురు అండర్ గ్రాడ్యుయేట్, ముగ్గురు పోస్ట్ గ్రాడ్యుయేట్ చేసే వారున్నారు. ఈ మేరకు కాలేజీలో కవిత, కాలేజీ ప్రతినిధుల సమక్షంలో విద్యార్థినిలకు ఆదిత్య, ఆర్య స్కాలర్‌షిప్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ మహిళా సాధికారతకు తమ మద్దతు ఎప్పటికీ ఉంటుందన్నారు. తన కుమారులిద్దరూ సమాజ సేవకోసం ఫౌండేషన్‌ను స్థాపించి విద్యార్థినులకు చేయూతనందించడం సంతోషంగా ఉందని తెలిపారు. చిన్న వయసులోనే వారు గొప్పగా ఆలోచించడం తల్లిగా తనకు గర్వంగా ఉందన్నారు. భవిష్యత్‌లోనూ ఫౌండేషన్ ద్వారా మరిన్ని కార్యక్రమాలు చేపట్టి సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని కవిత ఆకాంక్షించారు. స్కాలర్ షిప్ అందుకున్న విద్యార్థినులకు అభినందనలు తెలిపిన ఆమె.. చదువులో బాగా రాణించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు.

## సీఎంను కలిసిన ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావును ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఎస్.సుధాకర్‌రావు ఆదివారం కలిశారు. ఇటీవల చైర్మన్‌గా నియమితులైన ఆయన మర్యాదపూర్వకంగా సీఎంను కలిసి.. తనకు చైర్మన్‌గా అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## గొప్ప వాగ్గేయకారుడు గద్దర్

**వామపక్షాల ఆధ్వర్యంలో గద్దర్ సంస్మరణ సభ**


గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వామపక్ష నేతలు తమ్మినేని, కూనంనేని, నర్సింగ్‌రావు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం తన పాట ద్వారా పాలకులను గడగడలాడించిన గొప్ప వాగ్గేయకారుడు గద్దర్ అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ, సీపీఎం, సీపీఎంఎల్ న్యూ డెమోక్రసీ, సీపీఎంఎల్ ప్రజాపంథా, ఎంసీపీఐయూ, ఫార్వర్డ్ బ్లాక్, లిబరేషన్ తదితర వామపక్షాల ఆధ్వర్యంలో ప్రజా యుద్ధనౌక గద్దర్ సంస్మరణ సభ జరిగింది. సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలమల్లేశ్, నర్సింగ్‌రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ పీడిత వర్గాల అభివృద్ధి జరిగితేనే గద్దర్‌కు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కూనంనేని మాట్లాడుతూ మానవత్వం ఉన్న మహనీయుడు గద్దర్ అని కొనియాడారు. గద్దర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని నర్సింగ్‌రావు పిలుపునిచ్చారు. అశోక్‌తేజ మాట్లాడుతూ గద్దర్ ప్రజా యుద్ధనౌకతో పాటు గౌతమ బుద్ధ నౌక అని కీర్తించారు. గద్దర్ ఒక వ్యక్తి కాదు మహాశక్తి అని, తన పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిన గొప్ప కళాకారుడని జయరాజ్ కీర్తించారు. గద్దర్ కుమార్తె వెన్నెల, పలు కమ్యూనిస్టు పార్టీల నేతలు పోటు రంగారావు, కె.గోవర్ధన్, వేములపల్లి వెంకటరామయ్య, విమలక్క, వనం సుధాకర్ పాల్గొన్నారు.



మంచి స్నేహితుడు, కఠినమైన శత్రువు...
ఇద్దరూ అవసరమే. స్నేహితుడు ఉపదేశిస్తాడు.
శత్రువు కార్యోన్ముఖుణ్ణి చేస్తాడు.
– డైయొజినీజ్



సాక్షి
సోమవారం, 21 ఆగస్టు 2023

# కాలం కార్ఖానా

కాలం ఒక కార్ఖానా. మనం నేల మీద పడిన క్షణం నుంచి కాలం కార్ఖానాలో మన కోసం ఉత్పత్తి మొదలైపోతుంది. ఆ ఉత్పత్తులలో మనకు కావలసిన రకరకాల ఆహార్యాలు, ఆలోచనలు, రుచులు, అభిరుచులు, అలవాట్లే కాదు; వాటిని నియంత్రించే హద్దులూ ఏర్పడిపోతాయి. పుట్టిన మరుక్షణం నుంచి కాలం మనకు తెలియకుండానే మనతో కలసి నడుస్తుంది, మనల్ని నడుపుతుంది. కానీ మనం ఆ సంగతి గుర్తించం, మనల్ని మనమే నడుపుకుంటున్నామనుకుంటాం. అంతా మన ప్రయోజకత్వమేననుకుని విర్రవీగుతాం. కాలాన్ని కేలండర్‌గా మార్చి గోడకూ; గడియారంగా మార్చి మణికట్టుకూ బంధించామనుకుంటాం. కానీ గుప్పిట్లో నీళ్ళు వేళ్ళ సందుల్లోంచి జారిపోయినట్టుగా కాలం కూడా ఏ బంధనాలకూ లొంగకుండా జారుకుంటూనే ఉంటుందన్న వాస్తవం మన తెలివిని నిరంతరం వెక్కిరిస్తూనే ఉంటుంది.

కాలంలో ఒకానొకనాడు మనిషి నగ్నత్వాన్నే ఒంటికి చుట్టుకున్నాడు. తర్వాత తర్వాత ఒళ్ళంతా వస్త్రంతో కప్పుకోవడమే సంస్కారంగా, నాగరికతగా మారింది. మొన్నటికి మొన్న, తగినంత తిండికీ, చాలినంత ఆచ్ఛాదనకూ నోచుకోని ఈ దేశంలోని కోట్లాది నిరుపేదల బతుకు టద్దంగా మారుతూ మోకాళ్ళు దాటని అంగవస్త్రాన్ని మొలకు చుట్టుకోవడం ఆదర్శం కాదు, అవసరమనుకున్నాడు మహాత్మా గాంధీ. ఆ తర్వాత స్త్రీ పురుష వస్త్రధారణ అనేకానేక మార్పుల మలుపులు తిరుగుతూ ఒంటినిండా కప్పుకోవడమనేది 'అనాగరికం'గా మారి గాంధీగారి అంగవస్త్రంలా మోకాళ్ళు దాటని షార్ట్స్ ధరించడం అతి నవీనమైన పోకడగా మారింది. కాలం చేసే చిత్రాలు అలా ఉంటాయి. అది మన పట్టు తప్పించుకుంటూ ముందుకే కాదు, వెనక్కీ, పక్కలకీ కూడా పరుగులెడుతూ మనతో ఆడుకోగలదు.

కాలం అఖండంగా ఉంటూనే నిన్న, నేడు, రేపు రూపంలో ఖండితంగానూ ఉంటుంది. కానీ మన ఊహాపోహలకు, జీవనగమనానికి మేకులు దిగేసి వర్తమానమనే కట్టుకొయ్యకు బంధించి ఉంచుతుంది. కవి ఎంత క్రాంతదర్శి అయినా ఆ మేకుబందీ నుంచి పూర్తిగా తప్పుకోలేడు. రేపటి కాలంలో పోస్ట్ మ్యాన్ ఆరోవేలుగా మారబోతున్నాడని తెలిసి ఉంటే దేవరకొండ బాలగంగాధర తిలక్ ప్రసిద్ధ కవిత 'తపాలా బంట్రోతు' ఏ రూపం దిద్దుకొని ఉండేదో! 'దేశాంతరగతుడైన ప్రియుడి వార్త' మొబైల్ రూపంలో అరచేతి దూరంలో ఉన్న ఈ రోజున, ఏ అమ్మాయీ 'పద్దెనిమిదేళ్ళ పడుచుదనాన్ని భద్రంగా దాచి పళ్లెరంలో పెట్టి ప్రాణనాథుడి కందించా'లనే ఆశతో, 'చూపులు తుమ్మెద బారులు కట్టి' పోస్ట్ మ్యాన్ కోసం ఎదురుచూడాల్సిన అవసరమే లేదు. చిరునవ్వుతోనే కబురు లేదని చెప్పి వెళ్లిపోతున్న తపాలా బంట్రోతు వెనుక ఆ కళ్ళు 'విచ్చిన రెండు కల్హార సరస్సులు' కావలసిన అవసరమూ లేదు. అలాగని ప్రియుడి వార్త కోసం పడుచుదనం పడే ఆరాటం కాలభేదాలకు అతీతంగా నిత్యనూతనమూ అవుతుంది కనుక ఒక అపురూప భావస్పందన కలిగించే కవితగా అది భవిష్యత్తులోకి తన అస్తిత్వాన్ని పొడిగించుకుంటూనే ఉంటుంది. మరోపక్క, గతకాలపు చరిత్ర శకలంగానూ మారుతుంది.

గతంపై మసక తెర కప్పి మాయ చేయడం కాల స్వభావాలలో ఒకటి. మన పాదముద్రలు గతంలోకి వ్యాపించి ఉన్నాయన్న ఎరుక తప్పి, మన నడక వర్తమానంలోనే మొదలైందని అపోహ పడతాం. నేడు మన కళ్ళముందు ఉన్నవే నిత్యాసత్యాలు కావనీ, మొదటి నుంచీ ఈ ప్రపంచం ఇలాగే లేదనీ కొంత తెలిసినా కొంత తెలియనట్టే భ్రమావలయంలో గడుపుతూ ఉంటాం. ఎన్నో రకాల నియంతృత్వాలను దాటి ప్రజాస్వామ్యంలోకి వచ్చామనీ, అది కూడా ఇంకా ప్రయోగ దశలోనే ఉంది తప్ప పూర్తిగా పాదుకోలేదనీ, నేటి మన అనేకానేక సమస్యలు, సంక్షోభాల మూలాలు గతంలో ఉన్నాయనీ, వాటి పరిష్కారాల వెతుకులాటలో వందలు, వేల సంవత్సరాల గతంలోకి మన చూపుల నిడివి పెంచుకోవాలనే ఊహ రాకుండా మన బుద్ధికి కాలం దడి కడుతుంది. వర్తమానాన్ని ఒక మత్తుమందులా అలవాటు చేస్తుంది.

ప్రపంచవ్యాప్తంగా వాఙ్మయ పరిణామ క్రమాన్నే కనుక చూస్తే, క్రతు సంబంధమైన తంతు నుంచి మూకాభినయమూ, దాని నుంచి నాట్యమూ, నాట్యం నుంచి నాటకమూ ఎలా అభివృద్ధి చెందాయో; క్రతు సందర్భ గానం నుంచే పాట పుట్టి కావ్యస్థాయికి ఎలా పెరిగిందో; అనేకమంది అజ్ఞాతకర్తలు కలిగిన మౌఖిక సంప్రదాయం నుంచి, ఏక కర్తృకమైన లేఖన సంప్రదాయానికి వాఙ్మయం ఎలా పరివర్తన చెందిందో చెప్పే ఆసక్తికరమైన అధ్యయనాలు ఈరోజున అందుబాటులో ఉన్నాయి. అయినాసరే, నాట్యం, నాటకం, పాట, పద్యం, వచనపద్యం, గద్యం, కథ, నవల వంటి వివిధ ప్రక్రియలను పరస్పర సంబంధం లేని భిన్న రూపాలుగా విడదీసి చూడడాన్ని కాలం మనకు అలవాటు చేసింది. మౌఖిక సంప్రదాయానికి, అనేక కర్తృకానికి చెందినవాటిని కూడా లిఖిత సంప్రదాయం నుంచీ, ఒక్కరే రచించారన్న భావన నుంచీ చూడడం కూడా కాలం మప్పిన అలవాటే. కాలం పోయే చిత్రగతులు మనిషిని మొదటినుంచీ తికమకపెడుతూ ఆలోచనకు లోనుచేస్తూనే ఉన్నాయి. మహాభారత కథకుడు కాలానికి చెప్పిన భాష్యంలో అసాధారణమైన లోచూపు కనిపించి ఆశ్చర్యచకితం చేస్తుంది. భూత, భవిష్యత్, వర్తమానాలకు చెందిన అన్ని భావాలూ కాలనిర్మితాలేనంటాడు. భావాలు మనిషివే కనుక మనిషీ కాలనిర్మితుడే నన్నమాట. కాలం గురించిన తెలివిడితోనే దాని మాయాజాలం నుంచి ఏ కొంచెమైనా తప్పించుకోగలం.

# భారత ప్రధానుల నిర్ణయ విధానాలు!

కామెంట్



కరణ్ థాపర్

**ఆరుగురు ప్రధానమంత్రులపై నీరజా చౌధరి తాజాగా 'హౌ ప్రైమ్ మినిస్టర్స్ డిసైడ్' పుస్తకాన్ని వెలువరించారు. ఈ పుస్తక విజయ రహస్యం అంతా కూడా... చరిత్రనూ, జీవిత చరిత్రనూ మిళితం చేసి, దానికి ఉల్లాసభరితమైన చిట్టి పొట్టి కథల్ని, కబుర్లూ–కాకరకాయలను జోడించడంలోనే ఉంది. ఈ ప్రధానులలో ఎవరి మీదనైనా మీకు ఇదివరకే ఉన్న అభిప్రాయాన్ని పునరాలోచింపజేసేంతటి రహస్యాల వెల్లడింపులేమీ ఈ పుస్తకంలో లేవు. ఇది పునఃసమీక్ష కాదు. కానీ ఇందులో ఉల్లేఖనాలు, ఉటంకింపులతో పాటు... మీకు ఇప్పటికే తెలిసి ఉన్న వివరాలకు జోడింపుగా పరిశోధనాత్మక వివరాలు ఉన్నాయి. విషయాలను మీరు మరింత బాగా అర్థం చేసుకోడానికి ఈ పుస్తకం సహాయపడుతుంది.**

ప్రధానంగా జీవిత చరిత్రలు నాకు మనోరంజకంగా ఉంటాయి. అందుకు కారణం ఆ ముఖ్య పాత్రల జీవితాలలో మనం పాలుపంచుకోవడం ఒక్కటే కాదు, అవి చదవడానికి సరదాగా అనిపించే అనేక చిన్న చిన్న నిజ జీవితపు ఘటనల ఆసక్తికరమైన కథలతో నిండి ఉంటాయి. గంభీరమైన చరిత్ర పుస్తకాలు ఇందుకు భిన్నమైనవి. అవి మరింత విశ్లేషణాత్మకంగా ఉండడం వల్ల వాటిని చదివేందుకు ప్రయాస పడవలసి వస్తుంది. ఇక అవి దేనినైనా పునఃమూల్యాంకనం జరుపుతున్నట్లుగా ఉంటే కనుక అవి అర్థం చేసుకునేందుకు దుర్భేద్యంగా తయారవడం కద్దు.

పఠనీయతను, పారవశ్యాన్ని రెండు శైలులుగా జతపరచి ఆరుగురు ప్రధానమంత్రులపై నీరజా చౌధరి తాజాగా 'హౌ ప్రైమ్ మినిస్టర్స్ డిసైడ్' పుస్తకాన్ని వెలువరించారు. ఈ పుస్తక విజయ రహస్యం అంతా కూడా... చరిత్రనూ, జీవిత చరిత్రనూ మిళితం చేసి, దానికి ఉల్లాసభరితమైన చిట్టి పొట్టి కథల్ని, కబుర్లూ–కాకరకాయలను జోడించడంలోనే ఉంది.

ఉదాహరణకు, రాజీవ్ గాంధీపై నీరజ రాసిన అధ్యాయం ఇలా మొదలౌతుంది. ''రాజీవ్! ఈ ముస్లిం మహిళా బిల్లుపై మీరు నన్నే ఒప్పించలేకపోతే, దేశాన్ని ఎలా ఒప్పించబోతారు? అని సోనియా తన భర్తతో అన్నారు.'' ఇక పీవీ నరసింహారావు అధ్యాయ ప్రారంభ వాక్యం అయితే మరింతగా ఆసక్తిని రేకెత్తించేలా ఉంటుంది. ''డిసెంబరు 6వ తేదీ మధ్యాహ్నం పన్నెండు గంటల సమయం తర్వాత మీరు పూజలో కూర్చొని ఉన్నారని విన్నాను అని వామపక్ష పాత్రికేయుడు నిఖిల్ చక్రవర్తి ప్రధాని నరసింహారావుతో అన్నారు'' అని ఉంటుంది. ఆ విధమైన ప్రారంభ వాక్యంతో లోపలికి వెళ్లకుండా ఉండటం అసాధ్యం.

ఇప్పుడేమిటంటే, ఈ ప్రధానులలో ఎవరి మీదనైనా మీకు ఇదివరకే ఉన్న అభిప్రాయాన్ని పునరాలోచింపజేసేంతటి రహస్యాల వెల్లడింపులేమీ ఈ పుస్తకంలో లేవు. ఇది పునఃసమీక్ష కాదు. కానీ ఇందులో ఉల్లేఖనాలు, ఉటంకింపులతో పాటు... మీకు ఇప్పటికే తెలిసి ఉన్న వివరాలకు జోడింపుగా పరిశోధనాత్మక వివరాలు ఉన్నాయి. విషయాలను మీరు మరింత బాగా అర్థం చేసుకోడానికి ఈ పుస్తకం సహాయపడుతుంది.

నరసింహారావుపై ఆమె చేసిన వ్యాఖ్యలైతే విశేషంగా మనల్ని ఆకట్టుకుంటాయి. మొదటిది – ఆ మనిషి గురించి ఆమెకు ఉన్న అవగాహన. ''పీవీ నరసింహారావు... తనతో తను వాగ్వాదానికి దిగుతారు. ఒక విషయాన్ని ఆయన అంతర్గతంగా చర్చించుకుంటారు. ఎంత లోతుగా వెళతారంటే, ఏ వైపూ స్పష్టమైన చిత్రం కనిపించని స్థాయిలో ఆ విషయంలోని రెండు దృక్కోణాలనూ వీక్షిస్తారు'' అంటారు నీరజ.









నీరజా చౌధరి

ఇంకా అంటారూ, 1996లో ఆయన మెజారిటీ కోరుకోలేదనీ, ఆయన కోరుకున్న విధంగానే మెజారిటీ రాలేదనీ! ఎందుకంటే మెజారిటీ వస్తే సోనియాగాంధీకి దారి ఇవ్వవలసి వస్తుంది కదా! ''కాంగ్రెస్ మైనారిటీలో ఉంటేనే రావుకు మళ్లీ ప్రధాని అయ్యే అవకాశం ఉంటుంది'' అని రాశారు నీరజా చౌధరి. ఆమె సరిగ్గానే చెప్పారు. ఇంతకు ముందెప్పుడూ నాకు ఆ ఆలోచనే తట్టలేదు.

వాజ్‌పేయితో నరసింహారావుకు ఉన్న దగ్గరితనం నా దృష్టిని మొత్తం అటు వైపునకే మరల్చింది. ''ఇద్దరూ కలిసి చాలా దూరం ప్రయాణించారు. సంక్షోభ సమయాలలో ఒకరినొకరు కాపాడుకున్నారు'' అని రాస్తారు నీరజ.

1996 అక్టోబరులో జరిగిన ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో వాజ్‌పేయి... నరసింహారావుకూ, భువనేశ్ చతుర్వేది అనే ఒక జూనియర్ మంత్రికీ మధ్య కూర్చొని ఉన్నారు. అప్పుడు ''వాజ్‌పేయి... రావు వైపు ఒరిగి, 'కల్యాణ్ సింగ్ హమారే బహుత్ విరోధ్ మే హై, ఉస్ కో నహీ బన్‌నా చాహియే' (కల్యాణ్ సింగ్ నన్ను వ్యతిరేకిస్తున్నారు. ఆయన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టకూడదు) అన్నారు'' అని భువనేశ్ చతుర్వేదిని ఉటంకిస్తూ నీరజ రాశారు.

ఆ సాయంత్రం చతుర్వేది, 'వాజ్‌పేయికి సహాయం చేయాలా?' అని రావును అడిగారు. అందుకు ఆయన 'హా... కెహ్ దో వోరాజీ కో' (అవును... అవసరమైనది చేయమని వోరాజీకి చెప్పండి) అన్నారు. వోరా ఆనాటి యూపీ గవర్నర్.

నరసింహారావు సందేశం వోరాకు అందింది. కల్యాణ్ సింగ్ ముఖ్యమంత్రి కాలేదు. నీరజ వివరణ ఎక్కువ మాటలతో ఉండదు. ''లక్నోలో కల్యాణ్ సింగ్‌ను ముఖ్యమంత్రిగా నియమించడం అంటే అధికారం అద్వానీ చేతుల్లోకి వెళ్లడం. ఇది వాజ్‌పేయికి సమస్యల్ని సృష్టించ వచ్చు. వాజ్‌పేయి విషయంలో యూపీకి ఉన్న ప్రాముఖ్యాన్ని అర్థం చేసుకుని, తన స్నేహితుడికి సహాయం చేయాలని రావు నిర్ణయించు కున్నారు'' అని ఒక్కమాటలో చెప్పేశారు నీరజ.

తిరిగి ఐదేళ్ల తర్వాత పీవీ నరసింహారావుకు ప్రతిఫలంగా వాజ్‌పేయి సహాయం అందించారు. 2000 సెప్టెంబరులో అవిశ్వాస తీర్మానాన్ని వీగి పోయేలా చేసేందుకు ఎంపీలకు లంచం ఇచ్చిన కేసులో ట్రయల్ కోర్టు రావును దోషిగా నిర్ధారించింది. అప్పుడు, ''ఆ కేసును మూసి వేయించడానికి వాజ్‌పేయి సహాయం కోరారు నరసింహారావు'' అని నీరజ రాశారు. ''మధ్యవర్తిగా తను వాజ్‌పేయి దగ్గరకు వెళ్లినట్లు చతుర్వేది నాతో చెప్పారు: 'నేను అటల్‌జీని కలవడానికి వెళ్లాను. అప్పుడు ఆయన నన్ను లోపలికి పిలిచారు. 'ఇస్ కో ఖతమ్ కీజియే' (ఆ విషయాన్ని ముగించండి) అని అన్నారు'' అని భువనేశ్ చతుర్వేది తనతో చెప్పి నట్లు నీరజా చౌధరి పేర్కొన్నారు.

2002 మార్చిలో ఢిల్లీ హైకోర్టు నరసింహారావును నిర్దోషిగా ప్రకటించింది. ''హైకోర్టు తీర్పుపై అప్పీలు చేయకూడదని వాజ్‌పేయి ప్రభుత్వం నిర్ణయించుకోవడం గమనార్హం'', ''సీబీఐ కూడా కేసును ఉపసంహరించుకుంది'' అని రాశారు నీరజ.

నా ఇన్నేళ్లలోనూ నేను ఇలాంటి ఇచ్చిపుచ్చుకోవడాలను చూడలేదు. వాళ్లిద్దరూ ప్రత్యర్థులు. ప్రధాని పదవి కోసం తలపడ్డవారు. అయినప్పటికీ తమకెదురైన సవాళ్లను మొగ్గలోనే తుంచేయడానికి ఒకరికొకరు సహాయం చేసుకున్నారు.

'నా వీపు నువ్వు గోకు, నీ వీపు నేను గోకుతా' అనే మాటకు ఇదొక చక్కని నిదర్శనం. అత్తరు వాసనలా బయటికి కూడా రాదు. ఈ విషయంపై వారి వారి పార్టీలు ఎలా స్పందిస్తాయో తెలుసుకోవాలని నాకు ఇప్పుడు కుతూహలంగా ఉంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

## ఇదేనా ప్రజాస్వామ్యం?



నాకేమీ అర్థం కావడం లేదు. 'ఉపా' కింద 2020లో అరెస్ట్ అయిన జేఎన్‌యూ విద్యార్థి ఉమర్ ఖాలిద్ బెయిల్ పిటిషన్‌పై వాదనలను సుప్రీంకోర్టు మరో రెండు వారాలకు వాయిదా వేసింది! మరోవైపు, 'ప్రజాస్వామ్యానికి మాతృమూర్తి' అనే నినాదంతో మనం జీ20 సమావేశాలను నిర్వహిస్తున్నాం! ఈ ద్వంద్వ వైఖరి ఇంకా ఎంత కాలం?

– మనోజ్ కుమార్ ఝా, ఆర్జేడీ ఎంపీ

## వాళ్లవి మాటలే!



మోదీ ప్రభుత్వం 2014లో ప్రారంభించిన పీఎం జన్‌ధన్ యోజన కింద ఈ ఆగస్టుకు ఉచిత బ్యాంకు ఖాతాల సంఖ్య 50 కోట్లకు చేరుకుంది. వీటిల్లో 50 శాతం ఖాతాలు మహిళలవి కాగా, 67 శాతం ఖాతాలు గ్రామీణ ప్రాంతాలకు చెందినవి. గత ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎప్పుడూ మాట్లాడుతుండే ఈ విధమైన ఆర్థిక సమ్మిళితాన్ని కాంగ్రెస్ ఎందుకు అమలు చేయలేకపోయిందో?

– రఫీ బాగ్చీ, పన్ను చెల్లింపుదారు

## లెక్కించని సంపాదన



జస్ట్ ఇప్పుడే, ట్విట్టర్ నుంచి నా అకౌంట్‌కి డబ్బులు వచ్చి పడ్డాయి! ఎంతనుకుంటున్నారు? 148.46 డాలర్లు. రూపాయలలో అదెంతో లెక్క చూసుకోవాలి. అన్నట్టు, "ట్విట్టర్‌కు మీ సృజనాత్మకతను సమర్పిస్తున్నందుకు ధన్యవాదాలు" అని కూడా వారు నాకు మెసేజ్ పంపారు.

– ఇషాన్ శర్మ, యూట్యూబ్ క్రియేటర్

## అంతర్వీక్షణ



ఫొటోగ్రఫీ అనేది విలువైన క్షణాలు, సంఘటనలు, ప్రకృతి సౌందర్యం, సాంస్కృతిక – చారిత్రక ప్రాముఖ్యం ఉన్న ప్రదేశాలను సంగ్రహించే అద్భుతమైన కళ. లెన్స్ వెనుక ఉన్న కళాత్మకతను వేడుక చేసుకుందాం. ఫొటోల ద్వారా కథలు చెప్పే ఫొటోగ్రాఫర్‌లను అభినందిద్దాం.

– నవీన్ పట్నాయక్, ఒడిశా సీఎం

## కోర్టు కూడానా?!



రిజర్వేషన్‌తో ఐఐటీలో ప్రవేశం పొందుతారు. పరీక్షలు ఫెయిల్ అవుతారు. తక్కువ స్కోర్ కారణంగా తొలగించబడతారు. దానిపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తారు. 'మెరిట్ సాకుతో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను తొలగించలేము' అని కోర్టు తీర్పు పొందుతారు. భారతదేశంలోని అగ్రశ్రేణి కళాశాలలను ఎంత అపహాస్యం చేస్తున్నారు!

– అనురాధా తివారీ, రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమకారిణి

# లోగుట్టు పెద్ద హీరోలకు ఎరుక!

విస్తృత ప్రజాదరణ, ప్రాచుర్యం ఉన్న క్రికెట్, సినిమా ఈ దేశంలో మతాన్ని మించినవని అంటారు. జాతీయ గుర్తింపును తీర్చిదిద్ది, భారతదేశపు 'సాఫ్ట్‌పవర్'కు ప్రతీకగా నిలిచే ఈ రెంటి గురించి ఎవరి అభిప్రాయం వారిదే! పబ్లిక్‌లోకి వచ్చాక... వీటిపై మాట్లాడద్దని ఎవరన్నా అంటే అది అజ్ఞానం, అర్థరహితం. సినీ పరిశ్రమ ప్రస్తుత పరిస్థితి, మితిమీరిన పారితోషికాలు, అదుపు తప్పిన చిత్ర నిర్మాణవ్యయం, అందుకుంటున్న పారితోషికాలకు తారలు లెక్కలు సరిగ్గా చూపుతున్నారా, ప్రభుత్వానికి పన్ను కడుతున్నారా, ఆడని సినిమాలకు సైతం శత – ద్విశతదినోత్సవ 'వీర' రికార్డులు లాంటి అనేక అంశాలపై ఇటీవల జరుగుతున్న చర్చను ఈ దృష్టితో చూడాలి. పార్లమెంట్‌లో వచ్చిన పారితోషికాల ప్రస్తావనను 'పిచ్చుకపై బ్రహ్మాస్త్రం' అంటూ అగ్రతార చిరంజీవి 'వాల్తేరు వీరయ్య' చిత్ర ద్విశత దినోత్సవ వేదికపై నుంచి చేసిన వ్యాఖ్యలు రచ్చను పెంచాయి.

'భోళా శంకర్' చిత్రం రిలీజ్‌కు కొద్దిరోజుల వ్యవధి ఉండగా, ప్రత్యేక ఆహ్వానితులతో 'వాల్తేరు వీరయ్య' 200 రోజుల విజయోత్సవ వేడుక జరిగింది. ఆ వేదికపై ఆయన అచితూచి తన తమ్ముడు పవన్ కల్యాణ్ పేరెత్తకుండానే తారల వివాదాస్పద పారితోషికాల అంశాన్ని ప్రస్తావించారు. సినిమా వాళ్ళకు ఎక్కువ రెమ్యూనరేషన్లు ఇస్తున్నారనే అంశం పార్లమెంట్‌లో చర్చించాల్సిన విషయం కాదనీ, వరుసగా సినిమాలు చేస్తున్నది పరిశ్రమలోని వారికి ఉపాధి లభిస్తుందనే ఉద్దేశంతోనే అనీ అన్నారు. పాత రాజకీయ వాసనలు పోని చిరంజీవి ప్రత్యేక హోదా, ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణం, ఉద్యోగ – ఉపాధి అవకాశాలపై రాజకీయ నేతలు దృష్టి సారించాలనీ సలహా ఇచ్చారు. పారితోషికాల విషయాన్ని పెద్దది చేసి దేశవ్యాప్తంగా ప్రాజెక్ట్ చేయద్దనీ అభ్యర్థించారు. గమనిస్తే – 'ఆచార్య' చిత్ర సమయంలో జరిగిన పరిణామాలు, ఆ చిత్రానికి ఆరంభ వసూళ్ళు సైతం ఆశించినంతగా రాని పరిస్థితితో అక్కడ నుంచి చిరు కొత్త ధోరణిలోకి దిగారు. కారణాలు ఏమైనా ఆ తరువాత నుంచి తన ప్రతి కొత్త సినిమా రిలీజు ముందు అనివార్యంగా అన్నయ్య నోట తమ్ముడి మాట వినిపిస్తోంది. ఇది కేవలం యాదృచ్ఛికమే అనుకోగలమా? ఇదీ విశ్లేషకుల ప్రశ్న. దానికి జవాబు లోతైన వేరే చర్చ.

అది అటుంచితే... పరిశ్రమ బాగు కోసమే సినిమాలు చేస్తున్నామని పైకి ఎవరు ఎంతగా చెబుతున్నా, అసలు చిత్ర నిర్మాణ వ్యయంలో అత్యధిక భాగం అగ్రతారలు, అగ్ర టెక్నీషియన్ల జేబులోకే చేరుతుందనేది నిష్ఠుర సత్యం. తారల ఈ భారీ పారితోషికాల వ్యవహారంపై చర్చ ఇవాళ కొత్తది కాదు. ఆ మాటకొస్తే తీసుకొనే రెమ్యూనరేషన్‌లో మనమే జాతీయ స్థాయిలో ఘనులమంటూ, 'బిగ్గర్ దేన్ (అమితాబ్) బచ్చన్' అని జాతీయ ఆంగ్ల పత్రికల్లో సైతం మన హీరోలే రాయించుకున్న సందర్భాలూ ఉన్నాయి. అయితే, అంతకంతకూ సినిమాల సక్సెస్ శాతం తగ్గి, భారీ నష్టాలు పెరుగుతున్నందున... పారితోషికాల లాంటి అనుత్పాదక వ్యయం తగ్గాలనీ, సినిమా మేకింగ్ కోసం పెట్టే ఉత్పాదక వ్యయం పెరగాలనీ సాక్షాత్తూ పరిశ్రమలో పెద్దలే ఎప్పటి నుంచో మొత్తుకుంటున్నారు. ఇవాళ తెలుగులో పెద్ద సినిమాల బడ్జెట్‌లో సగటున మూడింట రెండొంతులు, మరోమాటలో 65 నుంచి 70 శాతం దాకా రెమ్యూనరేషన్లకే పోతోంది. అదేమంటే మార్కెట్‌లో ఉన్న డిమాండ్, సినిమాకు జరిగే వ్యాపారాన్ని బట్టే అంతంత పారితోషికాలు ఇస్తున్నారని వాదిస్తున్నారు. సమర్థించుకోవాలని చూస్తున్నారు. కానీ, ఈ ధోరణి పరిశ్రమ దీర్ఘకాలిక ప్రయోజనాలకూ, పైకి చెబుతున్న సోకాల్డ్ కార్మిక ఉపాధికీ పనికొచ్చేదైతే కానేకాదు.

అసలు ఇంతంత పారితోషికాలకూ ఓ కథ ఉంది. పైరసీ సినిమా చూడడం రక్తపుకూడు లాంటిదని మన స్టార్లు డైలాగులు చెబుతారు. కానీ, కొత్త సినిమా రిలీజంటే అధికారికంగా, అనధికారికంగా టికెట్ రేట్లు పెంచుకొని, పబ్లిక్ బ్లాక్‌మార్కెటింగ్ చేసే ధోరణిని ఆరంభించినదే మన మెగా తారలు. పైగా ఆ అధిక రేట్లతో సహజంగానే వచ్చే వసూళ్ళ లెక్క వేరు, ప్రభుత్వానికి చూపి పన్నుకట్టే లెక్క వేరు! ప్రభుత్వ ఖజానాకు వేస్తున్న ఈ కన్నానికి తోడు... బలుపు కాక వాపు అయిన ఆ ఓపెనింగ్ కలెక్షన్లే గీటురాయిగా టాప్‌స్టార్స్ పారితోషికాలను పెంచేస్తూ... నిర్మాతల జేబుకు పెడుతున్న చిల్లు అదనం. వెరసి... పైరసీ పెరగడానికీ, థియేటర్లలో సినిమా ఆడే రోజులు తగ్గి అన్ని సెక్టార్లలో పరిశ్రమ ఇక్కట్లలో పడడానికీ పరోక్షంగా కారణమయ్యారు.

అధిక టికెట్ రేట్లకూ, పారితోషికాలకూ జరుగుతున్న ఆ పన్నుల ఎగవేత మాట అటుంచుదాం. ఇటీవల 100 – 200 రోజులు బలవంతాన లాగించి ఆడిస్తున్న అగ్రతారల సినిమాలకు ప్రభుత్వానికి జీఎస్టీ కూడా దక్కట్లేదు. ఆశ్చర్యపరిచే ఈ లోగుట్టు ఇన్ని పెద్ద కబుర్లు చెబుతున్నవారికి తెలుసా? చాలా మందికి తెలియనిదేమిటంటే... వార్షిక టర్నోవర్ రూ. 20 లక్షల లోపుంటే, జీఎస్టీ కట్టనక్కర్లేదని చట్టం. ఈ లొసుగును అడ్డం పెట్టుకొంటూ... సినిమాలు రిలీజయ్యే చిన్న సెంటర్లలోని పలు నాన్–ఏసీ థియేటర్లు తమ వార్షిక టర్నోవర్ రూ. 20 లక్షల లోపేనని బొంకుతున్నాయి. అలా అవి తాము ప్రదర్శించే సిన్మాలకు ప్రభుత్వానికి దఖలు పరచాల్సిన 'డైలీ కలెక్షన్ రిపోర్ట్' (డీసీఆర్) రాయనక్కర్లేదు, జీఎస్టీ కట్టనూ అక్కర్లేదు. జీఎస్టీ లేని ఆ థియేటర్లను వాటంగా చేసుకొని, ఆడని సినిమాకు సైతం శత, ద్విశత దినోత్సవాలు చేసే సంస్కృతికి పలువురు హీరోలు, వారి భజన బృందాల వారు తెర తీశారు. ఇటీవల జరుగుతున్న పెద్ద హీరోల సినిమాల విజయోత్సవాల తెర వెనుక భాగోతం ఇదే! అలాంటి వేదికపై నిల్చొని చిరు సుద్దులు చెప్పడం పెను చోద్యం! పిచ్చుక లాంటి పరిశ్రమపై బ్రహ్మాస్త్రం వేస్తున్నారనడం విడ్డూరం.





జీఎస్టీ చట్టాన్ని సందు చేసుకొని... స్టార్ హీరోల సినిమాకు దొంగ రికార్డుల వీరతాళ్ళు వేసేందుకు ఈ నాన్–జీఎస్టీ సినీ థియేటర్లు భలే అక్కరకొస్తున్నాయి. ఇన్ని రోజులకు ఇంత అని ఫ్యాన్స్ దగ్గర ఎంతో కొంత మొత్తం గుత్తగా మాట్లాడుకొంటూ, ఆ హాళ్ళు అయినకాడికి సొమ్ము చేసుకుంటున్నాయి. వెరసి, మూసేసిన చాలా థియేటర్లకు బయట మాత్రం వాల్‌పోస్టర్లు ప్రదర్శిస్తూ, ఆడని సినిమాను సైతం శతదినోత్సవ విజయంగా ప్రకటిస్తున్నారు. కొద్దికాలంగా ఇద్దరు, ముగ్గురు అగ్ర హీరోల సినిమాలకు ఎక్కువగా జరుగుతున్నది ఇదే! గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో ఒక సూపర్‌తార అభిమానులు ఆయన ఫ్లాప్ సినిమాలన్నిటికీ ఇలానే శతదినోత్సవాలు చేస్తుంటారు. ఇక, ఒక దివంగత నటుడి సినిమా చిత్తూరు జిల్లా అరగొండలో ఆడింది ఒక్కరోజు ఒకే ఒక్క ఆట అయినా, 100 రోజులు గడిచాక ఈ ఏడాది శతదినోత్సవం చేయడం ఈ పెడ ధోరణికి తాజా పరాకాష్ఠ. అంతెందుకు... ఈ ఏడాదే సంక్రాంతికి రిలీజైన అగ్రతారల చిత్రాలూ తాజాగా ఇదే పద్ధతిలో 200 రోజులంటూ హంగామా షీల్డులు అందుకున్నవే! ఒకరు కర్నూలు జిల్లా ఆలూరులో చేస్తే, మరొకరు కృష్ణాజిల్లా అవనిగడ్డలో చేశారు. సెంటర్లు తేడానే తప్ప, మిగతాదంతా సేమ్ టు సేమ్!

నిజానికి, కింది సెంటర్ల నాన్–జీఎస్టీ థియేటర్లు సైతం ప్రతి పెద్ద సినిమానూ దాదాపు రూ. 3 – 4 లక్షల డబ్బు పెడుతూ ప్రదర్శిస్తున్నాయి. ఏటా కనీసం అలాంటి ఆరేడు సినిమాలు ఆడుతూ, 20 లక్షల నాన్–జీఎస్టీ టర్నోవర్ పరిధి దాటి మరీ వార్షిక లాభాలూ గడిస్తున్నాయి. పైకి మాత్రం జీఎస్టీ పరిధిలో లేమంటూ పన్ను ఎగవేస్తున్నాయనేది చిదంబర రహస్యం. చిరు దుకాణాలకు ఊరటగా ప్రభుత్వమిచ్చిన ఈ 20 లక్షల నాన్–జీఎస్టీ రూల్‌ను సినిమా హాళ్ళు మోసానికి వాడుకోవడం దురదృష్టకరం. నిజానికి, ట్యాక్స్ లేని హాళ్ళలో డీసీఆర్ ఉండదు గనక, అక్కడ సినిమా ఆడినా సరే బాక్సాఫీస్ పరిధిలో ఆడనట్టే లెక్క. ఇవాళ ప్రముఖులు ఇళ్ళల్లోనే క్యూబ్ కనెక్షన్లు పెట్టుకొని కొత్త సినిమాలు చూసుకుంటున్న ప్రదర్శనలతో అదీ ఒక రకంగా సమానం. ఇంత చిన్న లాజిక్ మర్చిపోయి, ఒకపక్క అభిమాన హీరోకు లేని రికార్డ్ తేవాలనే వెర్రి ప్రేమతో సామాన్య ఫ్యాన్స్ జేబులో సొమ్ము పోగొట్టుకుంటుంటే... మరోపక్క ప్రభుత్వానికి సినిమాహాళ్ళ పన్ను ఎగవేత సాక్షిగా హీరోలు విజయోత్సవ వేలంవెర్రిలో సాగడం విచారకరం. తెలిసో తెలియకో ఈ తప్పులో భాగమవుతున్న మన పెద్ద హీరోలు ముందు కళ్ళు తెరవాలి. ఈ అవాంఛనీయ వైఖరిని ఇకనైనా సరిచేసుకోవాలి.

చాలామంది గ్రహించని మరొక్క సంగతి – ఉభయ తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 1500కు పైగా థియేటర్లుంటే, ఇవాళ వాటిలో ఏడాదంతా సినిమాలు ప్రదర్శిస్తున్న హాళ్ళు రెండొంతులే! సుమారు 500కు పైగా హాళ్ళు ఏటా కొన్ని నెలలు మూసివేసే ఉంటున్నాయి. ఇటు సక్సెస్‌ఫుల్ సినిమాలూ, అటు కరోనా అనంతర కాలంలో హాళ్ళకు ప్రేక్షకులు రావడమూ తగ్గిపోయాక అదీ వర్తమాన సినీ పరిశ్రమ దుస్థితి. అందుకే, అడ్డగోలు పారితోషికాలు, అవసరం లేని రికార్డులతో బంగారు బాతును ఒకేసారి కోసుకుతినాలని చూస్తే అది యావత్ సినీ పరిశ్రమకే మెగా కష్టం. ఇది పిచ్చుకలు తమ గూటిపై తామే వేస్తున్న బ్రహ్మాస్త్రం. ప్రభుత్వానికి పన్ను ఎగవేతతో లేని హైప్ సృష్టిస్తూ, ఏకంగా పరిశ్రమ నెత్తిన పెడుతున్న భస్మాసుర హస్తం!


– రెంటాల జయదేవ

# కృష్ణ భక్తి

'మురారి పదభక్తిః చేత్, తదా మాఘే రతిం కురు' అని సంస్కృతంలో ఒక శ్లేషోక్తి. అంటే ఈ వాక్యానికి రెండు అర్థాలు చెప్పుకోవచ్చు.

మొదటిది, కేవలం సాహిత్య పరమైన అర్థం. 'మురారి మహాకవి కవిత్వంలో పదవిభజన, పద నిర్మాణం ఎలా ఉంటుందో తెలుసుకోవాలంటే, ముందు మాఘ మహాకవి కవిత్వంలో ఆసక్తి చూపు' అని! భక్తి అంటే విభజన, రచన అని కూడా అర్థం.

మురారి ప్రసిద్ధ సంస్కృత కవి. నాటక కర్త. తొమ్మిదో శతాబ్దం వాడు. 'అనర్ఘ రాఘవం' అనే పేరుతో రామాయణ కథను ఏడంకాల నాటకంగా రచించాడు. ఈయన తన రచనలో తనకు పూర్వీకుడైన మాఘ కవిని అభిమానించి, కొంతవరకు అనుసరించాడంటారు. మాఘుడు సంస్కృత పంచ కావ్యాలలో ఒకటయిన 'శిశుపాల వధ' కావ్యాన్ని రచించిన ఘనుడు. వ్యాకరణ జ్ఞానంలో అఖండుడని పేరు పొందినవాడు. తన కావ్యంలో తరచుగా క్లిష్టమైన పదాలు వాడి, తన వ్యాకరణ వైదుష్యాన్ని ప్రకటిస్తూ ఉంటాడు. మురారి కూడా ఆయన బాటలోనే నడిచాడు. కనక, మురారి వాడిన పద బంధాలను వ్యుత్పత్తులతో చక్కగా విభజించి బాగా అర్థం చేసుకోవాలనుకొనే వారు, ముందుగా మాఘుడి కవిత్వం బాగా అధ్యయనం చేయటం మంచిది అని ఇక్కడ సూచన.





ఈ శ్లేషోక్తికి రెండో అర్థం, 'మురారి (మురాసురుడిని సంహరించిన శత్రువు – శ్రీకృష్ణుడు) మీద నీకు భక్తి ఉంటే, 'మా– అఘే రతిం కురు'– పాప కృత్యాలలో ఎలాంటి ఆసక్తీ పెట్టుకోకు' అని. 'నేను కృష్ణ భక్తుడిని. నాకు ఆయన స్వామి' అని ఘడియకు పది సార్లు చెప్పుకొని లాభం లేదు. కృష్ణ భక్తుడు కావాలంటే ముందు ఒక భక్తుడికి ఉండవలసిన ప్రాథమిక లక్షణాలు – సౌశీల్యం, సాత్వికత, ధర్మ ప్రీతి, పాపకర్మల పట్ల వైముఖ్యం– ఇత్యాదులు ఉండాలి. అవి లేకుండా కేవలం స్తోత్రాలు, పూజలు, వ్రతాల వల్ల ఆయన మనకు దగ్గర కాడు. పాపభీతి లేకుండా, దుష్టకర్మలూ, దురాలోచనలూ చేసే వాడికి కృష్ణ భక్తి అబ్బదు. నిర్మలమైన మనసు కలిగి, పాపాలకు దూరంగా ఉన్న వాడే పరమాత్ముడికి దగ్గరవుతాడు.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** శు.పంచమి రా.9.46 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** చిత్త రా.3.38 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** ఉ.10.40 నుండి 12.20 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.27 నుండి 1.17 వరకు, తదుపరి ప.2.58 నుండి 3.49 వరకు, **అమృతఘడియలు:** రా.8.48 నుండి 10.32 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.47, **సూర్యాస్తమయం:** 6.20.

## క్లుప్తంగా...

### మాణిక్‌రావ్ ఠాక్రేతో జగ్గారెడ్డి భేటీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రేతో సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి భేటీ అయ్యారు. ఆదివారం ఉదయం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని ఠాక్రే నివాసానికి వెళ్లిన జగ్గారెడ్డి చాలా సేపు ఆయనతో మాట్లాడారు. ఆ సమయంలో ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి కూడా అక్కడే ఉన్నారు. కాగా, ఠాక్రే, రోహిత్‌చౌదరిలతో జగ్గారెడ్డి పార్టీ అంతర్గత వ్యవహారాలపైనే ఎక్కువగా చర్చించినట్టు తెలిసింది. కష్టపడితే విజయం సాధించే అవకాశం ఉన్న 30 అసెంబ్లీ స్థానాల్లో పార్టీని ముందుకు తీసుకెళ్లాల్సిన తీరు, కచ్చితంగా గెలిచే అవకాశమున్న 50 స్థానాల్లో అభ్యర్థుల ముందస్తు ప్రకటన లాంటి అంశాలపై వీరు చర్చించారని సమాచారం.

### పేదలపై దాడులు చేయడమే ఫ్రెండ్లీ పోలీసా: షర్మిల



ఆసుపత్రి ముందు ధర్నా చేస్తున్న షర్మిల

హస్తినాపురం: తెలంగాణలో అణగారిన వర్గాలు, పేదలపై పోలీసులు పాశవికంగా దాడులకు పాల్పడటమే ఫ్రెండ్లీ పోలీసా.. అని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మండిపడ్డారు. ఆదివారం సాయంత్రం హస్తినాపురంలోని శ్యాం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు లక్ష్మిని ఆమె పరామర్శించారు. అనంతరం షర్మిల మాట్లాడుతూ గిరిజన మహిళ అని చూడకుండా లక్ష్మిని పాశవికంగా చిత్రహింసలకు గురిచేసిన ఎల్‌బీనగర్ పోలీసులను వెంటనే సస్పెండ్ చేసి వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెలలో తన కూతురు పెళ్లి ఉందని కార్డు చూపించినా వినకుండా ఎస్‌ఐ రవికుమార్ చిత్రహింసలకు గురిచేయడం దారుణమన్నారు. పోలీసుల దాడిలో గాయపడిన లక్ష్మి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం, 120 గజాల ఇంటిస్థలం కేటాయిస్తామని మంత్రిగాని, ఎమ్మెల్యేగాని వచ్చి హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆసుపత్రి ముందు షర్మిల గంటసేపు ధర్నా చేశారు. అనంతరం నాగార్జునసాగర్ రహదారిపై రాస్తారోకో చేశారు. ట్రాఫిక్ స్తంభించడంతో వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి వచ్చి పరిస్థితిని సమీక్షించారు. ఏసీపీ ఆదేశాలతో షర్మిలను మహిళా కానిస్టేబుళ్లు అదుపులోకి తీసుకున్నారు.

### హోంమంత్రి బర్తరఫ్.. సీఎం రాజీనామా

- ఆర్‌ఎస్ ప్రవీణ్ డిమాండ్.. లక్ష్మీబాయికి పరామర్శ



హస్తినాపురం: తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని వెంటనే హోంశాఖమంత్రిని బర్తరఫ్ చేయాలని, నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ తన పదవికి రాజీనామా చేయాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. అమానుషంగా, పాశవికంగా హింసించి చిత్రహింసలకు గురిచేసిన లక్ష్మీబాయిని ఆదివారం హస్తినాపురంలోని శ్యామ్ ఆస్పత్రిలో ప్రవీణ్ పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ అధికారంలోకి వచ్చిన వెంటనే పోలీసులకు రూ.వేయి కోట్లు ఇచ్చి బడుగు బలహీన వర్గాల ప్రజలపై దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. 99 శాతం ఉన్న వర్గాలను అణచివేస్తున్న కేసీఆర్‌ను గద్దె దించితేనే ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. హరిజన, గిరిజన, వెనుకబడిన వర్గాలు, మైనార్టీలు అందరూ కలిసికట్టుగా రానున్న ఎన్నికల్లో కేసీఆర్‌ను ఓడించాలని, అప్పుడే అణగారిన వర్గాలకు న్యాయం జరుగుతుందని ప్రవీణ్ తెలిపారు. న్యాయం చేయాల్సిన పోలీసులే దాడులకు పాల్పడితే ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

### బీసీలకు 60 స్థానాలు కేటాయించాలి: జాజుల



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ ఒకట్రెండు రోజుల్లో అభ్యర్థుల జాబితాను ప్రకటించే క్రమంలో బీసీలకు కనీసం 60 స్థానాల్లో పోటీ చేసేలా అవకాశం కల్పించాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. ఈమేరకు ఆదివారం సీఎంకు లేఖ రాశారు. బీసీలకు ప్రాధాన్యం ఇవ్వకుంటే ఎన్నికల్లో గట్టెక్కే పరిస్థితి ఉండదన్నారు. టీఆర్‌ఎస్ పార్టీ పుట్టుక, తెలంగాణ ఉద్యమంలో బీసీల పోరాటం ఎనలేనిదని జాజుల గుర్తు చేశారు. సిట్టింగ్‌లకు సీట్లు ఇస్తామని చెప్పడంతో బీసీలకు అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు.

# సీడబ్ల్యూసీలోకి దామోదర

**ఏపీ నుంచి సుబ్బిరామిరెడ్డి, కొప్పుల రాజు, రఘువీరా, పళ్లంరాజు**

- తెలంగాణ నుంచి వంశీచంద్‌రెడ్డికి అవకాశం
- మొత్తం 84 మందితో సీడబ్ల్యూసీని ఏర్పాటుచేసిన ఖర్గే



రాజనర్సింహ



సుబ్బిరామిరెడ్డి



కొప్పుల రాజు



రఘువీరారెడ్డి



పళ్లంరాజు



వంశీచంద్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అత్యున్నత నిర్ణయాత్మక మండలి అయిన వర్కింగ్ కమిటీలో తెలంగాణ సీనియర్ నేత దామోదర రాజనర్సింహ చోటు దక్కించుకున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఏర్పాటు చేసిన నూతన కమిటీకి సంబంధించిన ఉత్తర్వులను ఆదివారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ విడుదల చేశారు. మొత్తం 84 మందితో ఏర్పాటు చేసిన నూతన సీడబ్ల్యూసీలో 39 మంది సభ్యులు, 32 మంది శాశ్వత ఆహ్వానితులు, 9 మంది ప్రత్యేక ఆహ్వానితులు, నలుగురు ఎక్స్ అఫీషియో సభ్యులు ఉన్నారు. రాష్ట్రం నుంచి సీనియర్ నేత దామోదర రాజనర్సింహకు శాశ్వత ఆహ్వానితుడిగా, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డికి ప్రత్యేక ఆహ్వానితుడిగా సీడబ్ల్యూసీలో అవకాశం కల్పించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ నుంచి మాజీ పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డికి సీడబ్ల్యూసీ సభ్యుడిగా, సీనియర్ నేతలు సుబ్బిరామిరెడ్డి, కొప్పుల రాజులను శాశ్వత ఆహ్వానితులుగా, కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజుకు ప్రత్యేక ఆహ్వానితుడిగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో చోటు కల్పించారు.

**సీడబ్ల్యూసీ సభ్యులు వీరే..:** మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, మన్మోహన్‌సింగ్, రాహుల్ గాంధీ, అధీర్‌రంజన్ చౌదరి, ఏకే ఆంటోని, అంబికా సోని, మీరా కుమార్, దిగ్విజయ్‌సింగ్, చిదంబరం, తారీఖ్ అన్వర్, లాల్ తన్హావాలా, ముకుల్ వాస్నిక్, ఆనంద్ శర్మ, అశోక్ చవాన్, అజ య్ మాకెన్, చరణ్‌జీత్ సింగ్ చన్నీ, ప్రియాంకా గాంధీ వాద్రా, కుమారి సెల్జా, గైఖంగం, ఎన్.రఘు వీరారెడ్డి, శశిథరూర్, తామ్రధ్వజ్ సాహు, అభిషేక్ మను సింఘ్వీ, సల్మాన్ ఖుర్షీద్, జైరాం రమేశ్, జితేంద్ర సింగ్, రణదీప్‌సింగ్ సూర్జేవాలా, సచిన్ పైలెట్, దీపక్ బాబరియా, జగదీశ్ ఠాకూర్, జి.ఎ.మీర్, అవినాశ్ పాండే, దీపాదాస్ మున్షీ, మహేంద్రజిత్ సింగ్ మాల్వియా, గౌరవ్ గొగోయ్, సయ్యద్ నాసిర్ హుస్సేన్, కమలేశ్ పటేల్, కేసీ వేణుగోపాల్.

**శాశ్వత ఆహ్వానితులు..:** వీరప్ప మొయిలీ, హరీశ్ రావత్, పవన్ కుమార్ బన్సల్, మోహన్ ప్రకాశ్, రమేశ్ చెన్నితల, బీకే హరిప్రసాద్, ప్రతిభాసింగ్, మనీశ్ తివారీ, తారిఖ్ హమీద్ కర్రా, దీపేంద్ర సింగ్ హుడ్డా, గిరిశ్ రాయ చోదంకర్, టి.సుబ్బిరామిరెడ్డి, కె.రాజు, చంద్రకాంత్ హండోరే, మీనాక్షి నటరాజన్, ఫూలోదేవి నేతం, దామోదర రాజనర్సింహ, సుదీప్ రాయ్ బర్మన్, డా.ఎ.చెల్లకుమార్, భక్త చరణ్ దాస్, అజోయ్ కుమార్, హరీశ్ చౌదరి, రాజీవ్ శుక్లా, మాణిక్కం ఠాగూర్, సుఖ్విందర్ రంధావా, మాణిక్‌రావ్ ఠాక్రే, రజినీ పటేల్, కన్హయ్య కుమార్, గురుదీప్ సప్పల్, సచిన్ రావ్, దేవేందర్ యాదవ్, మనీశ్ ఛాత్రత్

**ప్రత్యేక ఆహ్వానితులు..:** పళ్లంరాజు, పవన్ ఖేరా, గణేశ్ గొడియాల్, కొడిక్కునిల్ సురేశ్, యశోమతి ఠాకూర్, సుప్రియా శ్రీనాథే, పరిణీతి షిండే, అల్కా లాంబ, చల్లా వంశీచంద్‌రెడ్డి

**ఎక్స్ అఫీషియో సభ్యులు..:** బీవీ శ్రీనివాస్, నీరజ్ కుందన్, నెట్టా డి.డిసౌజా, లాల్జీ దేశాయ్

# ఆచితూచి.. అత్యున్నత హోదా

▶ మొదటి పేజీ తరువాయి

తగిన గుర్తింపు ఇచ్చిందనే చర్చ జరుగుతోంది. చాలాకాలంగా ఆయన ఢిల్లీ కేంద్రంగా పార్టీ వ్యవహారాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ఇప్పటికే ఏఐసీసీ కార్యదర్శిగా ఉన్న వంశీ.. పార్టీ పెద్దలకు అనేక అంశాల్లో సహాయకారిగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఢిల్లీ కేంద్రంగా వంశీ సేవలను వినియోగించుకోవాలన్న ఆలోచనతో ఆయనను ప్రత్యేక ఆహ్వానితుడిగా నియమించినట్టు సమాచారం. అయితే, సీడబ్ల్యూసీలో స్థానం కల్పిస్తారంటూ ప్రచారం జరిగిన కొందరికి చోటు దక్కకపోవడం, పార్టీపరంగా ఏ మాత్రం ప్రభావం లేని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నాయకులకు నేరుగా స్థానం కల్పించి, అధికారంలోకి రావాలని భావిస్తున్న తెలంగాణ నేతలను మాత్రం ఆహ్వానితుల హోదాకు మాత్రమే పరిమితం చేయడంపై రాష్ట్ర పార్టీలో చర్చ జరుగుతోంది. రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డికి సీడబ్ల్యూసీలో స్థానం దక్కవచ్చనే చర్చ గతంలో జరిగింది. మరో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా ఆ రేసులో ఉన్నారని, గిరిజన మహిళ కోటాలో సీతక్కకు అవకాశం ఉంటుందని కాంగ్రెస్ నేతలు భావించారు. కానీ, కాంగ్రెస్ అధిష్టానం మాత్రం అనూహ్యంగా దామోదర, వంశీలకు స్థానం కల్పించడం గమనార్హం.

**రేవంత్, భట్టి అభినందనలు:** కాంగ్రెస్ అత్యున్నత స్థాయి కమిటీ అయిన సీడబ్ల్యూసీలో స్థానం పొందిన తెలంగాణ నేతలకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కలు అభినందనలు తెలిపారు. తెలంగాణకు సీడబ్ల్యూసీలో స్థానం కల్పించినందుకు గాను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు సోనియా గాంధీకి ఆదివారం వారు వేర్వేరు ప్రకటనల్లో కృతజ్ఞతలు తెలిపారు. రాహుల్ వర్గంలో కీలకంగా ఉన్న మాజీ ఐఏఎస్ అధికారి కొప్పుల రాజుకు కూడా సీడబ్ల్యూసీలో చోటు దక్కడం పట్ల భట్టి హర్షం వ్యక్తం చేశారు.

### ఆశావహుల్లో అసంతృప్తి!

ఇదిలా ఉండగా సీడబ్ల్యూసీలో కచ్చితంగా అవకాశం లభిస్తుందని ఆశించిన రాష్ట్ర కాంగ్రెస్ నేతల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ముఖ్యంగా సీనియర్ నేత కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వర్గీయులు నారాజ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. పీసీసీ అధ్యక్ష పదవిని ఆశించిన కోమటిరెడ్డి కొంతకాలం పాటు అసమ్మతితో ఉన్నా ఆ తర్వాత క్రమంగా సర్దుకున్నారు. అయితే అధిష్టానం మాత్రం ఆయనను స్టార్ క్యాంపెయినర్ హోదాకు మాత్రమే పరిమితం చేసింది. ఇటీవల నియమించిన స్క్రీనింగ్ కమిటీలోనూ ఆయనకు చోటు దక్కకపోవడంతో అధిష్టానం ఏదైనా మంచి హోదా కల్పిస్తుందనే ఆశతో కోమటిరెడ్డి శిబిరం ఉంది. కానీ సీడబ్ల్యూసీ లోనూ పేరు కనిపించకపోవడంతో కోమటిరెడ్డి అనుచరులు నైరాశ్యంలో మునిగిపోయారు. మారిన రాజకీయ పరిస్థితుల్లో తమకు సీడబ్ల్యూసీలో స్థానం దక్కుతుందని భావించిన సీనియర్ నేతలు వీహెచ్, పొన్నాల కూడా హైకమాండ్ తాజా నిర్ణయంతో అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. ఇక మొదటి నుంచి కాంగ్రెస్ వర్గాల చర్చలో ఉన్న నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డికి కూడా అవకాశం రాకపోవడం, రాహుల్ దృష్టిలో ఉన్నారని, రేవంత్ కూడా సిఫారసు చేశారని ప్రచారం జరిగి, గిరిజన కోటాలో ఈ సారి చాన్స్ ఉంటుందని భావించిన ఎమ్మెల్యే సీతక్క పేరు కూడా జాబితాలో కనిపించక పోవడంతో వారి మద్దతుదారులు అసంతృప్తిలో మునిగిపోయారు. మొత్తం మీద ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తెలంగాణకు చెందిన మరో ఒకరిద్దరు నేతలకు సీడబ్లూసీలో చోటు కల్పిస్తే బాగుండేదనే అభిప్రాయం కాంగ్రెస్ వర్గాల్లో కనిపిస్తోంది.

# పల్మనరీ మెడిసిన్ ఔట్

▶ మొదటి పేజీ తరువాయి

విభాగాలను కూడా ఎన్‌ఎంసీ తొలగించింది. కొత్తగా సమీకృత వైద్య పరిశోధన విభాగాన్ని తీసుకొచ్చింది. అత్యవసర వైద్యానికి ప్రాధాన్యం ఇచ్చింది. సాధారణ పడకలను 8% తగ్గించి ఐసీయూ పడకలను మాత్రం 120 % పెంచింది.

**పల్మనాలజీ కిందే ఛాతీ, ఊపిరితిత్తుల వ్యాధులు**

ఛాతీ, ఊపిరితిత్తులు సంబంధిత వ్యాధులు లేదా కరోనా వ్యాప్తి వంటి సమయాల్లో పల్మనరీ మెడిసిన్ కీలకమైనది. టీబీ వ్యాధి కూడా దీని కిందకే వస్తుంది. వెంటిలేటర్ మీద ఉండే రోగులను పల్మనరీ, అనెస్తీషియా విభాగాల వైద్యులే చూస్తారు. అలాంటి ప్రాధాన్యత కలిగిన విభాగాన్ని తొలగించడంపై సంబంధిత వైద్యులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పల్మనరీని తీసేయడం వల్ల అనెస్తీషియా, జనరల్ మెడిసిన్ స్పెషలిస్టులపై భారం పడుతుందని అంటున్నారు. కాలేజీలో పల్మనరీతో పాటు తొలగించిన ఇతర విభాగాలకు చెందిన పీజీలు కూడా ఉండరు. దానికి సంబంధించిన వైద్యం కూడా అందుబాటులో ఉండదు.

**మరికొన్ని మార్గదర్శకాలు**

- అనెస్తీషియా కింద పెయిన్ మేనేజ్‌మెంట్ విభాగాన్ని తీసుకొచ్చారు. దీర్ఘకాలిక నొప్పులు, మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పులు వంటివి ఈ విభాగం కిందికి వస్తాయి.
- యోగాను ఒక విభాగంగా ప్రవేశపెట్టారు. ఈ మేరకు వేర్వేరుగా స్త్రీ, పురుష శిక్షకులు ఉండాలి.
- గతంలో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు 300 పడకలు అవసరం కాగా, ప్రస్తుతం వాటిని 220కి కుదించారు.
- స్కిల్ ల్యాబ్ తప్పనిసరి చేశారు. ఎంబీబీఎస్ విద్యార్థులు నేరుగా రోగుల మీద కాకుండా బొమ్మల మీద ప్రయోగం చేసేందుకు దీన్ని తప్పనిసరి చేశారు.
- గతంలో కాలేజీకి సొంత భవనం ఉండాలన్న నియమం ఉండేది. ఇప్పుడు 30 ఏళ్ల లీజుతో కూడిన భవనం ఉంటే సరిపోతుంది. కాలేజీ, అనుబంధ ఆసుపత్రి మధ్య దూరం గతంలో 10 కిలోమీటర్లు, 30 నిమిషాల ప్రయాణంతో చేరగలిగేలా ఉండాలన్న నియమం ఉండేది. ఇప్పుడు దీనిని కేవలం 30 నిమిషాల్లో చేరగలిగే దూరంలో ఉండాలన్న నియమానికి పరిమితం చేశారు.
- ఎన్ని సీట్లకు ఎన్ని జర్నల్స్, పుస్తకాలు ఉండాలన్నది స్పష్టం చేశారు.
- మెడికల్ కాలేజీకి అనుబంధంగా డాక్టర్లు, నర్సులతో పాటు మొత్తం 17 మంది సిబ్బందితో అర్బన్ హెల్త్ సెంటర్ ఉండాలి. ఎంబీబీఎస్ విద్యార్థులను ఇక్కడికి శిక్షణకు పంపుతారు.
- గతంలో ఎంబీబీఎస్, హౌసర్జన్లు, రెసిడెంట్లకు హాస్టల్ వసతి తప్పనిసరిగా ఉండేది. ఇప్పుడు రెసిడెంట్లకు తీసేశారు.

### 50 ఏళ్ల పల్మనరీ మెడిసిన్ రద్దు సమంజసం కాదు

50 ఏళ్లుగా ఉన్న పల్మనరీ మెడిసిన్ విభాగం తప్పనిసరి నిబంధన తొలగించడం సరైన చర్య కాదు. 2025 నాటికి టీబీ నిర్మూలనను లక్ష్యంగా పెట్టుకున్న భారతదేశం పల్మనరీ వంటి కీలకమైన విభాగాన్ని తీసేయడం సమంజసం కాదు. – డాక్టర్ కిరణ్ మాదల, సైంటిఫిక్ కమిటీ కన్వీనర్, ఐఎంఏ, తెలంగాణ

### బీసీలకు 50 శాతం టికెట్లివ్వాలి: ఆర్.కృష్ణయ్య



కాచిగూడ (హైదరాబాద్): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలు (బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ) బీసీలకు 50 శాతం టికెట్లు ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీలకు టికెట్లు ఇవ్వకుండా విస్మరించిన పార్టీలను ఎన్నికల్లో ఓడిస్తామని హెచ్చరించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన జరిగిన బీసీ సంఘాల ప్రతినిధుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ డబ్బు, నాయకత్వం పేర్లతో, సర్వేలతో బీసీ నాయకులను పక్కన పెడుతున్నారని, ప్రధాన పార్టీలు బీసీలకు టికెట్లు ఇస్తే గెలిపించుకునే బాధ్యత బీసీలదేనన్నారు. ప్రతి నియోజకవర్గంలో బీసీలు 50 శాతానికి పైగా ఉన్నారని, రాష్ట్రంలో బీసీ వాదం బలంగా ఉందని తెలిపారు. బీసీలను జెండాలు మోయడానికి, జిందాబాద్‌లు కొట్టించుకోవడానికే ఉపయోగించుకున్నారు తప్ప వారి అభివృద్ధికి చర్యలు తీసుకోవడం లేదని కృష్ణయ్య మండిపడ్డారు. 33 జిల్లాల్లో 18 జిల్లాల నుంచి ఒక్క బీసీ శాసనసభ్యుడు కూడా లేరన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు నీల వెంకటేశ్, వేముల రామకృష్ణ, టి.రాజ్‌కుమార్ పటేల్, కోట్ల శ్రీనివాస్, ఎస్.భూమన్న, ఆర్‌ఎం.ప్రసాద్, బాలరాజ్ గౌడ్, లడ్డూ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక అంశాలకు లోబడే హామీలు!



ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సమావేశమైన రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు

- రాష్ట్ర నేతలతో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే
- దళితబంధు లాంటి పథకంపై హామీ ఇచ్చేముందు లోతుగా అధ్యయనం చేయాలి
- అందరితో చర్చించాకే ప్రకటించాలి.. తొందరపాటుగా చేయకూడదు
- ఆర్థిక, సామాజిక, రాజకీయ పురోభివృద్ధికి దోహదపడేలా ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ప్రస్తుత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న దళితబంధు లాంటి పథకంపై హామీ ఇచ్చేముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పూర్తిగా అధ్యయనం చేయాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రాష్ట్ర నేతలకు సూచించినట్లుగా తెలిసింది. ఆర్థిక పరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుంటూనే ఎస్సీ, ఎస్టీలు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో పురోభివృద్ధి సాధించేలా కార్యక్రమాలు చేపట్టాల్సిందిగా చెప్పారని సమాచారం. ఆదివారం సీఎల్పీ నేత భట్టి విక్రమార్క నేతృత్వంలో ఎమ్మెల్యే సీతక్క, మాజీ కేంద్రమంత్రి బలరాం నాయక్, మాజీ మంత్రులు గడ్డం వినోద్, ప్రసాద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు సంపత్‌కుమార్, గంగారాం, ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర విభాగం చైర్మన్ బెల్లయ్యనాయక్ తదితరులు ఢిల్లీలోని ఖర్గే నివాసంలో ఆయనతో భేటీ అయ్యారు. ఈ నెల 26న చేవెళ్ల సభలో ప్రకటించాల్సిన దళిత, గిరిజన డిక్లరేషన్ అంశాలపై గంటన్నర పాటు చర్చించారు. కొందరు నేతలు దళితబంధు వంటి పథకాన్ని ప్రకటించాలని అన్నారు. దీనిపై ఖర్గే స్పందిస్తూ.. 'దళితబంధు లాంటి పథకం అమలు సాధ్యాసాధ్యాలు, అవసరమయ్యే నిధులపై లోతుగా చర్చించాలి. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ చంద్ర మండలం మీది భూములమ్మైనా దళితబంధు అమలు చేస్తామని అంటున్నారు. ఆయన మాటలు పట్టుకొని మనం కూడా చంద్ర మండలం మీద భూములమ్ముతామని ప్రజలకు చెప్పలేం కదా? ఇలాంటి హామీలు ఇచ్చేముందు ఆర్థికపరమైన అంశాలతో పాటు రాష్ట్ర బడ్జెట్‌ను అధ్యయనం చేయాలి. సాధ్యాసాధ్యాలను పరిశీలించే హామీలివ్వాలి. హామీల ప్రకటన ఎలాంటిదైనా అన్ని వర్గాలు, మేధావులు, సీనియర్లతో చర్చించే చేయాలి తప్ప తొందరపాటుతో కాదు..' అని స్పష్టం చేసినట్టు తెలిసింది.

**సీట్లు కాదు..గెలుపు ముఖ్యం**

కొందరు నేతలు జనరల్ స్థానాల్లోనూ ఎస్సీలకు సీట్లు కేటాయించాలని కోరినట్లు తెలిసింది. దీనిపై స్పందిస్తూ.. 'సీట్లు ముఖ్యం కాదు..గెలవడం ముఖ్యం. ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ అధికారంలోకి రావాలి. ఆ దిశగా పనిచేయండి. కాంగ్రెస్ సంప్రదాయ ఓటు బ్యాంకుగా ఉన్న దళిత, గిరిజనులకు పార్టీ పట్ల నమ్మకం పెంచండి..' అని ఖర్గే సూచించినట్లు సమాచారం. పోడు భూములపై హక్కులు, విద్య, ఉద్యోగ అవకాశాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు, గృహ నిర్మాణాలు వంటి హామీలపై కూడా చర్చించినా, పూర్తి స్థాయి అధ్యయనం చేశాకే వీటిపై తుది ప్రకటన చేద్దామని చెప్పినట్లు తెలిసింది.

**ఆర్థిక, సామాజిక అంశాలు పరిగణనలోకి: భట్టి**

చేవెళ్లలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై ఖర్గే చర్చించినట్లు భేటీ అనంతరం భట్టి విక్రమార్క మీడియాకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఆయా వర్గాలకు ఇవ్వాల్సిన ప్రాధాన్యతపైనా చర్చించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ పరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని డిక్లరేషన్ ప్రకటన ఉంటుందని అన్నారు.

# రాజీవ్ కృషితోనే ఐటీ, టెలికాం అభివృద్ధి

- రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి
- గాంధీభవన్‌లో పలువురు నేతల నివాళి

సాక్షి, హైదరాబాద్: దేశంలో సాంకేతిక విప్లవం తీసుకురావడమేకాక, రాజ్యాంగ సవరణలతో పల్లె సీమలకు సర్వ హక్కులు కల్పించి, సర్వతోముఖాభివృద్ధి కోసం కృషి చేసిన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఈనాటి యువతకు ఒక స్ఫూర్తి అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కొనియాడారు. రాజీవ్ కృషితోనే దేశంలో ఐటీ, టెలికాం రంగాల అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ 79వ జయంతి సందర్భంగా ఆదివారం సోమాజీగూడలోని రాజీవ్ విగ్రహానికి టీపీసీసీ నేతలతో కలసి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రేవంత్ మాట్లాడుతూ పరిపాలనలో సమూల మార్పులు తెచ్చి అధికారాన్ని పేదల చేతిలో పెట్టిన నాయకుడు రాజీవ్ గాంధీ అన్నారు. మహిళలకు స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు, 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించిన ఘనత కూడా ఆయనదేనన్నారు. ప్రధాని మోదీ దేశ సంపదను తన మిత్రుడికి దోచిపెడుతుంటే, తెలంగాణలో కేసీఆర్ తన కుటుంబానికి దోచిపెడుతున్నారని, బీజేపీ, బీఆర్‌ఎస్‌లది ఫెవికాల్ బంధమని అన్నారు. రానున్న ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు బుద్ధిచెప్పి రాష్ట్రాన్ని, దేశాన్ని కాపాడుకోవాలని రేవంత్ పిలుపునిచ్చారు.



పిల్లలకు క్రీడా పరికరాలను అందజేస్తున్న ఠాక్రే తదితరులు

**గాంధీభవన్‌లోనూ..**

రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా గాంధీభవన్‌లోనూ ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీపీసీసీ డాక్టర్స్ సెల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం, యూత్‌కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఫిషర్‌మెన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేశారు. రాజీవ్ గాంధీ జీవిత చరిత్రను వివరిస్తూ డాక్యుమెంటరీని ప్రదర్శించారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, ఎమ్మెల్యే జగ్గారెడ్డి, ఇతర నేతలు దీపాదాస్ మున్షీ, వి.హనుమంతరావు, మధుయాష్కీగౌడ్, మహేశ్‌కుమార్‌గౌడ్, అంజన్‌కుమార్ యాదవ్, సంగిశెట్టి జగదీశ్వర్‌రావు, శివసేనారెడ్డి, మెట్టుసాయికుమార్, రోహిణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 4 వేల ఏళ్ల నాటి ఎద్దు చిత్రం

- మహబూబ్‌నగర్ మూసాపేటలో గుర్తింపు



గుండుపై చిత్రించిన ఎద్దు చిత్రాన్ని చూపుతున్న శివనాగిరెడ్డి

సాక్షి, హైదరాబాద్/అడ్డాకుల: దాదాపు నాలుగు వందల అడుగుల ఎత్తులోని ఓ గుట్ట చిటారు గుండుపై రాయితో చెక్కిన ఎద్దు బొమ్మ ఇది. 4 వేల ఏళ్ల క్రితంనాటి చిత్రమిది. మహబూబ్‌నగర్‌కు చేరువలో ఉన్న మూసాపేట శివారులోని రామస్వామి గుట్టపైనున్న ఈ బొమ్మను ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి గుర్తించారు. స్థానిక రామలింగేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ తయారు చేసే పనిలో భాగంగా ఆదివారం ఆయన స్థానికులతో కలిసి వెళ్లారు. ఈ క్రమంలో పక్కనే ఉన్న 400 అడుగుల ఎత్తున్న గుట్ట పైభాగానికి చేరుకోగా, అక్కడున్న గుండుపై ఈ చిత్రం కనిపించింది. 10 సెం.మీ. పొడవు, 8 సెం.మీ. ఎత్తుతో ఉన్న ఈ బొమ్మ దిగువన మరికొన్ని జంతువులు, మనుషుల చిత్రాలు కూడా ఉన్నాయి. వాతావరణ ప్రభావానికి గురై అవి కొంత మేర మసకబారిపోయాయని ఆయన తెలిపారు. గుట్టపై నాటి మానవుల్లో ఓ సమూహం నివాసంగా ఉండి ఉంటుందని, ఆ క్రమంలోనే నిత్యం కలిసి ఉండే పశువులను చూసి ఈ చిత్రాలు చిత్రించి ఉంటారని పేర్కొన్నారు.

# సిరిసిల్ల కాంగ్రెస్‌లో భగ్గుమన్న విభేదాలు

**బాహాబాహీకి దిగిన సీనియర్, జూనియర్ నేతలు • అధిష్టానానికి తలనొప్పిగా మారిన నేతల తీరు**



సంగీతం శ్రీనాథ్‌పై దాడికి పాల్పడుతున్న దృశ్యం

సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో సీనియర్, జూనియర్ నేతల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. ఒకరినొకరు తోసుకుంటూ పిడిగుద్దులు కురిపించారు. సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఈ సంఘటనలో ఇద్దరు తీవ్రంగా, పలువురు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటనలో స్థానిక కాంగ్రెస్ నేత సంగీతం శ్రీనివాస్ కుమారుడు శ్రీనాథ్ కూడా గాయపడ్డారు. తాజాగా జరిగిన కార్యకర్తల సమావేశానికి ఏఐసీసీ కార్యదర్శి క్రిస్టోఫర్ తిలక్ రాకకు గంట ముందే పార్టీ నేతల మధ్య విభేదాలు బయటపడ్డాయి.

**ఫ్లెక్సీల్లో ఫొటోలు.. చేరికలపై వివాదం**

సిరిసిల్ల నియోజకవర్గం కాంగ్రెస్ నేతల్లో చాలారోజులుగా విభేదాలున్నాయి. పార్టీ టికెట్ కోసం కొందరు నాయకులు పరస్పరం బాహాటంగా విమర్శలు చేసుకుంటున్నారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో టికెట్ ఆశావహులు గ్రూపు రాజకీయాలు నడుపుతున్నారు. అయితే కార్యకర్తల్లో ఉత్సాహం పెంపొందించడంలో భాగంగా అధిష్టానం ఆదేశాల మేరకు ఆదివారం ఏఐసీసీ కార్యదర్శి క్రిస్టోఫర్ తిలక్, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అతిథులుగా ఈ కార్యక్రమాన్ని తలపెట్టారు. కాగా, ఫ్లెక్సీలో సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఫొటోను పెట్టకపోవడంపై అనుచరులు ప్రశ్నించారు. కొద్దిసేపటికే ముస్తాబాద్ మండలం గూడెం నుంచి పలువురు యువకులు పార్టీలో చేరడానికిరాగా స్థానిక నేతలు కండువాలు కప్పి ఆహ్వానించారు. అయితే ముస్తాబాద్ మండల ఇన్‌చార్జీలకు తెలవకుండానే వారిని పార్టీలో చేర్చుకోవడంపై పలువురు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక వర్గంతో మరో వర్గం వాగ్వాదానికి దిగింది. పలువురు బండబూతులు తిట్టుకున్నారు. పార్టీలో చాలాకాలంగా కె.కె.మహేందర్‌రెడ్డి, అతని అనుచర వర్గంతో చీటి ఉమేశ్‌రావు, సంగీతం శ్రీనివాస్ వర్గాలు విభేదిస్తున్నాయి. తాజా ఘర్షణతో ఈ విషయం స్పష్టమైంది. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్, డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ తదితరులు వివాదాన్ని సద్దుమణిగేలా చేస్తున్నారు.

## క్లుప్తంగా...



### కూలిన డీఆర్‌డీవో డ్రోన్

సాక్షి, బళ్లారి: కర్ణాటకలోని చిత్రదుర్గం జిల్లా హిరియూరు తాలూకా వద్దికెరె గ్రామం సమీపంలో తపస్07 ఎ–14 రకం డ్రోన్ కుప్పకూలింది. చిత్రదుర్గం వద్ద డీఆర్‌డీఓ ఏరోనాటికల్ టెస్టింగ్ రేంజ్ (ఏటీఆర్) ఉంది. నిత్యం ఇక్కడ డ్రోన్లు, మానవ రహిత విమానాల పరీక్షలు జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం ఈ డ్రోన్‌ను ప్రయోగాత్మకంగా పరీక్షిస్తుండగా చెళ్లకెర తాలూకా హిరియూరు వద్ద పొలంలో పెద్ద శబ్దంతో కుప్పకూలింది. దాని భాగాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి హాని జరగలేదు. డీఆర్‌డీవో అధికారులు, పోలీసులు ధ్వంసమైన డ్రోన్‌ను అక్కడి నుంచి తరలించారు. సాంకేతిక లోపంతోనే అది కూలిందని, విచారణ జరుపుతున్నామని డీఆర్‌డీవో అధికారులు చెప్పారు.

### పాకిస్తాన్‌లో రోడ్డు ప్రమాదం

18 మంది సజీవ దహనం



లాహోర్: పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దాదాపు 40 మంది ప్రయాణికులతో కరాచీ నుంచి ఇస్లామాబాద్ వెళ్తున్న ఓ బస్సు తన ముందున్న వ్యాన్‌ను ఢీకొట్టింది. ఈ వ్యాన్‌లో ఇంధన ట్యాంక్ ఉంది. దీంతో రెండు వాహనాలు వెంటనే నిప్పంటుకున్నాయి. ఈ ఘటనలో బస్సులోని పలువురు మహిళలు, చిన్నారులు సహా 18 మంది ప్రయాణికులు దుర్మరణం పాలయ్యారు. మరో 16 మంది గాయపడ్డారు. కొందరు బస్సు నుంచి బయటకు దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటలకు లాహోర్‌కు 140 కిలోమీటర్ల దూరంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. కొందరు క్షతగాత్రుల పరిస్థితి విషమంగా ఉందని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు పోలీసులు చెప్పారు. రోడ్డు ప్రమాదంలో 18 మంది ప్రయాణికులు మృతిచెందడం పట్ల పంజాబ్ ముఖ్యమంత్రి మొహిసిన్ నక్వీ విచారం వ్యక్తం చేశారు.

# ఒక ఉపగ్రహం కూలిన వేళ

**చంద్రయాన్ -2 వైఫల్యానికి ముందే ఇస్రో ఖాతాలో ఓ క్రాష్ ల్యాండింగ్**

**నేటి చంద్ర యాత్రలకు బాటలు వేసిన చంద్రయాన్ 'వైఫల్యం'**

ఫ్లాష్ బ్యాక్

కొన్నేళ్ల క్రితం చంద్రయాన్–2ను భారత అంతరిక్ష సంస్థ ఇస్రో చందమామ మీద నేలకూల్చిన సంగతి అందరికీ తెలిసిందే. అయితే ఇలా ఇస్రో నేలకూల్చిన శాటిలైట్లలో అదే మొదటిది కాదు. చంద్రయాన్ 1ను పదేళ్ల క్రితమే ఉద్దేశపూర్వకంగా క్రాష్ చేసింది.



అది 2008. నవంబర్ 14. మధ్యాహ్న వేళ. ఉక్కపోత చుక్కలు చూపుతోంది. గుజరాత్‌లోని రాజ్‌కోట్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం. టీమ్ఇండియా స్టార్ బ్యాట్స్‌మన్ యువరాజ్ సింగ్ శివాలెత్తుతున్నాడు. మహా మహా ఇంగ్లండ్ పేస్ బౌలర్లను వీర బాదుడు బాదుతున్నాడు. కేవలం 78 బంతుల్లో అతను చేసిన 138 పరుగుల సాయంతో భారత్ మరపురాని విజయం సాధించింది. దేశమంతా సంబరాల్లో మునిగి పోయింది. కానీ, అదే సమయంలో అక్కడికి 1,600 కిలోమీటర్ల దూరంలోని బెంగళూరులో పరిస్థితి మరోలా ఉంది. మరో దారిలేని పరిస్థితుల్లో, ఒక మినీ విస్ఫోటనానికి ఇస్రో భారంగా సిద్ధమవుతోంది. ఎందుకా విస్ఫోటనం? ఏమా కథ? అసలేం జరిగింది? చూద్దాం రండి...!

2008 అక్టోబర్ 22న చంద్రయాన్ మిషన్ ప్రయోగానికి ఇస్రో సిద్ధమైంది. భూ కక్ష్యకు ఆవలికి శాటిలైట్‌ను పంపడం భారత్‌కు అదే తొలిసారి. అప్పటిదాకా రష్యా, అమెరికా, జపాన్, యూరప్ స్పేస్ ఏజెన్సీల పేరిట ఉన్న ఘనత అది. చంద్రునిపై నీటి ఆనవాళ్లను తొలిసారిగా ప్రపంచానికి పట్టిచ్చిన ప్రయోగంగా చంద్రయాన్ చరిత్రలో నిలిచిపోయింది. అయితే అందరికీ తెలిసిన ఈ ఘనత వెనక బయటికి తెలియని మరో గాథ దాగుంది...

### ప్రోబ్... కూలేందుకే ఎగిరింది

చంద్రయాన్ లో భాగంగా 32 కిలోల బరువున్న మూన్ ఇంపాక్ట్ ప్రోబ్‌ను చంద్రునిపైకి పంపింది ఇస్రో.

- 2008 నవంబర్ 17వ తేదీ రాత్రి 8 గంటల వేళ ఇంపాక్ట్ ప్రోబ్‌ను చంద్రుని ఉపరితలం మీద కావాలనే కుప్పకూల్చేందుకు సిద్ధమైంది.
- అందులో భాగంగా చంద్రునికి దాదాపు 100 కిలోమీటర్ల ఎత్తు నుంచి ప్రోబ్ తన అంతిమ ప్రయాణానికి సిద్ధమైంది.
- చంద్రయాన్ కక్ష్య నుంచి క్రమంగా విడివడటం మొదలు పెట్టింది.
- దానిలోని స్పినప్ రాకెట్లు జీవం పోసుకుని గర్జించాయి. అయితే, ప్రోబ్ వేగాన్ని పెంచేందుకు కాదు, వీలైనంత తగ్గించేందుకు! చంద్రుని ఉపరితలం కేసి తిప్పి అనుకున్న విధంగా క్రాష్ చేసేందుకు!!
- ఎట్టకేలకు, చంద్రయాన్ మిషన్ నుంచి విడివడి అరగంటకు క్రాష్ ల్యాండ్ అయింది. ప్రోబ్ కథ అలా కంచికి చేరింది.
- తద్వారా, అంతదాకా అందరాని చందమామతో తొలిసారిగా కరచాలనం చేసి ఇస్రో కొత్త చరిత్ర సృష్టించింది.

### ఆ మూడింటి ముచ్చట్లు

ప్రోబ్ లో మూడు పరికరాలను ఇస్రో పంపింది. అవి ఫొటోలు, వీడియోలు తీసి భూమికి పంపే వీడియో ఇమేజింగ్ సిస్టం, ప్రోబ్ చంద్రునిపైకి పడ్డ వేగాన్ని కొలిచేందుకు రాడార్ ఆల్టిమీటర్, చంద్రుని వాతావరణాన్ని విశ్లేషించేందుకు మాస్ స్పెక్ట్రం మీటర్.

### భావికి బాటలు...

కూల్చేయడమే అంతిమ లక్ష్యంగా ఇస్రో ప్రయోగించిన 'విఫల' చంద్రయాన్ మిషన్ తర్వాతి రోజుల్లో చంద్రయాన్–2, చంద్రయాన్ –3 ప్రయోగాలకు బాటలు వేసింది. ఆగస్ట్ 23న చంద్రునిపై సగర్వంగా దిగి చంద్రయాన్–3 సాధించబోయే అంతిమ విజయం కోసం దేశమంతా ఇప్పుడు ఎదురు చూసేందుకు మూల కారణంగా నిలిచింది...!

- సాక్షి, నేషనల్ డెస్క్

# లూనా–25 ప్రయోగం విఫలం

## చంద్రుడి ఉపరితలాన్ని ఢీకొట్టి పేలిపోయిన రష్యా ల్యాండర్

మాస్కో: చందమామపై పరిశోధనల కోసం రష్యా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన లూనా–25 ప్రయోగం విఫలమైంది. చంద్రుడిపై అడుగుపెట్టకముందే ల్యాండర్ కుప్పకూలింది. అనియంత్రిత కక్ష్యలోకి ప్రవేశించి చంద్రుడి ఉపరితలాన్ని ఢీకొట్టి పేలిపోయింది. ఈ విషయాన్ని రష్యా అంతరిక్ష సంస్థ రోస్‌కాస్మోస్ ఆదివారం అధికారికంగా వెల్లడించింది. శనివారం లూనా–25తో కమ్యూనికేషన్ తెగిపోయినట్లు పేర్కొంది. ల్యాండర్ నియంత్రణ కోల్పోయి, మరో కక్ష్యలోకి పరిభ్రమించి, చివరికి చంద్రుడి ఉపరితలాన్ని ఢీకొట్టినట్టు స్పష్టం చేసింది. లూనా–25 స్పేస్‌క్రాఫ్ట్‌ను ఆగస్ట్ 10న వోస్తోచ్నీ కాస్మోడ్రోమ్ నుంచి రష్యా ప్రయోగించింది. షెడ్యూల్ ప్రకారం రెండు రోజుల క్రితం చంద్రుడి సమీపానికి చేరుకుంది. ఈ నెల 21న చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండ్ కావాల్సి ఉంది. అయితే, వ్యోమనౌకలో సాంకేతిక లోపం తలెత్తింది. శనివారం వేగం తగ్గింపు విన్యాసం చేపట్టారు. ఈ సందర్భంగానే సాంకేతిక లోపం తలెత్తినట్టు రోస్‌కాస్మోస్ తెలియజేసింది. ఆటోమేటిక్ స్టేషన్‌లో అత్యవసర పరిస్థితి ఏర్పడిందని, దీంతో వేగం తగ్గింపు విన్యాసం సఫలం కాలేదని వివరించింది. లూనా–25 స్పేస్‌క్రాఫ్ట్ చంద్రుడి దక్షిణ ధ్రువం వద్ద ఉపరితలాన్ని ఢీకొట్టిందని వెల్లడించింది. పేలిపోవడానికి కొన్ని గంటల ముందే లూనా–25 చంద్రుడి ఉపరితలానికి సంబంధించిన కొన్ని ఫొటోలను భూమిపైకి పంపించింది. ఇదిలా ఉండగా, రష్యా స్పేస్ ఏజెన్సీ చంద్రుడిపైకి వ్యోమనౌకను ప్రయోగించడం 47 ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి. లూనా విఫలంతో చంద్రుడిపైకి చేరాలన్న రష్యా కల నెరవేరలేదు. ఇప్పటిదాకా సోవియన్ యూనియన్, అమెరికా, చైనా మాత్రమే చంద్రుడిపై తమ వ్యోమనౌకలను విజయవంతంగా దింపాయి. అయితే, చంద్రుడి దక్షిణ ధ్రువంపై ఇంకా ఏ దేశమూ అడుగుపెట్టలేదు. దక్షిణ ప్రాంతంలో దింపేందుకు భారత్, రష్యా సిద్ధపడగా లూనా విఫలంతో ఈ పోటీ నుంచి రష్యా తప్పుకున్నట్లయింది. భారత్ ప్రయోగించిన చంద్రయాన్–3 ల్యాండర్ ఈ నెల 23న సాయంత్రం జాబిల్లి ఉపరితలంపై దిగడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి.


లూనా -25 ల్యాండర్ (ఫైల్)

## మరింత దగ్గరగా చంద్రయాన్ ల్యాండర్ మాడ్యూల్

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): చంద్రయాన్–3 మిషన్‌లో రెండో భాగమైన ల్యాండర్ మాడ్యూల్ కక్ష్య దూరాన్ని మరోసారి తగ్గించారు. అందులోని ఇంధనాన్ని ఆదివారం వేకువజామున 2 గంటలకు స్వల్పంగా మండించి కక్ష్య దూరాన్ని తగ్గించే ప్రక్రియను రెండోసారి విజయవంతంగా పూర్తి చేశారు. ప్రస్తుతం ల్యాండర్ మాడ్యూల్ చంద్రుడికి 25X134 కిలోమీటర్లు ఎత్తుకు అంటే చంద్రుడికి దగ్గరగా తీసుకొచ్చారు. మొదటి విడతలో 113 కిలోమీటర్ల దూరాన్ని 25 కిలోమీటర్లకు, 157 కిలోమీటర్ల దూరాన్ని 134 కిలోమీటర్ల తగ్గించి చంద్రయాన్–3 మిషన్‌లో భాగమైన ల్యాండర్ మాడ్యూల్ చంద్రుడికి మరింత చేరువగా తీసుకొచ్చారు. ల్యాండర్ మాడ్యూల్ ఆరోగ్యకరంగా ఉందని ఇస్రో శాస్త్రవేత్తలు ప్రకటించారు. బెంగళూరులోని మిషన్ ఆపరేటర్ కాంప్లెక్స్ (ఎంఓఎక్స్), ఇస్రో టెలీమెట్రీ ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్(ఇస్ట్రాక్), బైలాలులో ఉన్న ఇండియన్ డీప్ స్పేస్ నెట్‌వర్క్ (ఐడీఎస్ఎన్) కేంద్రాల్లో శాస్త్రవేత్తలు 23న సాయంత్రం 5.37 గంటలకు ల్యాండర్ మాడ్యూల్‌లో ఉన్న ఇంధనాన్ని స్వల్పంగా మండించి 6.04 గంటలకు చంద్రుడి ఉపరితలంపై దక్షిణ ధృవం ప్రాంతంలో సాఫ్ట్ ల్యాండింగ్ చేయడానికి కసరత్తు చేస్తున్నారు.



దాదాపు 37 నిమిషాల పాటు జరగనున్న ఈ ఆపరేషన్ అత్యంత కీలకం కానుంది.

**చంద్రుడిపై దిగడం విజయవంతమైతే**

చంద్రయాన్–3 మిషన్ ప్రయోగంలో అత్యంత కీలకఘట్టం దగ్గర పడడంతో ప్రపంచమంతా ఎంతో ఉత్కంఠతో ఉంది. రష్యా ప్రయోగించిన లూనా–25 మిషన్ చంద్రయాన్–2 తరహాలోనే చంద్రుడి ఉపరితలాన్ని ఢీకొని ఆఖరి దశలో విఫలమైంది. దీంతో ఇస్రో శాస్త్రవేత్తల్లో కూడా ఒకింత ఆందోళన మొదలైంది. ప్రపంచమంతా ఎంతో ఆసక్తి చూస్తున్న ఈవెంట్‌ను 23న సాయంత్రం 5.27 గంటలకు ప్రత్యక్షప్రసారాన్ని కల్పిస్తున్నారు. చంద్రయాన్–3లో ల్యాండర్ చంద్రుడిపై దిగే అంశంలో ఇస్రో వెబ్‌సైట్, యూట్యూబ్, ఫేస్‌బుక్, డీడీ నేషనల్ టీవీ చానెల్‌తో సహా బహుళప్లాట్‌ఫారమ్‌ల ద్వారా అందుబాటులో ఉంచారు.

# గూగుల్ అకౌంట్... వాడకుంటే డిలీటే!

**రెండేళ్లపాటు ఉపయోగించకపోతే శాశ్వతంగా రద్దు**

**2023 డిసెంబర్ 1 నుంచి కొత్త పాలసీ అమలు**

మీ గూగుల్ అకౌంట్‌ను ఈ మధ్య అసలే వాడటం లేదా? దాని వంక కన్నెత్తి చూసి రెండేళ్లయిందా? అయితే అది ఇక శాశ్వతంగా డిలీట్ అయిపోతుంది. ఈ మేరకు కొత్త పాలసీని 2023 డిసెంబర్ 1 నుంచి గూగుల్ అందుబాటులోకి తెస్తోంది. దీనికి సంబంధించిన వివరాలన్నీ తెలియజేస్తూ గూగుల్ ఈ వారమే తన యూజర్లందరికీ మెయిల్స్ పంపింది. తాను అందించే అన్ని సర్వీసులు, ప్రొడక్టులకూ ఇది వర్తిస్తుందని స్పష్టం చేసింది. 'మా యూజర్లు అకౌంట్‌ను వాడటం మానేసినా వారి డేటా పూర్తిగా గోప్యంగా, సురక్షితంగా ఉండేలా చూడటమే మా లక్ష్యం. అకౌంట్ డిలీషన్ అందులో భాగమే'' అని గూగుల్ ప్రకటించింది.

### వీటికి వర్తిస్తుంది

- గూగుల్ అకౌంట్‌ను రెండేళ్ల పాటు సైన్ ఇన్ చేయకపోతే, వాడకపోతే.
- ఒకసారి డిలీట్ చేసిన అకౌంట్ తాలూకు జీ మెయిల్ అడ్రస్‌ను ఇంకెవరికీ కేటాయించబోరు.
- సేఫ్టీ, సెక్యూరిటీ కారణాల రీత్యా తన పాలసీని ఇలా అప్డేట్ చేస్తున్నట్టు గూగుల్ తెలిపింది.
- అయితే అకౌంట్‌ను డిలీట్ చేసే ముందు గూగుల్ పలుమార్లు రిమైండర్ మెయిల్స్ పంపుతుంది. అవి సదరు అకౌంట్‌తో పాటు యూజర్ తాలూకు రికవరీ అకౌంట్‌కు కూడా వెళ్తాయి.
- ఏదైనా చర్య తీసుకోవడానికి కనీసం 8 నెలల ముందు నుంచే ఈ మెయిల్స్ రావడం మొదలవుతుంది.

### మీ గూగుల్ అకౌంట్ యాక్టివ్‌గా ఉండాలంటే...

- తరచూ లాగిన్ అవుతూ ఉన్నా...
- కనీసం రెండేళ్లకు ఒక సారైనా లాగిన్ అయినా...
- గూగుల్ డ్రైవ్ వాడినా...
- మెయిల్ పంపినా, చదివినా...
- యూట్యూబ్‌లో వీడియో చూసినా...
- ఏ గూగుల్ యాప్ డౌన్‌లోడ్ చేసినా... థర్డ్ పార్టీ యాప్, సర్వీస్ లను గూగుల్ ద్వారా సైన్ ఇన్ చేసినా మీ గూగుల్ ఖాతాకు ఎలాంటి ఢోకా ఉండదు.

### మినహాయింపులున్నాయ్..

గూగుల్ అకౌంట్ డిలీషన్ పాలసీకి కొన్ని మినహాయింపులు ఉన్నాయి. వాటి ప్రకారం రెండేళ్ల పాటు వాడకంలో లేని అకౌంట్లను డిలీట్ చేసే కొత్త విధానం ఈ కింది వాటికి వర్తించదు

- యూట్యూబ్ చానల్స్, ఖాతాకు, కామెంట్లున్న గూగుల్ అకౌంట్
- డబ్బులతో కూడిన గిఫ్ట్ కార్డులున్న జీ మెయిల్ అకౌంట్
- పబ్లిష్డ్ అప్లికేషన్ ఉన్న అకౌంట్

- సాక్షి, నేషనల్ డెస్క్




## తుక్కు రేసింగ్ కారుకు వేలంలో రూ.15 కోట్లు

కాలిఫోర్నియా: 1960వ దశకంలో రేసింగ్‌లో పాల్గొంటుండగా మంటల్లో చిక్కుకొని తుక్కుగా మారిన ఫెరారీ కారు తాజాగా వేలంలో రూ.15 కోట్ల(1.8 మిలియన్ డాలర్లు) ధర పలికింది. ఈ 'ఫెరారీ 500 మాండియాల్ స్పైడర్ సిరీస్–1' కారును 1954లో తయారు చేశారు. ప్రముఖ ఇటాలియన్ రేసర్ అల్బర్టో అస్కరీ 1952, 1953లో ఫార్ములా వన్ వరల్డ్ డ్రైవర్స్ చాంపియన్‌షిప్‌లో సాధించిన విజయాలకు గుర్తుగా ఫెరారీ సంస్థ దీన్ని తయారు చేసింది. రేసింగ్ డ్రైవర్ ఫ్రాంకో కోర్టెస్ 1954లో కారును కొనుగోలు చేశాడు. అనంతరం 1958లో ఇది అమెరికాకు చేరుకుంది. 1960లలో ఓ రేసులో ప్రమాదానికి గురై మంటల్లో కాలిపోయింది. 1978 వరకూ పలువురి చేతులు మారుతూ వచ్చింది. పూర్తిగా ధ్వంసమైన స్థితిలో ఉన్న ఈ కారును ఓ వ్యక్తి కొనుగోలు చేసి, దాదాపు 45 ఏళ్లపాటు అలాగే కాపాడుతూ వచ్చాడు. ఇటీవల ఆర్ఎం సోథ్‌బీ సంస్థ ఈ కారును వేలం వేసింది. ఏకంగా రూ.15 కోట్లు పలికింది. కారును బాగుచేసి, మళ్లీ రేసింగ్ ట్రాక్‌పై తీసుకొస్తానని దాన్ని కొనుక్కున్న వ్యక్తి చెప్పాడు.

## ఉక్రెయిన్‌కు అత్యాధునిక ఎఫ్–16లు

కీవ్/ఇనెడోవిన్: రష్యాను దీటుగా ఎదుర్కోలేక డీలాపడిన ఉక్రెయిన్‌లో ఉత్సాహాన్ని నింపే పరిణామం. ఆ దేశానికి అత్యాధునిక ఎఫ్–16 యుద్ధ విమానాలను అందజేయాలనే నిర్ణయానికి అమెరికా పచ్చజెండా ఊపింది. దీంతో నెదర్లాండ్స్, డెన్మార్క్‌లు అమెరికా తయారీ ఎఫ్–16లను ఉక్రెయిన్‌కు అందజేసేందుకు ముందుకు వచ్చాయి. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తాజాగా డెన్మార్క్, నెదర్లాండ్స్‌ల్లో పర్యటించారు. ఆదివారం ఆయన నెదర్లాండ్స్‌లోని ఎయిండ్ హోవెన్ ఎయిర్‌బేస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆ దేశ ప్రధాని మార్క్ రుట్‌తో సమావేశమయ్యారు. అక్కడున్న రెండు ఎఫ్–16 విమానాలను పరిశీలించారు. అనంతరం మార్క్‌రుట్ మీడియాతో మాట్లాడుతూ.. తమ షరతులకు ఉక్రెయిన్ అంగీకరించిన తర్వాతే ఎఫ్–16ల సరఫరా మొదలవుతుందని స్పష్టం చేశారు. ఆ షరతులు ఏమిటన్నది వెల్లడించలేదు. తమ వద్ద ప్రస్తుతం 42 ఎఫ్–16 విమానాలున్నాయని, వీటిలో కొన్నిటిని ఉక్రెయిన్‌కు ఉచితంగా అందజేస్తామని చెప్పారు. ఉక్రెయిన్‌కు తాము 19 ఎఫ్–16లను అందజేస్తామని డెన్మార్క్ ప్రధాని మెట్టె ఫ్రెడరిక్సన్ ప్రకటించారు. ఎఫ్–16 యుద్ధ విమానాల పైలెట్లకు 6 నుంచి 8 నెలల శిక్షణ అవసరముంటుందని అధికారులు చెబుతున్నారు. నెదర్లాండ్స్, డెన్మార్క్‌ల నిర్ణయం చారిత్రకమని జెలెన్‌స్కీ కొనియాడారు.



**రష్యా దాడుల్లో ఏడుగురు మృతి**

ఉక్రెయిన్‌లోని చెర్నిహివ్ నగరంపై శనివారం రష్యా జరిపిన భీకర క్షిపణి దాడుల్లో సోఫియా అనే ఆరేళ్ల చిన్నారి సహా ఏడుగురు చనిపోగా మరో 150 మంది క్షతగాత్రులయ్యారు. రష్యాలోని కుర్స్క్ ప్రాంత రాజధాని కుర్స్క్ రైల్వే స్టేషన్‌పై ఉక్రెయిన్ డ్రోన్ దాడి జరిపింది. రైల్వే స్టేషన్ పైకప్పునకు మంటలు అంటుకుని అయిదుగురు గాయపడ్డారు. కాగా, ఉక్రెయిన్ డ్రోన్ దాడితో మాస్కోలోని రెండు ఎయిర్‌పోర్టుల్ని కొద్ది గంటలపాటు మూసివేశారు.

### మాలిలో దుండగుల కాల్పులు

21 మంది పౌరులు మృతి

బమాకో: పశ్చిమ ఆఫ్రికా దేశమైన మాలిలో గుర్తుతెలియని దుండగుల కాల్పుల్లో 21 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. సెంట్రల్ మాలిలోని మోప్తీ ప్రాంతంలో తాజాగా ఈ ఘోరం చోటుచేసుకుంది. బందీయాగార పట్టణం సమీపంలోని యారో అనే ఓ గ్రామంపై దుండగులు విరుచుకుపడ్డారని, జనంపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారని స్థానిక మీడియా వెల్లడించింది. ఈ కాల్పుల్లో 21 మంది ప్రజలు చనిపోయారని, మరో 30 మందికిపైగా గాయపడ్డారని తెలియజేసింది. మృతుల్లో మహిళలు, చిన్నారులు ఉన్నట్లు సమాచారం. కాల్పులకు గల కారణాలు తెలియరాలేదు. మాలిలో అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలైన అల్‌ఖైదా, ఐసిస్ చురుగ్గా పనిచేస్తున్నాయి. ఉగ్రముఠాల అండతో తిరుగుబాటుదారులు కొన్ని భూభాగాలను ఆక్రమించారు.

### 'నీట్' నుంచి మినహాయించేదాకా ఉద్యమిస్తాం

తమిళనాడు సీఎం స్టాలిన్

చెన్నై: జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష(నీట్) నుంచి తమిళనాడును మినహాయించేదాకా తమ ఉద్యమం ఆగదని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తేల్చిచెప్పారు. 'నీట్'ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అధికార డీఎంకే నేతృత్వంలో ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా నిరసనలను, ఆందోళనలు నిర్వహించారు. నిరాహార దీక్షలు సైతం చేపట్టారు. నీట్ రద్దు అనేది రాజకీయపరమైన డిమాండ్ కాదని, అందిరికీ సమాన అవకాశాలు లభించాలన్నదే తమ ఉద్దేశమని స్టాలిన్ చెప్పారు. ఈ పరీక్ష నుంచి తమిళనాడు మినహాయించేలా అన్ని రకాల ప్రయత్నాలు చేస్తామని వెల్లడించారు. ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇంటి ఎదుట ధర్నా చేస్తామని పేర్కొన్నారు. ఈ ధర్నాలో పాల్గొనాలని విపక్ష ఏఐఏడీఎంకేకు స్టాలిన్ సూచించారు. అయితే, కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ సర్కారు కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడే నీట్‌ను తీసుకొచ్చారని ఏఐఏడీఎంకే నేత, మాజీ సీఎం పళనిస్వామి గుర్తుచేశారు.

### ఆ శాఖల అధికారులపైనే అత్యధిక ఫిర్యాదులు

న్యూఢిల్లీ: దేశంలో 2022లో అవినీతికి సంబంధించిన ఫిర్యాదులు అత్యధికంగా కేంద్ర హోంశాఖ అధికారులపైనే వచ్చాయి. ఆ తర్వాత రైల్వే శాఖ, బ్యాంకు అధికారులు ఉన్నారు. ఈ విషయాన్ని కేంద్ర విజిలెన్స్ కమిషన్(సీవీసీ) తన వార్షిక నివేదికలో వెల్లడించారు. గత ఏడాది అన్ని కేంద్ర ప్రభుత్వ శాఖలు, విభాగాలకు చెందిన అన్ని కేటగిరీల అధికారులు, ఇతర సిబ్బంది విషయంలో మొత్తం 1,15,203 ఫిర్యాదులు అందాయని తెలియజేసింది. వీటిలో 85,437 కేసులను పరిష్కరించామని, మిగిలినవి పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంది. అత్యధికంగా హోంశాఖ అధికారులపై 46,643, రైల్వే శాఖ అధికారులపై 10,580, బ్యాంకుల అధికారులపై 8,129 ఫిర్యాదులు తమకు అందాయని సీవీసీ స్పష్టం చేసింది. 'నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఢిల్లీ' ప్రభుత్వ అధికారులపై 7,370 ఫిర్యాదులు వచ్చాయని వివరించింది. ఇన్సూరెన్స్ సంస్థల్లో పనిచేసేవారిపై 987, ఉక్కుశాఖలో పనిచేసేవారిపై 923 కంప్లైంట్లు వచ్చినట్లు వెల్లడించింది.

### పర్యాటకుల రెస్టారెంట్ బిల్లు కట్టిన ఇటలీ ప్రభుత్వం

రోమ్: ఇటలీకి చెందిన ముగ్గురు పర్యాటకులు పొరుగుదేశం అల్బేనియాకు వెళ్లారు. అక్కడ రెస్టారెంట్‌లో తిని బిల్లు కట్టకుండా చెక్కేశారు. ఇటలీ ప్రధాని మెలోనీ ఇటీవల కుటుంబంతో కలిసి అల్బేనియాలో పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా అల్బేనియా ప్రధాని ఈడీ రమా ఈ విషయాన్ని ప్రస్తావించారు. దీనిని మెలోనీ తీవ్ర అవమానంగా భావించారు. దేశం పరువు తీశారంటూ తమ దేశస్తులపై మండిపడ్డారు. 'వెళ్లి ఆ నలుగురు ఇడియట్స్ బిల్లు కట్టండి'అంటూ అక్కడి తమ దౌత్యాధికారులను ఆదేశించారు. వారు వెళ్లి రూ.7,245 బిల్లును సదరు రెస్టారెంట్ నిర్వాహకులకు చెల్లించి వచ్చారు. నిబంధనలు, సంప్రదాయాలను పాటించాలని, ఇటువంటివి మరోసారి జరక్కుండా జాగ్రత్తపడాలని తమ దేశస్తులకు ఇటలీ ఎంబసీ సూచించింది. కొందరు వ్యక్తులు బిల్లు చెల్లించకుండానే రెస్టారెంట్ నుంచి వెళ్లిపోతున్నట్లుగా సదరు రెస్టారెంట్ విడుదల చేసిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ అవుతోంది. దీనిపై రెస్టారెంట్ యజమాని మాట్లాడుతూ.. ఫుడ్ ఐటమ్స్ ఎంతో బాగున్నాయంటూ సదరు నలుగురు ఇటాలియన్లు తమను మెచ్చుకున్నారని కూడా తెలపడం విశేషం.

### 'వారసత్వ రాజకీయాలు విషతుల్యం'

భోపాల్: వారసత్వ రాజకీయాలు విషంతో సమానమని హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. వీటివల్ల ఒకే కుటుంబం చెప్పుచేతల్లో పార్టీ, ప్రభుత్వం ఉంటాయన్నారు. కాంగ్రెస్, డీఎంకే, శివసేన(ఉద్ధవ్)వర్గం కుటుంబ రాజకీయాలను నడిపిస్తున్నాయని ఆరోపించారు. కొన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ కుల ఉద్యమాలను ప్రోత్సహిస్తోందన్నారు. వీటివల్లే 2018లో మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోయిందని చెప్పారు.

## అంగుళం కూడా చైనా ఆక్రమించలేదనడం అబద్ధం

న్యూఢిల్లీ/లేహ్: లద్దాఖ్‌లోని అంగుళం భూమిని కూడా చైనా ఆర్మీ ఆక్రమించుకోలేదంటూ ప్రధాని మోదీ చేసిన ప్రకటన అబద్ధమని కాంగ్రెస్ నేత రాహుల్ అన్నారు. చైనా సైన్యం అక్కడి పచ్చిక బయళ్లను ఆక్రమించుకోవడంపై లద్దాఖ్ వాసులు ఆందోళన చెందుతున్నారని ఆయన తెలిపారు. తన తండ్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించేందుకు శనివారం రాహుల్ లద్దాఖ్‌కు చేరుకున్నారు. 'చైనా సైన్యం చొచ్చుకువచ్చి పచ్చిక బయళ్లను లాగేసుకుందని ఇక్కడి వారంతా చెబుతున్నారు. భూమి ఆక్రమణకు గురి కాలేదంటూ ప్రధాని చెబుతున్నది నిజం కాదని వాళ్లు స్పష్టంగా చెబుతున్నారు'అని రాహుల్ అన్నారు. కాగా, రాహుల్ చైనా తరఫున వకాల్తా పుచ్చుకుని మాట్లాడుతున్నట్లుగా ఉందని బీజేపీ మండిపడింది.



ఇటువంటి ప్రకటనలతో రాహుల్ దేశం పరువు తీస్తున్నారని ఆరోపించింది.

సాక్షి
హైదరాబాద్
సోమవారం । 21 । ఆగస్టు । 2023







ప్రగతిపథంలో నిలిపింది మోదీనే..

కాంగ్రెస్ పాలనలో అధోగతి పాలైన దేశాన్ని తిరిగి ప్రగతిపథంలో నిలిపింది ప్రధాని మోదీ అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. -8లో

తెప్పోత్సవ ఊరేగింపులో బోనాలతో వస్తున్న మహిళలు





## న్యూస్‌రీల్

### ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా సంస్కరణలు: హరీష్‌రావు



ఈఆర్‌సీ పని తీరును పరిశీలిస్తున్న మంత్రి హరీష్‌రావు

**వెంగళరావునగర్:** ఆరోగ్య తెలంగాణను సాధించాలనే లక్ష్యంతోనే రాష్ట్రంలో కొన్నేళ్ళుగా అనేక సంస్కరణలు చేపట్టామని మంత్రి హరీష్‌రావు అన్నారు. వెంగళరావునగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయంలో ఆదివారం ఆయన 108, 104, 102ల నూతన ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్ (ఈఆర్‌సీ)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో హరీష్‌రావు మాట్లాడుతూ.. ఎమర్జెన్సీ సేవలు మరింత మెరుగుపర్చేందుకు రాష్ట్రంలో కేంద్రీకృత కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు 102, 104, 108 హెల్ప్‌లైన్లు వేర్వేరుగా ఉన్నాయని, ఇకనుంచి హెల్ప్‌లైన్ సేవలు ఒకే స్థానం నుంచి ఆపరేట్ చేయాలని ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్‌ను ప్రారంభించామన్నారు. ఈ సెంటర్‌లో 110 మంది సిబ్బంది వివిధ షిఫ్ట్‌ల ద్వారా 24 గంటల పాటు విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందిస్తారన్నారు. 108 ద్వారా తక్షణ వైద్య సహాయం, 102 ద్వారా అమ్మఒడి సేవలు, 104 ద్వారా వైద్య సమాచారం సలహాలు, సూచనలు ప్రజలకు అందజేస్తారని ఆయన చెప్పారు.

### స్వర్ణకారుల వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాఘవాచారి

**పంజగుట్ట:** తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి తొమ్మిదేళ్లవుతున్నా ప్రభుత్వం ఇప్పటివరకు స్వర్ణకారుల సమస్యలను పట్టించుకోలేదని తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షులు వింజమూరు రాఘవాచారి ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని కులాలకు ఆర్థిక చేయూత అందిస్తున్న ప్రభుత్వం స్వర్ణకార వృత్తిదారులు ఇటు వృత్తిపరంగా, ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు పడుతూ ఆత్మహత్యలు చేసుకుంటున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధాన కార్యదర్శి చేపూరి వెంకటస్వామితో కలిసి ఆయన మాట్లాడుతూ.. 2017లో రాష్ట్ర వ్యాప్తంగా స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిరసన కార్యక్రమం చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో విశ్వబ్రాహ్మణులకు రూ.250 కోట్లు ప్రకటించిందని కాని, ఇప్పటివరకు ఒక్క రూపాయి విడుదల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వెంటనే స్వర్ణకార వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, జీఓ నంబర్ 272ను సవరించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కోశాధికారి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు రామదాసు లక్ష్మణాచారి, ముత్తోజు శ్రీనివాసాచారి, పాలకొండ శ్రీనివాస్, రామోజు భిక్షపతి, కార్యదర్శి సతీష్‌చారి, పోతులూరిచారి, రమేష్, నాగరాజు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### కల్తీ ఆవు నెయ్యి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

**సాక్షి, సిటీబ్యూరో:** కల్తీ ఆవు నెయ్యి తయారు చేసి, ప్యాకింగ్ చేయడంతో పాటు ఓ బ్రాండ్ పేరుతో మార్కెట్‌లో విక్రయిస్తున్న నిందితుడిని నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. చిలకలగూడ ప్రాంతానికి చెందిన పెరుమాళ్ నచ్చి ముత్తు నవీన్ మోండా మార్కెట్‌లోని మారుతి వీధి వద్ద నెయ్యి వ్యాపారం చేస్తుంటాడు. వ్యాపారాన్ని పెంచుకోవడానికి కల్తీ నెయ్యి తయారు చేసి తక్కువ రేటుకు విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. బహిరంగ మార్కెట్‌లో వనస్పతి, పల్లి నూనె ఖరీదు చేస్తున్నాడు. వీటిని నిర్ణీత పాళ్లలో కలిపి ఆవు నెయ్యిగా మారుస్తున్నాడు. ఆవు నెయ్యి మార్కెట్‌లో కేజీ రూ.700 వరకు ఉండగా.. ఇతడు కల్తీ నెయ్యిని కేవలం రూ.500కు విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె.సైదులు నేతృత్వంలోని బృందం ఆదివారం దాడి చేసింది. నిందితుడిని పట్టుకోవడంతో పాటు మూడు టిన్నుల్లో నిల్వ ఉంచిన 45 కేజీల కల్తీ నెయ్యిని స్వాధీనం చేసుకుంది. ముత్తు నవీన్ 2019లోనూ ఇదే తరహా దందా చేస్తూ పోలీసులకు చిక్కినట్లు అధికారులు తెలిపారు.




# నేత్రపర్వం.. గంగ తెప్పోత్సవం




గంగ తెప్పను సాగర్‌లోకి వదులుతున్న తెప్పోత్సవ కమిటీ సభ్యులు

**ఖైరతాబాద్:** నగరంలో గంగ తెప్పోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు వందలాది గంగపుత్రులు తరలివచ్చారు. మహిళలు బోనాలు ఎత్తుకొని ఖైరతాబాద్ ఏడు గుళ్ల నుంచి ఖైరతాబాద్ లైబ్రరీ చౌరస్తా మీదుగా ఐమాక్స్ నుంచి సాగర తీరంలోని గంగమ్మ ఆలయం వరకు ముందుకు సాగారు. అనంతరం గంగ తెప్పను సాగర్‌లో వదిలి బోనాలను అమ్మవారికి సమర్పించారు. గంగ తెప్పోత్సవ కమిటీ అధ్యక్షుడు మల్కు మహేందర్‌బాబు, ప్రధాన కార్యదర్శి పూస నరిసింహ సారథ్యంలో నిర్వహించిన గంగ తెప్పోత్సవ శోభాయాత్రను బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐమాక్స్ వద్ద ఏర్పాటు చేసిన సభా కార్యక్రమానికి పెద్ద ఎత్తున గంగ పుత్రులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జల నాగేష్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, కార్పొరేటర్ విజయారెడ్డి, ఎన్జీఓ నాయకుడు జి.చందు, పూస నర్సింహ, చాట్ల సదానంద్, మంగళంపల్లి రాజు, మెట్టు ధన్‌రాజ్, కొప్పు పద్మ, అరుణ్‌జ్యోతి, గడప శ్రీహరి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# లక్కెవరిదో.. చిక్కెవరికో?

- బీఆర్‌ఎస్ తొలి జాబితా సిద్ధం!
- గ్రేటర్ సిట్టింగుల్లో టెన్షన్.. టెన్షన్
- 3, 4 స్థానాల్లో మార్పులుంటాయా?
- ఆశావహుల్లో పెరిగిన ఉత్కంఠ




**సాక్షి, సిటీబ్యూరో:** బీఆర్‌ఎస్ తొలి జాబితా వెలువడనుందని జరుగుతున్న ప్రచారంతో అందులో గ్రేటర్ పరిధిలోని లక్కెవరిదో.. చిక్కెవరికో? అనే చర్చ నడుస్తోంది. జీహెచ్‌ఎంసీ పరిధిలోని 24 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మెజారిటీ సీట్లు సిట్టింగ్ ఎమ్మెల్యేలకే తిరిగి దక్కనున్నప్పటికీ మూడు నాలుగు స్థానాల్లో మార్పులుండవచ్చనే అభిప్రాయాలతో వాటిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అలాంటి వాటిల్లో ఉప్పల్, అంబర్‌పేట, కంటోన్మెంట్, ముషీరాబాద్ ఉన్నాయి.

#### జోరుగా ప్రచారం..

◆ ఉప్పల్ నియోజకవర్గం నుంచి బేతి సుభాష్‌రెడ్డికి ఈసారి టికెట్ రాదని, అక్కడ బండారి లక్ష్మారెడ్డికి ఇవ్వనున్నారంటూ ప్రచారం జోరుగా ఊపందుకుంది. ఆ సీటు కోసం ఎంతో కాలంగా అక్కడ పని చేసుకుంటున్న జీహెచ్‌ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌కు కేటీఆర్ ఆశీస్సులున్నందున అతనికే దక్కుతుందని భావిస్తున్నవారూ ఉన్నారు. బండారి లక్ష్మారెడ్డి పేరు ప్రచారంలోకి రావడంతో సిట్టింగ్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, బొంతు రామ్మోహన్ ఇద్దరూ ఏకాభిప్రాయానికి వచ్చి బండారి తప్ప తమ ఇద్దరిలో ఎవరికైనా లభించేలా చూడాల్సిందిగా ఎమ్మెల్సీ కవితను కలిశారు. కేటీఆర్ అమెరికాలో ఉన్నందున ఆయన అండగా ఉన్నవారికి ఇప్పుడు అయోమయ పరిస్థితి ఏర్పడింది. కేటీఆర్ నగరంలో లేకపోవడంతో పార్టీ ముఖ్యులు హరీష్ రావు, కవిత, సంతోష్‌కుమార్‌ల వద్దకు వెళ్తున్నట్లు తెలుస్తోంది.

#### వీరికి టికెట్ అనుమానమేనా?

◆ అంబర్‌పేట సిట్టింగ్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌కు తొలిజాబితాలో టికెట్ అనుమానమేననే అభిప్రాయాలుండగా, అక్కడ ప్రత్యామ్నాయ అభ్యర్థి ఎవరన్నది మాత్రం తెలియడం లేదు. ముషీరాబాద్ నియోజకవర్గంపైనా సంశయాలున్నప్పటికీ, సిట్టింగ్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను తప్పించేందుకు కారణాలంటూ కనిపించడం లేదంటున్నారు. వయోభారం రీత్యా అనుకుంటే ఆయన కొడుకు జైసింహకు దక్కవచ్చనే భావిస్తున్న వారితో పాటు ఎమ్మెన్ శ్రీనివాస్‌కు లభించగలదనే అభిప్రాయాలూ ఉన్నాయి.

#### అదృష్టం ఎవరిని వరించేనో..

◆ కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న మృతితో ఆ నియోజకవర్గం ఇప్పటికే ఖాళీగా ఉంది.నియోజకవర్గంలో సాయన్నకు ఉన్న పేరు దృష్ట్యా ఆయన కుటుంబం నుంచే కుమార్తె లాస్య నందితకు ఇచ్చేందుకు అధిష్ఠానం సుముఖంగా ఉందనే అభిప్రాయాలున్నాయి. కేటీఆర్ అండదండలతో క్రిశాంక్‌కు టికెట్ లభించవచ్చని భావిస్తున్నవారూ ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయా నియోజకవర్గాల అభ్యర్థుల పేర్లు తొలి జాబితాలో ఉంటాయా.. ఉంటే ఎవరిని అదృష్టం వరిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. కేటీఆర్ అమెరికా వెళ్లడానికి ముందే జాబితా తయారైందని, ఇక ప్రకటనే తరువాయి అని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో సిట్టింగులో టెన్షన్,ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది.

#### గెలుపు గుర్రాలకే..

◆ మెజారిటీ నియోజకవర్గాల్లో సిట్టింగ్‌లకే తిరిగి టికెట్లు లభించనున్నట్లు చెబుతున్నారు. వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకొని, గెలిచే అవకాశాలుండటంతో తిరిగి వారినే కొనసాగించనున్నట్లు తెలుస్తోంది. అలాంటి వారిలో సుధీర్‌రెడ్డి (ఎల్‌బీనగర్), సబితా ఇంద్రారెడ్డి (మహేశ్వరం), మాధవరం కృష్ణారావు (కూకట్‌పల్లి), తలసాని శ్రీనివాస్ యాదవ్(సనత్‌నగర్), పద్మారావు(సికింద్రాబాద్) మాగంటి గోపీనాథ్ (జూబ్లీహిల్స్), ఎ.గాంధీ(శేరిలింగంపల్లి), కేపీ వివేకానంద (కుత్బుల్లాపూర్)లతో పాటు ఆయా నియోజకవర్గాల సిట్టింగులున్నారు.

## మంత్రి సంతకం ఫోర్జరీ: ఇద్దరిపై కేసు

**బంజారాహిల్స్:** రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సంతకాన్ని ఫోర్జరీ చేసి డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలంటూ సంగారెడ్డి కలెక్టర్‌కు లెటర్‌హెడ్‌పై సిఫారసు లేఖ అందించిన ఇద్దరి వ్యక్తులపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం నర్రెగూడం గ్రామానికి చెందిన ఎం.డి.గౌస్‌పాషా, గుంటి శేఖర్ ఇటీవల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ లెటర్‌హెడ్ తయారు చేసి సంగారెడ్డి కలెక్టర్‌కు డబుల్ బెడ్రూం ఇళ్లు అలాట్ చేయాల్సిందిగా లేఖ అందించారు. ఫేక్ లెటర్‌తో ఈ నేరానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా మంత్రి ఓఎస్డీ డాక్టర్ ఎస్.ఎం.రాజేశ్వర్‌రావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గౌస్‌పాషా, గుంటి శేఖర్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# వెంటాడిన మృత్యువు

- వైఎస్సార్ కడప జిల్లాలో రోడ్డు ప్రమాదం
- ముగ్గురు నగరవాసుల దుర్మరణం
- తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో మరో ఇద్దరు



మృతులు కొండేటి కృష్ణ, రుషి (ఫైల్)



మృతురాలు పద్మావతి (ఫైల్)



లారీని ఢీకొని నుజ్జునుజ్జయిన కారు



చికిత్స పొందుతున్న విజయరాణి



ఆస్పత్రిలో నిహారిక

**ఖైరతాబాద్:** ఏపీలోని కడప సమీపంలో చెన్నూరు హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో నగరానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. ఖైరతాబాద్ ప్రేమ్‌నగర్‌లోని ఇంజినీర్ కాసెల్‌లో హన్నె పద్మావతి (60) నివాసముంటున్నారు. ఆమె కూతురు కొండేటి విజయరాణి (35), అల్లుడు కొండేటి కృష్ణ (43), మనవడు రుషి (14), మనవరాలు నిహారిక (18)లు ఆనంద్‌నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్నారు. శుక్రవారం కొండేటి కృష్ణ తండ్రి మరణించడంతో అంత్యక్రియల కోసం తిరుపతిలోని బైరాగి పట్టెడకు పద్మావతి సహా అయిదుగురు కారులో బయల్దేరారు. శనివారం అంత్యక్రియలకు హాజరైన తర్వాత ఆదివారం ఉదయం తిరిగి నగరానికి బయల్దేరారు. వీరు ప్రయాణిస్తున్న కారు కడప దాటి చెన్నూరు సమీపంలోకి రాగానే ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ముందు కూర్చున్న పద్మావతి అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలపాలైన కృష్ణ, రుషి కడప రిమ్స్ ఆస్పత్రిలో కన్నుమూశారు. విజయరాణి, నిహారికలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

#### మృత్యు ముఖం నుంచి అప్పుడు బయటపడినా..

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఖైరతాబాద్ ప్రేమ్‌నగర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. రెండేళ్ల క్రితం ఈ కుటుంబ సభ్యులు యాదాద్రి వెళ్లి తిరిగి నగరానికి వస్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. కారు పూర్తిగా ధ్వంసమైంది. అందరూ ప్రాణాలతో బయటపడ్డారు. కానీ.. ఆదివారం మరోసారి జరిగిన రోడ్డు ప్రమాదం ముగ్గురు ప్రాణాలను బలిగొనడంతో మృతుల బంధువులు కన్నీటి పర్యంతమవుతున్నారు. పద్మావతి కుమారుడు మున్నా కుమార్ లండన్‌లో ఉన్నత చదువుల కోసం ఇటీవల వెళ్లాడు. తల్లి మరణ వార్తతో సోమవారం తిరిగి వస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పద్మావతి తాను నివసించే అపార్ట్‌మెంట్‌కు సెక్రటరీగా ఉన్నారు. అందరితోనూ ఆమె కలుపుగోలుగా ఉండేవారని అపార్ట్‌మెంట్ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

## వరుస క్రికెట్ మ్యాచ్‌లపై ఉత్కంఠ

- ఉప్పల్‌లో అక్టోబర్ 6,9,10 తేదీల్లో మ్యాచ్‌లు
- పని దినాలు కావడంతో ట్రాఫిక్ మళ్లింపులు, భద్రత ఇబ్బందులు
- ఈమేరకు హెచ్‌సీఏకు పోలీసుల విజ్ఞప్తి



**సాక్షి, సిటీబ్యూరో:** అక్టోబర్ 6, 9,10 తేదీల్లో ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ మైదానంలో ప్రపంచ కప్-2023 క్రికెట్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇందులో 6 (శుక్రవారం)తో పాటు, 9, 10 తేదీల్లో (సోమ మంగళ) వరుస మ్యాచ్‌లు ఉండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు, భద్రతా సమస్యలు తలెత్తుతాయని పోలీసు ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఈమేరకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) దృష్టికి తీసుకెళ్లిన్నట్లు తెలిసింది. ఇండియా వేదికగా అక్టోబర్ 5 నుంచి వన్డే ప్రపంచ కప్ జరగనుంది. ఈ పోటీల్లో మూడు మ్యాచ్‌లు ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నుంచి జరగనున్నాయి అవి కూడా వరుస మ్యాచ్‌లు కావడంతో భద్రతపై హైదరాబాద్ పోలీసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్టోబర్ 6న పాకిస్థాన్-నెదర్లాండ్, అక్టోబర్ 9న న్యూజిలాండ్- నెదర్లాండ్, అక్టోబర్ 10న పాకిస్థాన్ - నెదర్లాండ్ మ్యాచ్‌లు ఉప్పల్‌లో జరగనున్నాయి. ఈ మూడు క్రికెట్ మ్యాచ్‌లు కూడా పని దినాల్లోనే ఉండటంతో క్రీడాకారుల భద్రతతో పాటు ట్రాఫిక్ మళ్లింపులు, ఇతరత్రా సమస్యలు తలెత్తుతాయని పోలీసు ఉన్నతాధికారులు భావిస్తున్నారు.సాధారణంగా హైదరాబాద్‌లో వీకెండ్‌లో మ్యాచ్‌లు ఉంటే వీక్షకుల సంఖ్య కూడా ఎక్కువగా ఉంటుంది, సాధారణ ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఉండవు. కానీ, వరుసగా మూడు మ్యాచ్‌లు అది కూడా పని దినాల్లో నిర్వహించడంతో ట్రాఫిక్, భద్రత సమస్యలు తలెత్తుతాయనే అంశాన్ని పోలీసు ఉన్నతాధికారులు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) దృష్టికి తీసుకెళ్లారు. మ్యాచ్‌ల రీషెడ్యూల్ చేయాలని బోర్డ్ ఆఫ్ క్రికెట్ కంట్రోల్ ఇన్ ఇండియా (బీసీసీఐ)ను హెచ్‌సీఏ కోరినట్లు తెలిసింది.

# కనెక్టివిటీ కటకట!

- పదేళ్లయినా ఆచరణకు నోచుకోని 'లాస్ట్‌మైల్' లక్ష్యం
- నగర వాసులకు భారంగా మారిన మెట్రో జర్నీ
- కనీసం 16 లక్షల మంది పయనిస్తేనే బెంచ్‌మార్కు
- టికెట్‌యేతర ఆదాయం లేకపోవడంతో తీవ్ర నష్టాలు



**సాక్షి, సిటీబ్యూరో:** ఉప్పల్ మెట్రో స్టేషన్ నుంచి యూసుఫ్‌గూడకు వెళ్లేందుకు చార్జీ రూ.45. బోడుప్పల్‌లోని వెంకటేశ్వర టెంపుల్ నుంచి కేవలం 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉప్పల్ మెట్రోస్టేషన్ వరకు ఆటోచార్జీ రూ.120. అంటే బోడుప్పల్ నుంచి ఒక ప్రయాణికుడు యూసుఫ్‌గూడకు వెళ్లేందుకు కనీసం రూ.165 ఖర్చు చేయాలి. కేవలం రూ.100 పెట్రోల్‌తో సొంత వాహనంలో యూసుఫ్‌గూడ వరకు వెళ్లి రావచ్చు. మెట్రో స్టేషన్ల నుంచి లాస్ట్ మైల్ కనెక్టివిటీ లేకపోవడంతో చాలా మంది ప్రయాణికులు సొంత వాహనాలనే ఆశ్రయిస్తున్నారు. ఇంటి నుంచి రెండు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మెట్రోస్టేషన్‌కు చేరుకోవాలంటే కనీసం రూ.100 ఖర్చు చేయాల్సి వస్తోంది. ఆటో చార్జీలు, మెట్రో చార్జీలు కలిపి సామాన్య, మధ్యతరగతి ప్రయాణికులకు భారంగా మారుతున్నాయి. దీంతో చాలా మంది వ్యక్తిగత వాహనాలను ఆశ్రయిస్తున్నారు. మరోవైపు 10 సంవత్సరాలు దాటినా పూర్తిస్థాయిలో లాస్ట్‌మైల్ కనెక్టివిటీ అందుబాటులోకి రాకపోవడంతో ఆశించిన స్థాయిలో టికెట్లపై ఆదాయం లేక మెట్రో రైళ్లు సైతం నష్టాల్లో నడుస్తున్నాయి. ప్రపంచంలోని అనేక నగరాల్లో మెట్రో రైళ్లు నష్టాల్లోనే నడుస్తున్నట్లు సరిపెట్టుకున్నా.. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో హైదరాబాద్ మెట్రో రైల్ మరిన్ని నష్టాలను చవిచూడాల్సివస్తుందని నిపుణులు చెబుతున్నారు.

#### అటకెక్కిన లాస్ట్‌మైల్ కనెక్టివిటీ..

మెట్రో రైలు సేవలను వినియోగించుకొనే ప్రతి ప్రయాణికుడు ఇంటి నుంచి బయలుదేరి చివరకు ఇంటికి చేరుకొనేందుకు అనుగుణంగా లాస్ట్‌మైల్ కనెక్టివిటీ ఉండాలని 2011లోనే ప్రతిపాదించారు. ఈ మేరకు నగరంలోని వివిధ మార్గాల్లో మెట్రో గో బస్సులను నడిపేందుకు అప్పట్లో మెట్రో రైల్ ప్రణాళికలను రూపొందించింది. ఇప్పటి వరకు ఒక్క బస్సు కూడా అందుబాటులోకి రాలేదు. ఆ తర్వాత మెట్రో స్టేషన్లకు రెండు వైపులా ఉన్న కాలనీల నుంచి మినీ బస్సులను నడిపేందుకు ఆర్టీసీని రంగంలోకి దించారు. కానీ అది ప్రతిపాదన దశలోనే ఉంది. ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఓలా, ఉబెర్ వంటి క్యాబ్ సంస్థలు మినహా ఇప్పుడు ఎలాంటి లాస్ట్‌మైల్ కనెక్టివిటీ లేదు. పైగా ప్రయాణికులు సొంత వాహనాల్లో మెట్రో వరకు చేరుకొని అక్కడి నుంచి వెళ్లేందుకు పార్కింగ్ సదుపాయం లేదు. ఉన్న స్టేషన్లలో భారీగా పార్కింగ్ ఫీజులు వసూలు చేస్తున్నారు. దీంతో ఆ విధంగా కూడా మెట్రో ప్రయాణం భారంగానే మారింది. నాగోల్- రాయదుర్గం, ఎల్‌బీనగర్-మియాపూర్, జేబీఎస్- ఎంజీబీఎస్ కారిడార్‌లకు ఇరువైపులా వందల కొద్దీ కాలనీ, నివాస ప్రాంతాలు ఉన్నాయి. కానీ లాస్ట్‌మైల్ కనెక్టివిటీ లేకపోవడం వల్లనే ప్రయాణికులు సిటీ బస్సులను, ఆటోలు, క్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారు. మరోవైపు సొంత వాహనాల వినియోగం కూడా భారీగా పెరిగింది.

#### కనీసం 16 లక్షల మంది ఉండాలి..

ఎలాంటి లాభనష్టాలు లేకుండా మెట్రో రైళ్లు నడవాలంటే ఇప్పుడున్న చార్జీలపై ప్రతిరోజు కనీసం 16 లక్షల మంది ప్రయాణం చేయాలి. కానీ.. 5 లక్షల ప్రయాణికుల మార్కును దాటేందుకే 10 సంవత్సరాలు పట్టింది. ఈ లెక్కన మరో పదేళ్లు దాటినా లాభనష్టాలు లేని దశకు చేరుకోవడం కష్టమే. ప్రస్తుతం టికెట్లపై 45 శాతం మాత్రమే ఆదాయం వస్తోంది. మెట్రో టికెట్ కనిష్ట ధర రూ.10 నుంచి గరిష్టంగా రూ.60 వరకు ఉంది. ఈ చార్జీలను గరిష్టంగా రూ.100కు పెంచితే ఆదాయం పెరగవచ్చు. చార్జీలు పెంచితే జనం మెట్రోకు దూరమయ్యే అవకాశం కూడా ఉంది. చార్జీలు పెంచకుండా, నష్టాలు రాకుండా రైలు నడవాలంటే ప్రయాణికుల సంఖ్య పెరగాలి. అందుకు లాస్ట్‌మైల్ కనెక్టివిటీని పెంచడం ద్వారా ప్రయాణికుల సంఖ్యను పెంచుకోవడం, దీనికి తగిన విధంగా రైళ్లు, బోగీలను సంఖ్యను పెంచడమే ఏకైక పరిష్కారమని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న రైళ్లకు 3 బోగీలే ఉన్నాయి. ఒక్కో బోగీలో 330 మంది చొప్పున ఒక ట్రిప్‌లో 1000 మంది వరకు మాత్రమే ప్రయాణం చేసే అవకాశం ఉంది. ఈ సంఖ్యను పెంచాలంటే అదనపు బోగీలను ఏర్పాటు చేయాలి. వీటన్నిటితో మెట్రోస్టేషన్లకు లాస్ట్‌మైల్ కనెక్టివిటీని అందుబాటులోకి తేవడం ద్వారా, ప్రయాణికుల సంఖ్యకు తగినవిధంగా అదనపు రైళ్లను, బోగీలను ఏర్పాటు చేస్తే నష్టాలను అధిగమించవచ్చని అంచనా.

#### నాగపూర్ రైళ్లపై ఆశలు..

వివిధ మార్గాల్లో రైళ్ల సంఖ్యను పెంచేందుకు హైదరాబాద్ మెట్రో రైల్ ఇటీవల నాలుగు మెట్రో రైళ్లను నాగపూర్ నుంచి లీజుకు తెచ్చేందుకు సన్నాహాలు చేపట్టింది. ప్రయాణికుల రద్దీకి తగినవిధంగా రైళ్లను ఏర్పాటు చేయాలని మంత్రి కేటీఆర్ సూచించిన నేపథ్యంలో అధికారులు అందుకు తగిన చర్యలను చేపట్టారు. ఈ రైళ్లు అందుబాటులోకి వస్తే ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉన్న ఎల్‌బీనగర్-మియాపూర్, నాగోల్- రాయదుర్గం రూట్లలో ట్రిప్పుల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుంది.

## పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం

- మెరైన్‌లో ఉద్యోగం అని మాయమాటలు
- నగరవాసి నుంచి రూ.4 లక్షలు వసూలు
- ఇద్దరు నైజీరియన్లను అరెస్టు చేసిన రాచకొండ పోలీసులు

**సాక్షి, సిటీబ్యూరో:** మ్యాట్రిమోనిలో నకిలీ ప్రొఫైల్స్ పెట్టి, పెళ్లి చేసుకుంటానని యువతులను మోసం చేస్తున్న ఇద్దరు నైజీరియన్లను రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. ఇద్దరు నైజీరియన్లు గూగుల్‌లో నుంచి హ్యాండ్సమ్ అబ్బాయిల ఫొటోలను డౌన్‌లోడ్ చేసి, వాటి ద్వారా సామాజిక మాధ్యమాలలో నకిలీ ప్రొఫైల్‌లు సృష్టించారు. ఈక్రమంలో రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఓ యువతికి ఇన్‌స్టాగామ్‌లో పరిచయం అయ్యాడు. మెరైన్‌లో ఉద్యోగం చేస్తున్నానని, నెలకు రూ.3 లక్షలు వేతనం అని మాయమాటలు చెప్పాడు. తక్కువ కాలంలోనే ఇరువురి మధ్య స్నేహం బలపడింది. ప్రతి రోజు ఇన్‌స్టాగామ్‌లో చాటింగ్ చేసుకునేవారు. ఈక్రమంలో తనను పెళ్లి చేసుకుంటానని సైబర్ మోసగాడు యువతితో చెప్పాడు. త్వరలోనే హైదరాబాద్‌కు వస్తానని నమ్మించాడు. మర్నాడు ఉదయం ఫోన్ చేసి నీ కోసం బంగారం బహుమతిగా తీసుకొస్తున్నానని చెప్పాడు. అయితే ఢిల్లీ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారని చెప్పాడు. కస్టమ్స్ అధికారులతో మన ప్రేమ, పెళ్లి గురించి చెప్పానని, రూ.4 లక్షలు డబ్బులు ఇస్తే గిఫ్ట్ వదిలేస్తామని చెప్పారని వివరించాడు. లేకపోతే కేసులైతే ఉద్యోగం చిక్కుల్లో పడుతుందని, పెళ్లి ఆగిపోతుందని నమ్మించాడు. దీంతో అతని మాటలను పూర్తిగా విశ్వసించిన బాధితురాలు అతను అడిగిన డబ్బును ఆన్‌లైన్‌లో బదిలీ చేసింది. అంతే అప్పట్నుంచి ఫోన్ స్విచాఫ్. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాల ఆధారంగా నిందితులు ఢిల్లీలో ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఢిల్లీకి వెళ్లిన ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, రాజు బృందం.. ఇద్దరు నైజీరియన్లను అరెస్టు చేసి, స్థానిక న్యాయస్థానంలో హాజరుపరిచారు. ట్రాన్సిట్ వారెంట్‌పై నిందితులను హైదరాబాద్‌కు తీసుకొచ్చి, రిమాండ్‌కు తరలించారు.

## సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్‌పై దౌర్జన్యం

**హిమాయత్‌నగర్:** సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌కు చెందిన ఓ ఇన్‌స్పెక్టర్‌పై ఇద్దరు యువకులు విరుచుకుపడ్డారు. తాను పోలీసునని చెప్పినా ఏమాత్రం వినకుండా ఇన్‌స్పెక్టర్‌పై భౌతిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో స్వల్పంగా గాయపడ్డ ఇన్‌స్పెక్టర్ నారాయణగూడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇద్దరు యువకులపై కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే... హైదరాబాద్ సిటీ సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ ఎస్.నరేష్ శనివారం విధులు ముగించుకుని తన కారులో ఇంటికి బయలుదేరారు. హైదర్‌గూడ ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్ద ఫ్రీలెఫ్ట్ తీసుకునే క్రమంలో ఓ ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై అడ్డుపడ్డారు. ఈ సమయంలో వీరిమధ్య వాగ్వాదం జరిగింది. అక్కడితో ఆగని ఆ ఇద్దరు యువకులు కారులో ఉన్న ఇన్‌స్పెక్టరును బయటకు దించి అతనిపై చేయి చేసుకున్నారు. కారు సైడ్అద్దం, నంబర్ ప్లేట్‌ను విరగొట్టి, ఫొటోలు తీసుకుని రెచ్చిపోయారు. తాను పోలీసునని చెప్పినా ఏమాత్రం లెక్కచేయకుండా అందరూ చూస్తుండగానే వీరంగం సృష్టించారు. దీంతో ఆ ఇద్దరి యువకులపై ఫిర్యాదు చేయగా.. పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## దేశాన్ని ప్రగతిపథంలో నిలిపింది మోదీనే..

**కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**


బీజేపీ బహిరంగసభలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

**కూకట్‌పల్లి:** కాంగ్రెస్ పాలనలో అథోగతి పాలైన దేశాన్ని తిరిగి ప్రగతిపథంలో నిలిపింది ప్రధాని నరేంద్ర మోదీ ఒక్కరే అని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఆయన హయాంలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. ఆదివారం కూకట్‌పల్లిలో జరిగిన బహిరంగ సభలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో దేశంలో కుటుంబ పాలన కారణంగా అప్పులపాలై ఎంతో వెనుకబడిందన్నారు. ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలనలో ఏ రోజూ కూడా సెలవు పెట్టకుండా దేశం కోసం అనునిత్యం పోరాడుతున్నారని, ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేశారని తెలిపారు. ఇక తెలంగాణలో కేసీఆర్ కుటుంబ పాలనను నడుపుతూ అవినీతి సామ్రాజ్యాన్ని స్థాపించారని కిషన్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్రాన్ని రియల్ ఎస్టేట్ కంపెనీగా మార్చి తన కొడుకును మార్కెటింగ్ చైర్మన్‌గా చేర్చారని ధ్వజమెత్తారు. కేసీఆర్ కుటుంబ పాలనను అంతమొందించేందుకు బీజేపీ సిద్ధమైందన్నారు. హైదరాబాద్ నగరాన్ని అధ్వానంగా తయారు చేసి విశ్వనగరం పేరుతో నిధులన్నీ కమీషన్లకే పరిమితం చేశారన్నారు. లక్షల కోట్లు వెచ్చించినా ఇప్పటికీ నగరంలో వర్షాలు వస్తే పడవల్లో తిరిగే పరిస్థితి ఏర్పడిందన్నారు. హైదరాబాద్ నగరాన్ని అందంగా తీర్చిదిద్ది ప్రపంచ దేశాలకు పరిచయం చేసే విధంగా బీజేపీ కృషి చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో గెలిచిన ఎమ్మెల్యేలంతా బీఆర్ఎస్‌లో చేరారంటే..బీఆర్ఎస్‌కు, కాంగ్రెస్‌కు ఎంత బలమైన సంబంధాలు ఉన్నాయో అర్థమవుతుందన్నారు. బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే ఎంఐఎంకు ఓటు వేసినట్లే అన్నారు. ఆ మూడు పార్టీలు సిండికేట్‌తో ఎన్నికల్లో పోటీకి వస్తున్నాయని, వాటన్నిటికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం కావాలన్నారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ చైర్మన్, సమాజ సేవకుడు ముమ్మారెడ్డి ప్రేమకుమార్‌ను పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మాట్లాడుతూ కూకట్‌పల్లి ఎల్లమ్మబండ సర్వే నెంబర్ 57 కబ్జాకు గురవుతున్న సమయంలో తాను బీఆర్ఎస్ పార్టీలో ఉండి కూడా కబ్జాలను వ్యతిరేకించానని తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీలో చేరిన ముమ్మారెడ్డి ప్రేమకుమార్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధి పనులకు తాను ఆకర్షితుడినై పార్టీలో చేరుతున్నానని చెప్పారు. కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్ చంద్రారెడ్డి అధ్యక్షత వహించారు. బీజేపీ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, నాయినేని సూర్యప్రకాష్‌రావు, అర్కపల్లి సూర్యారావు, యంజాల పద్మయ్య, కార్పొరేటర్ మహేందర్, కృష్ణాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ అధ్యాపకులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలి

**తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ డిమాండ్**


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

**ముషీరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12 యూనివర్సిటీలలో బడ్జెట్, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులలో బోధిస్తున్న 1445 మంది కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ ఆధ్వర్యంలో సామూహిక సమర దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీచర్స్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ప్రొఫెసర్ హరగోపాల్, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసి ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను పటిష్టం చేయాలన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్, ఆర్.కృష్ణయ్యలు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ డాక్టర్ వేల్పుల కుమార్, తాళ్లపల్లి వెంకటేష్, ఈ.ఉపేందర్‌రావు, కన్వీనర్ చిర్రా రాజు, డాక్టర్ విజయేందర్‌రెడ్డి, డాక్టర్ నరసింహారావు, డాక్టర్ యాదయ్య, సిహెచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పంద్రాగస్టున 10 మిలియన్ల మంది బస్సు ప్రయాణం

**సాక్షి, సిటీబ్యూరో:** 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 10 మిలియన్ల మంది బస్సు ప్రయాణాన్ని ఎంచుకున్నారని ప్రముఖ ఆన్‌లైన్ బస్–టికెటింగ్ వేదికైన 'అభిబస్' వెల్లడించింది. స్వాతంత్ర్య దినోత్సవ వారాంతంలో పీక్ ట్రావెల్ సీజన్‌తో అధిక విమాన ప్రయాణ ఖర్చులు, రైలు టిక్కెట్ల పరిమిత లభ్యత వంటి కారణాలతో ప్రజలు తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి బస్సులను ఎంచుకున్నారని వారు పేర్కొన్నారు. ఆగస్టు 15వ తేదీన హైదరాబాద్ నుంచి గోవాకు రౌండ్–ట్రిప్ రైలు టిక్కెట్ల ధర సుమారుగా రూ.10 వేలు ఉండగా, బస్సు ప్రయాణికులు అదే గమ్యస్థానానికి దాదాపు రూ.2 వేలకే చేరుకోవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో హైదరాబాద్–బెంగుళూరు, హైదరాబాద్–గోవా, బెంగుళూరు–చెన్నై, చెన్నై–కోయంబత్తూర్, లక్నో–దిల్లీ, దిల్లీ–డెహ్రాడూన్ వంటి ప్రధాన నగరాలను కలిపే వాటితో సహా ప్రముఖ మార్గాలలో బస్సు ప్రయాణంలో పెరుగుదల గణనీయంగా చోటు చేసుకుందని అభిబస్ సీఓఓ రోహిత్ శర్మ తెలిపారు. అంతేగాకుండా పొడిగించిన వారాంతంలో ఇతర మార్గాలలో 30 శాతం వృద్ధి కనిపించిందని ఆయన వివరించారు.

## చేపల పంపిణీ కాదు.. చదువులు కావాలి

**ఎంపీ ఆర్.కృష్ణయ్య**



**ఉస్మానియా యూనివర్సిటీ:** దేశంలో తెలంగాణ అగ్రస్థానంలో నిలవాలంటే గొర్రెలు, బర్రెలు, పందులు, చేపల పంపిణీ కాదని విద్యతోనే అన్నిరంగాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీ ఆర్.కృష్ణయ్య అన్నారు. ఆదివారం తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టుల భర్తీకి చలో ఉస్మానియా యూనివర్సిటీ కార్యక్రమంలో భాగంగా భారీ ర్యాలీ చేపట్టారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ విద్య లేకుండా తరతరాలుగా కులవృత్తులు చేస్తున్న కుటుంబాలు పేదరికంలోనే ఉన్నాయన్నారు. విద్య తద్వారా శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం పరిశ్రమల స్థాపనతోనే అన్ని కులాల వారు అభివృద్ధి చెందుతారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ కేటగిరిలలో ఖాళీగా ఉన్న 44 వేల టీచర్ పోస్టులు, 4900 ఎయిడెడ్, ఆదర్శ పాఠశాలల్లో 2000, కస్తూర్బాలో 1500 టీచర్ పోస్టులతో పాటు 10 వేల పీఈటీలు, 4 వేల కంప్యూటర్ టీచర్స్, 5 వేల ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, డ్రాయింగ్ టీచర్స్, 3 వేల లైబ్రేరియన్, నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అందుబాటులోకి వచ్చిన శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలంటే అన్ని వర్గాలకు విద్య అవసరమన్నారు. చదువులతోనే కులవృత్తుల అభివృద్ధి సాధ్యమని, అందుకు టీచర్ పోస్టులను భర్తీ చేసి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలన్నారు. రాష్ట్రంలో ఏడు సంవత్సరాలుగా టీచర్ పోస్టులను భర్తీ చేయక వేలాది పాఠశాలలు మూతపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పక్క బీఈడీ, డీఈడీ ఇతర ఉపాధ్యాయ కోర్సులు పూర్తి చేసి వేలాది మంది నిరుద్యోగులు మారుతుండగా మరోపక్క ప్రైవేటు స్కూల్స్‌లో చదివే ఆర్థిక స్తోమతలేక లక్షలాది మంది పేద పిల్లలు విద్యకు దూరం అవుతున్నారని కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వేముల రామకృష్ణ, రాజ్‌కుమార్, నరేష్, మహేష్, మోడి రాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ ఆలయంలో కేంద్ర మంత్రి పూజలు


పూజల్లో పాల్గొన్న జి.కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్ తదితరులు

**అబిడ్స్:** అబిడ్స్ కట్టెల మండిలోని ముత్యాలమ్మ ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం వేడుకల్లో కేంద్రమంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌లు ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర బీజేపీ యువ నాయకుడు ఎం.విక్రమ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆలయ పునఃనిర్మాణ పనులు చేపట్టారు. విక్రమ్‌గౌడ్ ఆహ్వానం మేరకు కిషన్‌రెడ్డి, ఈటల హాజరై వేడుకల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు వారిని ఘనంగా సత్కరించారు.

## ఘనంగా సినారె గజల్ సాహితీ పురస్కారాల ప్రదానోత్సవం

**నాగోలు:** కొత్తపేట డివిజన్ న్యూనాగోలు, స్నేహపురి సీనియర్ సిటిజన్ భవన్‌లో ఆదివారం కొమర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సినారె గజల్ సాహితీ పురస్కారాల వేడులు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ కవి, పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ హాజరయ్యారు. తెలుగు అధికార భాషా సంఘం అధ్యక్షులు మంత్రి శ్రీదేవి, గజల్ కవయిత్రి, కొమర్రాజు ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు శ్యామల మాట్లాడారు. శ్రీనివాస్, గజల్ వాసుదేవ్, వాణీ వెంకట్, హిమజా తదితరులకు పురస్కారాలు అందచేశారు. కార్యక్రమంలో ఇంకా సాహితీ వేత్త ఏనుగు నరసింహారెడ్డి, ప్రముఖ కవి, సినీ గేయ రచయిత వడ్డేపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పద్మశ్రీ కొలకలూరి ఇనాక్

## ఢిల్లీ టూ రాంకోఠి!

- నగరంలో వాహనాల నకిలీ స్పేర్‌పార్ట్స్ విక్రయం
- పక్కా సమాచారంతో కోఠిలోని షాపుపై రైడ్ చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు
- సుమారు రూ.10 లక్షల విలువైన నకిలీ స్పేర్ పార్ట్స్ స్వాధీనం

**హిమాయత్‌నగర్:** సుజుకీ కంపెనీకి చెందిన టూవీలర్, ఫోర్ వీలర్‌ల నకిలీ స్పేర్ పార్ట్స్ అమ్మకాలు చేస్తున్న రాంకోఠిలోని 'బాలాజీ ఆటో పార్ట్స్' షాపుపై సెంట్రల్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుపుదాడి చేశారు. సుజుకీ కంపెనీకి చెందిన హోలోగ్రామ్ డూప్లికేట్‌ది తయారు చేసి ఇదే నిజమైన కంపెనీదంటూ నమ్మిస్తూ వాహనదారులను కొంతకాలంగా మోసం చేస్తున్న విషయాన్ని గుర్తించారు. దీంతో పాటు సుజుకి కంపెనీకి చెందిన క్యూఆర్ కోడ్‌లను సైతం క్రియేట్ చేసి ఈ నకిలీ దందాకు పాల్పడుతున్నట్లు స్పష్టత వచ్చింది. దీంతో 'బాలాజీ ఆటో పార్ట్స్' షోరూంలో భారీ ఎత్తున ఫేక్ స్పేర్ పార్ట్స్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు సీజ్ చేసి నారాయణగూడ పోలీసులకు అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నారాయణగూడ పోలీసులు యజమాని మహేందర్‌కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**ఢిల్లీ నుంచి దిగుమతి..**

రాంకోఠి కేంద్రంగా కొంతకాలంగా ద్విచక్ర, కారు, ఆటోలకు సంబంధించిన స్పేర్ పార్ట్స్ నకిలీ దందా నడుస్తుంది. ఈవిషయంపై సెంట్రల్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పక్కా సమాచారం అందుకుని శనివారం రాత్రి 'బాలాజీ ఆటో పార్ట్స్' షోరూంపై రైడ్ చేశారు. షోరూంకు చెందిన మహేందర్ కుమార్ గత కొంతకాలంగా న్యూఢిల్లీ నుంచి నకిలీ స్పేర్ పార్ట్స్‌ను ఇక్కడకు తీసుకొస్తున్నాడు. హోలోగ్రామ్‌ను కూడా ఇదే షోరూంలో నకిలీది తయారు చేసి ఢిల్లీ నుంచి తీసుకొచ్చిన ఆ పరికరాలపై వేస్తున్నారు. దీంతో పాటు క్యూఆర్ కోడ్ సైతం పరికరాల కవర్‌లపై ఉండటంతో ఎవరికీ ఇది ఫేక్ అని అనుమానం లేదు. న్యూఢిల్లీలో సుమారు రూ.500కు కొనుగోలు చేసిన పార్ట్స్‌ను ఇక్కడ రూ.1000కి అమ్ముతున్నారు. ఇలా కొంతకాలంగా చేస్తున్న నకిలీ స్పేర్‌పార్ట్స్ వ్యవహారంపై సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ సాయికిరణ్ రైడ్ చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

**దాదాపు రూ.10 లక్షల నకిలీ పార్ట్స్ సీజ్**

రైడ్‌లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు 14 సిలిండర్ పిస్టన్ కిట్స్, 26 ఎయిర్ ఫిల్టర్‌లు, 6 అబ్సోర్‌బేర్ అస్సీ రేర్ షాక్, 45 షూసెట్‌బ్రేక్‌లు, 45 ప్లేట్ క్లచ్‌లు, 8 సీడీఐ యూనిట్‌లు, 5 హబ్ రేర్ వీల్స్, 5 ఎయిర్ ఫిల్టర్ బాక్సులు, 5 డిస్క్ క్లచ్ ప్రెజర్‌లు, 5 హబ్‌క్లచ్ స్టిక్కర్స్, 75 వారిటర్ బాడీలు, ఒక డెల్ ల్యాప్‌టాప్, ఒక ప్రింటర్, సుజుకీ క్యూ ఆర్‌కోడ్ స్టిక్కర్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటి ధర దాదాపు రూ.10 లక్షలు ఉండొచ్చని పోలీసులు పేర్కొన్నారు.

## ఉచితంగా నిత్యావసర సరుకుల పంపిణీ


కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉచితంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

**సాక్షి, సిటీబ్యూరో:** మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా గాంధీభవన్‌లో ఆదివారం ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి ఆధ్వర్యంలో పేద ప్రజలకు ఉచితంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, ఏఐసీసీ పరిశీలకుడు దీపదాస్ మున్షీ, ఏఐసీసీ కార్యదర్శులు రోహిత్ చౌదరి, మన్సూర్ అలీ ఖాన్ తదితరులు పాల్గొని పేదలకు ఉచితంగా సరుకులు అందించారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ నియోజకవర్గంలోని అన్ని మురికివాడల్లో నిత్యావసర సరుకులు 50 శాతం సబ్సిడీపై సరఫరా చేస్తామని రోహిణ్ రెడ్డి ప్రకటించారు. దేశంలో పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, తెలంగాణలోని టీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు.



## 'సాక్షి' ఫొటోగ్రాఫర్లకు అవార్డులు


గడిగె బాలస్వామి


నోముల రాజేష్‌రెడ్డి

**సాక్షి, సిటీబ్యూరో:** అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని హై ఆక్టేన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శనివారం తెలుగు విశ్వవిద్యాలయంలో రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో 'సాక్షి' దినపత్రిక ఫొటోగ్రాఫర్లు గడిగె బాలస్వామి మూడో ప్రైజ్, నోముల రాజేష్‌రెడ్డి కన్సొలేషన్ ప్రైజ్‌కు ఎంపికయ్యారు. ఈ అవార్డులను ఈ నెల 24న అందజేయనున్నారు.

## వృద్ధుడి అదృశ్యం



**సాక్షి, సిటీబ్యూరో:** నగరంలోని సికింద్రాబాద్ రెజిమెంటల్ బజార్‌కు చెందిన మోతే భిక్షపతి యాదవ్ (75) అదృశ్యమయ్యాడు. ఆదివారం మధ్యాహ్నం 3:30 నుండి 4 గంటల మధ్య ప్రాంతంలో ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. ఈ మేరకు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫొటోలోని వ్యక్తి కనిపిస్తే 7842843396, 8878876004 నెంబర్లలో సమాచారం అందించాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

## చారిటీ పేరిట అక్రమ వసూళ్లు

**'బెగ్గింగ్' ముఠా ఆటకట్టించిన పోలీసులు**


వివరాలు వెల్లడిస్తున్న సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ రూపేష్, ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లు

**మలక్‌పేట:** చారిటీ పేరుతో కూడళ్లలో వాహనదారుల నుంచి విరాళాలు సేకరిస్తూ మోసాలకు పాల్పడుతున్న గ్యాంగ్‌ను పోలీసులు పట్టుకున్నారు. వీరి ముఠా గుట్టు రట్టు చేశారు. మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ సిహెచ్.రూపేష్ ఇతర అధికారులతో కలిసి వివరాలు వెల్లడించారు. నల్లగొండ జిల్లాకు చెందిన కేతావత్ రవి, కేతావత్ మంగు అన్నదమ్ములు. వీరు ఆటోలు నడుపుతున్నారు. రవి మీర్‌పేట నందిహిల్స్‌లో, మంగు ఆర్‌ఎన్‌రెడ్డి నగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరు అధికంగా డబ్బు సంపాదించాలనే ఆశతో మన్సూరాబాద్‌కు చెందిన గణేశ్‌ను సంప్రదించారు. ఆర్మూర్‌కు చెందిన గణేశ్ అప్పటికే 'అమ్మ చేయూత ఫౌండేషన్' నడుపుతున్నాడు. ఈ ఫౌండేషన్ పేరుతోనే వసూళ్లకు పాల్పడాలని గణేశ్ అన్నదమ్ములిద్దరికీ సలహా ఇచ్చాడు. ఈమేరకు ఫౌండేషన్ పేరుతో ఉన్న కలెక్షన్ బాక్సులు, బ్యాంకు ఎకౌంట్‌కు లింక్ చేసిన క్యూఆర్ కోడ్‌లు అందించాడు. దీంతో రవి, మంగులు కలెక్షన్ ఏజెంట్లుగా నిరుద్యోగులైన గృహిణులు, విద్యార్థులను నియమించుకున్నారు. ఈ మేరకు మహిళలకు కలెక్షన్ బాక్స్‌లు, ఐడీ కార్డులు, విజిటింగ్ కార్డులు ఇచ్చి, డ్రెస్సింగ్ కోడ్‌తో వారిని ఇంటి నుంచి తీసుకెళ్లి జంట నగరాల్లో రద్దీ ఉండే ట్రాఫిక్ జంక్షన్ల వద్ద దింపి వాహనదారుల నుంచి డబ్బులు యాచించాలని ఆదేశిస్తారు. రాత్రి 9 గంటల తరువాత వారిని తిరిగి వాహనాల్లో ఇంటికి తీసుకొచ్చి కలెక్షన్ లెక్కించి..ఏజెంట్లకు 35 శాతం చెల్లించి, మిగతాది నొక్కేస్తారు. ఇలా వీరు 2020 నుంచి రూ.లక్షలు గడించారు. కూడబెట్టిన డబ్బుతో గణేష్, రవి, మంగులు నాదర్‌గుల్, బడంగ్‌పేట, తుర్కయంజాల్ ప్రాంతాలలో ఓపెన్ ప్లాట్లు కొనుగోలు చేశారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా సౌత్ ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ టీమ్ మూసారంబాగ్ చౌరస్తాలో మలక్‌పేట పోలీసులతో కలిసి రహదారిపై డబ్బు సేకరిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా ఈ చారిటీ బెగ్గింగ్ మాఫియా గ్యాంగ్ గుట్టు బయట పడింది. జంక్షన్లలో డబ్బులు వసూలు చేస్తున్న ఏడుగురు యువతులను, గ్యాంగ్ లీడర్లు రవి,మంగు,గణేశ్‌లను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. వీరి నుంచి 12 కలెక్షన్ బాక్సులు, రెండు ఆటోలు, లక్షా 22 వేలు నగదు, 3 సెల్‌ఫోన్లు, కొనుగోలు చేసిన ఓపెన్ ప్లాట్ల పత్రాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## క్లుప్తంగా

### ఒట్టేసి చెబుతున్నాం.. మీ వెంటే మేముంటాం..!



**ఫిలింనగర్:** ఎన్నికలు సమీపిస్తున్న వేళ పలు పార్టీలలో వలసలు ఊపందుకున్నాయి. అభిమానంతో పార్టీలలో చేరుతున్న వారు కొంత మంది అయితే, కొంతమంది గాలివాటంగా చేరుతుంటారు. అయితే ఆదివారం ఫిలింనగర్‌లోని గౌతమ్‌నగర్‌కు చెందిన కొంతమంది యువకులు ఎమ్మెల్యే దానం నాగేందర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. 'మీ మీద అభిమానంతో పార్టీలో చేరాం.. చివరిదాకా మీతోనే ఉంటామన్నా..' అంటూ వారంతా ఎమ్మెల్యే దానం చేతిలో చేయి వేసి ఒట్టేసి చెప్పడం విశేషం. ఖైరతాబాద్ నియోజకవర్గంలో మరోసారి గులాబీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా తామంతా కలిసి పనిచేస్తామంటూ యువకులంతా స్పష్టం చేశారు.

### నిత్యావసరాల పంపిణీ



**బంజారాహిల్స్:** మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ జయంతి ఉత్సవాల సందర్భంగా ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఏఐసీసీ ఇన్‌చార్జి మాణిక్ రావ్ ఠాక్రే, పరిశీలకులు దీప్‌దాస్ మున్షి, సెక్రటరీలు రోహిత్ చౌదరి, మన్సూర్ అలీఖాన్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి చెందిన పేదలకు నిత్యాసర సరుకులు పంపిణీ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్వాకంతోనే నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయని ఆయన దుయ్యబట్టారు.

### సమస్యల పరిష్కారంపై రాజీపడం

**వెంగళరావునగర్:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎంతవరకైనా పోరాడటానికి సిద్ధంగా ఉన్నామని జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. వెంగళరావునగర్ డివిజన్ జవహర్‌నగర్‌లో ఆదివారం ఆయన పాదయాత్ర చేపట్టారు. ఆయనకు స్థానిక కాంగ్రెస్ నాయకులు జింకా ఆలీస్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ... తాను అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. తన తండ్రి పీజేఆర్ స్ఫూర్తితో ప్రజలకు అండగా ఉంటూ, ఏ సమయంలోనైనా పిలిస్తే పలుకుతానన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. అనంతరం ఆయన స్థానిక సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు భిట్ల సుశీల్‌కుమార్, అర్జున్, ఇమ్మానియేలు, రూబెన్, మహేందర్, చిన్న, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీలో పలువురి చేరిక



**ఫిలింనగర్:** జూబ్లీహిల్స్ డివిజన్ టీటీడీపీ అధ్యక్షుడు ఎండీ సలీమ్ ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు ఆదివారం టీడీపీలో చేరారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అరవింద్‌కుమార్‌గౌడ్ పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అరవింద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ... టీడీపీ హయాంలోనే నగరం అభివృద్ధి జరిగిందన్నారు. మరోసారి టీడీపీని ఆశీర్వదించేందుకు కార్యకర్తలు వస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఖైరతాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి శ్రీనివాస్‌నాయుడు, ఫిలింనగర్ గౌతమ్‌నగర్‌కు చెందిన మన్యం, కె.రామస్వామి, భరత్, కృష్ణ, కె.రాజన్న, వేముల రమేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమనే భావనతో తాము పార్టీలో చేరామని వారు పేర్కొన్నారు.

### మహిళ కడుపులోని భారీ కణితి తొలగింపు

**లక్డీకాపూల్:** ఓ మహిళ కడుపులో 10.5 కిలోల బరువున్న కణితిని శస్త్ర చికిత్స ద్వారా నిమ్స్ వైద్యులు తొలగించారు. వివరాలివీ... ఖమ్మం జిల్లాకు చెందిన కుసునూరు లక్ష్మి కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. నాలుగు రోజుల క్రితం సమస్య తీవ్రం కావడంతో కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు కడుపులో భారీ కణితి ఉన్నట్లు గుర్తించారు. మెరుగైన వైద్యం కోసం శుక్రవారం నిమ్స్‌కు తీసుకొచ్చారు. పరీక్షించిన సర్జికల్ ఆంకాలజీ వైద్యులు శస్త్ర చికిత్స చేయాలని సూచించారు. సర్జికల్ ఆంకాలజీ విభాగాధిపతి రాజశేఖర్, వైద్య బృందం ఆమెకి ఆపరేషన్ చేసి భారీ కణితిని తొలగించారు.

# సైలెన్సర్ల మోతపై... ట్రాఫిక్ పోలీసుల ఉక్కుపాదం!

- 230 మంది వాహనదారులపై కేసులు
- సైలెన్సర్లు మార్చి.. అధిక శబ్దంతో దూసుకెళ్తూ...
- ఎంవీ యాక్ట్ కింద కేసులు.. జరిమానాలు

షోరూం నుంచి వచ్చిన వాహనాల సైలెన్సర్లను మార్చి అధిక శబ్దంతో కూడిన సైలెన్సర్లను బిగించుకొని రయ్... రయ్ మంటూ దూసుకుపోతున్న వాహనదారులపై ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. చెవులు చిల్లులు పడేలా శబ్దంతో దూసుకుపోతూ ఇతర వాహనదారులు, పాదచారులకు న్యూసెన్స్ కలిగిస్తున్న న్యూటరిస్ట్‌లపై కొరడా ఝులిపిస్తున్నారు.



సైలెన్సర్లు మార్చి అధిక శబ్దంతో దూసుకెళ్తున్న ద్విచక్ర వాహనదారులకు జరిమానాలు విధిస్తున్న జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు

**బంజారాహిల్స్:** బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఎస్ఆర్ నగర్ ట్రాఫిక్ పోలీసులు ఈ నెల 10వ తేదీ నుంచి స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. సైలెన్సర్లు మాడిఫై చేసి దూసుకెళ్తున్న వాహనాలను తనిఖీల్లో పట్టుకుంటూ అక్కడికక్కడే మెకానిక్‌లను పిలిపిస్తూ మాడిఫై చేసిన సైలెన్సర్లను తొలగిస్తూ షోరూం నుంచి వచ్చిన సైలెన్సర్లు బిగించి అంతటితో ఊరుకోకుండా జరిమానా విధిస్తున్నారు.

◆ ఈ నాలుగు పోలీస్ స్టేషన్ల పరిధిలో గడచిన పది రోజులుగా నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో సైలెన్సర్లు మార్చి ఎంవీయాక్ట్‌ను ధిక్కరించిన 230 మంది వాహనదారులపై కేసులు నమోదు చేయడమే కాకుండా జరిమానాలు విధించారు. ఎంవీ యాక్ట్ ప్రకారం సైలెన్సర్లు తొలగించి అధిక శబ్దంతో కూడిన సైలెన్సర్లు వాహనం నడిపిస్తే రూ. 1000 జరిమానా విధిస్తున్నారు.

◆ జూబ్లీహిల్స్ పరిధిలోనే ఈ పది రోజుల వ్యవధిలో 67 కేసులు నమోదు చేశారు. ఈ డ్రైవ్ మరింత కాలం కొనసాగుతుందని ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

**రాత్రిపూటే ఎక్కువ...**

సైలెన్సర్లు మార్చి రకరకాల శబ్దాలతో కొత్త రకం సైలెన్సర్లు బిగించుకొని యువకులు స్పోర్ట్స్ బైక్‌లు, కార్లపై దూసుకెళ్తున్నారు. ముఖ్యంగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, నెక్లెస్ రోడ్డు, ఖైరతాబాద్ ఫ్లై ఓవర్‌పై రాత్రిపూట ఎక్కువగా ఈ వాహనాలు దూసుకెళ్తున్నాయి. వృద్ధులు, పిల్లలు ఈ సౌండ్‌కు దద్దరిల్లిపోతున్నారు. పక్క నుంచే చెవులు చిల్లులు పడేలా దూసుకెల్తున్న వాహనాలతో చాలా మందికి గుండె ఆగినంత పని అవుతున్నది. డయల్ 100కు ఎక్కువగా ఫిర్యాదులు వెళ్తున్నాయి. బంజారాహిల్స్, కేబీఆర్ పార్కు నుంచి దుర్గం చెరువు వరకు దూసుకెళ్తున్న ఈ స్పోర్ట్స్ బైక్‌లు, కార్లు తిరిగి అక్కడి నుంచి కేబీఆర్ పార్కు వరకు దూసుకొస్తున్నాయి. రాత్రి 8 తర్వాత తెల్లవారుజామున 2, 3 గంటల వరకు ఈ మోత మోగుతున్నది. ఎక్కువగా బంజారాహిల్స్, కేబీఆర్ పార్కు నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు నెక్లెస్ రోడ్డులో సైలెన్సర్ల శబ్దాలు స్థానికులకు నరకప్రాయంగా మారుతున్నాయి. ఇటీవల పోలీసు ఉన్నతాధికారులకు కూడా ఈ మోతపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి.



మెకానిక్ సాయంతో సైలెన్సర్లు తొల్గిస్తున్న జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఎస్ఐ శ్రీధర్

**రోజూ తనిఖీలు...**



సైలెన్సర్లు మాడిఫై చేసి వాహనాలు నడిపించడం ఎంవీ యాక్ట్ ప్రకారం నేరం. ఇలాంటి వారిపై జరిమానాలు విధించడం జరుగుతుంది. కొద్ది రోజులుగా మా పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ 30 కిపైగా కేసులు నమోదవుతున్నాయి. అక్కడికక్కడే మార్చిన సైలెన్సర్లను తొలగించడం జరుగుతుంది. ఈ ప్రక్రియ రోజూ కొనసాగుతుంది. ఎవరైనా సైలెన్సర్లు మార్చుకొని అధికశబ్దంతో కూడిన సైలెన్సర్లు బిగించుకుంటే వెంటనే తొలగించుకోవాలి.ట్రాఫిక్ పోలీసులకు దొరికితే జరిమానా విధిస్తాం.

– డి.నాగేశ్వర్‌రావు, ఏసీపీ ట్రాఫిక్ వెస్ట్‌జోన్–2

**మెకానిక్‌లతో సైలెన్సర్లు తొలగిస్తాం**



పది రోజులుగా మాడిఫై చేసిన సైలెన్సర్లపై స్పెషల్ డ్రైవ్ కొనసాగిస్తున్నాం. వేర్వేరుచోట్ల ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి. మరికొద్ది రోజులు ఇలాగే కొనసాగుతాయి. ఎవరైనా తమ వాహనాలను అధిక శబ్దంతో కూడిన సైలెన్సర్లు బిగించుకొని ఉంటే వాటిని తొలగించుకోవడం మంచిది. లేదంటే పట్టుబడ్డప్పుడు మేమే మెకానిక్ సాయంతో వాటిని తీసివేయిస్తాం. ఇప్పటి వరకు చాలా మంది వాహనదారులకు జరిమానాలు విధించడమే కాకుండా సైలెన్సర్లు కూడా తొలగించారు. కొంత మంది కార్లకు కూడా సైలెన్సర్లు మార్చి తిరుగుతున్నట్లుగా ఫిర్యాదులు అందుతున్నాయి. అలాంటి వాటిని కూడా గుర్తించి జరిమానాలు విధించడమే కాకుండా అవసరమైతే వాహనాలను సీజ్ చేసి సైలెన్సర్లను తొలగిస్తాం.

– వినోద్‌కుమార్, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

### వైభవంగా గంగ తెప్పోత్సవం



**పంజగుట్ట:** గంగపుత్రులు ఎంతో వైభవంగా నిర్వహించుకునే గంగ తెప్పోత్సవ కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి హాజరై బోనం ఎత్తుకున్నారు. గంగపుత్ర మహిళల సామూహిక బోనాల ఉత్సవంలో పాల్గొని బోనం ఎత్తుకుని అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు మధునాల బాబురావు, ఖైరతాబాద్ గంగపుత్ర సంఘం మహిళా నాయకులు మధునాల చంద్రకళ, మంగళపల్లి సునీత పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కారమయ్యే దాకా పోరు

**హిమాయత్‌నగర్:** రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మెను కొనసాగిస్తామని రెండవ ఏఎన్ఎంల యూనియన్(ఏఐటీయూసీ) స్పష్టం చేసింది. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని యూనియన్ కౌన్సిల్ సమావేశాన్ని ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించారు. యూనియన్ నాయకులు నరసింహ మాట్లాడుతూ... పలు రాష్ట్రాల్లో ఎన్‌హెచ్ఎం స్కీమ్ కింద పనిచేసే వారిని పర్మినెంట్ చేశారనే విషయాన్ని డి.హెచ్.శ్రీనివాస్ దృష్టికి పలుమార్లు తీసికెళ్లామన్నారు. 20 సంవత్సరాలుగా సెకండ్ ఏఎన్ఎంలు పని చేస్తున్నారని, వీరి సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదన్నారు. వీరి సమస్యలు పరిష్కారమయ్యే వరకు తమ పోరాటాలు ఆపేది లేదని, సమ్మెను కొనసాగిస్తూనే ఉంటామన్నారు. నేటి నుంచి అన్ని జిల్లాల్లో వివిధ రకాల ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు, దీనికి సెకండ్ ఏఎన్ఎంలు హాజరై విజయంతం చేయాలని నాయకులు తోట రామాంజనేయులు, బడేటి వనజ, గాండ్ల మధురిమ, విజయ కుమారి పిలుపునిచ్చారు.

## వేద సభ పరీక్షలకు గుర్తింపునివ్వాలి



మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న వేదపండితులు, నిర్వాహకులు

**వెంకటేశ్వరకాలనీ:** శ్రీశ్రీశ్రీ జనార్ధనానంద సంస్కృతి స్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో 23వ వేద మహాసభలలో నిర్వహించే వేద పరీక్షలలో ఉత్తీర్ణులు అయిన వారికి దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగే నియామకాల్లో అవకాశాలు కల్పించాలని ట్రస్ట్ ప్రతినిధులు దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని కోరారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మంత్రిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ... గడచిన 23 సంవత్సరాలుగా చాతుర్వేద పరీక్ష, సంపూర్ణ పరీక్షలు, సంపూర్ణ శుక్ల యజుర్వేద హవనాలు నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది నవంబర్ 2 నుంచి 6వ తేదీ వరకు పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో వార్షిక వేద సభలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభలో రెండు తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన వేద పాఠశాల విద్యార్థులు, వేద పండితులు పాల్గొని తమ ప్రావీణ్యాన్ని ప్రదర్శించనున్నారని పేర్కొన్నారు. ఈ వేద సభల్లో ఉత్తీర్ణులయ్యే వారికి అందజేసే సర్టిఫికెట్లకు దేవాదాయ శాఖ గుర్తింపు ఇవ్వాలని శాఖ ఆధ్వర్యంలో నియమించే వేద పారాయణ, అర్చక ఉద్యోగాలు కల్పించేందుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు బ్రహ్మానంద శర్మ, అంజనేయ శర్మ, జగన్నాథ శర్మ, తెలంగాణ మతైక సభ్యుడు శ్రవణ్‌కుమార్ శర్మ, జ్యోతిశ్చంద్ర శర్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ధర్మప్రచార పరిషత్ చైర్మన్ రమణాచారికి కూడా వినతి పత్రం సమర్పించారు.

## చేనేత ఉత్పత్తులకు ప్రజాదరణ

**శ్రీనగర్‌కాలనీ:** చేనేత కళాకారులను ఉత్పత్తులకు అమితమైన ఆదరణ ఉందని, వారి కళలకు వెల కట్టలేమని గాయని సోని కోమండూరి, సంగీత దర్శకుడు సాకేత్ అన్నారు. ఆదివారం శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో కృతి వీవ్స్ అండ్ క్రాఫ్ట్స్ పేరిట ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను సింగర్ శృతి రంజని, ఏపీ పద్మశాలీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మాడ జానకితో కలిసి ప్రారంభించారు. ఈ ప్రదర్శనలోని చీరలు నగర ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకుంటుందన్నారు. ప్రముఖ నగరాలకు చెందిన చేనేతకళాకారులు వారి ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ ఆభరణాలు, పలు ఫ్యాన్సీవస్తువులను సుమారు 70 స్టాల్స్‌లో అందుబాటులో ఉంచారు. చేనేత కళాకారుల ఉత్పత్తులు నేరుగా వినియోగదారులకు చేరాలనే సదుద్దేశంతో ఈ వస్త్ర ప్రదర్శనను ఏర్పాటుచేశామని, ఈ నెల 27వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు యలమంచిలి శ్రీలత తెలిపారు.



వస్త్ర ప్రదర్శనలోని చీరలను తిలకిస్తున్న గాయని సోని, సంగీత దర్శకుడు సాకేత్

## థర్డ్ పార్టీ రిజిస్ట్రేషన్‌కు అనుమతించడంపై హర్షం

**రహమత్‌నగర్:** దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న సమస్యకు పరిష్కారం లభించడం ఎంతో ఆనందంగా ఉందని ఎస్ఆర్ఆర్‌పురం హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. బోరబండలోని షాహీద్ తుర్రేబాజ్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఎస్ఆర్ఆర్‌పురం హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు ఎం.ఎ.సత్తార్ మాట్లాడుతూ..."హౌసింగ్ సొసైటీ సభ్యులకు థర్డ్ పార్టీ రిజిస్ట్రేషన్‌కు ప్రభుత్వం అనుమతి ఇవ్వడం తమను ఎంతో ఆనందాన్ని కల్గించిందన్నారు. సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌లకు సొసైటీ సభ్యులు రుణపడి ఉంటారని ప్రకటించారు. జీవో–96తో బ్యాంకు రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. కో ఆపరేటివ్ సొసైటీ అధికారిణి మేహరాజున్నాసా, వైస్ ప్రెసిడెంట్ సత్తాజీ, సెక్రటరీ అహ్మద్‌అలీ, కోశాధికారి షేక్ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 'సెయింట్ ఆల్ఫోన్సస్' వార్షికోత్సవం

**వెంకటేశ్వరకాలనీ:** బంజారాహిల్స్ రోడ్ నెం. 9లోని సెయింట్ ఆల్ఫోన్సస్ చర్చి తొలివార్షికోత్సవ వేడుకలు ఆదివారం చర్చి ఆవరణలో వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా చిన్న పిల్లలకు దివ్యసప్రసాదం హైదరాబాద్ కార్డినల్ బిషప్ పూల ఆంథోని, విచారణ గురువు ఫాదర్ అర్ల, స్కూల్ ప్రిన్సిపాల్ ప్రేమ్ కుమార్ తదితరులు అందజేశారు. అనంతరం బంజారాహిల్స్ ఆల్ఫోన్సస్ పల్లకీని చర్చి ఆవరణలో ఊరేగింపుగా నిర్వహించారు. వేడుకల్లో భక్తులు, విశ్వాసకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చర్చి కమిటీ సభ్యులు శౌరి రాజు, రవీంద్రనాథ్, లారెన్స్, విక్టర్, రాజ్, ఆంటోని పాల్గొన్నారు.



### వేడుకగా బోనాలు

**వెంకటేశ్వరకాలనీ:** బంజారాహిల్స్ రోడ్ నెం.10లోని గౌరీశంకర్ కాలనీ పోచమ్మగుడి వద్ద గంగపుత్ర సంఘం బంజారాహిల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోనాల వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల సందర్భంగా బస్తీలో సందడి వాతావరణం నెలకొంది. గంగపుత్ర సంఘం అధ్యక్షుడు రవి, ఉపాధ్యక్షుడు చందర్, ప్రధాన కార్యదర్శి దేవదాసు పాల్గొన్నారు.

### రాజీవ్ గాంధీకి నివాళి



**ఫిలింనగర్:** మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని ఇందిరానగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నేతలు కార్యకర్తలు ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, సోమాజిగూడ డివిజన్ల అధ్యక్షుడు రాజు, కాటూరి రమేష్, నారికేళ్ల నరేష్, నేతలు శ్యాం, లడ్డు రాజు తదితరులు పాల్గొన్నారు.

### బాలిక అదృశ్యం

**వెంగళరావునగర్:** ఇంటి నుంచి కిరాణా షాపునకు వెళుతున్నానని బయలు దేరిన మైనర్ బాలిక అదృశ్యమైన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ఎల్లారెడ్డిగూడలో కిరాణాషాపు నిర్వహించే బొల్లి శ్రీనుకు తల్లిదండ్రులతోపాటు అక్క, ముగ్గురు చెల్లెళ్లు ఉన్నారు. తల్లిదండ్రులు ఊర్లో ఉంటుండగా మూడేళ్లుగా శ్రీను తన చెల్లెళ్లతో కలిసి ఒకే చోట నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం 8 గంటల సమయంలో శ్రీను చిన్న (17 ఏళ్ల మైనర్ బాలిక) చెల్లెలు షాపు వద్దకు వెళుతున్నట్టుగా మరో చెల్లికి చెప్పి ఇంటి నుంచి బయలుదేరింది. సాయంత్రం వరకు రాలేదు. దీంతో ఆందోళన చెందిన శ్రీను, అతని మిగిలిన చెల్లెళ్లు ఆమె కోసం తెలిసిన వారు, పరిసర ప్రాంతాల్లో వెతికినా స్పందన లేదు.

### 'ఆప్' నేతల పాదయాత్ర

**రహమత్‌నగర్:** ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) పిలుపు మేరకు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పాదయాత్రను ఆదివారం నుంచి ప్రారంభించినట్లు ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి, జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మహమూద్‌అలీ ప్రకటించారు. శ్రీరాంనగర్‌లో ఆయన పార్టీ నాయకులతో కలిసి పాదయాత్రను నిర్వహించారు. మహమూద్ అలీ మాట్లాడుతూ... ఢిల్లీ, పంజాబ్ తరహా తెలంగాణ రాష్ట్రంలోనూ సంస్కరణలు తెస్తామన్నారు. సమస్యలపై ఫోన్: 80800 28080కు మిస్డ్ కాల్ చేయాలని కోరారు.

## అభివృద్ధికి జై కొడుతున్న యువత

- బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు
- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

**ఫిలింనగర్:** జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని గౌతంనగర్ బస్తీకి చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి 50 మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు వేసి ఆహ్వానించిన అనంతరం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువత పార్టీలో చేరుతున్నారని అన్నారు. దళిత బంధు, బీసీ బంధు, మైనార్టీ బంధుతో పాటు గృహలక్ష్మి, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు పేద, మధ్య తరగతి ప్రజలు ఎంతో లబ్ధి పొందుతున్నారని అన్నారు. బీఆర్ఎస్‌లోనే యువకులకు అన్ని రకాలుగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. ఫిలింనగర్ 18 బస్తీలు పూర్తిగా బీఆర్ఎస్ వైపే ఉన్నాయని చెప్పారు. యువకులు పార్టీ సంక్షేమ పథకాలను అర్హుల చెంతకు తీసుకెళ్లాలన్నారు. యూత్ ప్రెసిడెంట్ వంశీకృష్ణ, చింటు, సాయి రమేష్, రాజు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. రాబోయే ఎన్నికల్లో దానం నాగేందర్‌ను 40 వేలకు పైగా మెజార్టీతో గెలిపిస్తామని ఈ సందర్భంగా యువకులు ప్రతిజ్ఞ చేశారు.



పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే దానం

## రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే: రోహిణ్‌రెడ్డి



ఇందిరానగర్‌లో పాదయాత్ర చేస్తున్న డాక్టర్ రోహిణ్‌రెడ్డి

**ఫిలింనగర్:** రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడం ఖాయమని.. రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి జోస్యం చెప్పారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు విసుగెత్తిపోయిన ప్రజలు తమ ఓటు అనే వజ్రాయుధంతో బీఆర్ఎస్ పార్టీ నేతలకు తగిన గుణపాఠం ఖాయమని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం ఆయన జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరానగర్ బస్తీలో ఇంటింటికీ పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలు తెలుసుకోవడంతో పాటు వారికి భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు కాగితాలకే పరిమితం అవుతున్నాయని అవి కేవలం బీఆర్ఎస్ కార్యకర్తలకు మాత్రమే అందుతున్నాయని ఆరోపించారు. సామాన్యులకు ఒక్క పథకం కూడా అందుబాటులో లేదని విమర్శించారు. ఏ పథకంలో లబ్ధిదారులు కావాలన్నా వేలాది రూపాయలు లంచాలు ఇవ్వాల్సి వస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో డివిజన్ల అధ్యక్షుడు కాటూరి రమేష్, నారికేళ్ల నరేష్, గొల్ల్యాల రాజు, స్థానిక నేతలు శ్యాం, లడ్డు రాజు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన బ్రహ్మోత్సవాలు

**వెంగళరావునగర్:** జీటీఎస్‌కాలనీలోని వీరాంజనేయ భవానీశంకర అయ్యప్ప స్వామి సాయిబాబా దేవస్థానం (జీటీఎస్ టెంపుల్)లో ఈ నెల 17న ప్రారంభమైన భవానీశంకర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరిరోజు ఉదయం 10 గంటలకు వివిధ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న చిన్నారులతో సరస్వతీ హోమాన్ని చేయించారు. అనంతరం జరిగిన దక్షిణామూర్తి హోమం, పూర్ణాహుతి, నీరాజన మంత్రపుష్పం, ఆశీర్వచనంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్ చిన్న రమేష్ కుటుంబ సభ్యులు, కమిటీ సభ్యులు, వెంగళరావునగర్‌కాలనీ, జవహర్‌నగర్, సిద్ధార్థనగర్‌కాలనీ, కళ్యాణ్‌నగర్‌కాలనీ, రాజీవ్‌నగర్, రహమత్‌నగర్, మధురానగర్‌కాలనీ, ఎర్రగడ్డ తదితర ప్రాంతాల నుంచి భక్తులు రావడంతో ఆలయం భక్తులతో కిక్కిరిసి పోయింది. నాలుగు రోజుల పాటు జరిగిన బ్రహోత్సవ కార్యక్రమాలను చైర్మన్ చిన్న రమేష్‌తో పాటుగా కమిటీ సభ్యులు సిహెచ్.శ్రీనివాస్, జి.లక్ష్మి, కిలారు నరసింహారావు, కె.వెంకటేశ్వర్లు, ఇ.కె.సత్యనారాయణ, పి.స్రవంతి, ఎక్స్ అఫీషియో మెంబర్ డి.దేవేందర్‌శర్మలు పర్యవేక్షించారు.



హోమంలో పాల్గొన్న భక్తులు

## వివరాలు అడిగినందుకు దాడి

**వెంగళరావునగర్:** బొగ్గుల వివరాలు అడిగినందుకు ఆగ్రహించిన ఓ వ్యక్తి ఒక విద్యార్థిని ముక్కుపై గుద్ది పారిపోయిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... రహమత్‌నగర్‌కు చెందిన మహ్మద్ అక్రముద్దీన్ అనే యువకుడు శనివారం రాత్రి 9 గంటల సమయంలో ఈస్ట్ రహమత్‌నగర్ సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద ఉన్న బొగ్గుల దుకాణంకు వచ్చాడు. అదే సమయంలో అహాషం ఖాన్ అనే వ్యక్తి కూడా బొగ్గుల దుకారణం దగ్గర నిలబడి ఉన్నాడు. అక్రముద్దీన్ అతనిని బొగ్గుల గురించి అడిగాడు. దానికి ఆగ్రహించిన అహోషం ఖాన్ ఆగ్రహించి నేను బొగ్గులు అమ్మేవాడిలా కనిపిస్తున్నానా అంటూ గొడవపడ్డాడు. దానికి యువకుడు క్షమించమని ప్రాధేయపడ్డాడు. అయినప్పటికీ ఆ వ్యక్తి వినకుండా యువకుడి ముక్కుపై తన తలతో బలంగా గుద్దాడు, ముఖంపై పిడిగుద్దులు గుద్దాడు. దాంతో యువకుడికి రక్తం కారడంతో ఆ వ్యక్తి అక్కడ నుంచి పరారయ్యాడు. యువకుడు ఈ విషయాన్ని తన సోదరునికి చెప్పి ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోగా ముక్కు విరిగిందని, సర్జరీ చేయించుకోవాలని వైద్యులు సూచించారు. ఈ దాడి కారణంగా కళ్లు కూడా సరిగా కనిపించడం లేదని, తనపై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పేకాట ఆడుతున్న ఏడుగురిపై కేసు

**వీకెండ్ కావడంతో సరదగా గది అద్దెకు తీసుకుని..**

**బంజారాహిల్స్:** వీకెండ్ కావడంతో సరదాగా గది అద్దెకు తీసుకుని పేకాడుతున్న ఏడుగురు పేకాటరాయుళ్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... బంజారాహిల్స్ రోడ్ నెం 14లోని కలెక్షన్స్ పేరుతో నడుస్తున్న ఓయో రూమ్స్‌లో స్థానికంగా నివాసం ఉంటున్న కొంతమంది యువకులు శనివారం రాత్రి గది అద్దెకు తీసుకున్నారు. ఏడుగురు యువకులు గదిలో మద్యం సేవిస్తూ సరదా కోసం పేకాడుతున్నారు. రాత్రి పదకొండున్నర ప్రాంతంలో ఓయో రూమ్స్‌లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. దాంతో పేకాడుతున్న ఏడుగురు యువకులను అదుపులోకి తీసుకుని వారివద్దనుంచి రూ. 63 వేలు, ప్లేయింగ్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. తాము ఇదే ప్రాంతంలో ఉంటామని, ఇంట్లో స్థలం లేకపోవడంతో మందు కొట్టేందుకు ఇక్కడకు వచ్చి సరదాగా పేకాడుతున్నామని, తమ జేబులోని డబ్బును పేకాటలో దొరికిన డబ్బుగా చూపించవద్దంటూ వారంతా నెత్తీనోరు మొత్తుకున్నారు. అయితే ఎక్కడ పేకాట ఆడినా అది నేరమే అంటూ వారిని టాస్క్‌ఫోర్సు పోలీసులు బంజారాహిల్స్ పోలీసులకు అప్పగించారు. వీరిపై గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ఘాట్ రోడ్డులో అదుపుతప్పి లోయలోకి దూసుకుపోయిన ఆర్టీసీ బస్సు

## చెట్టుకొమ్మను తప్పించబోయి.. లోయలోకి బస్సు!

- పాడేరు ఘాట్ రోడ్డులో విషాదం.. ఇద్దరి మృతి
- 28 మందికి గాయాలు..

సాక్షి, పాడేరు/పాడేరు రూరల్/సాక్షి, అమరావతి, నెట్‌వర్క్: విశాఖ నుంచి పాడేరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఘాట్ రోడ్డులో అదుపుతప్పి లోయలోకి దూసుకుపోయిన ప్రమాదంలో ఇద్దరు ప్రయాణికులు మృతి చెందారు. ఆదివారం మధ్యాహ్నం 34 మంది ప్రయాణికులతో బస్సు వెళుతోంది. పాడేరుకు 12 కిలోమీటర్ల దూరంలో ఘాట్‌లోని వ్యూపాయింట్ వద్ద మలుపులో రోడ్డు పక్కన చెట్టు కొమ్మలను తప్పించే ప్రయత్నంలో అదుపు తప్పింది. రక్షణ గోడను ఢీకొట్టి వందడుగుల లోయలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం సూర్రెడ్డిపాలెంకు చెందిన నరవ నారాయణమ్మ(50), అల్లూరి జిల్లా పాడేరు మండలం జి.కొత్తూరు గ్రామానికి చెందిన గిరిజనుడు సీసా కొండన్న(55) తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందారు. మరో 28 మంది గాయపడ్డారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖలోని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ దుర్ఘటన గురించి తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అక్కడకు చేరుకున్నారు. ఆర్టీసీ, పోలీస్ శాఖ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని సీఎం జగన్ ఆదేశించారని తెలిపారు. శాశ్వత అంగవైకల్యం పొందిన వారికి రూ.5 లక్షలు, గాయపడిన వారికి రూ.లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేస్తామన్నారు. పాడేరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మంత్రి పరామర్శించారు. అత్యవసర వైద్యం అవసరమైతే విశాఖ కేజీహెచ్ లేదా కార్పొరేట్ ఆస్పత్రులకు తరలించాలని, క్షతగాత్రులు పూర్తిగా కోలుకునే వరకు వైద్య సాయం అందించాలని స్పష్టం చేశారు. పాడేరు ఘాట్‌లో ప్రమాదాలు నివారించేందుకు రవాణ శాఖ అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపిస్తామన్నారు.

# ‘ఘోస్ట్’ చందా.. మార్గదర్శి దందా!

▶ మొదటి పేజీ తరువాయి

ఏ చిట్ ఫండ్స్ సంస్థలు, ప్రైవేటు బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు చేయని రీతిలో వినూత్న రీతిలో మార్గదర్శి సాగిస్తున్న ఆర్థిక అక్రమాలకు ఇది తాజా నిదర్శనం.

### ఇలా ఎందుకు చేశారంటే..

ఇక్కడ మార్గదర్శి చిట్ ఫండ్స్ ఇలా ఎలా చేసిందనే సందేహం రావడం సహజం. ఎలా అంటే సుబ్రహ్మణ్యం ఆధార్ కార్డును తమ ఏజంట్ల ద్వారా సేకరించి ఆయనకు తెలియకుండానే చిట్టీ గ్రూపులో చందాదారునిగా చేర్చింది. ఇలాంటి వారిని 'ఘోస్ట్ చందాదారులు' అని వ్యవహరిస్తారు. అంటే చందాదారులు లేకుండానే వారి పేరిట చిట్టీ గ్రూపుల్లో సభ్యత్వం కొనసాగిస్తారు. అయితే తాను చందాదారునిగా ఉన్నానని సుబ్రహ్మణ్యానికి తెలియదు కాబట్టి ఆయన చందా చెల్లించరు. ఆయన్ని ఎవరూ అడగరు కూడా. దాంతో అసలు విషయం బయటకు వచ్చే అవకాశమే లేదు. ఆయన పేరిట ఉన్న చిట్టీకి ప్రతి నెలా మార్గదర్శి చిట్ ఫండ్స్ యాజమాన్యం చందా చెల్లించకపోయినా, చెల్లించినట్టుగా రికార్డుల్లో నమోదు చేస్తుంది. ప్రతి నెల చందాదారునికి వచ్చే డివిడెండ్‌ను మాత్రం సుబ్రహ్మణ్యం పేరిట తానే తీసుకుంటుంది. ఒక నెల సుబ్రహ్మణ్యం పేరిట చిట్టీ పాట పాడతారు. ఆ చిట్టీ పాట మొత్తం (ప్రైజ్‌మనీ) మార్గదర్శి యాజమాన్యం తమ సొంత ఖాతాలో వేసుకుంటుంది. అంటే రూపాయి చందా చెల్లించకుండానే.. ప్రతి నెల డివిడెండ్ మొత్తం తీసుకోవడంతోపాటు చిట్టీ పాట పేరిట ప్రైజ్ మనీ కూడా కొల్లగొడుతోంది.

### ఇలా వెలుగు చూసింది..

మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయాల్లో సోదాల్లో భాగంగా సందేహం కలిగిన చందాదారులను స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారులు సంప్రదిస్తున్నారు. ఆ విధంగా సూళ్లూరుపేటకు చెందిన సుబ్రహ్మణ్యం చీరాలలో చిట్టీ గ్రూపులో సభ్యుడిగా ఉండటం ఏంటనే సందేహం వచ్చి అధికారులు సంప్రదించడంతో అసలు వ్యవహారం బట్టబయలైంది. మార్గదర్శి చిట్ ఫండ్స్‌కు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 37 బ్రాంచీల పరిధిలో ఇలాంటి ఘోస్ట్ చందాదారులు భారీగా ఉండొచ్చనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు. ఘోస్ట్ చందాదారుల దందాతోపాటు చందాదారులను దురుద్దేశంతో అప్పుల ఊబిలోకి నెట్టేస్తూ వారిని ఆర్థికంగా ఇక్కట్ల పాటు చేస్తోందని కూడా ఈ సోదాల్లో వెల్లడైంది. సీఐడీ అదనపు డీజీ సంజయ్, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రామకృష్ణ, సీఐడీ ఎస్పీ అమిత్ బర్దర్ మంగళగిరిలోని సీఐడీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఘోస్ట్ చందాదారులు, చందాదారులకు తెలియకుండానే వారిని ష్యూరిటీగా చూపించడం తదితర మోసాలకు పాల్పడిన ఫిర్యాదులతో మార్గదర్శి చిట్ ఫండ్స్‌పై మూడు కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. విలేకరుల సమావేశంలో వారు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.




### ఘోస్ట్ చందాదారులతో భారీగా అక్రమాలు

వ్యక్తులకు తెలియకుండానే వారి ఆధార్ నంబర్లు సేకరించి, చిట్టీ గ్రూపుల్లో సభ్యులుగా చూపిస్తున్నారు. ఆ విధంగా ఘోస్ట్ చందాదారుల పేరిట డివిడెండ్లతోపాటు చిట్టీ మొత్తాన్ని మార్గదర్శి చిట్ ఫండ్స్ తమ ఖాతాల్లో జమ చేసుకుంటూ మోసానికి పాల్పడుతోంది. ఇది చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధం. ఇతర చందాదారుల ప్రయోజనాలకు విఘాతం కూడా. ఎందుకంటే ఇతర చందాదారుల ఆర్థిక ప్రయోజనాలకు విరుద్ధంగా అంటే వారికి తక్కువ డివిడెండ్ వచ్చేలా చేస్తున్నారు. మరోవైపు ఘోస్ట్ చందాదారునికి ఎక్కువ వేలంపాట మొత్తం (ప్రైజ్‌మనీ) వచ్చేట్టుగా వేలం నిర్వహిస్తున్నారు.

### వందకుపైగా ఫిర్యాదులు

**చందాదారుల నుంచి ఫిర్యాదులు లేకుండానే మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలను స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారులు ఖండించారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ పాల్పడుతున్న మోసాలపై పెద్ద సంఖ్యలో చందాదారులు పోలీసులు, సీఐడీ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. మూడు రోజుల్లోనే దాదాపు వంద మందికిపైగా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అధికారులు వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటున్నారు. కాగా, చందాదారులు పూర్తి వివరాలతో ఫిర్యాదులు చేసేందుకు సీఐడీ విభాగం ప్రత్యేకంగా వాట్సాప్ నంబర్ 9493174065 కేటాయించింది.**

### అప్పుల ఊబిలోకి చందాదారులు

చిట్టీ గ్రూపు ప్రారంభంలోనే చందాదారుల నుంచి సంతకాలు తీసుకుని తమకు అనుకూలంగా మలచుకుంటున్నారు. ఏకంగా చందాదారుల ఆస్తులను తమ పేరిట రాయించుకోవడం మార్గదర్శి చిట్‌ఫండ్స్ దారుణాలకు నిదర్శనం. ముందుగా తీసుకున్న సంతకాలను దుర్వినియోగం చేస్తూ ఓ చందాదారునికి కనీసం సమాచారం ఇవ్వకుండానే ఆయన్ను మరో చందాదారునికి ష్యూరిటీగా రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. దాంతో చిట్టీ పాట పాడిన చందాదారుడు వాయిదాలు చెల్లించ లేదు కాబట్టి, ష్యూరిటీగా పేర్కొన్న చందాదారుడు చెల్లించాలని రికార్డుల్లో చూపిస్తున్నారు. ఓ చిట్టీ పాట పాడిన చందాదారు ప్రైజ్‌మనీ తీసుకుని రెండు వాయిదాలు చెల్లించిన తర్వాత మిగిలిన వాయిదాలు చెల్లించకపోతే.. ఆ చిట్టీ పాటను రద్దు చేసి సంబంధిత నెలకు కొత్తగా చిట్టీ పాట నిర్వహించాలని చట్టం చెబుతోంది. కానీ దీన్ని మార్గదర్శి చిట్ ఫండ్స్ పట్టించుకోవడం లేదు. చిట్టీ వాయిదాలు చెల్లించలేని చందాదారులతో మాట్లాడి వారిని మరో చిట్టీ గ్రూపులో సభ్యులుగా చేరుస్తోంది. ఆ కొత్త గ్రూపులో డివిడెండ్‌తో పాత గ్రూపు వాయిదాలు చెల్లించవచ్చు అని చెబుతోంది. ఇలా ఒక చందాదారుని లెక్కకు మించి చిట్టీ గ్రూపుల్లో చందాదారుగా చూపిస్తోంది. దాంతో ఆ చందాదారు మార్గదర్శి చిట్ ఫండ్స్‌కు భారీగా బకాయిలు పడేట్టు చేస్తోంది. అతి సామాన్య పూజారిని ఏకంగా 22 చిట్టీ గ్రూపుల్లో చందాదారునిగా చేర్చారు. మరో వ్యక్తిని ఏకంగా 60 చిట్టీ గ్రూపుల్లో చందాదారునిగా చేర్చినట్టు చెప్పారు. కానీ ఆయన ఏకంగా 90 చిట్టీ గ్రూపుల్లో చందాదారునిగా చూపించినట్టు సోదాల్లో వెల్లడైంది. ఇలాంటి అక్రమాలకు అంతే లేదు. ఆ చందాదారుడు ఓ చిట్టీలో పాటపాడినప్పటికీ అతి తక్కువ అంటే నామమాత్రంగానే ప్రైజ్‌మనీ పొందుతున్నారు. ఎంతగా అంటే రూ.50 లక్షల చిట్టీ గ్రూపులో సభ్యుడైన ఓ చందాదారుడు రూ.46 లక్షలకు చిట్టీ పాట పాడితే ఆయనకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ చేతికి ఇచ్చింది కేవలం రూ.20 మాత్రమే. మరో చందాదారుడు రూ.18 లక్షలకు చిట్టీ పాట పాడితే చేతికి వచ్చింది కేవలం రూ.200. మార్గదర్శి చిట్ ఫండ్స్‌లో ఇలాంటి అక్రమాలు కుప్పలు కుప్పలుగా బయటపడుతున్నాయి.

### 3 చోట్ల చీటింగ్ కేసులు నమోదు

చీరాల, అనకాపల్లి, రాజమహేంద్రవరం టూ టౌన్ పోలీస్ స్టేషన్లలో మార్గదర్శి చిట్ ఫండ్స్‌పై మూడు కేసులు నమోదు చేశారు. మూడు చోట్ల బ్రాంచి మేనేజర్లు (ఫోర్‌మెన్)లతోపాటు మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమన్యాంపై వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఆ మూడు బ్రాంచిల మేనేజర్లను సీఐడీ అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వారిని అరెస్టు చూపించి న్యాయస్థానంలో హాజరు పరుస్తామని సీఐడీ అదనపు డీజీ సంజయ్ తెలిపారు.

- ▶ సూళ్లూరుపేటకు చెందిన సుబ్రహ్మణ్యానికి తెలియకుండా ఆయన్ను చీరాలలో చందాదారునిగా నమోదు చేసినందుకు చీరాల పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు.
- ▶ అనకాపల్లికి చెందిన బి.వెంకటేశ్వరరావు నెలకు రూ.10 వేలు చొప్పున చందా చెల్లిస్తూ చిట్టీ గ్రూపులో చేరారు. 50 నెలల చందాలు చెల్లించిన తర్వాత ఆయన రూ.4,61,989కు చిట్టీ పాడారు. ఆయన ఎన్నిసార్లు మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రైజ్‌మనీ ఇవ్వలేదు. ఎట్టకేలకు ఆయనకు రూ.20 మాత్రమే వస్తుందని చెప్పారు. మిగిలిన మొత్తం ఆయన ష్యూరిటీ ఇచ్చిన మిగిలిన చిట్టీల్లో సర్దుబాటు చేసినట్టు చూపారు. అసలు తాను ఎవరికీ ష్యూరిటీ ఇవ్వలేదని చెప్పినా, బ్రాంచి మేనేజర్ వినిపించుకోలేదు. ఆయన సంతకాలు ఫోర్జరీ చేసిన పత్రాలు చూపించారు. ఆ కాపీలు కావాలని అడిగినా సరే ససేమిరా అన్నారు. దాంతో వెంకటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.
- ▶ కోరుకొండ విజయ్‌కుమార్ అనే చందాదారుడు మార్గదర్శి చిట్‌ఫండ్స్ రాజ మహేంద్రవరం బ్రాంచిలో రూ.5 లక్షల చిట్టీ గ్రూపులో చేరారు. కొన్ని వాయిదాలు చెల్లించాక 2020 జూన్‌లో రూ.3 లక్షలకు చిట్టీ పాట పాడారు. కానీ ఆయనకు ప్రైజ్‌మనీ ఇచ్చేందుకు మార్గదర్శి చిట్ ఫండ్స్ మేనేజర్ తిరస్కరించారు. విజయ్ కుమార్ తన స్నేహితుడు మల్లి కార్జున రావుకు 2019లో ష్యూరిటీ ఇచ్చారని, ఆ స్నేహితుడు వాయిదాలు చెల్లించడం లేదు కాబట్టి ఆయనకు ప్రైజ్‌మనీ ఇవ్వమని చెప్పారు. అసలు మల్లికార్జునరావు చిట్టీ మొత్తం గడువు తీరనే లేదని తెలిసింది. తనను మార్గదర్శి చిట్ ఫండ్స్ యాజ మాన్యం మోసం చేసిందని విజయ్‌కుమార్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

### మార్గదర్శి ఓ ‘నల్ల’ ఖజానా

- బ్రాంచి మేనేజర్ల పేరిట భారీగా బినామీ ఆస్తులు
- ఓ మేనేజర్ పేరిట రూ.100 కోట్ల ఆస్తి
- రూ.కోటి డిపాజిట్‌కు పైబడి వెయ్యి ఖాతాలు

మార్గదర్శి చిట్ ఫండ్స్ నల్ల కుబేరుల అడ్డా అన్నది బట్టబయలైంది. తవ్వేకొద్దీ అక్రమాలు పుట్టలు పుట్టలుగా వెలుగు చూస్తున్నాయి. రాష్ట్రంలో అక్రమ సంపాదనను దాచుకునేందుకు రామోజీరావు సృష్టించిన ఓ మినీ స్విస్ బ్యాంకు అని ఆధారాలతో స్పష్టమవుతోంది. ఉభయతారకంగా నల్లకుబేరులు, రామోజీరావు ఈ బ్లాక్ మనీ దందా సాగిస్తున్నారన్నది తేటతెల్లమవుతోంది. మరోవైపు మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి మేనేజర్లు చందదారుల సొమ్మును భారీగా తమ సొంతానికి మళ్లించుకున్న గుట్టు కూడా రట్టు అవుతోంది. శని, ఆదివారాల్లో స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారుల సోదాల్లో ఈ వ్యవహారం వెలుగు చూసింది. మనీ లాండరింగ్ జరుగుతున్నట్టుగా వెల్లడి కావడం గమనార్హం. రూ.కోటి కంటే అధికంగా చిట్టీలు వేసిన, అక్రమ డిపాజిట్లు చేసిన వారు దాదాపు వెయ్యి మంది వరకు ఉన్నట్టు ఇప్పటి వరకు గుర్తించినట్టు సమాచారం. వారి మార్గదర్శి లెడ్జర్ పుస్తకాల్లోగానీ, ఆ చందాదారులకు ఇచ్చిన పాస్‌బుక్‌లోగానీ వారి పాన్ నంబర్లు, ఆధార్ నంబర్లు నమోదు చేయనే లేదన్నది వెల్లడైంది. కొందరు చందాదారులను సీఐడీ అధికారులు పిలిచి విచారించగా వారికి అన్ని కోట్ల రూపాయలు ఏలా వచ్చాయన్నది చెప్పలేకపోయారు. పాన్ కార్డు, ఆధార్ కార్డు వివరాలను ఆన్‌లైన్ ఖాతాల్లో ఎందుకు లింక్ చేయలేదని మార్గదర్శి చిట్ ఫండ్స్ బ్రాంచి మేనేజర్లను ప్రశ్నిస్తే వారు విస్మయకర సమాధానమిచ్చారు. ఈ అక్రమాల్లో మేనేజర్లు కీలక పాత్ర పోషిస్తున్నట్టు స్పష్టమైంది. రాష్ట్రంలోని ముఖ్య పట్టణంలోని ఓ బ్రాంచి మేనేజర్‌ను పోలీసులు ఇటీవల అరెస్టు చేశారు. దాంతో రామోజీరావుతోసహా మొత్తం మార్గదర్శి చిట్ ఫండ్స్ యాజమాన్యం హడలెత్తిపోయింది. ఆ మేనేజర్, ఆయన కుటుంబ సభ్యుల పేరిట దాదాపు రూ.100 కోట్ల వరకు ఆస్తులు ఉన్నట్టు వెల్లడైంది. ఈ మేనేజర్ చాలా మంది పెద్దలకు బినామీ అన్నది స్పష్టమవుతోంది. ఇలా పలువురు మేనేజర్లు ఉన్నట్టు సమాచారం. కాగా, కొందరు బ్రాంచి మేనేజర్లు చందాదారుల చందా మొత్తాలను తమ సొంతానికి వాడుకుంటున్నట్టు కూడా వెల్లడైంది. విశాఖపట్నంలో దీనిని నిర్ధారించారు. ఇతర బ్రాంచి కార్యాలయాల్లో ఆరా తీస్తున్నారు. పలు చోట్ల అవకతవకలకు సంబంధించి లెడ్జర్ ఖాతాలు, చిట్టీ పాటల మినిట్స్ పుస్తకాలు స్వాధీనం చేసుకున్నారు.

---

**నగర వార్తలు**

### నేడు ఆర్ కృష్ణయ్యకు ప్రజా ఉద్యమ సమ్రాట్ అవార్డు ప్రదానం

చిక్కడపల్లి: బీసీ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు ఎంపీ ఆర్.కృష్ణయ్యకు ప్రజా ఉద్యమ సమ్రాట్ అవార్డును ప్రదానం చేస్తున్నట్లు శ్రుతిలయ ఆర్ట్స్ నిర్వాహకులు, ప్రముఖ గాయని ఆమని తెలిపారు. రవీంద్రభారతిలో సోమవారం మధ్యాహ్నం జరిగే కార్యక్రమంలో జయహో పోలీస్ శీర్షికతో యూనియన్ హోమ్‌మినిస్టర్స్ మెడల్ 2023 పొందిన బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐడీ భూపతి శ్రీనివాసరావు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎం.జితేందర్‌రెడ్డి, గ్రేహౌండ్స్ అదనపు ఎస్‌పి వేంకటేశ్వర్‌రావు తదితరులకు ప్రతిష్ఠాత్మక ప్రైడ్ ఇండియా 2023 అభినందన పురస్కారాలు హోమ్ మంత్రి మహమూద్ ఆలీ చేతుల మీదుగా ప్రదానం చేస్తామన్నారు.

### లాభాలిస్తామంటూ రూ.కోట్లల్లో వసూలు..

మాదాపూర్ : పెట్టుబడిదారులకు ఇచ్చిన డబ్బును చెల్లించక పోవడంతో ఇంటిపై దాడి చేసిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. మాదాపూర్ ఇన్స్‌పెక్టర్ ఎన్.తిరుపతి తెలిపిన మేరకు.. భీమవరానికి చెందిన పి. కృష్ణంరాజు మాదాపూర్‌లోని డిఎస్ఆర్ ఫార్చ్యూన్ ప్రైమ్ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్నారు. కృష్ణంరాజు , జి. రాంబాబు అనే వ్యక్తితో కలసి రాధారామ్ మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని ఏర్పాటు చేసి పెట్టుబడి దారులను ఆకర్షించేందుకు పెట్టుబడి పెట్టిన వారికి 10నుంచి 20శాతం వరకు చెల్లిస్తామని చెప్పి కోట్లల్లో వసూలు చేశారు. తిరిగి ఇవ్వక పోవడంతో పెట్టుబదుదారులు ఇంటిపై దాడి చేశారు. ఆ తరువాత పి.కృష్ణంరాజు ఇంటినుంచి వెళ్ళిపోయాడు. ఈ సంఘటనపై భార్య పి.విజయలక్ష్మి మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### బెస్ట్ చెఫ్ పోటీల విజేత శృతి



సాక్షి, సిటీబ్యూరో: నగర వ్యాప్తంగా ఉన్న గేటెడ్ కమ్యూనిటీ నివాసిత గృహిణుల పాకశాస్త్ర ప్రావీణ్యానికి అద్దం పడుతూ సాగిన చెఫ్ పోటీలు ముగిశాయి. ఈ పోటీలో బెస్ట్ చెఫ్‌గా జయభేరీ సమ్మిట్ నివాసి శృతి త్రిపాఠి గెలుపొందగా ఆ తర్వాత స్థానాల్లో నెక్లెస్ రైడ్ నివాసి మౌసమి, జనప్రియ మెట్రోపొలిస్ నివాసి లలిత్ ఆదిత్యలు నిలిచారు. గచ్చిబౌలిలోని హిల్ రిడ్జ్ ప్రింగ్స్ కమ్యూనిటీ ప్రాంగణంలో ఆదివారం ఫైనల్ పోటీలు జరిగాయి. నగరం లో పలు హై రైజ్ గేటెడ్ కమ్యూనిటీలో జరిగిన ఆడిషన్ లలో ఎంపికైన 30 మంది గృహిణులు ఈ గ్రాండ్ ఫినాలే లో పోటీ పడ్డారు. తమ అసాధారణమైన వంట నైపుణ్యాలను ప్రదర్శించి న్యాయమూర్తులను ఆకట్టుకున్నారు.

## గాంధీ వైద్యుల మరో ముందడుగు

- బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తినుంచి లివర్ సేకరించిన వైద్యులు
- ఉస్మానియాలో మరో వ్యక్తికి ట్రాన్స్‌ప్లాంట్
- అభినందించిన మంత్రి హరీష్ రావు




గాంధీఆస్పత్రి : బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తికి చెందిన కాలేయాన్ని సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి వైద్యులు సేకరించి ఉస్మానియా ఆస్పత్రికి తరలించి అక్కడ చికిత్స పొందుతున్న మరో వ్యక్తికి అమర్చారు. గాంధీ సూపరింటెండెంట్ రాజారావు తెలిపిన వివరాల ప్రకారం... గాంధీఆస్పతితో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి బ్రెయిన్‌డెడ్‌అయ్యాడు. అతని కుటుంబసభ్యుల అంగీకరించడంతో బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి శరీరం నుంచి పలు అవయవాలు సేకరించాలని వైద్యులు నిర్ణయించారు. లివర్ ఒక్కటే పూర్తిస్థాయిలో పనిచేస్తుందని, మిగతా అవయవాల పనితీరు బాగోలేదని వైద్యపరీక్షల్లో తేలింది. జీవన్‌దాన్‌లో నమోదు చేసుకున్న జాబితా ప్రకారం ఏబీ బ్లడ్ గ్రూపుకు చెంది లివర్ సమస్యతో బాధపడేవ్యక్తి ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తేలింది. గాంధీ వైద్యులు బ్రెయిడ్ డెడ్ అయిన వ్యక్తి శరీరం నుంచి లివర్‌ను సేకరించి (రిట్రీవల్) ప్రత్యేక వాహనంలో ఉస్మానియా ఆస్పత్రికి తరలించి, అక్కడ చికిత్స పొందుతున్న మరోవ్యక్తికి (ట్రాన్స్‌ప్లాంట్) అమర్చారు. లివర్‌ను సేకరించడం ఇదే గాంధీఆస్పత్రిలో మొదటిసారని వివరించారు. గాంధీ ఆస్పత్రిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో లివర్‌ను విజయవంతంగా సేకరించి మరో వ్యక్తికి అమర్చి పునర్జన్మ ప్రసాదించిన గాంధీ సూపరింటెండెంట్ రాజారావు, గాంధీ, ఉస్మానియా వైద్యులు, సిబ్బందిని వైద్యమంత్రి హరీష్‌రావు అభినందించారు.

## హస్తకళా ప్రదర్శన ప్రారంభం



వస్త్ర ప్రదర్శనను తిలకిస్తున్న డిప్యూటీ స్పీకర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి

బంజారాహిల్స్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేనేత కళాకారులను అన్ని విధాలా ప్రోత్సాహన్నిస్తోందని, ప్రతిఒక్కరూ చేనేత వస్త్రాలను తప్పక కొనుగోలు చేసి ధరించి వారికి చేయూతను అందించి మన కళలను భావితరాలను అందించాలని నగర డిప్యూటీ మేయర్ ఎం. శ్రీలత శోభన్‌రెడ్డి అన్నారు. ఆదివారం బంజారాహిల్స్ రోడ్ నెం-12లోని కళింగ కల్చరల్ హాల్‌లో జగ్దీశ్వర్ హస్తకళా ఎక్స్‌పో ఆధ్వర్యంలో హ్యాండ్లూమ్ ఇండియా పేరిట ఏర్పాటు చేసిన వస్త్ర ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు ప్రతి సోమవారం ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు చేనేత వస్త్రాలను ధరిస్తున్నామని తెలిపారు. ఇక్కడ తెలంగాణ సంప్రదాయ వస్త్రాలతో పాటు పలు రాష్ట్రాల చేనేతకారుల ఉత్పత్తులను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేతకళాకారులు తమ ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ చీరలతో పాటు పలు ప్యాన్సీవస్తువులను సుమారు 60 స్టాల్స్‌లో ప్రదర్శిస్తున్నారు. ఈ ప్రదర్శన ఈ నెల 28వ తేదీ వరకు కొనసాగుతుంది.

## దృవాన్ష్ బృందాన్ని అభినందించిన ఎమ్మెల్సీ కవిత



మధులిక చౌదరిని సత్కరించిన ఎమ్మెల్సీ కవిత

మణికొండ: ప్రస్తుత పరిస్థితిలో మన పర్యావరణంతో, జీవకారుణ్యం, చెరువులను పరిరక్షించుకోవటం ఎంతో అవసరమని అలాంటి పనిని చేపట్టి నీతి అయోగ్ గుర్తింపు పొందటం అభినందనీయమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ చిన్నచెరువును దత్తత తీసుకుని అభివృద్ధి చేసిన దృవాన్ష్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు మధులిక చౌదరితో పాటు సభ్యులను ఆమె ఆదివారం ప్రత్యేకంగా అభినందించారు. నెక్నాంపూర్ చెరువు వద్ద చేపట్టిన పనులు, పెరిగిన పర్యావరణం, మురుగునీటి, శుద్ధి, ఫ్లోటింగ్ ఐలాండ్, నీటిలో ఆక్సిజన్ పెంచిన విధానాలను అడిగి తెలుసుకున్నారు. అదే తరహాల్లో నగరంలోని హుస్సేన్ సాగర్‌ను పరిశుభ్రంగా మార్చే అవకాశం ఉంటుందా అని అడిగి తెలుసుకున్నారని మధులిక చౌదరి పేర్కొన్నారు. త్వరలోనే నెక్నాంపూర్ చెరువును పరిశీలించేందుకు వస్తానని తెలిపారని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో దృవాన్ష్ సంస్థ కార్యదర్శి నీరజ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## మెడికవర్ ఉమెన్,చైల్డ్ హాస్పిటల్ ప్రారంభం



మెడికవర్ ఉమెన్, చైల్డ్ ఆసుపత్రి ప్రారంభ కార్యక్రమంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మాదాపూర్: హైటెక్ సిటీ మెటల్ చార్మినార్ ఎదురుగా మెడికవర్ ఉమెన్, చైల్డ్ హాస్పిటల్‌ను అత్యాధునిక సదుపాయాలతో ఆదివారం ప్రారంభించారు. శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ చైర్మన్ రామలింగేశ్వరరావు, సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, మెడికవర్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ కృష్ణలు ప్రారంభించారు. ఈసందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. ప్రజలకు అత్యాధునిక సదుపాయాలతో అనుభవజ్ఞులైన వైద్యులు సేవలందిస్తూ ప్రజల మన్నలను పొందడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇక్కడ ప్రత్యేకంగా స్త్రీలు, చిన్నపిల్లలకు వైద్యం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ డీజీపీ అనురాగ్‌శర్మ, టీఎస్ఆర్టీసీ ఎండీసజ్జనార్ పాల్గొన్నారు.

### మణిపూర్‌లో శాంతిభద్రతలను పునరుద్ధరించాలి

గోల్కొండ: మణిపూర్‌లో వెంటనే శాంతిభద్రతలను పునరుద్ధరించాలని ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ దిమోల్ అకోయి జామ్ అన్నారు. ఆదివారం గోల్కొండ తారామతి-బారాదారి ఆడిటోరియంలో మణిపూర్ ప్రజలకు సంఘీభావంగా ఒకరోజు కాన్ఫరెన్స్ జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ మణిపూర్‌లో 130 రోజులుగా హింసాకాండ కొనసాగుతుందని ఈ హింసాకాండలో 70 వేల మంది నిరాశ్రయులయ్యారన్నారు. మణిపూర్‌లో వెంటనే సాధారణ పరిస్థితులు నెలకొనేలా చర్యలుతీసుకోవాలని ఆయన కోరారు. హైదరాబాద్ మణిపూరి సొసైటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

## అమెరికన్ ఫుట్‌బాల్ టైటిల్ విజేత తెలంగాణ జట్టు



అమెరికన్ ఫ్లాగ్ ఫుట్‌బాల్ టైటిల్ సాధించిన తెలంగాణ జట్టు

రసూల్‌పురా: సికింద్రాబాద్ కంటోన్మెంట్ జింఖానా మైదానంలో అమెరికన్ ఫ్లాగ్ ఫుట్‌బాల్ 2023 జాతీయస్థాయి పోటీలు ఆదివారం జరిగాయి. ఈ పోటీల్లో పురుషుల తెలంగాణ జట్టు 16-8 గోల్స్‌తో కేరళ జట్టుపై, మహిళల విభాగంలో రాజస్థాన్ 8-6 గోల్స్‌తో యూపి జట్టుపై ఘన విజయంతో టైటిల్ సాధించారు. ఐఓఏ మాజీ సంయుక్త కార్యదర్శి మహారాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ, భారత దేశంలో అమెరికన్ ఫుట్‌బాల్ ఫౌండర్ నామ్‌దేవ్ శిర్గావ్‌కర్, ఏఎఫ్ ఎఫ్ఐ సీఈవో డాక్టర్ సందీప్ చౌదరి, తెలంగాణ జట్టు కోచ్ ప్రవీణ్ రెడ్డి చింతల పాల్గొన్నారు. కాగా ఘన విజయం సాధించిన తెలంగాణ జట్టు క్రీడాకారులు వీర మణికంఠరెడ్డి, సుధీర్ బోయిన్. తరుణ్ కుమార్, శివ, సుధీర్ గౌడ్, గౌస్‌బాషా, కార్తీక్ గణేష్, పంకజ్, సంతోష్, నిఖిల్, కేతన్, అవనీష్, భరత్ లను ఫ్లాగ్ ఫుట్‌బాల్ బ్రాండ్ అంబాసిడర్ కౌటిక్ విఠల్, నామ్‌దేవే శిర్గావ్‌కర్ అభినందించారు.

## అవసరమైతే ప్రగతి భవన్ ముట్టడిస్తాం

- పీసీసీ మాజీ అధికార ప్రతినిధి రమ్యారావు

సాక్షి,సిటీ బ్యూరో: అధికార పక్షం అండతో భూబకాసురులు సామాన్య మధ్యతరగతి వర్గాల వారి నుంచి బలవంతంగా లాక్కున్న ఇంటి స్థలాలను తిరిగి ఇప్పించకుంటే అవసరమైతే ప్రగతి భవన్ ముందు బాధితులతో కలిసి ఆందోళనకు దిగుతామని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ అధికార ప్రతినిధి రమ్యారావు హెచ్చరించారు. ఆదివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హ్యాపీ హోమ్స్ సాగర్ హిల్స్ బాధితులతో కలిసి మాట్లాడారు. సొంత గూడు కోసం పైసా.. పైసా కూడ గట్టి, అప్పులు చేసి కొనుగోలు చేసిన రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు కలిగిన స్థలాలను బలవంతంగా స్వాధీనం చేసుకొని అక్రమంగా విల్లాలు నిర్మిస్తున్నారని ఆరోపించారు. సీఎం కోటరీగా చెలామణి అవుతున్న కొందరు భూ బకాసురులుగా మారారని విమర్శించారు. తొమిదేళ్ల క్రితం గజం భూమి లేని వారు ప్రస్తుతం వందల ఎకరాలకు భూస్వాములుగా ఎదిగారని దుయ్యబట్టారు. రాష్ట్ర రాజధానిలో భూ అక్రమణలు పెరిగిపోయాయని, ప్రభుత్వ భూములనే కాకుండా ప్రైవేటు భూములు సైతం అధికార బలం, అంగ బలంతో బలవంతంగా లాక్కుంటున్నాని ఆరోపించారు.

### అక్రమంగా విల్లాల నిర్మాణం

నగర శివారులోని రాజేంద్రనగర్ మండలం బుద్వేల్ గ్రామంలో ప్రైవేటు స్థలాలు లాక్కొని అక్రమంగా విల్లాలు నిర్మిస్తున్నారని రమ్యారావు ఆరోపించారు. ఇందుకు పోలీసు, రెవెన్యూ అధికారుల సహకరిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో హ్యాపీ హోమ్స్ సాగర్ హిల్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సయ్యద్ హిదాయతుల్లా షఫీ, ఆహ్మద్ సర్ఫారాజ్ సిద్దిఖీతోపాటు స్థలాల యాజమానులు పాల్గొన్నారు.



# మనిషి... మనుగడ

మంచిమాట

మనుగడ అనేది ప్రతి మనిషికీ ఉంటుంది. మనిషికి మాత్రమే మనుగడ ఉంటుందా? ప్రతి జీవికీ మనుగడ ఉంటుంది. ఏ జీవి మనుగడ దానిదే. కొన్ని జంతువుల మనుగడ మనిషికి కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రతి మనిషి మనుగడా తనకు, సమాజానికి ప్రయోజనకరం గానే ఉండాలి; ప్రయోజనకరంగా ఉండేందుకు మనిషి తన మనుగడను ఒక అవకాశంగా తీసుకుని, చేసుకుని ప్రయత్నించాలి.

మనుగడ ప్రయోజనకరంగా పరిణమించడానికి ఏ మనిషికి ఐనా మెదడు, మనసు ఈ రెండూ కీలకం ఐనవి. మనసు తిన్ననైంది కాకపోవడం మాత్రమే మనిషికి లోటు కాదు; మెదడు సరిగ్గా పనిచెయ్యక పోవడం మాత్రమే మనిషికి లోటు కాదు. మెదడుకు మనసు లేకపోవడమే, మనసుకు మెదడు లేకపోవడమే మనిషికి లోతైన లోటు! మెదడుకు మనసు ఉండాలి; మనసుకు మెదడు ఉండాలి. మెదడు, మనసు కలిసి ఉద్యుక్తం ఐతే, ఉన్ముఖం ఐతే, ఉద్యమిస్తే ఉన్నతం ఐన ఫలితం వస్తుంది. మనుగడ ఉచ్ఛస్థితికి చేరుతుంది.

సగటు మనిషి తన చేతిలోనే తాను ఓడిపోతూ ఉంటాడు; తన ప్రవర్తనవల్ల తాను సరిగ్గా ఉండడం జరగదు సగటు మనిషికి; చేసిన లేదా జరిగిన తప్పులు దిద్దుకోబడడం ఉండదు చాల మంది విషయంలో; చెడిపోవడం అన్నది చెరిగిపోవడం జరగడం లేదు పలువురిలో. వీటికి కారణం మెదడుకు మనసు లేకపోవడమే; మనసుకు మెదడు లేకపోవడమే.

> మనిషికి మెదడు, మనసు ఉంటాయి. అవి సరిగ్గా, మెరుగ్గా ఉంటే మనిషి సరిగ్గా, మెరుగ్గా ఉంటాడు; అవి మేలుగా ఉంటే మనిషి మేలుగా ఉంటాడు. మెదడు, మనసు రెండూ కలిసి జతగా పనిచేస్తూ ఉంటేనే మనిషి గొప్ప స్థితిని, స్థాయిని, గతిని ఆపై ప్రగతిని పొందుతూ ఉంటాడు.

మనిషి మెదడు, మనసు ఎప్పుడూ ఖాళీగా ఉండవు. ఏవేవో, ఎన్నెన్నో వాటిలో ఉంటూ ఉంటాయి. అవసరం ఐనవి తక్కువగా, ఎక్కువగా అనవసరం ఐనవి మెదడు, మనసుల్లో ఉండి మనిషి మనుగడ మందమైపోవడానికి, మొద్దుబారిపోవడానికి కారణాలు ఔతూ ఉంటాయి. మెదడు, మనసుల పనితీరువల్లే మనిషికి మేలు, కీడులు కలుగుతూ ఉంటాయి; మనిషిని పనికి వచ్చేట్టుగానూ, పనికిరానట్టుగానూ చేసేవి మెదడు, మనసులే.

మెదడుకు మనసును, మనసుకు మెదడును నేర్పుతో అనుసంధానం చేసుకోవడమూ, ఆ అనుసంధానంతో దైనందిన జీవనాన్ని ఎదుర్కోవడమూ తెలిసిన మనిషికి అభివృద్ధి అలవడుతుంది. మనిషి అభివృద్ధిని అలవాటు చేసుకోవాలి; మనిషికి అభివృద్ధిలో అభినివేశం ఉండి తీరాలి. అభివృద్ధిలేని మనిషి అక్కరకురాని మనిషి ఔతాడు ఆపై అక్కర్లేని మనిషి ఔతాడు. మనిషి మనుగడ అనవసరం ఐంది, పనికిరాంది కాకూడదు; మనిషి మనుగడ వెలవెలపోకూడదు. మనిషి మనుగడ విలువైంది కావాలి. మనిషి తన మనుగడకు తానే విలువను, వన్నెను సమకూర్చుకోవాలి. మెదడు, మనసుల్ని సంయుక్తంగా సంప్రయోగించి మనిషి తన మనుగడను విజయవంతంగా నడుపుకోవాలి.

'తిండిని వెతుక్కుంటూ రోజూ తిని/ ఏవేవో అల్పమైన కథలు చెప్పుకుని/ మనసు ఒడిలి బాధల్ని అనుభవించి/ ఇతరుల్ని బాధించేవెన్నో చేసి/ తల నెఱుపు వచ్చి ముసలితనాన్ని పొంది/ ఘోరమైన మరణానికి బలై / మాసిపోయే పలు విదూషకుల్లా నేను కూలిపోతాననుకున్నావా?' అని, అని తమిళ్ కవి సుబ్రమణియ బారతి పేలవంగా ఉండడాన్ని తిరస్కరించారు. కూలిపోయేందుకు కాకుండా, విదూషకత్వంతో కాకుండా, మాసిపోయేందుకు కాకుండా, ఇతరుల్ని బాధించేందుకు కాకుండా, బాధల్ని అనుభవిస్తూ ఉండేందుకు కాకుండా, అల్పుడుగా కాకుండా, ఏదో తింటూ కాలం గడిపేందుకు కాకుండా మిన్నగా మసలేందుకు, మిన్నులా ఎత్తుల్లో నిలిచేందుకు మెదడుతో మనసును, మనసుతో మెదడును సంయుక్తం చేసుకుని మనిషి కార్యాచరణకు పూనుకోవాలి.

మనిషి మనుగడ ప్రయోజనకరంగా ఎందుకు ఫలించకూడదు? మనిషి తన మనుగడను పట్టుదలతో ప్రయోజనకరం చేసుకోవాలి. మెదడు, మనసుల సమన్వయంతో, సంయోగంతో మనిషి సంపూర్ణంగా సఫలం అవాలి. మనిషి తన మనుగడకు సత్ప్రయోజనాన్ని సాధించుకోవాలి; సమాజానికీ సాధ్యం ఐనంత ప్రయోజనకరంగా మనిషి మెదులుతూ ఉండాలి.

– రోచిష్మాన్

సన్నిధి

వాగ్గేయకార వైభవం




# ఓం శాంతిః శాంతిః శాంతిః

మీరు ఎన్నిక్రతువులు చేయండి, ఎన్ని పూజలు చేయండి, యజ్ఞాలు చేయండి... చివరకు మీరు కోరుకునేది ఏది... కేవలం ప్రశాంతత. నేను రాజభవనంలో ఉన్నా, నేనెంత అందగాడినయినా, ఎంత విద్వాంసుడినయినా, ఎంత ఐశ్వర్యం ఉన్నా... మనసు అల్లకల్లోలంగా ఉన్నప్పుడు, తీవ్ర అశాంతితో ఉన్నప్పుడు ఇవేవీ మీకు శాంతినివ్వలేవు. ఒక పచ్చటి చెట్టు, రంగు రంగుల పూలతో, కాయలతో, పళ్ళతో ఉన్నప్పటికీ తొర్రలో అగ్నిహోత్రం ఉన్నప్పుడు అది లోపల.. లోపల ఎంత దహించుకు పోతుంటుందో... మనసులో అశాంతి ఉన్న వ్యక్తికూడా అలాగే బాధపడుతూ ఉంటాడు. అందుకే శాంతి కావాలి. మన సంప్రదాయం మనకు ఒక శాంతి మంత్రాన్నే ఇచ్చింది...ఓం శాంతిః శాంతిః శాంతిః

ఇది కేవలం ప్రాణులు మాత్రమే కాదు, అంతరిక్షం శాంతి పొందాలి, పృథివి శాంతి పొందాలి, వాయువు శాంతిపొందాలి. జలం శాంతి పొందాలి. ఏదీ కూడా వ్యగ్రతను పొందకూడదు. భూమికి అచల అని పేరు. అంటే కదలనిది..అని. భూమికి కోపం వచ్చి తన కట్టుతప్పి కదిలిందనుకోండి.. ఎంత ప్రాణ నష్టం? ఎంత ఆస్తి నష్టం ? అందుకే భూమి ప్రశాంతంగా ఉండాలి.

వాయుః శాంతిః వాయువు తన కట్టుతప్పి తీవ్రతను చూపిందనుకోండి.. ప్రభంజనం అంటాం. అన్నీ నేల కొరుగుతాయి. అదే వాయువు తాను ఉండాల్సిన కట్టుబాటులో ఉంటే... వాయుః ప్రాణః, సుఖం వాయుః.

అప్పుడు ప్రాణమూ వాయువే, సుఖమూ వాయువే. చల్లగాలి చక్కగా వీస్తుందనుకోండి. సుఖంగా అనిపిస్తుంది. ఏ ఇబ్బందీ లేకుండా ఊపిరిని ఒకే వేగంతో తీసి, ఒకే వేగంతో విడిచిపెడుతూ ఉన్నప్పుడు.. అంతకన్నా ఆయుర్దాయం మరేముంది! వాయువు ఎంతకాలం శరీరంలో తిరుగుతూ ఉంటుందో అంత కాలమే సంధిబంధాలు.. కాళ్ళు, చేతులు, మణికట్టు అన్నీ వంగుతాయి. అది ప్రసరించనప్పుడు శరీరం ఒక కర్రయిపోతుంది. అందుచేత వాయువు అత్యంత ప్రధానమైనది. దాని చేత ప్రాణులన్నీ చలనశీలంగా ఉంటాయి.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

వడిబాయక తిరితే ప్రాణ బంధుడా !.. అంటారు అన్నమాచార్యులవారు. ఒకే వేగంతో ఊపిరిని శరీరం లోపలికి, బయటికి పంపుతున్నాడే..ఆయనే వేంకటేశ్వరుడు. ఇక అంతకన్నా నాకు దగ్గరగా ఎవరున్నార్రా!!! అని అడిగాడు. వడిబాయక తిరిగే ప్రాణబంధుడా.. అని పిలిచాడు ఆయన వేంకటేశ్వరుడిని. అదే.. వాయుఃప్రాణః సుఖం వాయుః. ఊపిరిని తీసి విడిచి పెడుతున్న శరీరం ఆచంద్రార్కం.. శాశ్వతంగా ఉండదు. పడిపోతుంది. ఇప్పుడు వాయువుకున్న గొప్పదనం ఏమిటంటే.. అదే వాక్కుగా మారుతుంది. ఆ వాయువు చేత ప్రాణాలను నిలబెట్టుకున్నవాడు వాటిని సార్థక్యం చేసుకున్నప్పుడు శరీరం పడిపోయినా ఆ వ్యక్తి.. కాలంలో శతాబ్దాలు నిలబడిపోతాడు.. ఎలా! అది వాక్కుగా మారినందువల్ల...!

బౌద్ధవాణి

# తలుపులు తాళాలు లేని ఇళ్ళు...



వారణాసిలో గంగానదీ ఒడ్డున ఒక సత్రం ఉంది. ఆ సత్రానికి ఒకరోజున ముగ్గురు బాటసారులు వచ్చారు. వారు ఉదయం భోజనం ముగించాక సత్రం మధ్యలో ఉన్న చెట్టు కింది రచ్చబండ మీద కూర్చొన్నారు. ఒకరి సమాచారం ఒకరు చెప్పుకున్నారు.

వారిలో పొడగరి సుదత్తుడు. అతను అంగరాజ్యం నుండి వచ్చాడు. బట్టతల వాడు సుశీలుడు కోసల రాజ్యవాసి. పొట్టిగా నల్లగా ఉన్న వాడు ధర్మధరుడు. అతను శాక్య రాజ్యం నుంచి వచ్చాడు.

''మిత్రులారా! మన దగ్గర ధనం ఉంది. ఈ ప్రాంతంలో దొంగలు ఎక్కువ. మనం చూస్తూ ఉండగానే మాయం చేయగలరు. కళ్ల గప్పి సొమ్ములు కాజేసుకుపోగల నేర్పరులు.'' అన్నాడు సుదత్తుడు.

''ఇక్కడ కంటే మగధ రాజ్యం మరీనూ. పట్టపగలే దోపిడీలు చేస్తారు'' అన్నాడు సుశీలుడు.

''మా రాజ్యంలో ఆ బెడద ఉండదు' అన్నాడు ధర్మధరుడు.

''మా రాజ్యంలో కూడా... మా రాజ్యంలో కూడా'' అన్నారు మిగిలిన ఇద్దరు!

''నిజమా!'' అని ప్రశ్నించాడు ధర్మధరుడు.

''ఔను మిత్రమా! మా రాజ్యంలో ఇళ్ళన్నీ గట్టి గోడలతో ఉంటాయి. బలమైన తలుపులు ఉంటాయి. ఏ ఒక్కరూ నిర్లక్ష్యంగా ఉండరు. వస్తువులన్నీ ఎడాపెడా పడవెయ్యరు. పైగా.. రాజభటులు ఎప్పుడూ కావలి కాస్తూనే ఉంటారు. మన అజాగ్రత్తే దొంగలకు అవకాశం అవుతుంది. మనం నిర్లక్ష్యాన్ని కప్పి పుచ్చుకుని నేరం దొంగల మీద వేస్తాం'' అన్నాడు అంగ రాజ్యానికి చెందిన సుదత్తుడు.

''అసలు మా రాజ్యంలో అయితే.. దొంగతనం చేయాలి అంటేనే దొంగలకీ భయమేస్తుంది. దొంగల విషయంలో మా మహారాజుగారు మహా క్రూరంగా వ్యవహరిస్తారు. కఠిన శిక్షలు అమలు చేస్తారు'' అన్నాడు సుశీలుడు.

> 'శిక్షించబడతాం' అనే భయంతో కోరికల్ని వదిలి పెట్టకూడదు. భయంతో వదిలే కోరికలు తాత్కాలికమే. ఇక్కడ శిక్షలు లేవు, ఎవ్వరూ చూడడం లేదు' అనుకుంటే వెంటనే కోర్కెలు తీర్చుకోవడానికి సిద్ధపడతారు. అవకాశం లేకపోవడం వల్లనో, శిక్షల భయం వల్లనో తప్పులకు దూరంగా ఉండటం కాదు... స్వీయ నిగ్రహం వల్ల ఉండాలి. అలా ఉండాలంటే మనస్సులో కామరాగాలు నశించాలి. వాళ్లే వీతరాగులు.

''దొంగతనం చేయాలంటే.. దొంగలకి వెన్నులో వణుకు వస్తుంది. అందుకే మా రాజ్యంలో ఇళ్ళకు సరైన తాళాలు కూడా వెయ్యరు. దండం దశగుణం భవత్... అంటూ ముగించాడు సుశీలుడు.

ధర్మధరుడు వాళ్ళిద్దరి మాటలు విని మౌనంగా ఉన్నాడు.

''మిత్రమా! మరి మీ రాజ్యం''అని అడిగాడు సుదత్తుడు.

''మిత్రులారా! మా రాజ్యంలో మా ఇళ్ళకు తాళాలు ఉండవు.'' అన్నాడు.

'అంటే మా రాజ్యం లాగానే అన్నమాట'' అన్నాడు ఆతృతగా సుశీలుడు.

''కాదు మిత్రమా! ఈ సుదత్తుని రాజ్యంలో ప్రజలు తమ జాగ్రత్తల్లో ఉంటారు. ఇంటికి బలమైన గోడలూ, వాటి చుట్టూ రక్షక వలయాలూ.. ఇతరులకి దొంగతనం చేసే అవకాశమే ఇవ్వరు. కాబట్టి ఆ రాజ్యంలో దొంగతనాలు లేవు. ఇక మీ రాజ్యంలో కఠోరమైన శిక్షలు. కాబట్టి, శిక్షల భయంతో మీ రాజ్యంలో చోరులు లేరు. కానీ మా రాజ్యంలో వేరు. దొంగతనానికి కఠినమైన శిక్షలు లేవు. మా ఇళ్లకూ గట్టి రక్షణలూ లేవు. అయినా దొంగతనాలు జరగవు. కారణం! దొంగతనం చేయాలనే ఆలోచనే ఎవ్వరిలోనూ ఉండదు. పరుల సొమ్ముని పాములా భావిస్తారు. మనో నిబ్బరంతో ఉంటారు. శీలవంతులుగా జీవిస్తారు. కాబట్టి మా రాజ్యంలో దొంగతనాలు తెలియవు. దొంగలకి శిక్షలు తెలియవు. వారి కోసం చెరసాలలూ లేవు.'' అన్నాడు.

''ఐతే.. మేము విన్నది నిజమే అన్నమాట'' మీరందరూ వీతరాగులే'' అన్నారు మిగిలిన ఇద్దరూ!

''అవును.. తథాగత బుద్ధుని బోధనలు పాటిస్తాం. వీతరాగులుగానే జీవిస్తాం'' అన్నాడు ధర్మధరుడు.

అలాంటి మనుషులు, వారి మనస్సులూ దుఃఖాలకి దూరమవుతాయి. అలాంటి మనుషులున్న సమాజం ఆదర్శనీయమవుతుంది. అల్లకల్లోలాలకు దూరమవుతుంది. ఆ సమాజంలో శాంతి తాండవిస్తుంది'' అంటాడు బుద్ధుడు.

– డా. బొర్రా గోవర్ధన్

# సినిమా

## సెప్టెంబరులో స్టార్ట్



రజనీకాంత్

'జైలర్' సినిమా సక్సెస్ జోష్‌లో ఉన్నారు హీరో రజనీకాంత్. అయితే ఈ సినిమా రిలీజ్‌కి ముందే తన ఆధ్యాత్మిక యాత్రలో భాగంగా హిమాలయాల్లో కొంత సమయం గడిపారు రజనీ. అలాగే దేశంలోని మరికొన్ని ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శిస్తున్నారాయన. అయితే రజనీకాంత్ ఆధ్యాత్మిక యాత్ర ఈ నెలాఖరుకల్లా పూర్తవుతుందట. దీంతో 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో తాను హీరోగా నటించాల్సిన సినిమాపై ఆయన పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరిస్తారని, సెప్టెంబరు రెండో వారంలో ఈ సినిమా షూటింగ్‌లో జాయిన్ అవుతారని కోలీవుడ్ టాక్. రజనీకాంత్ కెరీర్‌లో 170వ సినిమాగా తెరకెక్కనున్న ఈ మూవీలో ఓ కీలక పాత్రలో అమితాబ్ బచ్చన్, ప్రతినాయకుడి ఛాయలు ఉండే మరో కీలక పాత్రలో శర్వానంద్ నటిస్తారనే ప్రచారం సాగుతోంది. లైకా ప్రొడక్షన్స్‌పై సుభాస్కరన్ నిర్మించనున్న ఈ సినిమా 2024లో విడుదల కానుంది.

## చిన్న విరామం తర్వాత..



రామ్ చరణ్

రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'గేమ్‌చేంజర్'. ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కాగా ఈ సినిమా లేటెస్ట్ షెడ్యూల్ చిత్రీకరణ ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైంది. అయితే ఈ షెడ్యూల్‌లో చిన్న విరామం ఇచ్చిన యూనిట్ తిరిగి షూటింగ్‌ని ప్రారంభించినట్లు ఫిల్మ్‌నగర్ టాక్. రామ్‌చరణ్‌తో పాటు కీలక తారాగణం పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట శంకర్. జయరాం, అంజలి, సునీల్, నవీన్‌చంద్ర కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నారు. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది.

## బీదర్‌లో సైంధవ్



వెంకటేశ్

వెంకటేశ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'సైంధవ్'. ఈ మూవీలో శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్నారు. ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ కర్ణాటకలోని బీదర్‌లో ప్రారంభమైంది. వెంకటేశ్ పాల్గొంటున్న ఈ షెడ్యూల్‌లో ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేశారట శైలేష్ కొలను. తాజాగా మొదలైన బీదర్ షెడ్యూల్ ఈ నెలాఖరు వరకూ సాగుతుందట. సెప్టెంబరులో ప్లాన్ చేసిన ఓ విదేశీ షెడ్యూల్‌తో 'సైంధవ్' చిత్రీకరణ దాదాపు పూర్తవుతుందని, వినాయక చవితి పండగ సందర్భంగా టీజర్‌ను విడుదల చేసే ఆలోచనలో చిత్ర యూనిట్ ఉన్నారని ఫిల్మ్‌నగర్ సమాచారం. తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం, హిందీ భాషల్లో 'సైంధవ్' చిత్రం డిసెంబరు 22న విడుదల కానుంది. ఈ సినిమాకు సహ నిర్మాత: కిషోర్ తాళ్లూరు, సంగీతం: సంతోష్ నారాయణ్.

## ప్రతి పాత్ర కథని మలుపు తిప్పుతుంది - దుల్కర్ సల్మాన్

**"నేను ఇప్పటి వరకూ గ్యాంగ్‌స్టర్ సినిమాలు చేయలేదు. తొలిసారి 'కింగ్ ఆఫ్ కొత్త' చేశాను. ఈ కథ రెండు పీరియడ్స్‌లో ఉంటుంది. పాటలు, యాక్షన్ సీక్వెన్స్, ఫుట్ బాల్.. ఇలా అన్ని వాణిజ్య అంశాలున్నాయి. ఇందులో ప్రతి పాత్ర కథని మలుపు తిప్పుతుంది. అది నాకు చాలా నచ్చింది" అని హీరో దుల్కర్ సల్మాన్ అన్నారు. అభిలాష్ జోషి దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్, ఐశ్వర్య లక్ష్మి జంటగా నటించిన చిత్రం 'కింగ్ ఆఫ్ కొత్త'. జీ స్టూడియోస్, వేఫేరర్ ఫిల్మ్స్ నిర్మించిన ఈ సినిమా తెలుగు, మలయాళం, తమిళ్, హిందీలో ఈ నెల 24న రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా దుల్కర్ సల్మాన్ పంచుకున్న విశేషాలు....**



- అభిలాష్, నేను చిన్ననాటి స్నేహితులం. ఎప్పటి నుంచో సినిమా చేయాలనుకుంటే 'కింగ్ ఆఫ్ కొత్త'కి కుదిరింది. మంచి గ్యాంగ్‌స్టర్ డ్రామా ఇది. స్నేహం కూడా ఉంటుంది. నేను ఏడాదికి మూడు సినిమాలు చేస్తాను. కానీ, ప్రేక్షకులకు మంచి సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వాలని ఈ మూవీ కోసం ఏడాది శ్రమించా. సాంకేతికంగా ఈ మూవీ పెద్ద స్థాయిలో ఉంటుంది.
- కొత్త అంటే మలయాళంలో టౌన్ అని అర్థం. అదొక ఫిక్షనల్ టౌన్. అయితే తెలుగులో కొత్త అనే పదానికి కొత్తది అనే అర్థం వస్తుంది. అందుకే డబ్బింగ్‌లో కోత అని చెప్పాం. ప్రేక్షకులకు నేను ఎక్కువగా లవర్ బాయ్‌గా గుర్తుంటాను(నవ్వుతూ). ఒకేరకమైన కథలు, పాత్రలు చేయాలని ఉండదు. ప్రేక్షకులతో పాటు నటుడిగా నాకు నేను సర్‌ప్రైజ్ అయ్యే పాత్రలు చేయాలని ఉంటుంది. ఈ మూవీ కోసం తెలుగు, మలయాళం, తమిళ్, హిందీ భాషల్లో నేనే డబ్బింగ్ చెప్పాను. ఓ రకంగా ఇప్పుడు నేను డబ్బింగ్ ఆర్టిస్టని కూడా (నవ్వుతూ).
- ఐశ్వర్య లక్ష్మి చాలా ప్రతిభ ఉన్న నటి. ఈ మూవీలో తన పాత్ర కీలకంగా ఉంటుంది. నిమేష్ రవి విజువల్స్, జాక్స్ బిజోయ్ సంగీతం సినిమాకు ప్లస్. సినిమాని కాపాడాలి, మంచి సమయంలో రిలీజ్ చేయాలంటే మనమే నిర్మాణం, డిస్ట్రిబ్యూషన్‌లో ఉండాలని వేఫేరర్ ఫిల్మ్స్ స్టార్ట్ చేశాను. ప్రస్తుతం నేను, రానా కలిసి 'కాంత' చేస్తున్నాం. తెలుగు, ఇతర పరిశ్రమల నుంచి నేర్చుకున్న ఎన్నో విషయాలను మలయాళంలో అనుసరిస్తున్నాను. ప్రస్తుతం తెలుగులో వెంకీ అట్లూరిగారి దర్శకత్వంలో 'లక్కీ భాస్కర్' సినిమా చేస్తున్నాను. మరికొన్ని కథలు వింటున్నాను. ప్రభాస్‌గారి 'కల్కి 2898 ఏడీ'లో నేను నటిస్తున్నానా? లేదా? అన్నది మేకర్సే చెప్పాలి.



కృతీసనన్



కాజోల్

## మిస్టరీ మొదలైంది

బాలీవుడ్ హీరోయిన్స్ కాజోల్, కృతీ సనన్ కలిసి నటిస్తున్న తాజా చిత్రం 'దో పత్తీ'. మిస్టరీ అండ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమాకి శశాంకా చతుర్వేది దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ ముంబైలో ప్రారంభమైంది. కృతీసనన్, కాజోల్ పాల్గొంటుండగా కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు శశాంక. ఈ సినిమాను రచయిత కనికా థిల్లాన్, కృతీసనన్ నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో ఈ సినిమా డైరెక్ట్‌గా స్ట్రీమింగ్ కానుంది. మరోవైపు 2015లో షారుక్ ఖాన్ హీరోగా రోహిత్ శెట్టి దర్శకత్వంలో వచ్చిన 'దిల్‌వాలే' చిత్రంలో కాజోల్, కృతీసనన్ కలిసి నటించారు. మళ్లీ ఇప్పుడు 'దో పత్తీ' కోసం ఈ ఇద్దరూ సెట్స్‌లో జాయిన్ అవుతున్నారు.

## కాంబినేషన్ రిపీట్



ధనుష్

హీరో ధనుష్, దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'కెప్టెన్ మిల్లర్'. ఈ సినిమా డిసెంబరులో విడుదల కానుంది. అయితే 'కెప్టెన్ మిల్లర్' తర్వాత అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలోనే మరో సినిమా చేయనున్నారు ధనుష్. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు మేకర్స్. ఇలా ధనుష్, అరుణ్ కాంబినేషన్ రిపీట్ కానుంది. అలాగే ఈ సినిమాకు ధనుష్ నిర్మాణ భాగస్వామిగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తన కెరీర్‌లోని 50వ సినిమాతో బిజీగా ఉన్నారు ధనుష్. ఈ మూవీలో ఆయన హీరోగా నటించడంతో పాటు దర్శకత్వం వహిస్తున్నారు. ధనుష్ ఇప్పటికే కమిట్ అయిన సినిమాలు పూర్తి చేసిన తర్వాతనే అరుణ్ సినిమాని స్టార్ట్ చేస్తారట.

## మొదటి ప్రయాణం మరచిపోకూడదు - త్రినాథరావు నక్కిన



చంటి, లహరి, త్రినాథరావు నక్కిన

''నాది, బెక్కెం వేణు గోపాల్‌గారి ప్రయాణం చిన్న సినిమా నుంచే ప్రారంభమైంది. అప్పట్లో మా సినిమా పోస్టర్, టీజర్, ట్రైలర్‌లను ఎవరు రిలీజ్ చేస్తారా? అని ఎదురు చూసే వాళ్లం. ఇప్పుడు పెద్ద సినిమాలు చేస్తున్నామని మా మొదటి ప్రయాణం మరచిపోకూడదు కదా?. అందుకే ఎవరైనా సపోర్ట్ కావాలని అడిగితే మా వంతు సపోర్ట్ చేయటానికి, ప్రోత్సహించటానికి వెనుకాడం'' అని డైరెక్టర్ త్రినాథరావు నక్కిన అన్నారు. చంటి, లహరి జంటగా కేవీఆర్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఏపీ 31'. 'నెంబర్ మిస్సింగ్' అన్నది ట్యాగ్ లైన్. అన్నపూర్ణేశ్వరి సినీ క్రియేషన్స్‌పై నారాయణ స్వామి.ఎం నిర్మిస్తున్నారు. ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను త్రినాథరావు నక్కిన, ఫస్ట్ లుక్‌ని నిర్మాత బెక్కెం వేణుగోపాల్ రిలీజ్ చేసి, 'ఏపీ 31' హిట్ కావాలన్నారు. ''అందరి సపోర్ట్‌తో సినిమాను పూర్తి చేస్తున్నాం'' అన్నారు కేవీఆర్.

## సూర్యతో జోడీ?



అదితీ

ప్రముఖ దర్శకుడు శంకర్ కుమార్తె అదితీ శంకర్ హీరో సూర్యకి జోడీగా నటించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి తమిళ చిత్ర వర్గాలు. సూర్య హీరోగా సుధా కొంగర దర్శకత్వంలో వచ్చిన 'సూరరై పోట్రు'(తెలుగులో ఆకాశం నీ హద్దురా) సినిమా హిట్‌గా నిలిచింది. వీరి కాంబినేషన్‌లో మరో చిత్రం 'సూర్య 43'(వర్కింగ్ టైటిల్) రూపొందనుంది. ఈ మూవీలో అదితీ శంకర్ హీరోయిన్‌గా ఫిక్స్ అయ్యారని టాక్.

## మోసగాడి యాక్షన్



నరేందర్, రేఖ

చంద్రకాంత్ దత్త, నరేందర్, రేఖ నిరోషా ప్రధాన పాత్రల్లో బర్ల నారాయణ దర్శకత్వం వహించిన చిత్రం 'చీటర్'. యస్ఆర్ఆర్ ప్రొడక్షన్స్‌పై పరుపాటి శ్రీనివాస్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా సెప్టెంబర్ 22న విడుదల కానుంది. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని దర్శకుడు త్రినాథరావు నక్కిన విడుదల చేసి, మాట్లాడుతూ–''చీటర్' ఫస్ట్ లుక్ బాగుంది.. సినిమా హిట్ కావాలి''అన్నారు. ''యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన సినిమా ఇది. విడుదలైన పాటలకు మంచి స్పందన వచ్చింది'' అన్నారు బర్ల నారాయణ. ''మా సినిమా ఔట్‌పుట్ బాగా వచ్చింది'' అన్నారు శ్రీనివాస్ రెడ్డి.



## సిన్సినాటి ఓపెన్ ఫైనల్లో అల్‌కరాజ్‌తో జొకోవిచ్ 'ఢీ'

కెరీర్‌లో 39వ మాస్టర్స్ సిరీస్ టైటిల్ సాధించేందుకు సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్... కెరీర్‌లో ఐదో మాస్టర్స్ సిరీస్ టైటిల్ నెగ్గేందుకు స్పెయిన్ స్టార్, ప్రపంచ నంబర్‌వన్ కార్లోస్ అల్‌కరాజ్ అమీతుమీ తేల్చుకోనున్నారు. అమెరికాలోని ఒహాయో రాష్ట్రంలో జరుగుతున్న సిన్సినాటి ఓపెన్ మాస్టర్స్-1000 టోర్నీలో వీరిద్దరూ ఫైనల్లోకి దూసుకెళ్లారు. పురుషుల సింగిల్స్ సెమీఫైనల్స్‌లో అల్‌కరాజ్ 2-6, 7-6 (7/4), 6-3తో హుబెర్ట్ హుర్కాజ్ (పోలాండ్)పై విజయం సాధించగా... జొకోవిచ్ 7-6 (7/5), 7-5తో అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ)ను ఓడించాడు. ఈ క్రమంలో 36 ఏళ్ల జొకోవిచ్ ఈ టోర్నీ చరిత్రలో ఫైనల్ చేరిన పెద్ద వయస్కుడిగా గుర్తింపు పొందాడు. అల్‌కరాజ్‌తో ముఖాముఖి రికార్డులో జొకోవిచ్ 1-2తో వెనుకంజలో ఉన్నాడు.



# రుతురాజ్, సామ్సన్ మెరుపులు

### రెండో టి20లోనూ భారత్‌దే గెలుపు

- సిరీస్ 2-0తో టీమిండియా వశం
- 33 పరుగుల తేడాతో ఐర్లాండ్ ఓటమి

**డబ్లిన్:** సీనియర్లంతా విశ్రాంతి తీసుకున్న ఐర్లాండ్ పర్యటనలో యువ ఆటగాళ్లు బాధ్యతగా ఆడి టీమిండియాను గెలిపించారు. రెండో టి20లో 33 పరుగులతో గెలుపొందిన బుమ్రా బృందం మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది. సిరీస్‌లోని చివరిదైన మూడో మ్యాచ్ ఈనెల 23న ఇదే వేదికపై జరుగుతుంది. రెండో టి20లో మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 185 పరుగులు చేసింది. ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ (43 బంతుల్లో 58; 6 ఫోర్లు, 1 సిక్స్), సంజూ సామ్సన్ (26 బంతుల్లో 40; 5 ఫోర్లు, 1 సిక్స్), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రింకూ సింగ్ (21 బంతుల్లో 38; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరిపించారు. మెకార్తీ 2 వికెట్లు తీశాడు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన ఐర్లాండ్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 152 పరుగులు చేసి ఓడిపోయింది. ఓపెనర్ ఆండీ బల్బిర్నీ (51 బంతుల్లో 72; 5 ఫోర్లు, 4 సిక్సర్లు) ఒంటరి పోరాటం చేశాడు. బుమ్రా, ప్రసిధ్ కృష్ణ, రవి బిష్ణోయ్ తలా 2 వికెట్లు తీశారు.

**రాణించిన గైక్వాడ్**

భారీ షాట్లు ఆడే క్రమంలో బంతిని గాల్లోకి లేపిన టాపార్డర్ బ్యాటర్లు యశస్వి జైస్వాల్ (11 బంతుల్లో 18; 2 ఫోర్లు, 1 సిక్స్), వన్‌డౌన్ బ్యాటర్ తిలక్ వర్మ (1) అవుటయ్యారు. విండీస్ పర్యటనలో రాణించిన తిలక్ ఈ సిరీస్‌లోని రెండు మ్యాచ్‌ల్లో నిరాశ పరిచాడు. మెకార్తీ షార్ట్‌పిచ్ బంతిని తిలక్ పుల్ చేయగా అదికాస్తా అక్కడే చాలా ఎత్తుకు లేచింది. డీప్‌స్క్వేర్ లెగ్‌లో ఉన్న డాక్‌రెల్ క్యాచ్‌ను అందుకున్నాడు. 34 పరుగులకే 2 కీలక వికెట్లు కోల్పోయిన జట్టును రుతురాజ్, సంజూ సామ్సన్ ధాటిగా నడిపించారు. మూడో వికెట్‌కు 71 పరుగులు జోడించారు. వేగంగా ఆడుతున్న సామ్సన్ బంతిని వికెట్ల మీదికి ఆడుకొని నిష్క్రమించగా, అర్ధసెంచరీ అనంతరం రుతురాజ్ అవుటయ్యాడు. ఆఖర్లో రింకూ సింగ్, శివమ్ దూబే (16 బంతుల్లో 22 నాటౌట్, 2 సిక్స్‌లు) మెరుపులు మెరిపించారు.


సామ్సన్


రింకూ సింగ్

**బల్బిర్నీ పోరాటం...**

తొలి మ్యాచ్‌లో బుమ్రా పడగొట్టినట్లే ఈసారి ప్రసిధ్ కృష్ణ ఒకే ఓవర్లో (3వ) కెప్టెన్ స్టిర్లింగ్ (0), టక్కర్ (0)లను డకౌట్ చేశాడు. టెక్టర్ (7), క్యాంఫర్ (18)లను రవి బిష్ణోయ్ స్పిన్‌తో బోల్తా కొట్టించాడు. దాంతో 10 ఓవర్లలో ఐర్లాండ్ స్కోరు 63/4. ఈ దశలో ఐర్లాండ్‌కు గెలుపుపై ఆశలేమీ లేవు. అయితే బల్బిర్నీ వీరవిహారం భారత శిబిరాన్ని వణికించింది. డాక్‌రెల్ (13; 1 సిక్స్)తో కలిసి జట్టు స్కోరును 100 పరుగులు దాటించాడు. కాసేపటికే డాక్‌రెల్ లేని పరుగుకు యత్నించి రనౌట్ కాగా... సిక్సర్ల మోత మోగిస్తున్న బల్బిర్నీ జోరుకు అర్ష్‌దీప్ బ్రేక్ వేశాడు. ఆ తర్వాత మ్యాచ్ పూర్తిగా భారత్ పక్షాన నిలిచింది. మార్క్ అడైర్ (15 బంతుల్లో 23; 3 సిక్సర్లు) భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. అయితే బంతులకి, పరుగులకి మధ్య కొండంత అంతరాన్ని ఈ సిక్సర్లు తగ్గించలేకపోయాయి.


రుతురాజ్

### స్కోరు వివరాలు

**భారత్ ఇన్నింగ్స్:** యశస్వి (సి) క్యాంఫర్ (బి) యంగ్ 18; రుతురాజ్ (సి) టెక్టర్ (బి) మెకార్తీ 58; తిలక్ వర్మ (సి) డాక్‌రెల్ (బి) మెకార్తీ 1; సంజూ సామ్సన్ (బి) వైట్ 40; రింకూ సింగ్ (సి) యంగ్ (బి) అడైర్ 38; దూబే (నాటౌట్) 22; సుందర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 185.**

**వికెట్ల పతనం:** 1-29, 2-34, 3-105, 4-129, 5-184. **బౌలింగ్:** మార్క్ అడైర్ 4-0-36-1, జోష్ లిటిల్ 4-0-48-0, మెకార్తీ 4-0-36-2, క్రెయిగ్ యంగ్ 4-0-29-1, బెన్ వైట్ 4-0-33-1.

**ఐర్లాండ్ ఇన్నింగ్స్:** బల్బిర్నీ (సి) సామ్సన్ (బి) అర్ష్‌దీప్ 72; స్టిర్లింగ్ (సి) అర్ష్‌దీప్ (బి) ప్రసిధ్ కృష్ణ 0; టక్కర్ (సి) రుతురాజ్ (బి) ప్రసిధ్ కృష్ణ 0; టెక్టర్ (బి) రవి బిష్ణోయ్ 7; క్యాంఫర్ (సి) దూబే (బి) రవి బిష్ణోయ్ 18; డాక్‌రెల్ (రనౌట్) 13; అడైర్ (సి) తిలక్ వర్మ (బి) బుమ్రా 23; మెకార్తీ (సి) రవి బిష్ణోయ్ (బి) బుమ్రా 2; యంగ్ (నాటౌట్) 1; జోష్ లిటిల్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 16; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి) 152.**

**వికెట్ల పతనం:** 1-19, 2-19, 3-28, 4-63, 5-115, 6-123, 7-126, 8-148. **బౌలింగ్:** బుమ్రా 4-1-15-2, అర్ష్‌దీప్ 4-0-29-1, ప్రసిధ్ కృష్ణ 4-0-29-2, రవి బిష్ణోయ్ 4-0-37-2, వాషింగ్టన్ సుందర్ 2-0-19-0, శివమ్ దూబే 2-0-18-0.


స్వర్ణ పతకాలతో భారత పిస్టల్ షూటర్లు ఇషా సింగ్, మను భాకర్, రిథమ్ సాంగ్వాన్

# భారత్ బంగారు గురి

- మహిళల 25 మీటర్ల పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో ఇషా సింగ్ బృందానికి స్వర్ణం
- పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ టీమ్ ఈవెంట్‌లోనూ భారత్‌కు పసిడి పతకం
- కాంస్యంతో పారిస్ ఒలింపిక్స్ బెర్త్ సాధించిన అఖిల్ షెరాన్

**బకూ (అజర్‌బైజాన్):** ప్రపంచ సీనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో ఆదివారం భారత షూటర్లు అద్వితీయ ప్రదర్శనతో అలరించారు. రెండు స్వర్ణ పతకాలు, ఒక కాంస్య పతకం సాధించడంతో పాటు భారత్‌కు పారిస్ ఒలింపిక్స్ ఐదో బెర్త్‌ను ఖరారు చేశారు. తెలంగాణ షూటర్ ఇషా సింగ్, హరియాణా అమ్మాయిలు రిథమ్ సాంగ్వాన్, మనూ భాకర్ బృందం మహిళల 25 మీటర్ల పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు బంగారు పతకం అందించింది. రిథమ్, ఇషా సింగ్, మనూ భాకర్ జట్టు 1,744 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానంలో నిలిచింది. వ్యక్తిగత విభాగంలో రిథమ్ 583 పాయింట్లు స్కోరు చేసి ఎనిమిదో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించింది. ఇషా సింగ్ 581 పాయింట్లతో 16వ స్థానంలో, మనూ 580 పాయింట్లతో 22వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత పొందలేకపోయారు. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో రిథమ్ ఎనిమిది పాయింట్లు స్కోరు చేసి ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకుంది. పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ టీమ్ ఈవెంట్‌లో అఖిల్ షెరాన్, ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్, నీరజ్ కుమార్‌లతో కూడిన భారత జట్టు స్వర్ణ పతకం గెలిచింది. భారత బృందం మొత్తం 1750 పాయింట్లు స్కోరు చేసి ప్రథమ స్థానంలో నిలిచింది. క్వాలిఫయింగ్‌లో 585 పాయింట్లు స్కోరు చేసిన అఖిల్ ఐదో స్థానంతో ఫైనల్‌కు అర్హత పొందాడు. ఎనిమిది మంది మధ్య షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో అఖిల్ 450 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించాడు. అంతేకాకుండా భారత్‌కు పారిస్ ఒలింపిక్స్ ఐదో బెర్త్‌ను అందించాడు. ప్రస్తుతం పతకాల పట్టికలో భారత్ మూడు స్వర్ణాలు, మూడు కాంస్యాలతో కలిపి ఆరు పతకాలతో మూడో స్థానంలో ఉంది.


అఖిల్

## అనాహత్ అదరహో

### ఆసియా జూనియర్ బాలికల స్క్వాష్ టైటిల్ సొంతం

**డాలియన్ (చైనా):** భారత స్క్వాష్ రైజింగ్ స్టార్ అనాహత్ సింగ్ ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్‌లో అద్భుత ప్రదర్శన చేసింది. అండర్-17 బాలికల సింగిల్స్ విభాగంలో ఆసియా చాంపియన్‌గా అవతరించింది. 15 ఏళ్ల అనాహత్ ఫైనల్లో 3-1తో ఇనా క్వాంగ్ (హాంకాంగ్)పై విజయం సాధించింది. ఈ టోర్నీలో భారత్‌కు మూడు కాంస్య పతకాలు కూడా లభించాయి. అండర్-19 బాలుర సింగిల్స్‌లో శౌర్య, అండర్-19 బాలికల సింగిల్స్‌లో పూజ ఆర్తి, అండర్-15 బాలుర సింగిల్స్‌లో ఆర్యవీర్ సింగ్ మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాలు గెలిచారు.






# 100 మీటర్ల చాంప్ నోవా లైల్స్

### వరుసగా నాలుగోసారి అమెరికా ఖాతాలో స్ప్రింట్ స్వర్ణం

**బుడాపెస్ట్ (హంగేరి):** 'జమైకా చిరుత' ఉసేన్ బోల్ట్ రిటైరయ్యాక... పురుషుల 100 మీటర్ల స్ప్రింట్ ఈవెంట్‌లో మళ్లీ అమెరికన్ అథ్లెట్లు ఆధిపత్యం చాటుకుంటున్నారు. ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో వరుసగా నాలుగోసారి పురుషుల 100 మీటర్ల విభాగంలో అమెరికా ఖాతాలో స్వర్ణ పతకం చేరింది. ఆదివారం జరిగిన పురుషుల 100 మీటర్ల ఫైనల్లో అమెరికా అథ్లెట్ నోవా లైల్స్ పసిడి పతకం సాధించాడు. 26 ఏళ్ల నోవా లైల్స్ అందరి కంటే వేగంగా 9.83 సెకన్లలో గమ్యానికి చేరి తొలిసారి ఈ విభాగంలో విశ్వ విజేతగా అవతరించాడు. లెట్సిలె టెబోగో (బోట్స్‌వానా; 9.88 సెకన్లు) రజతం... జార్నెల్ హ్యూస్ (బ్రిటన్; 9.88 సెకన్లు) కాంస్యం గెల్చుకున్నారు. ఒబ్లిక్ సెవిల్లె (జమైకా) కూడా 9.88 సెకన్లలో రేసును ముగించాడు. అయితే ఫొటో ఫినిష్ ఆధారంగా రజత, కాంస్య పతకాలను ఖరారు చేశారు. 2017 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో జస్టిన్ గాట్లిన్ (అమెరికా) ధాటికి ఉసేన్ బోల్ట్ కాంస్య పతకంతో సరిపెట్టుకొని అదే ఏడాది ఆటకు వీడ్కోలు పలికాడు. అనంతరం 2019 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో క్రిస్టియన్ కోల్‌మన్ (అమెరికా), 2022 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఫ్రెడ్ కెర్లీ (అమెరికా) 100 మీటర్ల విభాగంలో వరల్డ్ చాంపియన్స్‌గా నిలిచారు. ఈసారి డిఫెండింగ్ చాంపియన్ ఫ్రెడ్ కెర్లీ సెమీఫైనల్లోనే నిష్క్రమించాడు.

**భారత అథ్లెట్లకు నిరాశ**

ఈ మెగా ఈవెంట్‌లో వరుసగా రెండోరోజు భారత అథ్లెట్లు నిరాశాజనక ప్రదర్శన కనబరిచారు. పురుషుల హైజంప్‌లో సర్వేశ్ కుషారే 2.22 మీటర్ల ఎత్తుకు ఎగిరి ఓవరాల్‌గా 20వ స్థానంలో నిలిచాడు. పురుషుల 400 మీటర్ల హర్డిల్స్‌లో సంతోష్ కుమార్ తన హీట్స్‌ను 50.46 సెకన్లలో ముగించి ఓవరాల్‌గా 36వ ర్యాంక్‌తో సరిపెట్టుకున్నాడు.



# సూపర్ స్పెయిన్

### తొలిసారి మహిళల ప్రపంచకప్ ఫుట్‌బాల్ టైటిల్ సొంతం

**సిడ్నీ:** ఏమాత్రం అంచనాలు లేకుండా ఆస్ట్రేలియాలో అడుగుపెట్టిన స్పెయిన్ మహిళల ఫుట్‌బాల్ జట్టు చివరకు అందర్నీ ఆశ్చర్యపరుస్తూ విశ్వవిజేతగా అవతరించింది. ఆదివారం జరిగిన మహిళల ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీ ఫైనల్లో స్పెయిన్ 1-0 గోల్ తేడాతో ఇంగ్లండ్ జట్టును ఓడించింది. ఆట 29వ నిమిషంలో ఓల్గా కర్మోనా చేసిన గోల్‌తో స్పెయిన్ ఆధిక్యంలోకి వెళ్లింది. ఆట 68వ నిమిషంలో స్పెయిన్‌కు పెనాల్టీ కిక్ రూపంలో రెండో గోల్ చేసే అవకాశం వచ్చింది. అయితే జెన్నీ హెర్మోసో కొట్టిన పెనాల్టీ షాట్‌ను ఇంగ్లండ్ గోల్‌కీపర్ మేరీ ఇయర్ప్స్ ఎడమ వైపునకు డైవ్ చేస్తూ అడ్డుకుంది. మూడో ప్రయత్నంలో తొలిసారి ఈ మెగా టోర్నీలో ఫైనల్ చేరిన ఇంగ్లండ్ జట్టు స్కోరు సమం చేసేందుకు చివరి నిమిషం వరకు తీవ్రంగా శ్రమించింది. కానీ స్పెయిన్ డిఫెన్స్ పటిష్టంగా ఉండటంతో ఇంగ్లండ్‌కు నిరాశ తప్పలేదు. నిర్ణీత 90 నిమిషాల తర్వాత ఇంజ్యూరీ టైమ్ రూపంలో మరో 15 నిమిషాలు అదనంగా ఆడించారు. ఈ ఉత్కంఠభరిత నిమిషాలను అధిగమిస్తూ స్పెయిన్ తమ ఆధిక్యాన్ని కాపాడుకొని చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది.

- స్వీడన్‌తో జరిగిన సెమీఫైనల్లో స్పెయిన్ తరఫున 89వ నిమిషంలో ఓల్గా కర్మోనా రెండో గోల్ చేసి తమ జట్టును ఫైనల్‌కు చేర్చింది. 2015లో కర్లీ లాయిడ్ (అమెరికా) తర్వాత ఒకే ప్రపంచకప్‌లో సెమీఫైనల్లో, ఫైనల్లో గోల్ చేసిన ప్లేయర్‌గా ఓల్గా కర్మోనా గుర్తింపు పొందింది.
- 75,784 మంది ప్రేక్షకులు ఈ ఫైనల్‌ను ప్రత్యక్షంగా తిలకించారు.
- చాంపియన్‌గా నిలిచిన స్పెయిన్ జట్టుకు మొత్తం ఒక కోటీ 5 లక్షల డాలర్ల (రూ. 87 కోట్ల 30 లక్షలు) ప్రైజ్‌మనీ లభించింది. ఇందులో 42 లక్షల 90 వేల డాలర్లు స్పెయిన్ ఫుట్‌బాల్ సమాఖ్యకు... 62 లక్షల 10 వేల డాలర్లు జట్టులోని సభ్యులకు (23 మందికి 2 లక్షల 70 వేల డాలర్ల చొప్పున) లభించాయి.
- ఈ విజయంతో పురుషుల, మహిళల ప్రపంచకప్ టైటిల్ గెలిచిన దేశంగా స్పెయిన్ గుర్తింపు పొందింది. స్పెయిన్ పురుషుల జట్టు 2010 ప్రపంచ కప్‌లో విజేతగా నిలిచింది.

# వరుసగా రెండు మ్యాచ్‌లు కష్టం: హెచ్‌సీఏ

### షెడ్యూల్ మార్పు ఉండదని రాజీవ్ శుక్లా స్పష్టీకరణ

**న్యూఢిల్లీ:** భారత్ ఆతిథ్యమిచ్చే వన్డే వరల్డ్‌కప్ మరో 45 రోజుల్లో మొదలవనుంది. ఈ దశలో హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) వరుస రోజుల్లో రెండు ప్రపంచకప్ మ్యాచ్‌ల నిర్వహణ కష్టమవుతుందని అభ్యంతరం వ్యక్తం చేసింది. అక్టోబర్ 9, 10 తేదీల్లో జరిగే మ్యాచ్‌లకు మార్పు కోరింది. అయితే భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సీనియర్ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా ఇప్పుడున్న పరిస్థితుల్లో షెడ్యూల్ మార్పు కుదరదని స్పష్టం చేశారు. నిజానికి మెగా ఈవెంట్ షెడ్యూల్ చాలా ముందుగా విడుదల చేస్తారు. కానీ ఈసారి కేవలం నాలుగు నెలల ముందే జూన్‌లో ప్రకటించారు. ఇటీవలే షెడ్యూల్‌లో మార్పులు చేశారు. మళ్లీ మార్పులంటే కష్టమేనని బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి. ఎందుకంటే మరో నాలుగు రోజుల్లోనే (ఈ నెల 25న) టికెట్ల విక్రయం కూడా జరగబోతుంది.







లాజిస్టిక్ సమస్యలే కాదు... ఇతరత్రా సర్దుబాట్లకు అవకాశాల్లేవని బోర్డు వర్గాలు అభిప్రాయపడ్డాయి. అందువల్లే ఇకపై షెడ్యూల్లో మార్పులుండబోవని స్పష్టం చేసింది. అక్టోబర్ 5న ఇంగ్లండ్, న్యూజిలాండ్‌ల మధ్య అహ్మదాబాద్‌లో జరిగే మ్యాచ్‌తో ప్రపంచకప్ మొదలవుతుంది.

**అసలేం జరిగింది?**

తొలుత ఐసీసీ-బీసీసీఐ ఖరారు చేసిన షెడ్యూలు ప్రకారం అక్టోబర్ 9న ఉప్పల్ మైదానంలో న్యూజిలాండ్, నెదర్లాండ్స్‌ల మధ్య మ్యాచ్, 12న పాకిస్తాన్, శ్రీలంకల మధ్య మ్యాచ్‌లు జరగాలి. అయితే మెగా ఈవెంట్‌కే హైలైట్‌గా నిలువనున్న భారత్, పాక్ పోరు అహ్మదాబాద్‌లో ఒకరోజు ముందుకు (అక్టోబర్ 15 నుంచి 14కు) జరిపారు. దీంతో పాకిస్తాన్‌కు సరైన విరామం కోసమని పాక్, శ్రీలంక మధ్య 12న జరగాల్సిన మ్యాచ్‌ను 10న నిర్వహించడమే హెచ్‌సీఏకు కష్టాలను తెచ్చిపెట్టింది. 9, 10 తేదీల్లో మ్యాచ్‌లంటే పోలీసు శాఖ నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని సుప్రీం కోర్టు నియమిత అడ్మినిస్ట్రేటర్‌తో నడుస్తున్న హెచ్‌సీఏ తెలిపింది.



నేను హైదరాబాద్ వేదిక ఇన్‌చార్జ్‌గా ఉన్నాను. అక్కడ ఏమైన సమస్యలుంటే పరిష్కరించవచ్చు. కానీ షెడ్యూల్ మార్పు ఒక్క బీసీసీఐ చేతుల్లో ఉండదు. ఐసీసీ, పాల్గొంటున్న జట్లు, ఇతరత్రా సంస్థలు (సదుపాయాలు, లాజిస్టిక్స్) అందర్నీ ఒప్పించాల్సి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో మార్పు అసాధ్యం. –బోర్డు ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా

## చాంపియన్ వృత్తి అగర్వాల్

**భువనేశ్వర్:** జాతీయ సబ్ జూనియర్, జూనియర్ అక్వాటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ స్విమ్మర్లు 14 పతకాలతో మెరిశారు. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో తెలంగాణ స్విమ్మర్లు ఆరు స్వర్ణాలు, ఐదు రజతాలు, మూడు కాంస్యాలు గెలిచారు. హైదరాబాద్ అమ్మాయి వృత్తి అగర్వాల్ గ్రూప్-1 బాలికల విభాగంలో వ్యక్తిగత చాంపియన్‌షిప్ టైటిల్‌ను సాధించింది. వృత్తి ఈ టోర్నీలోనాలుగు స్వర్ణాలు, ఒక రజతం సాధించింది. చివరిరోజు శివాని కర్రా 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్, 50 మీటర్ల బటర్‌ఫ్లయ్ ఈవెంట్స్‌లో తెలంగాణకు రెండు రజత పతకాలు అందించింది. గచ్చిబౌలి స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ కోచ్ ఆయుశ్ యాదవ్ వద్ద శివాని శిక్షణ తీసుకుంటోంది. నిత్యశ్రీ సాగి రెండు రజతాలు, ఒక కాంస్యం, సుహాస్ ప్రీతమ్ రెండు కాంస్యాలు నెగ్గారు.



# రాయలసీమ కింగ్స్ 'హ్యాట్రిక్' విజయం

**విశాఖ స్పోర్ట్స్:** ఆంధ్ర ప్రీమియర్ లీగ్ టి20 టోర్నమెంట్ రెండో సీజన్‌లో రాయలసీమ కింగ్స్ జట్టు వరుసగా మూడో విజయంతో 'హ్యాట్రిక్' నమోదు చేసింది. ఇక్కడి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో రాయలసీమ కింగ్స్ ఐదు వికెట్ల తేడాతో గోదావరి టైటాన్స్ జట్టును ఓడించింది. ఆరు జట్లు పాల్గొంటున్న ఈ లీగ్‌లో రాయలసీమ కింగ్స్ 12 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో ఉంది. ముందుగా బ్యాటింగ్ చేసిన గోదావరి టైటాన్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 150 పరుగులు చేసింది. త్రిపురాణ విజయ్ (25 బంతుల్లో 63 నాటౌట్; 6 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్‌తో అజేయ అర్ధ సెంచరీ చేశాడు. రాయలసీమ కింగ్స్ బౌలర్లలో హరిశంకర్ రెడ్డి మూడు వికెట్లు, గిరినాథ్ రెడ్డి రెండు వికెట్లు తీశారు. అనంతరం రాయలసీమ కింగ్స్ 17.4 ఓవర్లలో 5 వికెట్లకు 153 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ హనుమ విహారి (12 బంతుల్లో 21; 3 ఫోర్లు, 1 సిక్స్), అభిషేక్ రెడ్డి (37 బంతుల్లో 53; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), తన్నీరు వంశీకృష్ణ (39 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. గోదావరి టైటాన్స్ బౌలర్లు ఏకంగా 21 ఎక్స్‌ట్రాలు ఇవ్వడం గమనార్హం.

**తపస్వి ఆల్‌రౌండ్ ప్రదర్శన**

మరో మ్యాచ్‌లో ఉత్తరాంధ్ర లయన్స్ 93 పరుగుల తేడాతో వైజాగ్ వారియర్స్‌పై ఘనవిజయం సాధించింది. ముందుగా ఉత్తరాంధ్ర లయన్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 206 పరుగులు చేసింది. కెప్టెన్ కోన శ్రీకర్ భరత్ (23 బంతుల్లో 45; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), వెంకట్ రాహుల్ (36 బంతుల్లో 53; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), పిన్నింటి తపస్వి (23 బంతుల్లో 38; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), సిర్లా శ్రీనివాస్ (13 బంతుల్లో 33 నాటౌట్; 1 ఫోర్, 4 సిక్స్‌లు) దూకుడుగా ఆడారు. అనంతరం వైజాగ్ వారియర్స్ 14.4 ఓవర్లలో 113 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. తపస్వి, పృథ్వీరాజ్ మూడు వికెట్ల చొప్పున తీశారు.


## ఆసియా కప్ టోర్నీకి నేడు భారత జట్టు ఎంపిక

**న్యూఢిల్లీ:** ఇంకొన్ని రోజుల్లోనే స్వదేశంలో వన్డే వరల్డ్‌కప్ జరగనుంది. దీనికంటే ముందు పూర్తిస్థాయి సన్నద్ధత కోసం ఆసియా కప్ వన్డే ఫార్మాట్‌లో జరుగనుంది. అంటే ఆసియా కప్‌కు ఎంపికయ్యే జట్టే దాదాపు వన్డే ప్రపంచకప్‌లో ఆడుతుందన్నది సుస్పష్టం. ఈ నేపథ్యంలో నేడు ఆసియా కప్‌లో పాల్గొనే జట్టు కోసం సీనియర్ సెలక్షన్ కమిటీ కీలక సమావేశం జరుగనుంది. ఇందులో కోచ్ రాహుల్ ద్రవిడ్, కెప్టెన్ రోహిత్ శర్మ కూడా పాల్గొంటారని బోర్డు వర్గాలు తెలిపాయి. గాయాల నుంచి కోలుకున్న స్టార్ ఆటగాళ్లు కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్‌ల ఫిట్‌నెస్, అదనపు పేసర్‌గా శార్దుల్ ఠాకూర్ లేదంటే ప్రసిధ్ కృష్ణలలో ఎవరికి అవకాశమివ్వాలనే అంశాలపై అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ చర్చించనుంది. సోమవారం ప్రకటించే భారత జట్టే ప్రపంచకప్‌కు ప్రొవిజనల్ జట్టుగా దాదాపు ఖాయమయ్యే అవకాశముంది.

# ప్రణయ్, శ్రీకాంత్, లక్ష్య సేన్‌లపై భారత్ ఆశలు

### నేటి నుంచి ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

**కోపెన్ హగెన్ (డెన్మార్క్):** ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో స్టార్ షట్లర్లు హెచ్ఎస్ ప్రణయ్, కిడాంబి శ్రీకాంత్, లక్ష్య సేన్‌లపై భారత్ ఆశలు పెట్టుకుంది. నేటి నుంచి జరిగే ఈ మెగా టోర్నీలో భారత ఆటగాళ్లు ఫేవరెట్లుగా బరిలోకి దిగుతున్నారు. మహిళల విభాగంలో మాజీ చాంపియన్ పీవీ సింధుకు తొలి రౌండ్లో బై లభించింది. మాజీ ప్రపంచ చాంపియన్ నొజోమి ఒకుహారా (జపాన్), తుయ్ లిన్ గుయెన్ (వియత్నాం) మధ్య తొలి రౌండ్ విజేతతో 2019 ప్రపంచ చాంపియన్ సింధు రెండో రౌండ్లో తలపడుతుంది. పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్‌కు క్లిష్టమైన డ్రా ఎదురైంది. మొదటి రౌండ్లోనే అతను 14వ సీడ్ కెంటా నిషిమోటో (జపాన్)ను ఎదుర్కొంటాడు. 11వ సీడ్ లక్ష్య సేన్...జార్జెస్ జులియన్ పాల్ (మారిషస్)తో, 9వ సీడ్ ప్రణయ్... కెల్లే కొల్జనెన్ (ఫిన్లాండ్)తో పోటీపడతారు. పురుషుల డబుల్స్‌లో ప్రపంచ రెండో ర్యాంకింగ్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ఈసారి స్వర్ణంపై కన్నేసింది. గత ఏడాది జరిగిన ఈ టోర్నీలో మేటి డబుల్స్ జోడీ కాంస్య పతకంతో సరిపెట్టుకుంది. మహిళల డబుల్స్‌లో 15వ సీడ్ పుల్లెల గాయత్రి-ట్రిసా జాలీ జంటకు తొలి రౌండ్లో బై లభించింది.







## రెండో గేమ్ కూడా 'డ్రా'

**బకూ (అజర్‌బైజాన్):** ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్ ఓపెన్ విభాగంలో వరల్డ్ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) ఫైనల్ ప్రత్యర్థి ఎవరో నేడు తేలనుంది. భారత యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద, అమెరికా గ్రాండ్‌మాస్టర్ ఫాబియానో కరువానా మధ్య రెండో సెమీఫైనల్ టైబ్రేక్‌కు దారి తీసింది. వీరిద్దరి మధ్య శనివారం తొలి గేమ్ 'డ్రా'కాగా... ఆదివారం జరిగిన రెండో గేమ్‌లో కూడా ఫలితం తేలలేదు. తెల్లపావులతో ఆడిన ప్రజ్ఞానంద 47 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు.



| స్టాక్ మార్కెట్లు | | (శుక్రవారం ముగింపు) | | |
|---|---|---|---|---|
| దేశీ సూచీలు | | విదేశీ సూచీలు | | |
| సెన్సెక్స్ ▽ 202 64,948 | నిఫ్టీ ▽ 55 19,310 | నాస్‌డాక్ | 13,291 ▽ | 26 |
| | | డోజోన్స్ | 34,587 △ | 26 |
| | | ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,262 ▽ | 48 |
| | | డాక్స్ | 15,574 ▽ | 103 |
| | | షాంఘై | 3,132 ▽ | 32 |
| | | నికాయ్ | 31,462 ▽ | 135 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి
•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్



# విదేశీ విద్యానిధికి 'డాలర్' రూట్!

- డాలర్ మారకంలో పెట్టుబడులు
- కరెన్సీ విలువ క్షీణతకు హెడ్జింగ్
- పదేళ్లలో 50% నష్టపోయిన రూపాయి
- ఉన్నత విద్య కోసం భారీ వ్యయం
- విదేశీ ఈక్విటీలు అనుకూలం

హైదరాబాద్‌కు చెందిన వర్ధన్‌కు ఇద్దరు పిల్లలు సంతానం. ఒకరు పదో తరగతి చదువుతుంటే, మరొకరు ఐదో తరగతిలో ఉన్నారు. వీరిద్దరినీ అండర్ గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోసం విదేశాలకు పంపాలన్నది అతడి లక్ష్యం. వర్ధన్ కేవలం ఆకాంక్షతోనే సరిపెట్టలేదు. తమ పిల్లలు మూడేళ్ల వయసులో ఉన్నప్పటి నుంచే ఆయన వారి భవిష్యత్ విద్య కోసం పెట్టుబడులు ప్రారంభించారు. అది కూడా డాలర్‌తో కోల్పోతున్న రూపాయి విలువ క్షీణతను దృష్టిలో పెట్టుకుని వ్యవహరించారు. తన పెట్టుబడులను డాలర్ మారకంలో ఉండేలా చూసుకున్నారు. మరో రెండేళ్ల తర్వాత తన కుమారుడు గ్రాడ్యుయేషన్ కోసం విదేశాలకు వెళ్లాల్సి ఉంది. వర్ధన్ ముందస్తు ప్రణాళిక వల్ల నిశ్చింతగా ఉన్నాడు. విదేశాల్లో కోర్సుల కోసం పెద్ద మొత్తంలోనే ఖర్చు చేయాల్సి వస్తుంది. అందుకే పిల్లలు స్కూల్ ఆరంభంలో ఉన్నప్పటి నుంచే పెట్టుబడుల ప్రణాళికలు అమలు చేయాలి. ఈ విషయంలో వర్ధన్ అనుసరించిన మార్గం ఎంతో మందికి ఆదర్శం అవుతుంది. పిల్లలకు అత్యుత్తమ విదేశీ విద్యావకాశాలు ఇవ్వాలని కోరుకునే తల్లిదండ్రులు, అందుకు కావాల్సిన వనరులను సమకూర్చుకునే మార్గాలను చర్చించేదే ఈ కథనం.



ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య ఏటేటా పెరుగుతూ వెళుతోంది. భారత విదేశాంగ శాఖ గణాంకాల ప్రకారం 2021 జనవరి నాటికి 85 దేశాల్లో సుమారు 11 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో ఎక్కువ మంది కెనడాలో చదువుతున్నారు. ఆ తర్వాత అమెరికా, యూఏఈ, ఆస్ట్రేలియా, యూకే భారత విద్యార్థుల ముఖ్య ఎంపికలుగా ఉన్నాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏటేటా క్షీణిస్తూనే ఉండడాన్ని చూస్తున్నాం. గడిచిన 20 ఏళ్ల కాలాన్ని పరిశీలిస్తే డాలర్‌తో రూపాయి ఏటా సగటున 3 శాతం విలువను నష్టపోతూ వచ్చింది. 2009లో డాలర్‌తో రూపాయి విలువ 46.5గా ఉంటే, ఇప్పుడు 83కు చేరింది. ఇక్కడ గమనించాల్సింది ఏమిటంటే పిల్లల చదువు కోసం చెల్లించాల్సిన ఫీజులు, ఇతర ఖర్చులన్నీ కూడా డాలర్ రూపంలో ఉంటుంటే.. మనం సంపాదించేది రూపాయిల్లో. అందుకుని పిల్లల విద్య కోసం పెట్టుబడులను డాలర్ మారకంలో చేసుకోవడమే మెరుగైన మార్గం అవుతుంది. మొత్తంగా కాకపోయినా, పెట్టుబడుల్లో చెప్పుకోతగ్గ మేర డాలర్ మారకంలో ఇన్వెస్ట్ చేసుకోవాలి. ఒకవైపు డాలర్‌తో రూపాయి మారకం క్షీణిస్తూ పోతుంటే, మరోవైపు ద్రవ్యోల్బణం సైతం కరెన్సీ విలువను కొంత హరిస్తుంటుంది. వీటిని తట్టుకుని పెట్టుబడులపై మెరుగైన రాబడులు వచ్చేలా చూసుకోవాలి. అప్పుడే లక్ష్యం తేలికవుతుంది.



### యూఎస్ మార్కెట్లో ఇన్వెస్ట్‌మెంట్ దారి

**నేరుగా స్టాక్స్**
- దేశీయ బ్రోకరేజీ, విదేశీ బ్రోకరేజీ సంస్థ లేదా ఎన్ఎస్ఈ ఐఎఫ్ఎస్‌సీ ద్వారా ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.
- దేశీయ బ్రోకరేజీ సంస్థలు విదేశీ బ్రోకరేజీ సంస్థలతో జట్టు కట్టి సేవలందిస్తున్నాయి.
- ఎన్ఎస్ఈ, ఐఎఫ్ఎస్‌సీ ద్వారా కొన్ని విదేశీ స్టాక్స్‌లో పెట్టుబడులకు అవకాశం ఉంది.

**ఈటీఎఫ్‌లు**
- ఆర్‌బీఐ పరిమితుల వల్ల కొన్ని ఈటీఎఫ్‌లు మినహా.. మిగిలిన ఈటీఎఫ్‌లు అందుబాటులో ఉన్నాయి.
- కింగ్ ఎర్రర్, పెట్టుబడుల విధానంపై అవగాహన కలిగి ఉండాలి.
- ఈ పెట్టుబడులు ఆర్‌బీఐ లిబరలైజ్డ్ రెమిటెన్స్ స్కీమ్ కిందకు వస్తాయి. ఏడాదిలో 2,50,000 డాలర్లు ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

## రూపాయి విలువ క్షీణత..

గడిచిన కొన్ని దశాబ్దాల కాలంలో డాలర్‌తో రూపాయి ఎంతో నష్టపోయింది. ముఖ్యంగా గత దశాబ్ద కాలంలోనే 50 శాతం విలువను కోల్పోయింది. ఈ క్షీణత ఇక ముందూ కొనసాగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ''యూఎస్ ఫెడరల్ రిజర్వ్ కఠిన వైఖరి తీసుకోవడంతో రూపాయి క్షీణతను ఇక ముందూ చూడనున్నాం. ఎందుకంటే యూఎస్ ఫెడ్ వైఖరితో డాలర్ సరఫరా తగ్గుతుంది. అది వర్ధమాన మార్కెట్లలోకి పెట్టుబడుల రాకపై ప్రభావం చూపిస్తుంది''అని జేఎం ఫైనాన్షియల్ చీఫ్ ఎకనమిస్ట్ ధనుంజయ్ సిన్హా వివరించారు. రూపాయి విలువను కాపాడేందుకు ఆర్‌బీఐ సైతం ఫారెక్స్ నిల్వలను ఉపయోగించుకుంటోంది. డాలర్ ఇదే మాదిరిగా గరిష్ట స్థాయిలో కొనసాగితే, అధిక ముడి చమురు ధరల కారణంగా భారత్‌తో వాణిజ్య లోటు ఎగువనే ఉంటుందన్నది నిపుణుల విశ్లేషణగా ఉంది. ఇది రూపాయి విలువను మరింత కిందకు తోసేస్తుందన్న విశ్లేషణ వినిపిస్తోంది. ''స్వల్ప కాలంలో డాలర్‌తో రూపాయి విలువ 6–7 శాతం మేర క్షీణించొచ్చని భావిస్తున్నాం'' అని ధనుంజయ్ సిన్హా చెప్పారు. 1947లో స్వాతంత్ర్యం సిద్ధించే నాటికి మన రూపాయి విలువ డాలర్ మారకంలో 4గా ఉంటే, ఇప్పుడు 83 స్థాయిలకు చేరుకోవడం గమనించొచ్చు.

## ఫీజులపై రూపాయి ప్రభావం

'విదేశాల్లో చదువుకు, ముఖ్యంగా అమెరికాలో.. ఎంతలేదన్నా అండర్ గ్రాడ్యుయేషన్‌కు 10 వేల నుంచి 50 వేల డాలర్ల వరకు ఖర్చు అవుతుంది. పీజీ చేసేందుకు 12,000 డాలర్ల నుంచి 80,000 డాలర్ల వరకు (స్కాలర్‌షిప్ కలపకుండా) వ్యయం చేయాల్సి వస్తుంది. వీటికి తోడు నివసించే ప్రాంతం ఆధారంగా జీవన వ్యయాలకు అదనంగా ఖర్చు చేయాలి. కరోనా మహమ్మారిని దృష్టిలో పెట్టుకుని విదేశాల్లోని విద్యా సంస్థలు ఇప్పటి వరకు ట్యూషన్ ఫీజుల పెంపులకు దూరంగా ఉన్నాయి. ఇప్పుడు ఖర్చులు భారీగా పెరిగాయంటే అది కేవలం కరెన్సీ కారణంగానే' అని విదేశీ విద్యా కన్సల్టెన్సీ సంస్థ ఏపీఎస్ వరల్డ్ సీఈవో అనిర్బన్ సిర్కార్ తెలిపారు. ఏటా రూపాయి విలువ క్షీణిస్తుందని భావిస్తే.. దీనికి అనుగుణంగా విదేశీ కోర్సుల వ్యయం పెరుగుతూ వెళుతుంది. ''విదేశీ విద్యా వ్యయం ఏటా పెరుగుతూనే ఉంది. దీనికి ద్రవ్యోల్బణం ఒక్కటే కారణం కాదు. డాలర్‌తో రూపాయి విలువ క్షీణిస్తుండడం కూడా కారణమే'' అని యూఎస్‌లో పెట్టుబడులకు వీలు కల్పించే వేదిక వెస్టెడ్ ఫైనాన్స్ సీఈవో విరమ్‌షా చెప్పారు.

•••


2012 జూలైలో రూపాయి విలువ డాలర్‌తో 55గా ఉంది. అప్పుడు అండర్ గ్రాడ్యుయేట్ కోర్స్ ట్యూషన్ ఫీజు ఏడాదికి 20,000 డాలర్లు ఉందని అనుకుందాం. నాడు డాలర్‌తో రూపాయి విలువ 55 ప్రకారం ఒక ఏడాదికి రూ.11 లక్షలు ఫీజు కోసం చెల్లించాల్సి వచ్చేది. అదే ఫీజు ఇప్పటికీ పెరగకుండా అక్కడే ఉన్నా కానీ, రూపాయి విలువ క్షీణత ఫలితంగా కోర్సు వ్యయం రూ.16.60 లక్షలకు పెరిగినట్టు అవుతుంది. అంటే రూ.5 లక్షలకు పైగా పెరిగింది. ద్రవ్యోల్బణం ప్రభావాన్ని కూడా కలిపి చూస్తే ఈ భారం ఇంకాస్త ఎక్కువే ఉంటుంది. అందుకని పిల్లల విదేశీ విద్య కోసం పొదుపు చేసే వారు కేవలం ద్రవ్యోల్బణం ఒక్కటే కాకుండా, రూపాయి క్షీణతను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

## అంతర్జాతీయ పెట్టుబడుల మార్గం

విదేశీ విద్య కోసం చేసే పెట్టుబడులను అంతర్జాతీయ మార్కెట్లకు కేటాయించుకోవడం అర్థవంతంగా ఉంటుంది. జపాన్, బ్రిటన్, యూఎస్ తదితర దేశాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. పెట్టుబడులకు వైవిధ్యం కూడా తోడవుతుంది. భారత ఇన్వెస్టర్లలో ఎక్కువ మంది అమెరికన్ మార్కెట్లలోనే ఇన్వెస్ట్ చేస్తున్నారు. ఇప్పటికైతే డాలర్ ఆధిపత్యానికి ఎలాంటి ఇబ్బంది లేదన్న విశ్లేషణ వినిపిస్తోంది. యూఎస్ పెట్టుబడులు కరెన్సీ విలువ పతనానికి హెడ్జింగ్‌గానే కాకుండా పెట్టుబడుల్లో వైవిధ్యానికీ వీలు కల్పిస్తాయన్నది నిపుణుల సూచన. ''విదేశీ విద్య కోసం, డాలర్ మారకంలో లక్ష్యాల కోసం యూఎస్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టుకోవడం మంచి విధానం అవుతుంది. దీని వల్ల గమ్యస్థానంలో (చదువుకునే) ద్రవ్యోల్బణానికి తోడు, రూపాయి విలువ క్షీణతకు హెడ్జింగ్‌గా పనిచేస్తుంది. చాలా దేశాల్లో రిటైల్ ద్రవ్యోల్బణంతో పోలిస్తే ఉన్నత విద్య ద్రవ్యోల్బణం ఎక్కువే ఉంటుంది'' అని ఫింజ్ స్కాలర్జ్ వెల్త్ మేనేజర్ సీఈవో రేణు మహేశ్వరి సూచించారు. డాలర్‌తో ఇన్వెస్ట్ చేసినప్పుడు, తిరిగి డాలర్‌తో ఉపసంహరించుకునేట్టుగా ఉంటే, అది అధిక ప్రయోజనాన్నిస్తుంది.

•••

ఉదాహరణకు 2012లో నిఫ్టీ 500 ఈటీఎఫ్‌లో, ఎస్అండ్‌పీ 500లో 100 డాలర్లు చొప్పున ఇన్వెస్ట్ చేశారని అనుకుందాం. నాడు డాలర్‌తో రూపాయి విలువ 55గా ఉంది. అప్పటి నుంచి ఈ రెండు సూచీలు ఏటా 13 శాతం రాబడులు ఇచ్చాయి. దీంతో నిఫ్టీ 500 ఈటీఎఫ్‌లో 100 డాలర్ల పెట్టుబడి నేడు రూ.18,000 అవుతుంది. ఎస్అండ్‌పీ 500 ఈటీఎఫ్‌లో పెట్టుబడి రూ.25,000 అయి ఉండేది. 40 శాతం అధికంగా ఎస్అండ్‌పీ 500 ఈటీఎఫ్‌లో రాబడులు వచ్చాయి. రెండు సూచీలు ఒకే విధమైన రాబడిని ఇచ్చినా.. రెండు దేశాల కరెన్సీ విలువల్లో మార్పుల ఫలితంగా ఎస్అండ్‌పీ 500లో అధిక రాబడులు వచ్చాయి. డాలర్‌తో రూపాయి క్షీణించడం వల్లే ఇలా జరిగింది.



## ఏమిటి మార్గం..?

విదేశీ విద్య కోసం డాలర్ మారకంలో పెట్టుబడులు మేలైన మార్గం అన్నది నిపుణుల సూచన. కానీ, ఒక ఇన్వెస్టర్‌గా తాను చేసే పెట్టుబడులను అర్థం చేసుకుని, వాటి పనితీరును ట్రాక్ చేసుకునే విషయ పరిజ్ఞానం తప్పనిసరి. ఎందుకంటే అంతర్జాతీయ పెట్టుబడులపై ఎన్నో అంశాల ప్రభావం ఉంటుంది. దేశీయ అంశాలతో సంబంధం ఉండదు. అందుకని వాటిని విడిగా ట్రాక్ చేసుకోవాల్సిందే. ''అంతర్జాతీయ పెట్టుబడులను ఎంపిక చేసుకునే ముందు చార్జీలను తప్పకుండా చూడాలి. సరైన స్టాక్‌ను సరైన ధరల వద్ద కొనుగోలు చేసే నైపుణ్యాలు కూడా అవసరం'' అని మహేశ్వరి తెలిపారు. తమ మొత్తం పెట్టుబడుల్లో 10–15 శాతం మేర విదేశీ స్టాక్స్ కోసం వైవిధ్యం కోణంలో కేటాయించుకోవచ్చు. పిల్లల విదేశీ విద్యకు ఎంత ఖర్చు అవుతుందో, ఆ అంచనాల మేరకు కేటాయింపులు చేసుకోవాలి. స్టాక్స్ ఎంపిక తెలియని వారు, ఈ రిస్క్ తీసుకోకుండా విదేశీ స్టాక్స్‌తో కూడిన మ్యూచువల్ ఫండ్స్ పథకాలను ఎంపిక చేసుకోవచ్చు. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ యూఎస్ బ్లూచిప్ ఈక్విటీ ఫండ్ ఏడాది కాలంలో 17 శాతం వరకు రాబడులు ఇచ్చింది. డీఎస్‌పీ యూఎస్ ఫ్లెక్సిబుల్ ఈక్విటీ ఫండ్ 15 శాతం రాబడులు తెచ్చి పెట్టింది. ఇలాంటి ఎన్నో ఫండ్స్ అందుబాటులో ఉన్నాయి. డాలర్ మారకంలో పెట్టుబడులకు అవసరమైతే ఆర్థిక సలహాదారులను సంప్రదించడానికి వెనుకాడొద్దు.

## సన్సేరా ఇంజనీరింగ్ | చాయిస్ ఇంటర్నేషనల్ | కొనొచ్చు

స్టాక్స్ వ్యూ

ప్రస్తుత ధర: రూ. 920 టార్గెట్: రూ. 1,064

ఎందుకంటే: ఆటోమోటివ్ విడిభాగాల కంపెనీ సన్సేరా ఇంజనీరింగ్ లిమిటెడ్(ఎస్ఈఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికంలో అంచనాలను మించిన పనితీరు చూపింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో స్వీడిష్ అనుబంధ సంస్థ పటిష్ట వృద్ధిని సాధించింది. ఆదాయం 35 శాతం జంప్‌చేయగా.. మొత్తం ఎగుమతులు వార్షికంగా 33 శాతం ఎగశాయి. పూర్తి ఏడాదిలోనూ ఎగుమతుల్లో భారీ వృద్ధి సాధించగలమని కంపెనీ యాజమాన్యం విశ్వాసాన్ని వ్యక్తం చేస్తోంది. ఇందుకు పటిష్ట ఆర్డర్ బుక్, కొత్త క్లయింట్ల జమ, సామర్థ్య విస్తరణ తదితర అంశాలు దోహదపడనున్నాయి. వార్షిక ప్రాతిపదికన ఈ ఆర్థిక సంవత్సరంలో కంపెనీ మొత్తం ఆదాయం 24 శాతం, నిర్వహణ లాభం(ఇబిటా) 25 శాతం, నికర లాభం 31 శాతం చొప్పున వృద్ధి చెందే వీలుంది. ఈ క్యూ1లో ఆటో విభాగం ఐసీఈ బిజినెస్‌నుంచి ఆదాయం 20 శాతం పురోగమించింది. త్రైమాసిక ప్రాతిపదికన(గతేడాది క్యూ4తో పోలిస్తే) మార్జిన్లు 1.12 శాతం మెరుగుపడి 17.4 శాతానికి చేరాయి. గత క్యూ1తో చూస్తే నామమాత్ర వృద్ధిని సాధించాయి. నికర లాభం 31 శాతం జంప్‌చేసి రూ. 45 కోట్లకు చేరింది. ట్రాన్స్‌ఫార్మేషన్‌లో భాగంగా ఎస్ఈఎల్ ఆటోమోటివ్ నుంచి నాన్‌ఆటోమోటివ్, ఎక్స్ఈవీ అగ్నోస్టిక్ ప్రొడక్టుల సరఫరాలోకి ప్రవేశించింది. తద్వారా కంపెనీ సామర్థ్యాన్ని నిరూపించుకుంది. మధ్యకాలం నుంచి దీర్ఘకాలానికి కంపెనీ పటిష్ట ఫలితాలు సాధించే అవకాశముంది. రెండేళ్ల కాలంలో ఆదాయం 17 శాతం, ఇబిటా 22 శాతం, నికర లాభం 29 శాతం చొప్పున వృద్ధి సాధించవచ్చని అంచనా.




## ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ | మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 785 టార్గెట్: రూ. 880

ఎందుకంటే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) తొలి త్రైమాసికంలో రవాణా, లాజిస్టిక్స్ సర్వీసుల కంపెనీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మిశ్రమ పనితీరు ప్రదర్శించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో మొత్తం ఆదాయం వార్షికంగా 9 శాతం పుంజుకుని రూ. 950 కోట్లను తాకింది. ఇది మా అంచనాలకంటే 5 శాతం తక్కువకాగా.. సరుకు రవాణా 3 శాతం, సరఫరా చైన్ విభాగం వార్షికంగా 20 శాతం చొప్పున వృద్ధి చూపాయి. అధిక మార్జిన్లు ఆర్జించగల జల రవాణా(సీవేస్) విభాగం మాత్రం వార్షిక ప్రాతిపదికన 18 శాతం క్షీణించింది. నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు 0.9 శాతం నీరసించి 10.6 శాతానికి పరిమితమయ్యాయి. మా అంచనా 10.8 శాతంకాగా.. నికర లాభం 6 శాతం బలపడి రూ. 82.3 కోట్లకు చేరింది. వెరసి 5 శాతం అంచనాలను స్వల్పంగా అధిగమించింది. అంచనాలకంటే తగ్గిన పన్ను రేటు లాభాల్లో వృద్ధికి దోహదం చేసింది. అసంఘటిత రంగం నుంచి సంఘటిత రంగానికి పెరుగుతున్న డిమాండ్ కారణంగా సరుకు రవాణా సర్వీసుల బిజినెస్ లబ్ధి పొందే అవకాశముంది. ఆటోమోటివ్ రంగ పురోభివృద్ధి నేపథ్యంలో సరఫరా చైన్ విభాగం వృద్ధి బాటలోనే కొనసాగే వీలుంది. ఇక గరిష్ట మార్జిన్లు సాధించే సీవేస్ బిజినెస్ ఈ ఆర్థిక సంవత్సరంలో దాదాపు యథాతథ స్థితిలోనే కొనసాగవచ్చని అంచనా. ఈ విభాగానికి కొత్త నౌక జత కావలసి ఉంది. ఈ ఏడాది ద్వితీయార్ధం (అక్టోబర్– మార్చి) కాలంలో కొత్త నౌక అందుబాటులోకి రావచ్చని కంపెనీ భావిస్తోంది. వివిధ విభాగాల ఔట్‌లుక్ మెరుగుపడటంతో వచ్చే ఏడాదికి షేరువారీ ఆర్జన(ఈపీఎస్) అంచనాలను 4 శాతంమేర పెంచుతున్నాం. దీర్ఘకాలానికి షేర్ మంచి రాబడులు ఇస్తుందని భావిస్తున్నాం.




గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

## బిగ్-సి మరో 150 స్టోర్లు

రూ.1,500 కోట్ల టర్నోవర్ లక్ష్యం • కంపెనీ ఫౌండర్ బాలు చౌదరి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మొబైల్స్ విక్రయాల్లో ఉన్న బిగ్-సి వచ్చే రెండేళ్లలో రూ.300 కోట్లతో కొత్తగా 150 ఔట్‌లెట్లను ఏర్పాటు చేస్తోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడులో కంపెనీకి 250 స్టోర్లున్నాయి. 2023–24లో టర్నోవర్ 50 శాతం వృద్ధితో రూ.1,500 కోట్లు లక్ష్యంగా చేసుకున్నామని బిగ్-సి ఫౌండర్, సీఎండీ ఎం.బాలు చౌదరి తెలిపారు. కంపెనీ రెండు దశాబ్దాల వేడుకల్లో భాగంగా బిగ్-సి బ్రాండ్ అంబాసిడర్, సినీ నటుడు మహేశ్ బాబుతో కలిసి ఈడీ వై.స్వప్న కుమార్, డైరెక్టర్లు జి.బాలాజీ రెడ్డి, ఆర్.గౌతమ్ రెడ్డి, కైలాశ్ లఖ్యానితో కలిసి ఆదివారమిక్కడ మీడియాతో మాట్లాడారు. '2002 డిసెంబర్ 23న బిగ్-సి మొదలైంది. మొబైల్స్ రిటైల్‌లో తెలంగాణ, ఏపీలో తొలి స్థానంలో నిలిచి రెండు దశాబ్దాల ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేశాం. మూడవ దశాబ్దంలోనూ అగ్ర స్థానాన్ని కొనసాగిస్తాం. 3 కోట్ల మంది కస్టమర్లను సొంతం చేసుకున్నాం. మరిన్ని ఎలక్ట్రానిక్స్, గ్యాడ్జెట్స్‌ను జతచేస్తాం. 1,500 మందిని కొత్తగా నియమించుకోవడం ద్వారా సిబ్బంది సంఖ్య రెండేళ్లలో 4,000లకు చేరుతుంది. ఒక్కో కుటుంబంలో మూడు తరాలకు సేవలు అందిస్తున్నాం' అని చెప్పారు.



మహేశ్‌బాబుతో గౌతమ్ రెడ్డి, స్వప్న కుమార్, బాలు చౌదరి, బాలాజీ రెడ్డి, కైలాశ్ లఖ్యాని (ఎడమ నుంచి)

### తుది దశలో నేషనల్ ఈ కామర్స్ విధానం

- ప్రతిపాదిత జాతీయ ఈ-కామర్స్ విధానం తుది దశలో ఉన్నట్టు ఓ సీనియర్ ప్రభుత్వ అధికారి వెల్లడించారు. దీనికి సంబంధించి భాగస్వాముల అభిప్రాయాల స్వీకరణకు కొత్త ముసాయిదా పాలసీ విడుదల ఉండదని స్పష్టం చేశారు.

| కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో) | |
|---|---|
| 21-8-2023 | |
| విశాఖ | 470–00 |
| చిత్తూరు | 503–00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 435–00 |
| విజయవాడ | 435–00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| 20-8-2023 ఫామ్ ధర... | |
| హైదరాబాద్ | 410–00 |
| వరంగల్ | 412–00 |
| రిటైల్ ధర | 4.70 |

# ఎస్‌డబ్ల్యూపీతో స్థిరమైన ఆదాయం పొందొచ్చా?

**ఎస్‌డబ్ల్యూపీ అంటే ఏంటి? ఓ పథకంలో పెట్టుబడి పెట్టి, తదుపరి నెల నుంచి ఎస్‌డబ్ల్యూపీ ద్వారా ఆదాయం పొందొచ్చా?** – కృతిక

మార్కెట్ల అస్థిరతలను అధిగమించేందుకు వీలుగా క్రమంగా ఇన్వెస్ట్ చేసుకునేందుకు సిప్ ఎలా ఉపయోగపడుతుందో..? అదే మాదిరి.. సిస్టమ్యాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్ (ఎస్‌డబ్ల్యూపీ) అనేది, పెట్టుబడిని క్రమానుగతంగా వెనక్కి తీసుకునేందుకు వీలు కల్పిస్తుంది. మార్కెట్లు కనిష్టాల్లో (తక్కువ విలువల వద్ద) ఉన్నప్పుడు పెట్టుబడినంతా వెనక్కి తీసుకోకుండా ఎస్‌డబ్ల్యూపీ సాయపడుతుంది. రిటైర్మెంట్ తీసుకున్న వారికి ఎస్‌డబ్ల్యూపీ అనుకూలంగా ఉంటుంది. కావాల్సినంత స్థిరమైన ఆదాయం పొందే ఏర్పాటు చేసుకోవచ్చు. ఎన్ని రోజులకు ఒకసారి ఆదాయం రావాలన్నది నిర్ణయించుకునే స్వేచ్ఛ ఉంటుంది. ఇన్వెస్టర్ ప్రతీ నెలా నిర్ణీత తేదీన, నిర్ణీత మొత్తాన్ని ఎస్‌డబ్ల్యూపీ ద్వారా రావాలని నిర్ణయించుకుంటే.. అదే రోజు ఆ మొత్తం బ్యాంకు ఖాతాకు జమ అవుతుంది. ఆ మేరకు పెట్టుబడుల నుంచి యూనిట్లు తగ్గిపోతాయి. సిప్‌కు విరుద్ధంగా పనిచేసేదే ఎస్‌డబ్ల్యూపీ. ఇక్కడ రెండు కీలక అంశాలను గుర్తుపెట్టుకోవాలి. ఎస్‌డబ్ల్యూపీ కోసం చేసే పెట్టుబడుల్లో కనీసం మూడింట ఒక వంతు అయినా ఈక్విటీల్లో ఉంచుకోవాలి. ఉపసంహరించుకునే మొత్తం ఏటా పెట్టుబడుల విలువలో 4–6 శాతం మించి ఉండకూడదు. దీనివల్ల పెట్టుబడికి నష్టం లేకుండా ఉంటుంది. ఉదాహరణకు మీ పెట్టుబడులపై రాబడి వార్షికంగా 8–9 శాతంగా ఉండి, మీరు 5 శాతాన్ని వెనక్కి తీసుకుంటున్నట్టు అయితే.. అప్పుడు మిగిలిన 3–4 శాతం రాబడి పెట్టుబడి వృద్ధికి తోడ్పడుతుంది. దీనివల్ల మీ పెట్టుబడి విలువ క్షీణించకుండా ఉంటుంది. ఎస్‌డబ్ల్యూపీ ద్వారా ఉపసంహరించుకునే మొత్తంలో కొంత పెట్టుబడి, కొంత లాభం ఉంటుంది. ఈ లాభంపైనే పన్ను పడుతుంది. డెట్‌లో అయితే కాలవ్యవధితో సంబంధం లేకుండా లాభం వ్యక్తిగత ఆదాయానికి కలుస్తుంది. ఈక్విటీల్లో అయితే ఏడాదిలోపు లాభంపై 15 శాతం చెల్లించాలి. ఏడాదికి మించిన లాభం మొదటి రూ.లక్షపై పన్ను లేదు. తదుపరి లాభంపై 10 శాతం పన్ను పడుతుంది.

Q & A


ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



**ఫండ్ ఆఫ్ ఫండ్స్ (ఎఫ్‌వోఎఫ్) ఎలా పనిచేస్తాయి? వీటి వల్ల లాభాలేంటి?** – రవీంద్రనాథ్

ఫండ్ ఆఫ్ ఫండ్ (ఎఫ్‌వోఎఫ్) అంటే సమీకరించిన పెట్టుబడులను తీసుకెళ్లి మరో మ్యూచువల్ ఫండ్ పథకంలో ఇన్వెస్ట్ చేసే పథకం. పెట్టుబడుల విధానానికి అనుగుణంగా డెట్ ఫండ్స్ లేదా ఈక్విటీ ఫండ్స్‌లో ఒకటి లేదా ఒకటికి మించిన పథకాల్లో ఇన్వెస్ట్ చేయవచ్చు. సాధారణంగా ఎఫ్‌వోఎఫ్‌లను ఆయా ఫండ్స్ హౌస్‌లు వాటికి సంబంధించిన ఈటీఎఫ్‌ల్లో ఇన్వెస్ట్ చేసేందుకు ప్రారంభిస్తుంటాయి. ఎఫ్‌వోఎఫ్‌లు ఇతర మ్యూచువల్ ఫండ్స్ పథకాల మాదిరే పనిచేస్తాయి. వీటిల్లోనూ సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో పెట్టుబడి పెట్టుకోవచ్చు. విదేశీ సూచీలు, విదేశీ మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లో ఇన్వెస్ట్ చేసే ఎఫ్‌వోఎఫ్‌లు కూడా ఉన్నాయి. ఇతర పథకాల మాదిరే ఎఫ్‌వోఎఫ్‌ల్లోనూ ఎక్స్‌పెన్స్ రేషియో ఉంటుంది. ఎఫ్‌వోఎఫ్‌లు ఇతర పథకాల్లో ఇన్వెస్ట్ చేస్తాయి కనుక రెండింటిలోనూ ఎక్స్‌పెన్స్ రేషియో భారం ఇన్వెస్టర్‌పైనే పడుతుంది. ఉదాహరణకు ఎఫ్‌వోఎఫ్‌లో 1 శాతం ఎక్స్‌పెన్స్ రేషియో ఉందనుకుంటే, అది ఇన్వెస్ట్ చేసే పథకం ఎక్స్‌పెన్స్ రేషియో 0.50 శాతం ఉంటే మొత్తం 1.5 శాతం ఎక్స్‌పెన్స్ రేషియో చెల్లించాల్సి వస్తుంది. ఎఫ్‌వోఎఫ్ ఇన్వెస్ట్ చేసే పథకంలో నేరుగా ఇన్వెస్టర్లు పెట్టుబడులకు అవకాశం లేనప్పుడు వీటిని పరిశీలించొచ్చు. ఎఫ్‌వోఎఫ్‌లను నాన్ ఈక్విటీ పథకంగా పరిగణిస్తారు. కనుక డెట్ పథకాలకు మాదిరే మూలధన లాభాలపై పన్ను అమలవుతుంది. ఒకవేళ ఎఫ్‌వోఎఫ్ దేశీయ ఈక్విటీ పథకాల్లోనే 90 శాతానికిపైగా పెట్టుబడి పెడితే ఈక్విటీకి మాదిరే మూలధన లాభాల పన్ను వర్తిస్తుంది.

## క్లుప్తంగా...

### భారతీయ వైద్య విద్యార్థుల కోసం ఉజ్బెకిస్థాన్ హెల్ప్‌లైన్


లక్డీకాపూల్ (హైదరాబాద్): ఉజ్బెకిస్థాన్ ఆరోగ్య మంత్రిత్వశాఖ, తాష్కెంట్ మెడికల్ అకాడమీ (టీఎంఏ) కలిసి భారతీయ ఎంబీబీఎస్ విద్యార్థుల కోసం జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) ప్రమాణాల ప్రకారం 1800123 2931 అనే టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్, www.studyinuzbek.uz అనే వెబ్‌సైట్‌ను ప్రారంభించాయి. హైదరాబాద్‌లోని టీఎంఏ దక్షిణాసియా ప్రతినిధి కార్యాలయం దేశంలోని ప్రధాన నగరాలన్నింటిలో సెమినార్లు కూడా నిర్వహిస్తున్నాయి. కొంతమంది మోసపూరిత ఏజెంట్లు ఎంబీబీఎస్‌లో ప్రవేశాలు కల్పిస్తామని చెబుతూ, మధ్య తరగతికి చెందిన తల్లిదండ్రుల నుంచి పెద్ద మొత్తాల్లో డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ విషయం కేంద్ర ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో ఎన్ఎంసీ తాజాగా కొత్త నిబంధనలు విధించింది. ఈ వెబ్‌సైట్, హెల్ప్‌లైన్ ద్వారా వైద్య విద్యార్థులు విదేశీ విద్య విషయంలో సమాచారాన్ని తనిఖీ చేసుకుని, తమ ప్రవేశాల విషయాన్ని ఎన్ఎంసీ ప్రమాణాల ప్రకారం ఖరారు చేసుకోవచ్చు. టీఎంఏ వైస్ డీన్ ఖొల్మతొవ్ మాట్లాడుతూ 'మా వ్యూహాత్మక భాగస్వామి నియో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ భారతీయ పాఠ్యాంశాలు, పాఠ్యపుస్తకాలు, అధ్యాపకులు, నెక్స్ట్ మాస్టర్ క్లాసులను అందిస్తుంది. 250 మంది భారతీయ విద్యార్థులను టీఎంఏలో ఇంగ్లిష్ మీడియంలో ఆరేళ్ల పాటు వైద్య విద్యను చదవడానికి వీలు కల్పిస్తుంది' అని అన్నారు.

### సీటెట్‌కు 25 వేలమంది హాజరు

సాక్షి, హైదరాబాద్: జాతీయ స్థాయిలో ఉపాధ్యాయ ఉద్యోగాలకు పోటీ పడేవారి కోసం సెంట్రల్ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీటెట్) ఆదివారం దేశవ్యాప్తంగా జరిగింది. మొత్తం 20 భాషల్లో పరీక్ష నిర్వహించారు. తెలంగాణ వ్యాప్తంగా దాదాపు 25 వేల మంది పరీక్షకు హాజరయ్యారు. హైదరాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్ కేంద్రాల్లో పరీక్ష జరిగింది. హైదరాబాద్ నాచారంలోని పరీక్ష కేంద్రంలో ఓఎంఆర్ షీట్ తప్పుగా ఇవ్వడంతో గందరగోళం నెలకొంది. ఓంఎంఆర్‌పై ఉన్న కోడ్‌ను వైట్‌నర్‌తో చెరిపి, కొత్త కోడ్ నంబర్ ఇవ్వడంతో విద్యార్థులు సందేహాలు వ్యక్తం చేశారు. ఇవి ఫలితాల్లో ప్రభావం చూపుతాయని పరీక్ష కేంద్రంలోని నిర్వాహకులను నిలదీశారు. తాము ఉన్నతాధికారుల ఆదేశం మేరకే వ్యవహరించామని, ఎవరికీ ఎలాంటి నష్టం జరగదని వారు హామీ ఇచ్చినట్టు విద్యార్థులు తెలిపారు.

# 100 ఖాతాలు.. రూ.400 కోట్లు!


భరత్‌కుమార్



**పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో కొల్లగొట్టేశారు**

- దుబాయ్, తైవాన్, చైనాల్లో ఉన్న సూత్రధారులు
- గుట్టురట్టు చేసిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు
- సహకరిస్తున్న ముంబై వాసి భరత్ కుమార్ అరెస్టు

సాక్షి, హైదరాబాద్: విదేశాల్లో ఉంటూ ఇక్కడ పార్ట్‌టైమ్ జాబ్స్ పేరుతో ఎరవేసి ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్స్‌తో బాధితులను నిండా ముంచుతున్న సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న ముంబై వాసిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు పట్టుకున్నారు. ఈ–క్రిమినల్స్ ఫైనాన్షియల్ నెట్‌వర్క్‌ను పర్యవేక్షిస్తున్న ఇతను ప్రతి లావాదేవీకి 20 శాతం కమీషన్ తీసుకుంటున్నాడని, బ్యాంకు ఖాతాల్లో పడిన మొత్తాన్ని క్రిప్టో కరెన్సీగా మారుస్తూ విదేశాలకు తరలిస్తున్నాడని దర్యాప్తు అధికారులు గుర్తించారు. కేసులో పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నారు.

**వ్యాపారం సాగక అడ్డదారి..**

ముంబైకి చెందిన రోనక్ భరత్ కుమార్ కక్కడ్ వృత్తిరీత్యా డిజిటల్ మార్కెటింగ్ నిర్వాహకుడు. వివిధ కంపెనీలకు సంబంధించిన ప్రకటనలు తయారు చేయడం, వీటిని సోషల్ మీడియా ద్వారా ప్రమోట్ చేయడం చేస్తుండేవాడు. ఈ వ్యాపారం కోసం రొలైట్ మార్కెట్, బ్లాక్ వే డిజిటల్ పేర్లతో రెండు కంపెనీలు ఏర్పాటు చేశాడు. వీటి పేర్లతో కరెంట్ ఖాతాలు కూడా తెరిచాడు. కానీ వ్యాపారం ఆశించిన స్థాయిలో సాగకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాడు. ఇందులో భాగంగా టెలిగ్రామ్ యాప్ ద్వారా వివిధ వ్యాపారాలు, స్కీమ్‌లు తదితరాలకు సంబంధించిన గ్రూప్‌లను సెర్చ్ చేశాడు. ఓ గ్రూపు ద్వారా తైవాన్‌కు చెందిన స్వాంగ్ లిన్, యూరోపియన్ యూనియన్‌కు చెందిన ఇరీన్ పరిచయమయ్యారు.

**20% కమీషన్‌తో..**

తొలుత భరత్‌ను సంప్రదించిన ఆ ఇద్దరూ తమకు ఇండియాలో కొన్ని వ్యాపారాలు ఉన్నాయని, అనేక మంది నిరుద్యోగులకు తాము పార్ట్‌టైమ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని, వారి నుంచి అడ్వాన్సులు తీసుకుంటామని చెప్పారు. వాటికి సంబంధించిన నగదు భారీగా జమ చేయడానికి బ్యాంకు ఖాతాలు కావాలని అడిగారు. అయితే ఈ ఖాతాలను వినియోగించి సైబర్ నేరాలు చేస్తారన్న విషయం తెలిసిన భరత్.. అదే అంశం వారితో చెప్పి బేరసారాలు చేశాడు. ప్రతి లావాదేవీపైనా 20 శాతం కమీషన్ తీసుకుని సహకరించేందుకు అంగీకరించాడు. భరత్ తన రెండు ఖాతాలతో పాటు దుబాయ్‌లో ఉండే స్నేహితుడు ప్రశాంత్‌ను సంప్రదించి అక్కడి భారతీయులకు సంబంధించిన బ్యాంకు ఖాతాలతో పాటు ఇక్కడ ఉండే వారి బంధువులవీ సేకరించాడు. ప్రశాంత్ దుబాయ్‌లోని తన కార్యాలయం ద్వారా పన్నులు లేకుండా నగదును దుబాయ్ కరెన్సీగా మార్చే వ్యాపారం చేస్తున్నాడు.

**క్రిప్టో కరెన్సీగా మార్చి..**

దుబాయ్, భారత్‌లో ఉన్న పలువురికి చెందిన 100 బ్యాంకు ఖాతాల వివరాలు ప్రశాంత్ నుంచి భరత్‌కు, అతన్నుంచి విదేశాల్లో ఉన్న స్వాంగ్ లిన్, ఇరీన్‌కు చేరాయి. వీరు తమ వలలో పడిన వారికి ఈ ఖాతాల నంబర్లనే ఇచ్చి డబ్బు డిపాజిట్/ట్రాన్స్‌ఫర్ చేయించేవారు. ఆ సొమ్మును ప్రశాంత్ తన ఖాతాల్లోకి బదిలీ చేసుకుని, క్రిప్టో కరెన్సీగా మార్చి భరత్‌కు పంపేవాడు. భరత్ తైవాన్‌లో ఉండే స్వాంగ్ లిన్‌కు పంపేవాడు. బ్యాంకు ఖాతాల నిర్వహణ, కరెన్సీ మార్పిడి బాధ్యతలు భరత్‌కుమార్, ప్రశాంత్ నిర్వహిస్తుండగా, బాధితులను మోసం చేయడం లిన్, ఇరీన్ చేసేవాళ్లు. తమకు చేరిన మొత్తం నుంచి లిన్, ఇరీన్ తమ వాటా మిగుల్చుకుని మిగిలింది చైనాలో ఉండే కీలక నిందితులకు పంపేవాళ్లు. ఇలా మొత్తం ఆరు నెలల్లో రూ.400 కోట్లు కొల్లగొట్టారు. నగరంలో నమోదైన ఓ కేసు దర్యాప్తులో ఈ వ్యవహారాలు గుర్తించిన సైబర్ క్రైమ్ పోలీసులు గత వారం భరత్‌ను అరెస్టు చేసి తీసుకువచ్చారు.

# ఫొటో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి: హరీశ్‌రావు

**ఫొటోగ్రఫీ విజేతలకు బహుమతుల ప్రదానం**


మంత్రి హరీశ్‌రావు చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న శ్రీకాంత్. చిత్రంలో అల్లం నారాయణ, కొప్పుల ఈశ్వర్, దేశపతి శ్రీనివాస్


ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణతో.. అవార్డులు అందుకున్న 'సాక్షి' ఫొటోగ్రాఫర్లు శివప్రసాద్, యాకయ్య, వేణుగోపాల్, సతీశ్, శివకుమార్, భాస్కరాచారి, రాజేశ్‌రెడ్డి, ఠాకూర్

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): ఫొటో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హరీశ్‌రావు హామీ ఇచ్చారు. గతంలో పత్రికా ఫొటోగ్రాఫర్లకు ఫొటో జర్నలిస్టుగా అక్రిడిటేషన్ ఉండేదని, కానీ నేడు ఫొటోగ్రాఫర్‌గా మార్పు చేయడం వలన ఇబ్బంది పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ సమస్య త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ ఫొటోజర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌లో గెలుపొందిన ఫొటో గ్రాఫర్లకు ఆదివారం రవీంద్రభారతిలో బహుమతులు ప్రదానం చేశారు. హరీశ్ మాట్లాడుతూ దినపత్రికల్లో వార్త పూర్తిగా చదవకపోయినప్పటికీ ఫొటోను చూసి సారాంశం గ్రహించవచ్చని చెప్పారు. తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్లు జర్నలిస్టుల సంక్షేమ నిధి కోసం కేటాయించిందని, త్వరలో జర్నలిస్టు భవనం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

**అవార్డులు అందుకున్న 'సాక్షి' ఫొటోగ్రాఫర్లు వీరే..**

- అముముల యాకయ్య (సూర్యాపేట)
- ఠాకూర్, రాజేశ్‌రెడ్డి (హైదరాబాద్)
- కె.శివకుమార్ (యాదాద్రి భువనగిరి)
- వి.భాస్కరాచారి (మహబూబ్‌నగర్)
- శ్రీకాంత్ (సిరిసిల్ల)
- శివప్రసాద్ (సంగారెడ్డి)
- వేణు (జనగామ)
- సతీశ్ (సిద్దిపేట)

## ఫలితం కోసం చూడకుండా
# అంకితభావంతో పనిచేయాలి

**హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే**



ఐఏఎంసీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే తదితరులు

సాక్షి, హైదరాబాద్: 'ఫలితాల కోసం ఎదురుచూడకుండా అంకితభావంతో నీ పని నువ్వు చేసుకుపో.. అని భగవద్గీతలోని శ్లోకాలు చెబుతున్నాయి..ఇది అర్బిట్రేషన్‌లో నిపుణులు ఎలాంటి కీలకపాత్ర పోషించాలో చెబుతుంది'అని హైకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే అన్నారు. ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్ (ఐఏఎంసీ) ఆధ్వర్యంలో 'ఆర్బిట్రేషన్‌లో విలువను పెంపొందించడం–నిపుణుల సూచనలు'అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన'అనే భగవద్గీత శ్లోకాన్ని ఉటంకించారు.నిష్పక్షపాతానికి కట్టుబడి న్యాయమైన తీర్మానాలకు వేదికను ఏర్పాటు చేయడంతో నిపుణులకు ఈ సూత్రం ప్రతిధ్వనిస్తుందని చెప్పారు. ఐఏఎంసీ రిజిస్ట్రార్ ప్రారంభోపన్యాసం చేశారు. భారత్‌ను అంతర్జాతీయ మధ్యవర్తిత్వ కేంద్రంగా మార్చడంలో న్యాయవ్యవస్థ, ప్రభుత్వ పాత్ర కీలకమని అన్నారు. కార్యక్రమంలో జస్టిస్ బి.విజయసేన్‌రెడ్డి, జస్టిస్ శ్రీసుధ, జస్టిస్ నంద, జస్టిస్ కాజ శరత్, జస్టిస్ పుల్లా కార్తీక్, సింగపూర్ ఇంటర్నేషనల్ కమర్షియల్ కోర్ట్ అంతర్జాతీయ మధ్యవర్తి, అంతర్జాతీయ న్యాయమూర్తి ప్రొఫెసర్ డగ్లస్ జోన్స్, లండన్, టొరంటో, సిడ్నీలోని లా ఛాంబర్స్‌తో ఇంటర్నేషనల్ ఆర్బిట్రేటర్ ప్రొఫెసర్ జానెట్ వాకర్, ఎఫ్‌టీఐ కన్సల్టింగ్ సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్ లీ బేకర్, అర్బిట్రేటర్ భాగస్వామి విన్సెంట్ రోవాన్, ఎఫ్‌టీఐ కన్సల్టింగ్‌లో సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్ కార్తీక్ బలిసాగర్ పాల్గొన్నారు.

# 29 కోర్టు హాళ్లలో లైవ్ ప్రసార సేవలు

**నేడు ప్రారంభించనున్న హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే**



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర హైకోర్టులో కేసుల విచారణకు సంబంధించి ఆన్‌లైన్ లైవ్ ప్రసారాలను సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ప్రారంభించనున్నారు. ఉదయం 10.15 గంటలకు హైకోర్టులోని 29 హాళ్లలో విచారణల లైవ్ ప్రసార సేవలను ఆయన లాంఛనంగా ప్రారంభిస్తారు. ఆ తర్వాత 10.30 గంటల నుంచి లైవ్ ప్రసారాలు ప్రారంభం అవుతాయి. ఇప్పటికే మొదటి కోర్టు హాల్‌లో లైవ్ ప్రసార సేవలను ప్రారంభించిన విషయం తెలిసిందే. కొన్ని నెలలుగా ఈ సేవలు న్యాయవాదులకు, ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. ఇకపై మిగతా కోర్టుల్లో జరిగే విచారణలను కూడా వీక్షించే వీలు కలగనుంది. దీనితో న్యాయవాదులకు కూడా ఆన్‌లైన్ ద్వారా వాదనలు వినిపించే అవకాశం లభిస్తుంది. భవిష్యత్‌లో న్యాయవాదులే కాకుండా వాదప్రతివాదుల నుంచి న్యాయమూర్తులు ఏదైనా సమాచారం తెలుసుకోవాలంటే ఎదురుచూడాల్సిన అవసరం లేకుండా నేరుగా ఆన్‌లైన్‌లో వివరాలు తెలుసుకోవచ్చు. అన్ని కోర్టులను ఆన్‌లైన్ లైవ్ పరిధిలోకి తీసుకొచ్చి న్యాయ సేవలను ప్రజలకు మరింత చేరువచేస్తామని సుప్రీంకోర్టు పలుమార్లు పేర్కొన్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆన్‌లైన్ లైవ్ ప్రసారాలను అందుబాటులోకి తీసుకొస్తోంది. లైవ్ ప్రసారాలతో పెండింగ్ కేసులు తగ్గే అవకాశం ఉందని, కేసులు సత్వరమే పరిష్కారమవుతాయని కోర్టు వర్గాలు చెబుతున్నాయి. ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు లైవ్ ప్రసారాలకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

**● పిల్లి కూనలకు శునకమే తల్లి**



గంగారం: ఓ శునకం.. జాతి వైరం మరిచి పిల్లి కూనలను అక్కున చేర్చుకుంది. పాలిస్తూ వాటిని కంటికి రెప్పలా కాపాడుకుంటోంది. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం బావురుగొండకు చెందిన రైతు మేడ ఎల్లయ్య పెంపుడు కుక్క.. రెండు పిల్లి కూనలకు తన పిల్లలకు మాదిరిగానే పాలిచ్చి ఒడిలో దాచుకుంటోంది.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. 